
ఈనాడు

విజయవాడ 3-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 144

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



శిర్డీ సాయికి రూ.80 లక్షల స్వర్ణకిరీటం



కొత్త సంవత్సరం వేళ హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన ప్రదీప్ మోహంతి అనే భక్తుడు శిర్డీ సాయిబాబాకు రూ.80 లక్షల విలువైన వజ్ర ఖచిత స్వర్ణకిరీటాన్ని కానుకగా సమర్పించారు. గురువారం రాత్రి ప్రదీప్ మోహంతి, ప్రతిమా మోహంతి దంపతులు సాయిబాబా సమాధిని దర్శించుకున్నారు. వీరు అందజేసిన 655 గ్రాముల (585 గ్రాముల బంగారం) కిరీటంలో 153 క్యారెట్ల వజ్రాలు పొదిగి ఉన్నాయి. ఆలయ పూజారులు ఈ కిరీటాన్ని సాయిబాబా విగ్రహానికి కొద్దిసేపు అలంకరించారు. ఆ తర్వాత సాయిబాబా సంస్థాన్ సీఈవో గోరక్ష్ గాడిల్కర్‌కు అధికారులు కిరీటం అందజేశారు.

డ్రా తీసేముందు కొన్న టికెట్టు.. రూ.25 లక్షల బంపర్ లాటరీ

పంజాబ్‌లోని రూప్‌నగర్ జిల్లాలో ఓ వ్యక్తిని కొత్త సంవత్సరాది వేళ అదృష్టం వరించింది. స్థానిక అశోక్ లాటరీ దుకాణం నుంచి ఓ వ్యక్తి రూ.500 చెల్లించి కొనుగోలు చేసిన గోల్డెన్ లాటరీ మొదటి బహుమతి కింద రూ.25 లక్షలు గెలుచుకుంది. ఆ టికెట్టును డ్రా తీయడానికి కేవలం 45 నిమిషాల ముందు విజేత కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అనూహ్యంగా భారీ నగదు గెలుచుకున్న విజేత తన వివరాలను గోప్యంగా ఉంచమని అశోక్ లాటరీ బృందాన్ని కోరారు.



నర్మదానది తీరాన 200 చిలుకల మృత్యువాత



ఖర్గోన్: మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లా బడవాహ్ ప్రాంతంలో నర్మదానది తీరాన 200 చిలుకలు మృత్యువాత పడ్డాయి. వాటికి పెట్టిన ఆహారం విషతుల్యంగా మారడమే కారణమని అధికారులు శుక్రవారం వెల్లడించారు. మొదట్లో వినిపిస్తున్న బర్డ్‌ఫ్లూ వంటి కారణమేదీ వాస్తవం కాదని పోస్టుమార్టం నివేదిక తేల్చినట్లు జిల్లా వైల్డ్‌లైఫ్ వార్డెన్ టోనీ శర్మ తెలిపారు. నదిపై ఉన్న కాలువ వంతెన వద్ద సందర్శకులు ఎవరూ చిలుకలకు ఆహారం పెట్టకుండా అటవీశాఖ అధికారులు కాపలా సిబ్బందిని నియమించారు. తదుపరి పరీక్షల నిమిత్తం చిలుకల అంతర్భాగ (విసరా) నమూనాలను జబల్‌పూర్‌కు పంపారు.

ఖాలిద్‌కు మమ్దానీ లేఖ

న్యూయార్క్: దిల్లీ అల్లర్ల కుట్ర కేసులో 2020 నుంచి నిర్బంధంలో ఉన్న సామాజిక కార్యకర్త, జేఎన్‌యూ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖాలిద్‌కు న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ లేఖ రాశారు. "ప్రియమైన ఉమర్.. ద్వేషం భావన మన వ్యక్తిత్వాన్ని హరించేంతగా మనపై ప్రభావం చూపరాదంటూ మీరన్న మాటల్ని నేను తరచూ తలుచుకుంటూ ఉంటాను. మీ తల్లిదండ్రుల్ని కలిసి ఎంతో సంతోషించాను. మేమంతా మీ గురించే ఆలోచిస్తున్నాం" అని మమ్దానీ తన స్వదస్తూరితో రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ విషయాన్ని ఖాలిద్ భాగస్వామి బనోజ్యోత్స్న లాహిరి సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. మరోవైపు- ఉమర్ ఖాలిద్‌కు బెయిలు మంజూరు చేయాలంటూ అమెరికా చట్టసభ్యులు కొందరు అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రాకు లేఖ రాశారు. జైల్లో ఉన్న ఉమర్ ఖాలిద్‌కు లేఖ రాయడం ద్వారా భారత అంతర్గత వ్యవహారాల్లో మమ్దానీ జోక్యం చేసుకున్నారని భాజపా ఆరోపించింది. భారత విభజన గురించి మాట్లాడే నేరగాళ్లకు మద్దతు తెలపడం ద్వారా మమ్దానీ ఖురాన్ గ్రంథాన్ని అవమానించారని వీహెచ్‌పీ అభిప్రాయపడింది.

ఇరాన్‌లో ఆందోళనలు హింసాత్మకం

- వివిధ ప్రాంతాల్లో ఏడుగురి మృతి

దుబాయ్: ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఇరాన్‌లో నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. పెరిగిన ధరలు, తమ కరెన్సీ రియాల్ విలువ పడిపోవడంతో ప్రజలందరూ వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పతనానికి నిరసనగా ఆందోళనకారులు, భద్రతా దళాల మధ్య చెలరేగిన ఘర్షణల్లో ఏడుగురు మరణించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో భద్రతా దళానికి చెందిన ఓ సభ్యుడు కూడా ఉన్నట్లు పేర్కొన్నాయి. రాజధాని టెహ్రాన్‌లో ప్రారంభమైన ఈ ఆందోళనలు.. ఇప్పుడు వివిధ ప్రాంతాలకు విస్తరించి హింసాత్మకంగా మారాయి. ముఖ్యంగా లూర్ తెగకు చెందిన ప్రజలు ఎక్కువగా ఉండే అజ్నా, లోర్డెగాన్, కుహ్‌దాస్త్ నగరాల్లో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. కొన్ని చోట్ల పరిస్థితులు చేయి దాటిపోవడంతో పోలీసులు కాల్పులు జరిపారు. దేశంలో ఆందోళనల నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్పందించారు. నిరసనకారులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అంతర్గత వ్యవహారాల మంత్రిని ఆదేశించారు. ర్యాలీల్లో ఇరాన్ సుప్రీంనేత ఖమేనీకి వ్యతిరేకంగా ప్రజలు నినాదాలు చేస్తున్నారు.



ఇరాన్‌లోని లోరెస్థాన్ ప్రావిన్స్‌లో ఆందోళనకారులు దగ్ధం చేసిన వాహనాలు

హద్దు మీరొద్దు: ట్రంప్

ఇరాన్‌లో ఆందోళనకారులపై కాల్పులు జరిపి చంపితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఆందోళన చేస్తున్న వారిని కాపాడేందుకు అమెరికా రంగంలోకి దిగుతుందని చెప్పారు. ఈ వ్యాఖ్యలకు టెహ్రాన్ అంతే ఘాటుగా స్పందించింది. తమ దేశంలో జరుగుతున్న ప్రదర్శనల వెనక ఇజ్రాయెల్, అమెరికా దేశాల కుట్ర ఉందని ఆరోపించింది. తమ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకుంటే పశ్చిమాసియా ప్రాంతంలో అగ్రరాజ్య ప్రయోజనాలు దెబ్బతింటాయని హెచ్చరించింది.

అశ్లీల పోస్టులను తొలగించండి

- 'ఎక్స్'ను ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం

దిల్లీ: అసభ్యత, అశ్లీలత, చట్ట వ్యతిరేకత నిండిన పోస్టులను వెంటనే తొలగించాల్సిందిగా ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం "ఎక్స్"ను శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యంగా కృత్రిమ మేధ ఆధారిత యాప్ గ్రోక్ సాయంతో రూపొందించిన అభ్యంతరకరమైన పోస్టులను తక్షణం తొలగించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఎక్స్ వేదిక భారత ఆపరేషన్ల చీఫ్ కంప్లయెన్స్ ఆఫీసర్‌కు నోటీసులు జారీ చేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000, ఐటీ రూల్స్ 2021 కింద తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని నోటీసుల ద్వారా ప్రభుత్వం ఎక్స్‌కు తెలియజేసింది. "ఇప్పటికే చట్టవిరుద్ధంగా రూపొందించిన, ప్రసారం చేసిన పోస్టులను తొలగించాలి లేదా అవి అందుబాటులో లేకుండా చేయాలి" అని కేంద్రం నిర్దేశించింది. ఈ ఆదేశాలు వెలువడిన 72 గంటల్లో ఏం చర్యలు తీసుకున్నారో తెలిపే నివేదిక (యాక్షన్ టేకెన్ రిపోర్టు) సమర్పించాలని ఆదేశించింది. అమర్యాదకరమైన, అశ్లీలత నిండిన అంశాలు ఎక్స్ వేదికగా ప్రసారం అవుతున్నాయని ప్రభుత్వానికి సమాచారం అందిందని, పలువురు చట్టసభల ప్రతినిధులు కూడా ఈ మేరకు ఫిర్యాదు చేశారని ప్రభుత్వం పేర్కొంది.

రైలులో దొంగలతో కలిసి రూ.1.44 కోట్లు కొట్టేశాడు!

- జీఆర్‌పీ అధికారి అరెస్టు

పట్నా: బిహార్‌లో గత ఏడాది ఓ రైలులో జరిగిన రూ.1.44 కోట్ల విలువైన బంగారం దోపిడీ కేసులో అనూహ్య విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారికి ఈ దోపిడీలో ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్‌చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కోల్‌కతాకు చెందిన బంగారం వ్యాపారి ధనంజయ్ కిందటి ఏడాది నవంబరులో హౌరా-బీకానేర్ ఎక్స్‌ప్రెస్‌లో జైపుర్ వెళ్తున్నారు. అదే సమయంలో పోలీస్ యూనిఫాం ధరించిన నలుగురు వ్యక్తులు గయా స్టేషన్‌లో రైలు ఎక్కారు. వారిలో వ్యాపారి పక్కన కూర్చున్న ఇద్దరు అతడి వద్ద దాదాపు కిలోకి పైగా బంగారం ఉన్నట్లు తెలుసుకున్నారు. వ్యాపారి నిద్రపోతున్న సమయంలో నిందితులు బంగారు బిస్కెట్లను దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పట్నా రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రైల్వే అధికారుల కాల్ రికార్డింగ్స్ పరిశీలించగా.. ఈ దోపిడీలో గయా జీఆర్‌పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజేష్ కుమార్ సింగ్, ఇతర సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని సీనియర్ అధికారి వెల్లడించారు. ఈ కేసులో రాజేష్ కుమార్ సింగ్‌ను అరెస్టుచేసి, జ్యుడిషియల్ కస్టడీకి పంపారు. దోపిడీతో సంబంధమున్న ఇతర అధికారుల కోసం గాలిస్తున్నారు.

ఈ చేదు వాస్తవం తెలుసుకోండి



మిమ్మల్ని కాపాడటానికి ఏ ఒక్కరూ లేరిక్కడ. మీరు చదివే కాలేజీ, మీరు పని చేసే కంపెనీ, మీ డిగ్రీ పట్టా, మీ తల్లిదండ్రులు, స్నేహితులు మీ జీవితాన్ని మార్చలేరు.. మీ స్థితిని మార్చగలిగేది ఒక్కరు మాత్రమే. అది మీరే! ఎవరి సాయం కోసమో ఎదురుచూస్తూ కూర్చోకండి. మిమ్మల్ని మీరు నమ్ముకొని తక్షణం పనిలోకి దిగండి. ఎన్ని ఆటంకాలు వచ్చినా ప్రయత్నించడం మానకండి.

– అక్షయ్ సైనీ, యూట్యూబర్

బుల్లెట్ రైలు ప్రాజెక్టులో తుది పర్వత సొరంగం తవ్వకం పూర్తి

దిల్లీ: దేశీయంగా బుల్లెట్ రైలు ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టులో చివరి పర్వత సొరంగం తవ్వకం పనులు మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో శుక్రవారం పూర్తయ్యాయి. ఈ తవ్వకం తుది ఘట్టాన్ని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దిల్లీ నుంచి వర్చువల్ విధానంలో వీక్షించారు. తాజాగా తవ్వకం పూర్తయిన సొరంగం పొడవు 1.5 కిలోమీటర్లు. ముంబయి, అహ్మదాబాద్‌లను అనుసంధానించేలా చేపట్టిన 508 కిలోమీటర్ల పొడవైన బుల్లెట్ రైలు ప్రాజెక్టులో విరార్, బొయిసర్ స్టేషన్ల మధ్య ఇది ఉంటుంది. ఈ ప్రాజెక్టులో మొత్తం 8 పర్వత సొరంగాలు ఉండగా, వాటిలో 7 మహారాష్ట్రలోనే ఉన్నాయి.

■ మరోవైపు- కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఆర్థిక వ్యవస్థలో డేటా సెంటర్లకు, రైల్వేకు ఇంధన అవసరాలు తీర్చడంలో చిన్న, మాడ్యులార్ అణు రియాక్టర్లు కీలక పాత్ర పోషిస్తాయని అశ్వినీ వైష్ణవ్ దిల్లీలో విలేకర్లతో మాట్లాడుతూ తెలిపారు. వాటిని సాకారం చేసేందుకు.. ఇటీవలే పార్లమెంటు ఆమోదం పొందిన 'శాంతి' బిల్లు దోహదపడుతుందని పేర్కొన్నారు. నౌకలను నడిపేందుకు ఉపయోగించే 15-30 మెగావాట్ల అణు విద్యుత్ కేంద్రాలను రైల్వే కార్యకలాపాలకు కూడా వినియోగించుకోవచ్చని చెప్పారు.



తక్షశిలలో అతిపురాతన వైడూర్యాలు లభ్యం

ఇస్లామాబాద్: పాకిస్థాన్ పరమైన తక్షశిలా నగరంలో నిర్వహించిన తవ్వకాల్లో అరుదైన వైడూర్యాలు, కుషాణ రాజవంశీకుల కాలం నాటి కాంస్య నాణేలు లభించాయి. యునెస్కో గుర్తింపు పొందిన ఈ పురాతన నగరంలో తాజాగా భీర్ మౌండ్ అనే దిబ్బపై తవ్వకాలు జరపగా క్రీస్తు పూర్వం 6వ శతాబ్దానికి చెందిన వైడూర్యాలు, క్రీస్తు శకం 2వ శతాబ్దానికి చెందిన నాణేలు బయటపడ్డాయి. తక్షశిలా నగర ప్రాంతం నుంచి ఈ దశాబ్దంలో లభించిన అతి కీలక పురాతన వస్తువులు ఇవేనని అధికారులు పేర్కొన్నట్లు డాన్ పత్రిక తెలిపింది. లాపిస్ లాజులి అనే శాస్త్రీయ నామం కలిగిన విలువైన రాళ్లను (వైడూర్యాలను) అలంకారికంగానే కాక పురాతన రసవాద పరిశోధనలకూ ఉపయోగించేవారు. ఇక్కడ లభించిన నాణేలు కుషాణుల కాలం నాటివని తేల్చారు. పురాతన కాలంలో ఈ ప్రాంతాన్ని గాంధార దేశంగా వ్యవహరించేవారు. నాణేలపై వాసుదేవ చక్రవర్తి చిత్రం ఉందని పంజాబ్ పురాతత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అసిం డోగర్ తెలిపారు.

దక్షిణ యెమెన్‌పై సౌదీ విమానాల దాడి

ఏడెన్ (యెమెన్): దక్షిణ యెమెన్‌లో యూఏఈ మద్దతు ఉన్న సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ (ఎస్టీసీ) వేర్పాటువాదులపై శుక్రవారం సౌదీ అరేబియా యుద్ధ విమానాలు దాడులు చేశాయి. వేర్పాటువాదుల శిబిరాలను ఖాళీ చేయించేందుకు ఇటీవల సౌదీ.. సైనిక చర్యను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ తాజా దాడిలో జరిగిన నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. గత నెలలో యెమెన్ ప్రభుత్వ అధీనంలో ఉన్న హద్రమౌత్, మహ్రా ప్రాంతాల్లోకి ఎస్టీసీ దళాలు చొరబడ్డాయి. దీంతో సౌదీ మద్దతు ఉన్న నేషనల్ షీల్డ్ ఫోర్సెస్ దళాలు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. దీనికి తోడు ఎస్టీసీకి ఆయుధాలు అందించేందుకు ఓ నౌకను ముకల్లా ఓడరేవుకు యూఏఈ పంపిందని తెలియడంతో సౌదీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ముకల్లాపై ఇటీవల దాడులు నిర్వహించింది. అప్పటి నుంచి సౌదీ, యూఏఈ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

బడి ప్రవేశం ఐదేళ్లకా.. ఆరేళ్లకా!

- ఎన్ఈపీ అమలులో తార్కిక అవరోధం

ఇంటర్నెట్ డెస్క్: పిల్లలు బడిలో ప్రవేశం పొందడానికి సరైన వయసు ఐదేళ్లా, ఆరేళ్లా అన్న తర్కం కేంద్రం ప్రవేశపెట్టిన "జాతీయ విద్యా విధానం-2020" (ఎన్ఈపీ) అమలులో అడ్డంకిగా మారింది. ఒకటో తరగతిలో చేరాలంటే బాలబాలికలకు కనీసం ఆరు సంవత్సరాల వయసు నిండి ఉండాలన్న కేంద్రం నిబంధనను కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. మరికొన్ని ఆసక్తి చూపడం లేదు. తాజా నివేదికల ప్రకారం, 2026 ప్రారంభమైనప్పటికీ తమిళనాడు, కేరళ లాంటి ప్రధాన రాష్ట్రాలతో సహా, మొత్తం ఆరు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ఈ నిబంధనను ఇంకా అమలులోకి తీసుకురాలేదు.

మూడేళ్లు ఆటపాటలే ఉండాలి

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గత మూడేళ్లుగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జాతీయ విద్యావిధానం అమలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తోంది. ప్రాథమిక విద్యలో ఏకరూపత తీసుకురావడానికి "5+3+3+4" విద్యా విధానాన్ని కేంద్రం ప్రతిపాదించింది. దీని ప్రకారం, బాలబాలికలకు మొదటి మూడు సంవత్సరాల పాటు అంగన్‌వాడీ లేదా ప్రీ-స్కూల్ విద్యకు పంపించాలి. ఒక విద్యార్థి ఒకటో తరగతికి వచ్చేసరికి ఖచ్చితంగా 6 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. తదుపరి రెండేళ్లు ఒకటో తరగతి, రెండో తరగతి చదవాలి. అంటే ఒక విద్యార్థి అక్షరాస్యత వైపు అడుగులు వేసే ముందు మూడేళ్లపాటు కేవలం ఆటపాటల ద్వారా పాఠాలు నేర్చుకునే వాతావరణం ఉండాలి.



రాష్ట్రాల విముఖత

తమిళనాడు, కేరళ రాష్ట్రాలు ఈ విషయంలో భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు 5 ఏళ్ల వయసులోనే పాఠశాల విద్య ప్రారంభించే సంప్రదాయం ఉందని, అందువల్ల ఒక్కసారిగా బాలబాలిక బడి ప్రవేశం వయసును 6 ఏళ్లకు పెంచితే, నూతన విద్యాసంవత్సరం "జీరో ఇయర్" అయ్యే అవకాశం ఉందని వాదిస్తున్నాయి. అంతేకాదు ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ గందరగోళంలో పడుతుందని అంటున్నాయి. అందుకే ఈ రాష్ట్రాలలో ఇప్పటికీ 5 ఏళ్లు నిండిన పిల్లలను ఒకటో తరగతిలో చేర్చడానికి అనుమతిస్తున్నారు. మరోవైపు కేరళ తమ విద్యా చట్టాలు, సామాజిక పరిస్థితుల ఆధారంగా పాత నిబంధనల వైపే మొగ్గుచూపుతోంది. కేంద్రం మాత్రం విద్యార్థులందరికీ దేశవ్యాప్తంగా ఒకే వయస్సు ప్రమాణం ఉండాలని అంటోంది. ఇక దిల్లీ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో దీనిపై ఇంకా స్పష్టమైన ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

తైవాన్ సమీపంలో యుద్ధ విన్యాసాలు ఆపండి

చైనాను కోరిన అమెరికా

ఇంటర్నెట్‌డెస్క్: తైవాన్ జలసంధి చుట్టూ చైనా భారీగా యుద్ధ విన్యాసాలు చేయడంపై అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తం చేసింది. బీజింగ్ సంయమనం పాటించాలని ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ పిగోట్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. "తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు, బెదిరింపులకు పాల్పడటం ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు పెంచుతాయి. తైవాన్‌పై సైనిక ఒత్తిడిని ఆపాలని బీజింగ్‌ను కోరుతున్నాం. దౌత్యమార్గాలతో ఈ సమస్యను పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం. తైవాన్ జలసంధి చుట్టూ శాంతి, స్థిరత్వానికి అమెరికా మద్దతిస్తోంది. ఏకపక్షంగా బలవంతపు చర్యలను, బెదిరింపులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని పిగోట్ పేర్కొన్నారు.

దిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీని శుక్రవారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా కనిపించింది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపిన వివరాల ప్రకారం- సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో 9.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆయా నగర్, రిడ్జ్‌లలో మరింత తక్కువగా వరుసగా 8.1, 8.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నెల 5 వరకు దిల్లీలోని పలు ప్రాంతాల్లో శీతల గాలులు వీచే అవకాశముందని ఐఎండీ తెలిపింది. స్థానికంగా గాలి నాణ్యత ఇంకా మెరుగుపడకుండా.. 'వెరీ పూర్' విభాగంలో కొనసాగుతోంది. దట్టమైన పొగమంచు కారణంగా దృశ్యస్పష్టత తగ్గిపోవడంతో శుక్రవారం దిల్లీ విమానాశ్రయంలో 66 విమాన సర్వీసులు రద్దయ్యాయి.

వైన్ సీసా క్యాండిల్ వల్లే స్విట్జర్లాండ్‌లో అగ్నిప్రమాదం

క్రాన్స్-మోంటానా: స్విట్జర్లాండ్‌లోని స్కీయింగ్ రిసార్ట్‌లో 40 మంది మృతికి కారణమైన అగ్ని ప్రమాదానికి వెలుగుతున్న క్యాండిల్ నుంచి వచ్చిన మంటలే కారణమని పరిశోధకులు భావిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకలకు ఇక్కడి లీ కాన్‌స్టలేషన్ బార్‌కు ప్రజలు భారీగా తరలివచ్చారు. బార్‌లో బార్‌మెన్ ..బార్‌మెయిడ్‌ను భుజాలపై ఎత్తుకుని తిప్పుతున్న సమయంలో ఆమె చేతిలోని షాంపేన్ బాటిల్ చివర వెలుగుతున్న క్యాండిల్... చెక్కతో చేసిన పైకప్పుకు తగిలి మంటలు అంటుకున్నాయని పేర్కొన్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతుందని తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు 120 మంది వరకూ గాయపడ్డారు.

అహ్మదాబాద్ పూల ప్రదర్శన స్థిరత్వానికి ప్రతీక

ప్రధాని మోదీ ప్రశంస

దిల్లీ: అహ్మదాబాద్‌లోని సబర్మతీ తీరానికి కొత్త రంగులు అద్దేలా ఏర్పాటుచేసిన 14వ అంతర్జాతీయ పూల ప్రదర్శనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ప్రశంసించారు. ఈ ప్రదర్శన.. నగర ప్రజలకు ప్రకృతి పట్ల ఉన్న ప్రేమను తెలియజేయడంతో పాటు సృజనాత్మకత, సుస్థిరత, సామాజిక భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పలు దృశ్యాలను ఎక్స్‌లో మోదీ పోస్ట్‌చేశారు. దీనిని అహ్మదాబాద్ నగర మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. ప్రధాని మోదీ స్ఫూర్తితోనే ఈ ప్రదర్శనను ఏర్పాటుచేసినట్లు గుజరాత్ సీఎం భూపేందర్ పటేల్ వెల్లడించారు. "ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేసిన సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ భారీ ప్రతిమ, అతిపెద్ద వలయాకృత పూల అలంకరణ(మండల)గా రెండు గిన్నిస్ రికార్డులు సాధించడం ప్రజలందరికీ గర్వకారణం. ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేసిన భారతీయ పండుగలు, శాస్త్రీయ నృత్యాలు, పౌరాణిక కథలు, ప్రధాన అభివృద్ధి ప్రాజెక్టులు, క్రీడలు సహా పలు అంశాలకు సంబంధించిన నమూనాలను ప్రజలు సందర్శించాలి" అని భూపేందర్ ఎక్స్‌లో పోస్ట్‌చేశారు.



వారణాసి రైల్వేస్టేషనులో టాస్ విజేతకు కూలీ



క్రికెట్‌లో మ్యాచ్ ప్రారంభానికి ముందు టాస్ వేసి.. గెలిచిన జట్టు కెప్టెన్ బ్యాటింగు లేదా ఫీల్డింగు ఎంచుకొంటారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 160 ఏళ్ల చరిత్ర కలిగిన వారణాసి రైల్వేస్టేషనులోనూ నిత్యం రైలు ప్లాట్‌ఫాం మీదకు వచ్చే ముందు రైల్వే కూలీలు నాణెంతో టాస్ వేస్తారు. ఈ టాస్ గెలిచిన పోర్టర్‌కు ఆ రైలులో దిగే ప్రయాణికుల నుంచి ఉపాధి (కూలీ) లభిస్తుంది. వివాదాలు లేకుండా పరస్పర అవగాహనతో గత యాభై ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతుండటం విశేషం. రద్దీగా ఉండే వారణాసి రైల్వే జంక్షను మీదుగా ప్రతిరోజూ 250 నుంచి 300 రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. దాదాపు 200 మంది కార్మికులు ఇక్కడ పనిచేస్తుంటారు. లగేజీ బ్యాగులకు చక్రాలు, ప్లాట్‌ఫాంలలో లిఫ్టులు.. ఎస్కలేటర్లు, బ్యాటరీ రిక్షాల వంటివి అందుబాటులోకి రావడంతో తమ ఉపాధి దెబ్బతిన్నట్లు వారణాసి పోర్టర్స్ అసోసియేషను ప్రతినిధి కేదార్ యాదవ్ తెలిపారు. రోజుకు ఒక ట్రెండు గిరాకీల చొప్పున మాత్రమే రావడంతో ఒక్కొక్కరి రోజువారీ సంపాదన రూ.200 దాటడం లేదన్నారు. – ఈటీవీ భారత్

ఇద్దరిని కారు ఎక్కించుకొని.. ముగ్గురిగా దించిన సిక్కు డ్రైవర్



టొరంటో: కెనడాలోని కాల్గరీ నగరమది. అసలే చిమ్మ చీకటి.. ఆపైన మైనస్ 23 డిగ్రీల ఉష్ణోగ్రత.. తుపాను వాతావరణంలో గడ్డకట్టే చలి. అటువంటి పరిస్థితిలో ఓ నిండుగర్భిణికి పురిటినొప్పులు రావడంతో ఆమెను ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు భర్త ట్యాక్సీ బుక్ చేశారు. భారత సంతతి క్యాబ్ డ్రైవరు హర్‌దీప్‌సింగ్ తూర్ ఆ దంపతులను కారులో ఎక్కించుకొని ఆసుపత్రికి బయలుదేరారు. వెనుక సీటులో ఆమె నొప్పులు భరించలేక అవస్థలు పడుతోంది. సుమారు అరగంట అలాగే ప్రయాణించారు. ఇంకా ఆసుపత్రికి చేరుకోకముందే కారులోనే ఆమె ప్రసవించారు. తర్వాత ఆ ముగ్గురినీ సురక్షితంగా ఆసుపత్రికి చేర్చడంతో వైద్యసిబ్బంది తల్లీబిడ్డల సంరక్షణకు చర్యలు తీసుకున్నారు. డిసెంబరు 27వ తేదీ రాత్రి జరిగిన ఈ ఘటన వైరల్ కావడంతో హర్‌దీప్ సింగ్ గురువారం మీడియాతో మాట్లాడారు. "గర్భిణి పరిస్థితిని చూసి అంబులెన్సుకు ఫోను చేద్దామనుకున్నా. రోడ్లు మంచుతో తడిసి జారుతున్నాయి. ఆలస్యమైతే ప్రమాదం కాబట్టి, అది సరైన నిర్ణయం కాదని కారులో ఎక్కించుకొని ఆసుపత్రికి బయలుదేరా. తల్లీబిడ్డలు సురక్షితమని వైద్యులు చెప్పాక చాలా సంతోషమేసింది. నా నాలుగేళ్ల క్యాబ్ సర్వీసులో ఇలాంటి అనుభవం ఇదే మొదటిసారి. తల్లీబిడ్డలను కాపాడటం ఎంతో సంతృప్తిగా అనిపించింది" అన్నారు.

కిమ్ కుమార్తెకు త్వరలోనే కీలక పదవి!

సియోల్: ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ వారసురాలిగా ఆయన కుమార్తె కిమ్-జు-యే (13)ను ప్రకటించనున్నట్లు మరోసారి ఊహాగానాలు మొదలయ్యాయి. కొత్త ఏడాది సందర్భంగా నిర్వహించిన ఓ అధికారిక కార్యక్రమంలో తండ్రి కిమ్ జోంగ్ ఉన్, తల్లి రి సోల్ జుతో పాటు జు-యే కనిపించడంతో ఆమెను పాలక వర్కింగ్ పార్టీ కాంగ్రెస్‌లో ఉన్నతస్థాయి పదవిలో నియమించనున్నట్లు వార్తలు జోరందుకున్నాయి. తల్లిదండ్రులతో కలిసి జు-యే గురువారం దేశ మాజీ అధ్యక్షులు, తన తాతముత్తాతల స్మారక ప్రదేశాన్ని జు-యే సందర్శించారు. దీనికి సంబంధించిన ఫొటోను ఉత్తర కొరియా మీడియా ప్రచురించడంతో భవిష్యత్తులో అధికారిక పగ్గాలు ఆమెకే అందించనున్నట్లు సంకేతాలు పంపుతున్నారని వార్తలు వస్తున్నాయి. జనవరి లేదా ఫిబ్రవరిలో అధికార వర్కింగ్ పార్టీ కాంగ్రెస్ వార్షిక వేడుకలు జరగనున్నాయని, ఆ సమయంలో జు-యేకు కీలక పదవీ అప్పగించే అవకాశం ఉన్నట్లు దక్షిణ కొరియా నిఘా వర్గాలు భావిస్తున్నాయి.



కుటుంబ స్మారకం వద్ద తండ్రి కిమ్ జోంగ్ ఉన్, తల్లి రి సోల్ జుతో కిమ్-జు-యే

సర్ కసరత్తులో నగరాల వెనుకబాటు

దిల్లీ: వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రస్తుతం సాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఓటరు నమోదు పత్రాలు పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాల నుంచే ఎక్కువగా అందుతున్నాయని ఎన్నికల సంఘం (ఈసీ) అధికారులు శుక్రవారం వెల్లడించారు. పట్టణాల్లో ఓటర్లు రకరకాల కారణాలతో ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వల్ల.. నింపిన ఓటరు నమోదు పత్రాలను తిరిగి ఇవ్వలేకపోతున్నారని వారు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బూత్ స్థాయి అధికారులు ఎక్కువ మంది ఓటర్ల నుంచి నమోదు పత్రాలను సేకరించగలుగుతున్నారని తెలియజేశారు. లఖ్‌నవూ, కాన్పుర్, నోయిడా నగరాల్లో నమోదు పత్రాల సేకరణ అతి తక్కువగా నమోదైందని వెల్లడించారు. గత సంవత్సరం బిహార్‌లో నిర్వహించిన సర్ కసరత్తులో పట్నా నగరంలోనూ ఇదే వైఖరి కనిపించిందన్నారు. సర్ రెండో దశ అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లలో నవంబరు 4న ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇందులో ఒక్క ఉత్తర్‌ప్రదేశ్‌లో మినహా అన్ని ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించారు. అస్సాంలో సర్ ప్రక్రియ జరుగుతోంది.

యూనస్ పాలనలో అంధకారంలో బంగ్లాదేశ్

- షేక్ హసీనా ఆరోపణ

ఇంటర్నెట్‌డెస్క్: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తమ దేశంలో పరిపాలన సాగిస్తున్న మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. దేశాన్ని పూర్తిగా అంధకారంలోకి నెట్టేశారని ఆరోపించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆమె బంగ్లాదేశ్ ప్రజలను ఉద్దేశించి భావోద్వేగ సందేశాన్ని విడుదల చేశారు. ప్రస్తుతం దేశం భయం గుప్పిట్లో ఉందని, ప్రజలను దోపిడీదారులు బందీలుగా చేసుకున్నారని ఆమె మండిపడ్డారు. హసీనా సందేశాన్ని ఆమె పార్టీ అయిన అవామీ లీగ్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. హసీనా తన సందేశంలో తాత్కాలిక ప్రభుత్వం తీరును ఎండగట్టారు. 'దేశాన్ని నాశనం చేయడానికి కుట్రలు పన్నిన వారి నిజ స్వరూపాలు ఇప్పుడు బయటపడ్డాయి. వారి ముసుగులు తొలగిపోయాయి. దోపిడీదారులు ఇప్పుడు ప్రజలను బందీలుగా చేసుకున్నారు. అపరిమితమైన అవినీతి, అబద్ధాలతో దేశాన్ని చీకట్లోకి నెట్టేస్తున్నారు' అని హసీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు అవామీ లీగ్ పార్టీ సోషల్ మీడియా వేదికగా మైనారిటీల రక్షణపై సుదీర్ఘ పోస్ట్ పెట్టింది. "అతివాద నేత ఉస్మాన్ హాదీ మరణం తర్వాత దేశంలో హింస చెలరేగింది. ప్రధానంగా హిందువులే లక్ష్యంగా దాడులు జరిగాయి. ఇప్పుడు క్రైస్తవుల పరిస్థితి కూడా దారుణంగా మారింది. క్రిస్మస్ వేళ వారిని భయభ్రాంతులకు గురిచేశారు. చర్చిలు, మిషనరీ పాఠశాలలకు బెదిరింపు లేఖలు పంపారు. మైనారిటీలను రాజకీయ శత్రువులుగా, ఇస్లాం వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారని అవామీ లీగ్ ఆరోపించింది.



ఈనాడు

Pongal OFFERS SOUTH INDIA shopping mall

విజయవాడ 3-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 144
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


R.S. Brothers™
MEGA SHOPPING MALL
RUPEE SALE
సంక్రాంతి ఆఫర్లు
పట్టు చీరలపై ప్రత్యేకమైన ఆఫర్లు మీకోసం...
PURE LINEN COTTON @ ₹499 GET 2ND SAREE@ ₹1
AMBANI SAREE @ ₹798 GET 2ND SAREE@ ₹1
PURE BANARASI @ ₹850 GET 2ND SAREE@ ₹1
PURE SAIYAARA @ ₹1195 GET 2ND SAREE@ ₹1
KEERTHY SILK @ ₹1250 GET 2ND SAREE@ ₹1
BANARASI KATAN SILK @ ₹2495 GET 2ND SAREE@ ₹1
PATTU SAREE
BUY 1 MEENAKARI PATTU SAREE @4995 & GET 2ND SAREE @ ₹49
BUY 1 POCHAMPALLY WORK SAREE @3995 & GET 2ND SAREE @ ₹39
BUY 3 @ ₹500 RANG COTTON SAREE
BUY 3 @ ₹550 TURKEY SILK
BUY 3 @ ₹598 LINEN COTTON SAREE
KANJIVARAM BROCADE SAREE ₹1198 ₹599 50% OFF
₹325 ₹199 KAVERI PRINT SAREE
₹478 ₹295 SINDOOR SILK SAREE
₹795 ₹350 MOKSHA PATTU SAREE
₹850 ₹395 DEEPIKA WORK SAREE
₹895 ₹450 BANGLORE SILK SAREE
₹950 ₹495 SRI VALLI SAREE
₹1395 ₹650 CHINNON PATTU SAREE
50% OFF ₹398 ₹199 NAVYA TISSUE SAREE
50% OFF ₹550 ₹275 RICCO PATTU SAREE
50% OFF ₹596 ₹298 VISTHARA PRINT SAREE
50% OFF ₹598 ₹299 DOLA PRINT SAREE
50% OFF ₹650 ₹325 VISCOS PRINT SAREE
50% OFF ₹698 ₹349 GATTU SILK SAREE
50% OFF ₹798 ₹399 TUSSER SILK SAREE
50% OFF ₹950 ₹475 DHARMAVARAM SILK SAREE
50% OFF ₹1198 ₹599 TISSUE PATTU SAREE
SAREES
50% OFF ₹1250 ₹625 BANARASI PATTU SAREE
50% OFF ₹1498 ₹749 MAHESHWARI PATTU SAREE
50% OFF ₹1550 ₹775 JOHRIVAAJ CATALOG SAREE
*Conditions Apply
LADIES WESTERN & LEISURE WEAR
BUY 5 @ ₹500 DUPATTAS
BUY 4 @ ₹500 COTTON NIGHTY
BUY 3 @ ₹555 PRINTED PLAZO
UPTO 50% OFF ₹595 KURTHIS
UPTO 50% OFF ₹695 KURTHIS
UPTO 50% OFF ₹695 STRAGHIT PANTS
UPTO 50% OFF ₹795 KURTHIS
BUY 2 @ ₹799 ALPINE NIGHY
UPTO 50% OFF ₹895 KURTHIS
UPTO 50% OFF ₹995 KURTHIS
UPTO 50% LADIES JEANS
UPTO 30% OFF HEAVY WORK LEHENGAS
BUY 3 @ ₹1199 NIGHT DRESS
BUY 2 @ ₹1499 COTTON PATIYALA SUIT
BUY 2 @ ₹2599 FANCY LEHENGAS
GIRLS WEAR
UPTO 50% OFF ₹495 GIRLS SKIRTS
BUY 4 @ ₹500 GIRLS SHORTS
BUY 4 @ ₹500 GIRLS PYJAMA
BUY 4 @ ₹550 GIRLS PYJAMA
BUY 4 @ ₹550 GIRLS T-SHIRTS
BUY 4 @ ₹600 GIRLS TRACK PANT 3/4
BUY 3 @ ₹695 GIRLS COTTON FROCKS
BUY 3 @ ₹895 GIRLS COTTON FROCKS
BOYS WEAR
BUY 4 @ ₹550 BOYS T-SHIRTS
BUY 4 @ ₹595 BOYS T-SHIRTS
BUY 4 @ ₹600 BOYS T-SHIRTS
UPTO 50% OFF ₹645 BOYS SHIRTS
UPTO 50% OFF ₹695 BOYS SHIRTS
BUY 3 @ ₹745 BOYS T-SHIRTS -NECKER
UPTO 50% OFF ₹995 PANTS
UPTO 50% OFF ₹1095 PANTS
UPTO 50% OFF ₹1195 PANTS
MENS WEAR
BUY 1 @ 40% OFF BUY 2 @ 50% OFF
BUY 3 @ 40% OFF BUY 3, GET 3 FREE
BUY 1 @ 20% OFF BUY 2 @ 40% OFF BUY 1, GET 1 FREE
MUFTI BUY 1 @ 25% OFF BUY 2 @ 50% OFF
BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 3 @ 40% OFF
BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 2, GET 2 FREE
BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 2, GET 2 FREE
KILLER BUY 1 @ 30% OFF BUY 2 @ 40% OFF BUY 3 @ 50% OFF
Levi's BUY 1 @ 20% OFF BUY 3 @ 40% OFF BUY 5 @ 50% OFF BUY 2, GET 2 FREE
The withdrawal of offers and schemes is solely at the discretion of management.
R.S. Brothers™
MEGA SHOPPING MALL
TOLL FREE 1800 570 1999
బీసెంట్ రోడ్ క్రాస్, ఏలూరు రోడ్ విజయవాడ
బందర్ రోడ్ విజయవాడ
Email : info@rsbrothers.net | Shop us @ www.rsbrothers.net Follow us on : RSBrothersIndia rsbrothersindia
HOME FURNISHING
BUY1 GET 1 ₹295 BLANKETS
BUY 4 ₹199 TOWELS
BUY 4 ₹499 SINGLE BEDSHEETS SET
BUY 3 ₹999 DOUBLE BEDSHEETS SET

ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 3-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 144
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అర్జీ ఆగొద్దు

దీర్ఘకాలంగా భూ వివాదాలతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్ పేరుతో రీసర్వే చేసిన వైకాపా ప్రభుత్వం.. రైతుల భూములను కబ్జా చేసే కుట్రతో అనేక అవకతవకలకు పాల్పడింది. తప్పుల తడకలతో పాసుపుస్తకాలు ఇచ్చింది. వాటివల్ల గ్రామాల్లో భూ వివాదాలు చెలరేగి ఘర్షణలకు దారి తీశాయి. వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు అనేక చర్యలు చేపట్టారు. - మంత్రి అనగాని సత్యప్రసాద్

22ఎ భూముల సమస్యలకు 3 నెలల్లో పరిష్కారం చూపాలి

- రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం నివారణకు చర్యలు
- జేసీల నుంచి ఆర్డీవో, తహసీల్దార్లకు అధికారాల బదిలీ
- ప్రతి అర్జీకి పరిష్కారం.. తిరస్కరిస్తే కారణం చూపాల్సిందే
- ఆదేశాలు జారీ చేసిన రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్



దోనేపూడిలో రైతుకు పట్టాదారు పాసుపుస్తకం అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, పక్కన ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్

రీసర్వేతో భూ వివాదాలకు స్వస్తి

భూములు కబ్జా చేసే కుట్రతోనే గత ప్రభుత్వంలో అవకతవకలు 12లో

బాపట్ల జిల్లాలో పాసు పుస్తకాల పంపిణీలో మంత్రి అనగాని

ఈనాడు - అమరావతి

రెవెన్యూ శాఖలో ప్రక్షాళన చర్యలు వేగవంతమయ్యాయి. వైకాపా ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన రీసర్వే సమస్యల పరిష్కారానికి సంబంధించి ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెవెన్యూ క్లినిక్‌ల ఏర్పాటు ద్వారా ఎక్కడికక్కడే చికిత్స కూడా ప్రారంభించింది. తాజాగా 22ఎ జాబితాల నుంచి ప్రైవేటు భూముల తొలగింపు సహా మ్యుటేషన్ సేవలు, సర్వే నంబర్ల డూప్లికేషన్, నోషనల్ ఖాతాల్ని శాశ్వత ఖాతాలుగా మార్పు, ఆధార్ నంబర్ల సవరణ వరకు దీర్ఘకాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అర్జీల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గించే క్రమంలో ఇప్పటి వరకు సంయుక్త కలెక్టర్ (జేసీ) వద్ద ఉన్న అధికారాల్ని తహసీల్దార్లు, ఆర్డీవోలకు బదలాయిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ (మిగతా 12లో)

భూసమస్యలపై మంత్రులు, కలెక్టర్లు చొరవ తీసుకోవాలి

పాసుపుస్తకాల పంపిణీపై విదేశాల నుంచి చంద్రబాబు సమీక్ష 12లో

కొండగట్టు ఆంజనేయ క్షేత్రానికి

నేడు పవన్ కల్యాణ్

- రూ.35.19 కోట్ల తితిదే నిధులతో రెండు పనులకు శంకుస్థాపన
- దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణం

లోపలి పేజీలో

తెలుగు వెలుగుల వేడుక

మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు సిద్ధమైన గుంటూరు

నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహణ • ఐదు ప్రాంగణాల్లో కార్యక్రమాలు

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం: మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు గుంటూరులో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ సభ జరగనుంది. అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చన నడుమ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విశ్వయోగి విశ్వంజీ, ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. అదే సమయంలో మహాసభల ప్రాంగణం చుట్టూ ఏర్పాటు చేసిన నాలుగు ఉపవేదికలపై సన్మానాలు, సాహితీ సదస్సులు, కవి సమ్మేళనాలు, తెలుగు చలనచిత్ర గీతాలాపనలు మొదలు కానున్నాయి. ఈ కార్యక్రమాలు రాత్రి 11 గంటల వరకు (మిగతా 3లో)



న్యాయవాదులు నైపుణ్యం పెంచుకునేందుకు..

ఏపీ లీగల్ అకాడమీ అవసరం

అకాడమీ ఏర్పాటుకు సహకరించే తొలి వ్యక్తిని నేనే అవుతా

- ఏఐతో న్యాయవ్యవస్థలో భారీ మార్పులు
- స్వయంగా ఆలోచించే శక్తిని కోల్పోకుండా చూసుకోండి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ



సమావేశంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ. చిత్రంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం, అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి సుబోధ్

ఈనాడు, అమరావతి: న్యాయమూర్తులకు శిక్షణ, నైపుణ్యం పెంచుకునేందుకు జ్యుడీషియల్ అకాడమీ ఉన్నట్లు.. న్యాయవాదులు వృత్తినైపుణ్యం పొందేందుకు శాశ్వతంగా ఏపీ లీగల్ అకాడమీ అవసరమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ పేర్కొన్నారు. ఏపీ లీగల్ అకాడమీ ఏర్పాటుకు సహకరించే తొలి వ్యక్తిని తానే అవుతానని హామీ ఇచ్చారు. అకాడమీ ఏర్పాటుపై దృష్టిపెట్టాలని ఏపీ బార్ కౌన్సిల్, హైకోర్టు న్యాయవాదుల సంఘం, అడ్వొకేట్ జనరల్ (ఏజీ), అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ)లకు సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా న్యాయవాదులు నైపుణ్యం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సృజనాత్మకంగా ఆలోచించి కేసుల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. (మిగతా 3లో)



మన దగ్గర ఎంతుందన్నది కాదు..
మన తోడుగా ఎవరున్నారన్నది లెక్క!
ఎక్కువ సమాచారం
తెలుసుకుంటున్నా...
ఎక్కువ డిగ్రీలు సంపాదిస్తున్నా...
ఎక్కువ గంటలు పనిచేస్తున్నా...
నా అన్నవారు నీకుండాలి!
చదువు ఉన్నా ఉద్యోగం లేదు.
ఉద్యోగం ఉన్నా స్థిరత్వం లేదు.
స్థిరత్వం ఉన్నా ప్రశాంతత లేదు.
ఈ దశలో డబ్బు పోయినా..
హోదా తగ్గినా...
మనసులో మాట పంచుకోడానికి.
మేమున్నామంటూ నిలబడడానికి.
ఆపదొస్తే ఆదుకోడానికి...
పదిమందీ కావాల్సిందే!
మరి ఆ సామాజిక
సంపద మీకుందా?

ప్రత్యేక కథనం 11లో

సంక్రాంతికి వెస్ట్‌బైపాస్‌లో.. కాజ-గొల్లపూడి మధ్య ఒకవైపు కార్లు, బైక్‌లకు అనుమతి 12లో


ఈ సీజన్ యొక్క
అద్భుతమైన ఆఫర్లు
జనవరి 31 వరకు మాత్రమే
సంక్రాంతి
శుభాకాంక్షలు
బంగారు
ఆభరణాల వేస్టేజీ
50% తగ్గింపు
డైమండ్ జ్యువెలరీ క్యారట్
₹49,999
మాత్రమే
పోల్కి జ్యువెలరీ పై
మేకింగ్ & వేస్టేజీ
చార్జీలు లేవు
షరతులు వర్తిస్తాయి
వేగా జ్యువెలర్స్ అన్ని బ్రాంచ్‌లలో ఈ ఆఫర్స్ వర్తిస్తాయి
V
VEGA
JEWELLERS
VISION - 9966 547 998
దివిలోనైనా.. భువిలోనైనా.. వేగ తోడుంటే వివాహం వైభోగం అవుతుంది.
MG రోడ్, విజయవాడ
Call: 72079 16026
కొత్త బస్టాండ్ దగ్గర, నరసింహరావుపేట, ఏలూరు
Call: +91 8977530966
follow us: @vegajewellers
www.vegajewellers.com

ఏపీ లీగల్ అకాడమీ అవసరం

(మొదటి పేజీ తరువాయి)

కృత్రిమమేధ(ఏఐ)తో న్యాయవ్యవస్థలో భారీ మార్పులు రాబోతున్నాయని.. ఏఐ మన ఆలోచనా శక్తిని ప్రభావితం చేసే స్థాయికి చేరిందని హెచ్చరించారు. స్వయంగా ఆలోచించే శక్తిని కోల్పోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

● జస్టిస్ పీఎస్ నరసింహ శుక్రవారం ఏపీ హైకోర్టును సందర్శించారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని న్యాయసమాజాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహకు శ్రీవారి ప్రతిమను అందజేస్తున్న న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం, కార్యవర్గ సభ్యులు

కక్షిదారులు పూర్తి అవగాహనతో వస్తున్నారు

స్వాతంత్య్రం వచ్చిన ఈ 75 ఏళ్లలో న్యాయవ్యవస్థలో చాలా మార్పులొచ్చాయని జస్టిస్ నరసింహ పేర్కొన్నారు. "న్యాయవాద వృత్తి స్వరూపం పూర్తిగా మారిపోయింది. గతంలో కక్షిదారులు పూర్తిగా న్యాయవాదులపై ఆధారపడేవారు. ప్రస్తుతం కక్షిదారుల్లో చదువుకున్నవారు ఉంటున్నారు. తమకేం కావాలో వారికి స్పష్టత ఉంటుంది. న్యాయపరిధిలో ఏది సాధ్యమో? ఏది అసాధ్యమో చెప్పే ధైర్యం న్యాయవాదులకు ఉండాలి.

నా మనసంతా ఇక్కడే ఉంది

న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రజాస్వామ్యానికి పునాది. ఈ నేపథ్యంలో న్యాయమూర్తుల స్వతంత్రతతో పాటు న్యాయవాదుల స్వతంత్రత ఎంతో ముఖ్యం. అపరిష్కృత కేసుల సంఖ్య పెరుగుతున్నపుడు.. వాటిని సకాలంలో పరిష్కరించడానికి కొత్త మార్గాలను అన్వేషించాలి. వాటిలో 'మధ్యవర్తిత్వం' చాలా ముఖ్యమైంది. మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి మానవ వనరులు, శిక్షణ, మౌలిక వసతులు అవసరం. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయి. కొత్తగా హైకోర్టు భవన నిర్మాణం జరగడం సంతోషకరమైన విషయం. ఇది రెండుమూడేళ్లలో అందుబాటులోకి వస్తుంది. న్యాయవాదుల మానసిక, ఆరోగ్యానికి అవసరమైన సౌకర్యాలు అందులో ఉండాలని కోరుకుంటున్నా. ఈ కష్టకాలాన్ని న్యాయవాదులు, న్యాయమూర్తులు అద్భుతంగా ఎదుర్కొన్నారు. మీరు చూపిన ఓర్పు, సహనం ప్రశంసనీయం. ఈ లక్షణాలు భవిష్యత్తులో గొప్ప సంస్థలను నిర్మించడానికి దోహదపడతాయి. ఇప్పటివరకు నాకు లభించిన ప్రతి అవకాశానికి.. దేవుని దయతోపాటు న్యాయవృత్తిలో ఉన్న సహచరుల సహకారమే కారణం. నేను సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యాక ఇక్కడకు ఆలస్యంగా వచ్చినా.. నా మనసంతా ఇక్కడే ఉంది. మీరు చూపిన అభిమానానికి కృతజ్ఞతలు" అని తెలిపారు.

● కార్యక్రమంలో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ మాట్లాడుతూ.. జస్టిస్ నరసింహ అందించిన సేవలను కొనియాడారు. న్యాయవాదిగా పని చేసినప్పుడు నైతిక విలువలకు కట్టుబడి ఉన్నారని, అందుకే ఆయనకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా అవకాశం వచ్చిందని చెప్పారు. జస్టిస్ నరసింహ భవిష్యత్తులో సీజేఐగా బాధ్యతలు చేపట్టబోతున్నారని.. ఇది ఈ ప్రాంత వాసులకు గర్వకారణమని అన్నారు. అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ కూడా జస్టిస్ నరసింహ న్యాయసేవలను గుర్తుచేశారు.

● ఈ కార్యక్రమంలో న్యాయవాదుల డైరెక్టరీని జస్టిస్ నరసింహ, జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ తదితరులు ఆవిష్కరించారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు.. జస్టిస్ నరసింహను ఘనంగా సన్మానించి శ్రీవారి ప్రతిమను అందజేశారు.

● ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి సి.సుబోధ్ తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ నరసింహకు న్యాయమూర్తుల గౌరవ విందు

హైకోర్టు సందర్శనకు వచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ.. న్యాయమూర్తులతో కలిసి భోజనం చేశారు. సీనియర్ న్యాయవాదుల లాంజ్‌కు వెళ్లారు. అక్కడ వారితో మాట్లాడారు. హైకోర్టులోని గ్రంథాలయాన్ని సందర్శించారు. అనంతరం హైకోర్టు న్యాయవాదుల సంఘం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. శుక్రవారం రాత్రి జస్టిస్ నరసింహకు హైకోర్టు న్యాయమూర్తులు గౌరవ విందు ఏర్పాటుచేశారు.



జస్టిస్ పీఎస్ నరసింహకు ఆయన తండ్రి దివంగత జస్టిస్ పమిడిఘంటం కోదండరామయ్య చిత్రపటాన్ని అందిస్తున్న ఏఎస్‌జీ ధనంజయ, మోదేపల్లి గ్రామస్థులు

జస్టిస్ నరసింహను కలిసిన మోదేపల్లి గ్రామస్థులు

ప్రకాశం జిల్లా అద్దంకి మండలం మోదేపల్లి గ్రామస్థులు పలువురు ఏపీ హైకోర్టుకు వచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహను మర్యాదపూర్వకంగా కలిశారు. జస్టిస్ నరసింహ పూర్వీకులు మోదేపల్లికి చెందినవారు కావడం విశేషం. శాఖమూరి ఫణీంద్రబాబు, రవీంద్రబాబు, భీమని శ్రీనివాసరావు, బాచిన వెంకటేశ్వర్లు, వింజం వంశీకృష్ణ, న్యాయవాది బాచిన హనుమంతరావు తదితరులు జస్టిస్ నరసింహను కలిశారు. ఆయన వారితో ఆప్యాయంగా మాట్లాడారు. గ్రామ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో మోదేపల్లికి వస్తానని చెప్పారు. జస్టిస్ నరసింహ తండ్రి దివంగత న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం కోదండరామయ్య చిత్రపటాన్ని అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయతో కలిసి గ్రామస్థులు జస్టిస్ నరసింహకు అందజేశారు.

జల వివాదాలపై కేంద్ర కమిటీ

- సీడబ్ల్యూసీ ఛైర్మన్ నేతృత్వంలో ఏర్పాటు
- తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురేసి సభ్యులు
- కృష్ణా, గోదావరి బోర్డు ఛైర్మన్లతో పాటు కేంద్రం నుంచి మరో ఇద్దరు
- 3 నెలల్లో నివేదిక ఇవ్వాలని జలశక్తి శాఖ ఆదేశాలు

ఈనాడు, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాల జలవివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ అధ్యక్షతన మొత్తం 12 మంది సభ్యులను నియమించారు. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి అనుమతితో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. గత ఏడాది జులై 16న కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహించిన రెండు రాష్ట్రాల సీఎంల భేటీ నిర్ణయాల నేపథ్యంలో ఈ కమిటీకి రూపకల్పన చేశారు.

కమిటీ స్వరూపం

కమిటీ ఛైర్మన్: కేంద్ర జల సంఘం ఛైర్మన్

ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు: జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సలహాదారు, ఇంజినీర్ ఇన్ చీఫ్, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం చీఫ్ ఇంజినీర్

తెలంగాణ ప్రతినిధులు: నీటిపారుదలశాఖ సలహాదారు, ముఖ్య కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి, ఇంజినీర్ ఇన్ చీఫ్ (నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి)

కేంద్ర ప్రతినిధులు: కృష్ణా బోర్డు ఛైర్మన్, గోదావరి బోర్డు ఛైర్మన్, జాతీయ జల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజినీర్, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్ (ప్రాజెక్టులు, నిర్వహణ)

జులైలో నిర్ణయం.. ఇప్పటికి ఉత్తర్వులు

తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాల నేపథ్యంలో దిల్లీలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి ఆధ్వర్యంలో సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిల భేటీ జరిగింది. గత ఏడాది జులైలో జరిగిన ఈ సమావేశానికి రెండు రాష్ట్రాలూ పంపిన వాటి నుంచి మొత్తం 10 అంశాలను జలశక్తి శాఖ ఎజెండాగా నిర్ణయించింది. వాటిపై భేటీలో చర్చించారు. జల వివాదాలపై కమిటీలో చోటు కల్పించేందుకు రెండు రాష్ట్రాల నుంచి పేర్లు ప్రతిపాదించాలని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ కోరారు. ఒకరి తర్వాత మరొకరు పేర్లు ప్రతిపాదించాలన్న ఉద్దేశంతో రెండు రాష్ట్రాలూ ఆలస్యం చేస్తూ వచ్చాయి. కిందటి నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర జలశక్తి శాఖ మంత్రిని కలిసేందుకు దిల్లీ పర్యటన ఖరారైన నేపథ్యంలో ఈ అంశంలో కదలిక వచ్చింది. ఆంధ్రప్రదేశ్ నుంచి నలుగురి పేర్లు సూచిస్తూ జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. తెలంగాణ నుంచి కూడా పేర్లు పంపాలని కేంద్రం కోరగా ఆ రాష్ట్రం ఏడుగురిని ప్రతిపాదించింది. అయితే ఒక్కో రాష్ట్రం నుంచి నలుగురికి, కేంద్రం నుంచి నలుగురికి కమిటీలో చోటు కల్పించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి నిర్వహణ, సమగ్ర సాంకేతిక దృక్పథంతో అధ్యయనం చేసి ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను ఈ కమిటీ ప్రతిపాదించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏప్రిల్‌లో 'వీబీ జీ రామ్ జీ'!

- మార్చి నెలాఖరు వరకు పాత విధానంలోనే 'ఉపాధి'
- రాష్ట్రాలకు కేంద్రం స్పష్టత

ఈనాడు, అమరావతి: ఈ ఏడాది మార్చి వరకు పాత విధానంలోనే ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయనున్నారు. ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్(గ్రామీణ)' (వీబీ జీ రామ్ జీ) అమలులోకి రానుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (నరేగా) కేంద్ర ప్రభుత్వం సవరించి కొత్తగా 'వీబీ జీ రామ్ జీ'ని తీసుకొచ్చింది. ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందన్న విషయంలో ఇప్పటివరకు స్పష్టత లేదు. కొత్త విధానంలో లేబర్, మెటీరియల్ బడ్జెట్ నుంచి పరిపాలనా ఖర్చుల వరకు కేంద్రం 60%, రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులు భరించాలి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 9 నెలలు పూర్తయ్యాయి. మిగిలిన మూడు నెలలకు కేంద్రం కొత్త విధానంలో బడ్జెట్ కేటాయిస్తుందా? పాత విధానమే మార్చి నెలాఖరు వరకు కొనసాగించాలా? అనే దానిపై స్పష్టత ఇవ్వాలని పలు రాష్ట్రాలు కేంద్రాన్ని కోరాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రాల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు దిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టత ఇచ్చారు. మార్చి నెలాఖరు వరకు పాత విధానంలోనే నరేగా అమలు చేయాలని, ఏప్రిల్ 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' అమలులోకి వస్తుందని సూచించారు.

బడ్జెట్ రూ.6 వేల కోట్లు?: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులతో కలిపి 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి సంబంధించి 'వీబీ జీ రామ్ జీ' బడ్జెట్ రూ.6 వేల కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర గ్రామీణ జనాభా ఆధారంగా వేతనాలు, మెటీరియల్ నిధులు, పరిపాలనా ఖర్చులతో కలిపి ఈ బడ్జెట్ ఉంటుందని లెక్కలేశారు. ఇందులో కేంద్రం రూ.3,600 కోట్లు(60%), రాష్ట్రం రూ.2,400 కోట్లు (40%) సమకూర్చనున్నాయి. మార్చి నెలాఖరు నాటికి కేంద్రం 'వీబీ జీ రామ్ జీ' బడ్జెట్ కేటాయిస్తుందని, దాని ఆధారంగా రాష్ట్ర వాటా ప్రభుత్వం అందిస్తుందని అధికారులు చెబుతున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు వెలుగుల వేడుక

జరుగుతాయని మహాసభల నిర్వాహకుడు, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఆధ్యాత్మిక వేదికపై ప్రవచనాలు, హోమాలు, కల్యాణాలు ఉంటాయన్నారు. ప్రధాన వేదిక ముందు ఏర్పాటు చేసిన రామోజీరావు హస్తకళల ప్రాంగణంలో తెలుగు భాష ప్రాచీనత్వాన్ని ప్రస్ఫుటించేలా పురాతన సాహిత్యం, ప్రాచీన నాణేలు, తెలుగు సంప్రదాయ వంటకాలు సందడి చేయనున్నాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన ఆంధ్ర శ్రీపూర్ణకుంభ పురస్కారాల సభకు ముఖ్య అతిథిగా ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు హాజరు కానున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.హెచ్.మానవేంద్రనాథ్ రాయ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విశ్వ హిందీ పరిషత్తు సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొననున్నారు.

రెండో రోజు మారిషస్ అధ్యక్షుడి రాక

4వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సభలకు మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. శనివారం రాత్రికే ఆయన గుంటూరు చేరుకోనున్నారు. ఉత్తరాఖండ్ జ్యోతిష్మఠ్ జగద్గురు ఆదిశంకరాచార్య పీఠం ఉత్తరాధికారి స్వామి ప్రత్యక్ చైతన్య ముకుందానందగిరి శంకరాచార్య మహరాజ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, శాసనమండలి ఛైర్మన్ పి.మోషేనురాజు, మంత్రులు పాల్గొంటారు. సాయంత్రం జరిగే కార్యక్రమాలకు త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి హాజరవుతారు. ఈ సందర్భంగా ఆంధ్ర సారస్వత సేవా పురస్కారాల ప్రదానం జరగనుంది.

చివరి రోజున సీఎం చంద్రబాబు రాక

మహాసభల చివరి రోజైన సోమవారం ఉదయం కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు, పలువురు మంత్రులు హాజరవుతారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల పోస్టల్ కవర్‌ను సీఎం ఆవిష్కరించనున్నారు.

మూడు రోజుల కార్యక్రమంలో అనేక తెలుగు సాహిత్య ప్రక్రియలు అలరించనున్నాయి. అష్టావధానాలు, తెలుగు గజల్ సదస్సులు, భక్తి సాహిత్యం, చలనచిత్ర సాహిత్యంపై ప్రసంగాలు, ఇష్టాగోష్ఠులు, గీతాలాపనలు, వివిధ రకాల పురస్కారాల ప్రదానం చేపట్టనున్నారు. తెలుగు సంప్రదాయ వంటకాలతో విందు ఏర్పాటు చేస్తున్నారు.

మధ్యాహ్నం సభలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు 'మన తెలుగు భాష - అమృత భాష' అంశంపై ప్రసంగించనున్నారు. సాయంత్రం జరిగే ముగింపు సభకు సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, మంత్రి లోకేశ్ హాజరుకానున్నారు.

గ్రహం అనుగ్రహం

3-1-2026 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, శుక్లపక్షం

పూర్ణిమ: సా. 4-23 తదుపరి బహుళ పక్ష పాడ్యమి

ఆర్ద్ర: సా. 6-53 తదుపరి పునర్వసు

వర్జ్యం: తె. 6-17 నుంచి

అమృత ఘడియలు: ఉ. 9-29 నుంచి 10-59 వరకు

దుర్ముహూర్తం: ఉ. 6-35 నుంచి 8-03 వరకు

రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు

సూర్యోదయం: ఉ.6.36; సూర్యాస్తమయం: సా.5.34

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	14.0	26.0
ఖమ్మం	18.0	28.0
శ్రీకాకుళం	18.0	28.0
రాజమహేంద్రవరం	18.0	34.0
హైదరాబాద్	18.3	28.6
మహబూబ్‌నగర్	19.5	31.1
విశాఖపట్నం	19.6	28.0
అనంతపురం	19.8	32.6
కడప	20.0	29.0
గుంటూరు	20.0	30.0
కర్నూలు	20.0	31.7
ఒంగోలు	20.8	28.8
సూర్యాపేట	21.0	28.0
విజయవాడ	21.0	29.4
తాడేపల్లిగూడెం	21.0	31.0
తిరుపతి	21.1	30.4
నరసాపురం	22.0	31.8
నెల్లూరు	22.3	30.3

ఇదీ సంగతి!



ఊదు..! తప్పించుకొని వెళ్తే పట్టుకోలేమనుకున్నావా!

సంస్కరణలతోనే పెట్టుబడులు: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రం పెట్టుబడుల కోసం వెంపర్లాడటం కాదు.. అవే ఏపీని వెతుక్కుంటూ వస్తున్నాయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచ, దేశీయ పెట్టుబడిదారులతో చురుకుగా జరిపిన సంప్రదింపులు ఫలితాన్ని ఇచ్చాయని తెలిపారు. 'ఇది ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల ఫలితం. నిర్ణయాలు తీసుకోవడంలో వేగం.. పెట్టుబడిదారులకు నిబద్ధతతో ఇచ్చిన హామీల కారణంగా సాధ్యమైంది. వారి పట్ల మాకు స్పష్టమైన విధానం ఉంది. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని సౌకర్యాలు క్షేత్రస్థాయిలో కల్పిస్తున్నాం. వేగవంతమైన అనుమతులు, సెక్టార్ల వారీగా పాలసీలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఓడరేవులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, విద్యుత్, డిజిటల్ మౌలిక సదుపాయాలే పెట్టుబడులు రావడానికి కారణం. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్థిరమైన విధానాలతో తయారీ, పునరుత్పాదక విద్యుత్, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, రవాణా, కీలకమైన మౌలిక సదుపాయాల రంగాల్లో భారీ ఎత్తున పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. ఉద్యోగకల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం, పెట్టుబడులను త్వరగా గ్రౌండింగ్ చేయడం ఇక ముందూ కొనసాగుతుంది. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులతో పరిశ్రమలు, ఉపాధి ద్వారా రాష్ట్ర ప్రజలకు ఆర్థిక అవకాశాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాం. జాతీయ పెట్టుబడుల్లో రాష్ట్ర వాటా పెరగడం దేశ అభివృద్ధిలో భౌగోళికంగా విస్తృత మార్పులను సూచిస్తోందని పారిశ్రామిక నిపుణులు భావిస్తున్నారు' అని లోకేశ్ వివరించారు.

● దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో సుమారు 80 శాతం ఐదు రంగాల్లోనే ఉన్నాయి. అవి విద్యుత్(22.6 శాతం), కెమికల్స్, కెమికల్ ప్రొడక్ట్స్ (21.8 శాతం), మెటల్స్ (17.3 శాతం), ఐటీ (10.9 శాతం), రవాణా సేవలు (7.9 శాతం).

ఉపాధ్యాయుల సమాచార నవీకరణకు మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయులకు ఏటా బదిలీలు చేపట్టేందుకు చట్టాన్ని తీసుకొచ్చినందున సమాచార వ్యవస్థ (టీఐఎస్) నవీకరణకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల చట్టం ప్రకారం ప్రతి ఏడాది బదిలీలుంటాయి. పదోన్నతులకూ అవకాశం ఉంటుంది. దీంతో ఉపాధ్యాయులు తమ వివరాలను నవీకరించాలని సూచించింది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక తాత్కాలిక సీనియారిటీ జాబితాను విడుదల చేసి, అభ్యంతరాలు స్వీకరిస్తుంది. అనంతరం తుది సీనియారిటీ జాబితాను విడుదల చేస్తుంది.

రాష్ట్ర బడ్జెట్‌పై కసరత్తు షురూ!

- నెలాఖరులోగా ప్రతిపాదనలు పంపండి
- అన్ని విభాగాలకు ఆర్థిక శాఖ ఆదేశాలు

ఈనాడు, అమరావతి: వచ్చే ఆర్థిక సంవత్సరం.. 2026-27కు రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు మొదలైంది. అన్ని ప్రభుత్వ శాఖలు జనవరి నెలాఖరులోగా తమ బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్థికశాఖ ఆదేశాలు జారీచేసింది. ఇందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను సూచించింది. దీంతోపాటు 2025-26 అంచనాల సవరణ ప్రతిపాదనలు కూడా ఇవ్వాలని, అదే సమయంలో ఏ ప్రభుత్వ హెడ్ కింద ఎంత మొత్తం ఆదా అయ్యిందో ముందే గుర్తించాలని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా వివిధ ఖాతాల కింద ఎంత ఖర్చుచేశారు? మిగిలిన మూడు నెలల్లో ఎంత ఖర్చుచేసే అవకాశముందో స్పష్టమైన అంచనాలతో సవరణలు ప్రతిపాదించాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

మౌలిక వసతులపై వ్యయం.. ముఖ్యం

రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తోంది. ఇళ్ల నిర్మాణం, రహదారులు, ఇతర రవాణా సౌకర్యాల అభివృద్ధి, రక్షిత నీటికల్పన, విద్య, వైద్యం తదితర అంశాల్లో ప్రమాణాల మెరుగుదల, పారిశ్రామికీకరణ విస్తృతిని దృష్టిలో ఉంచుకొని మూలధన బడ్జెట్ ప్రణాళిక రూపొందించాలి. ● పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం, కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అమలయ్యే పథకాలు, నాబార్డ్, హడ్కో సాయంతో చేపడుతున్న పనుల గురించి వివరంగా సమర్పించాలి.

దేశంలో ఏపీ అగ్రస్థానం..

- మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం రాష్ట్రానికే
- బ్యాంక్ ఆఫ్ బరోడా సీఎంఐఈ నివేదికలో వెల్లడి

ఈనాడు, అమరావతి: దేశంలో అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా రాష్ట్రం మారింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం వాటా ఏపీ దక్కించుకున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) నివేదికలో వెల్లడించింది. ఆ తర్వాత స్థానాల్లో ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) ఉన్నాయి. గతంలో ముందు వరుసలో ఉన్న మహారాష్ట్ర, ఒడిశాలను దాటి పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ 9.5 శాతం, గుజరాత్ 7.1 శాతం పెట్టుబడులతో ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి.

తాగునీరే గరళమై...

జీవితాన్ని సంతోషంగా గడపాలంటే ముందు ఆరోగ్యం బాగుండాలి. ఊరికే జబ్బుపడకూడదంటే జనావాసాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా ఉండటంతో పాటు ప్రతిఒక్కరూ సురక్షితమైన తాగునీటికి నోచుకోవాలి. ఈ రెండూ కరవైన చోట రోగాలు విజృంభించి అకాల మరణాలకు మూలమవుతాయి. ప్రజల ప్రాణాలకు అలాంటి ప్రమాదమేదీ తలెత్తకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలదేనని గుర్తుచేస్తూ ఐరాస సర్వప్రతినిధి సభ 2010లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలను మానవ హక్కుల్లో అంతర్భాగాలుగా గుర్తించింది. 'కలుషితంకాని నీటిని పొందడం ప్రజల ప్రాథమిక హక్కు. సంక్షేమ రాజ్యంలో దాన్ని తు.చ.తప్పకుండా అమలు చేసి తీరాలి' అని భారత సర్వోన్నత న్యాయస్థానమూ అయిదేళ్ల నాడే నిర్దేశించింది. కానీ, నిర్లక్ష్యంలో జోగాడుతున్న అధికార యంత్రాంగం కారణంగా వ్యక్తిగత, గృహ అవసరాలకు తగినంత మంచినీటిని నిరంతరం పొందే హక్కు జనభారతానికి ఉండీ లేనిదవుతోంది. పైప్‌లైన్లలో పోటెత్తుతున్న మలిన జలాల మూలంగా దేశీయంగా ప్రజారోగ్యం తరచూ పడకేస్తోంది!

ఏమాత్రం ఆలోచన ఉన్నవారైనా సరే, మంచినీళ్ల పైప్‌లైన్ మీద మరుగుదొడ్డి కడతారా? ఇంటింటికీ సరఫరా అయ్యే నీటిలో మురుగు వచ్చి కలుస్తుంటే చూస్తూ ఊరుకుంటారా? అలా కట్టిన మరుగుదొడ్డి గుంత నుంచి పెల్లుబికిన వ్యర్థ జలాలు... ఆ టాయిలెట్ కింద నుంచి వెళ్తున్న ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌లో కలవడంతో ఇండోర్‌లోని భగీరథ్‌పుర ప్రాంతంలో ఇప్పుడెన్నో కుటుంబాలు కన్నీళ్లలో మునిగాయి. సర్కారీ సిబ్బంది బాధ్యతారాహిత్యంతో అక్కడ కనీసం పదిమంది మరణిస్తే- దాదాపు మూడువేల మంది ఆసుపత్రి పాలయ్యారు. వరసగా ఎనిమిదేళ్ల పాటు దేశంలోనే శుభ్రమైన నగరంగా పురస్కారాలు పొందిన ఇండోర్‌లోనే పరిస్థితి అలా అఘోరిస్తే- చెత్త మేటలకు, మురుగునీటి ఊటలకు పేరుమోసిన మన పట్టణాల మాటేంటి? హైదరాబాద్, విజయవాడ, గుంటూరు తదితర నగరాల్లో తాగునీటి కాలుష్యం గతంలో ఎంతోమందిని పొట్టనపెట్టుకుంది. అయినా రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలాచోట్ల కాలంచెల్లిన పైపులైన్లు అలాగే కనిపిస్తున్నాయి. మురుగుకాల్వల మధ్యలో తాగునీటి గొట్టాలు, శుభ్రత లేని జలాశయాలు వంటివి జనజీవనాన్ని రోగగ్రస్తం చేస్తూనే ఉన్నాయి!

ఏటా 3.77 కోట్ల మంది భారతీయులు కలుషిత నీళ్లలోంచి పురుడుపోసుకునే జబ్బుల బారినపడుతున్నారు. 15 లక్షల మంది పిల్లలు డయేరియాతో చనిపోతున్నారు. జలకాలుష్యంతో జనారోగ్యం దెబ్బతింటుండటంతో దేశం ఏడాదికి 7.3 కోట్ల పనిదినాలను నష్టపోతోంది. దానివల్ల భారతావనికి సంవత్సరానికి 60 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం సంభవిస్తోంది. పరిశోధకులు లెక్కగట్టిన ఈ కష్టనష్టాల అంచనాలన్నీ 2019 నాటివి. ఆ తరవాత కూడా పరిస్థితులు మెరుగైన దాఖలాలేమీ లేవు. అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, పురపాలక సంస్థలు ఇప్పటికైనా మేల్కొని శిథిలమైన పైపులైన్లను వెంటనే మార్చాలి. మురుగు కాల్వలకు సమీపంలోనే తాగునీటి గొట్టాలుండే దురవస్థను తప్పించాలి. వేసవి వచ్చిందంటే సాధారణ ప్రజానీకానికి నీటి అగచాట్లు అధికమవుతాయి. ఆలోగానే యంత్రాంగం చురుకు తెచ్చుకోవాలి. రోజుల తరబడి మంచినీళ్లు దొరకని దుస్థితిని పరిహరించడమెంత ప్రధానమో- సరఫరా చేసే ముందే నీటినాణ్యతను పరీక్షించడం అంతే ముఖ్యం!



ప్రకృతి హెచ్చరిస్తోంది...

వింటున్నారా?

భారతదేశంపై వాతావరణ మార్పుల ప్రభావం ఏడాదికేడాది ఉద్ధృతమవుతోంది. నిరుడు జనవరి నుంచి నవంబరు వరకు 334 రోజులు ఉంటే, వాటిలో 331 రోజులపాటు దేశంలో ఎక్కడో ఒకచోట తుపానులు, వరదలు, అధిక ఉష్ణోగ్రతలు, మట్టిపెళ్లలు విరిగిపడటం వంటివి ఎక్కువగా సంభవించాయి. వీటి దెబ్బకు మొత్తం 4,419 మంది ప్రాణాలు కోల్పోగా, 4.3 కోట్ల ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయి. ఇలాంటి విపత్తుల కట్టడికి అంతర్జాతీయ సమాజంతో కలిసి భారత్ తక్షణమే గట్టి చర్యలకు పూనుకోవాలి.

నిరుడు దేశవ్యాప్తంగా వడగాడ్పులు కల్లోలపరిచాయి. ఏప్రిల్-జూన్ మధ్య దిల్లీతోపాటు దేశంలో అనేక చోట్ల పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటాయి. ఆ సమయంలో, సహజంగా శీతల వాతావరణం ఉండే హిమాచల్‌ప్రదేశ్ సహా 19 రాష్ట్రాల్లో భానుడి భగభగలు 990 మంది ప్రాణాలను బలిగొన్నాయి. ఇది 2024లో సంభవించిన మరణాలకన్నా మూడు రెట్లు అధికం! వేసవి మండు టెండలు ముగిశాక వర్షాకాలంలో వరదలు, మట్టిపెళ్లలు విరిగిపడటం వల్ల 2,707 మంది మరణించారు. దేశమంతటా పిడుగుపాట్లు, ఉరుములూ మెరుపులతో కూడిన తుపానుల వల్ల మరో 1,500 మంది దుర్మరణం పాలయ్యారు. వాయవ్య భారతం నిరుడు 311 రోజుల పాటు ప్రకృతి ప్రకోపాలకు లోనైంది. హిమాచల్‌ప్రదేశ్‌లో అత్యధికంగా 1,459 మరణాలు సంభవించాయి. దక్షిణ భారతంలో అత్యధికంగా ఏపీలో 608 మరణాలు చోటుచేసుకోగా, మధ్యప్రదేశ్‌లో 537, ఝార్ఖండ్‌లో 478 మంది చనిపోయారు. ప్రకృతి ఉత్పాతాల వల్ల మహారాష్ట్రలో 8.4లక్షల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. మొంథా వంటి తుపానులు ఆంధ్రప్రదేశ్‌కు రూ.5,300 కోట్ల నష్టం కలిగించాయి. ఉత్తరాఖండ్‌లో మెరుపు వరదలు 90 మందిని బలిగొన్నాయి. 50 మంది గల్లంతయ్యారు. మొత్తంగా విపత్తుల వల్ల 1,81,459 ఇళ్లు నేలమట్టం కాగా, 77,189 పశువులు మరణించాయి.



గతి తప్పిన రుతువులు

విపత్తుల వల్ల నిరుడు దేశంలో చాలా మంది జీవనాధారం దెబ్బతినిపోయింది. అనేక కుటుంబాలు మానసిక కుంగుబాటుకు లోనయ్యాయి. ఈ నష్టం వెలకట్టలేనిది. బిహార్‌లో మెరుపులు, పిడుగుల వల్ల 250 మంది మరణించారు. ఆకస్మిక వరదల వల్ల పంటలు కోల్పోయిన 80శాతం వ్యవసాయ కుటుంబాలు జీవిక కోసం పంజాబ్, దిల్లీలకు వలసవెళ్లక తప్పలేదు. వీటికితోడు మాదక ద్రవ్యాల సేవనం, మనుషుల అక్రమ రవాణా వంటివీ సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. కలుషిత వరద నీరు వ్యాధులకు దారితీసి, ఆస్పత్రులు కిక్కిరిసిపోయాయి. 54లక్షల మంది నిర్వాసితులయ్యారు. వారిలో అత్యధికులు స్త్రీలూ పిల్లలే. 2050కల్లా 4.5 కోట్ల మంది ప్రకృతి ప్రకోపాల వల్ల నిర్వాసితులవుతారని అంచనా. భారతదేశానికి 1993 నుంచి 2022 వరకు 18వేల కోట్ల డాలర్ల నష్టం సంభవించింది. వాతావరణ మార్పుల వల్ల భారీగా నష్టపోయిన దేశాల్లో భారత్‌ది ఆరో స్థానం. సముద్ర జలాలు వేడెక్కడం వల్ల అరేబియా సముద్రంలో 40శాతం అధిక తీవ్రతతో తుపానులు పుట్టుకొచ్చాయి. వాటివల్ల భారీగా పంటనష్టం సంభవించింది. భవన నిర్మాణం కోసం చెరువులను పూడ్చేసిన నగరాల్లో వరదలు భారీ నష్టాన్ని మిగిల్చిన సంగతిని ప్రభుత్వాలు గుర్తించాలి. వాతావరణ మార్పులతో ఎండలు మండిపోవడం, చలి తీవ్రత పెరుగుతున్నాయి. వాయవ్య, మధ్య భారత రాష్ట్రాల్లో వసంత రుతువు కనుమరుగైంది. ఏప్రిల్‌లో అకాల వర్షాలకు జమ్మూకశ్మీర్, సిక్కింలలో మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. శీతాకాలంలోనూ ఉష్ణతాపం కొనసాగడంతో నేల నెర్రెలు చాస్తోంది. సముద్రాలు వేడెక్కి దక్షిణ సముద్ర తీరం దెబ్బతింటోంది. మహాసముద్రాలు దశాబ్దానికి 0.12 సెంటిగ్రేడ్ మేర వేడెక్కుతున్నాయి. సముద్ర మట్టాలు ఏటా 3.3 మిల్లీమీటర్ల చొప్పున పెరుగుతున్నాయి. నిరుడు జనవరి-సెప్టెంబరు మధ్యకాలంలో 270 రోజుల పాటు ప్రకృతి చిర్రుబుర్రులాడింది. 2024లో అలాంటి రోజులు 255 కాగా, 2022లో అవి 241 రోజులే! అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాతావరణ మార్పులు బూటకమంటూ చమురు, బొగ్గుల తవ్వకాలను మరింత ముమ్మరం చేస్తున్నారు. దీనివల్ల వాతావరణ వైపరీత్యాలు మరింత తీవ్రం కానున్నాయి. భారత్ ఎదుర్కొంటున్న సమస్యలే ఇతర వర్ధమాన దేశాలనూ పీడిస్తున్నాయి. కాబట్టి, వాతావరణ మార్పులను తట్టుకోవడానికి సంపన్న దేశాలు ఇస్తామన్న నిధులూ సాంకేతికతలను వర్ధమాన దేశాలు రాబట్టుకోవాలి.

ఉదాసీనంగా ఉంటే అంతే!


ప్రకృతి ఉత్పాతాలను తప్పించుకోవాలంటే- ముందు బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాల వాడకాన్ని కట్టిపెట్టి పూర్తిగా పునరుత్పాదక ఇంధనాలకు మారాలి. 2030కల్లా కర్బన ఉద్గారాలను కనీసం 45శాతం మేర తగ్గించుకోవాలి. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారానే 50శాతం విద్యుత్తును ఉత్పత్తి చేయడం, వాతావరణం నుంచి కర్బనాన్ని విడగొట్టే సాంకేతికతలను చేపట్టడం వంటివి విధిగా జరగాలి. అడవుల నరికివేత, చెరువుల పూడ్చివేత వంటి అకృత్యాలను అరికట్టి తీరాలి. ముఖ్యంగా ఈశాన్య భారత అడవులను కాపాడుకోవాలి. హిమనీనదాలు కరిగిపోకుండా జాగ్రత్తపడాల్సి ఉంది. దుర్భిక్షాన్నీ అతివృష్టినీ తట్టుకునే పంటల సాగును ప్రోత్సహించడంతో పాటు, ప్రకృతి ప్రకోపాల గురించి రైతులను ముందుగానే అప్రమత్తం చేసే సాంకేతికతలనూ విరివిగా వినియోగించాలి. అన్నదాతలు, వలసదారులు, నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి. ప్రకృతి వైపరీత్యాలకు అలవాటుపడటం తప్ప, మనం చేసేదేమీ లేదనే ఉదాసీనతను వదిలించుకోవాలి. 'కాప్-30' శిఖరాగ్ర సభ హరిత వాతావరణ నిధిని ఏర్పాటు చేయాలని నిశ్చయించింది. దాని కింద ప్రతి దేశం వాతావరణ మార్పుల నిరోధ విధానాన్ని రూపొందించి, పక్కాగా అమలు చేయాలి. ఈ విషయంలో భారత్ ఇతర దేశాలకు మార్గదర్శిగా నిలవాలి.



ప్రొఫెసర్ అంజల్ ప్రకాశ్
రీసెర్చ్ డైరెక్టర్, భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, ఐఎస్‌బీ

పదిహేడేళ్ల యువతి, వివాహిత... అమ్మాయిల కోసం ఒక స్కూలు పెట్టింది. పిల్లలు ఉత్సాహంగా ఆమె దగ్గర అక్షరాలు దిద్దడానికి వెళ్తున్నారు. అది చూసి కొందరికి కన్నుకుట్టింది. ఆడపిల్లలకు, అదీ అన్ని కులాల వారికీ చదువు అవసరమా? అనుకున్నారు. వద్దని చెబితే వినడం లేదని బడికి వెళ్తున్నప్పుడు ఆమె మీద దాడులు చేశారు. అసభ్య పదజాలంతో అవమానించడం, రాళ్లు విసరడం, బురద చల్లడం... ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టారు. అయినా ఆమె తొణకలేదు, బెణకలేదు! సంచీలో మరో చీర పెట్టుకుని బడికి వెళ్లి బురద అంటిన చీరను మార్చుకునేది. ఆరుగురు బాలికలతో మొదలై మూడేళ్లు తిరిగేసరికల్లా మూడు పాఠశాలలు, 150 మంది విద్యార్థినులకు విస్తరించింది ఆమె ప్రయత్నం. మరో

అక్షరాలు దిద్దించిన ధీర



ఏడాదికల్లా పుణె ప్రాంతంలో 18 స్కూళ్లు పెట్టారు ఆ దంపతులు. 175 ఏళ్ల క్రితం సమాజానికి ఎదురు నిలిచి వాళ్లు వేసిన పునాది మీదే నేటి మన స్త్రీవిద్య, మహిళాభ్యుదయం వేళ్లూనుకున్నాయి. ఆ దంపతులే- సావిత్రీబాయి పులె, జ్యోతిరావ్ పులె. ఈరోజు సావిత్రీబాయి పుట్టినరోజు.

మహారాష్ట్రలోని సతారా జిల్లా నైగావ్ గ్రామంలో 1831 జనవరి 3న ఖండోజీ నెవాసే పాటిల్, లక్ష్మి దంపతుల ఇంట జన్మించారు సావిత్రీబాయి. అప్పటి ఆచారం ప్రకారం పదేళ్లకే జ్యోతిరావు పులెతో ఆమె వివాహమైంది. ఆయన ఆధునిక భావాలు కలవారు. సావిత్రి చురుకుదనం, ఉత్సాహం గమనించిన పులె ఆమెకు చదవడాన్ని, రాయడాన్ని నేర్పించారు. అహ్మద్‌నగర్‌లోని మిషనరీ సంస్థలో చేరి టీచర్ ట్రైనింగ్ కూడా పూర్తిచేశారు సావిత్రి. కులప్రసక్తి లేకుండా బాలికలందరికీ చదువుచెప్పాలని పాఠశాలలను ప్రారంభించినందుకు నాటి సమాజం నుంచి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన్నారామె. మామగారు సైతం కొడుకు, కోడళ్లను ఇంటినుంచి వెలివేశారు. ఇవేవీ ఆ దంపతుల సంఘ సంస్కరణాభిలాషను తగ్గించలేదు. 1852లో 'మహిళా సేవా మండల్' స్థాపించి మహిళలకు వారి హక్కులపై అవగాహన కల్పించడం మొదలెట్టారు సావిత్రి. బాల్య వివాహాలను వ్యతిరేకించి, కులాంతర వివాహాలను ప్రోత్సహించారు. వితంతువుల పట్ల సమాజం ఆచరిస్తున్న దురాచారాల నిర్మూలనకు పోరాడి గెలిచారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడటం తమ సామాజిక బాధ్యతగా భావించిన పులె దంపతులు అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేశారు.

భర్త జ్యోతిరావు పులె మరణించిన తరవాత ఆయన చితికి తానే స్వయంగా నిప్పు పెట్టారు సావిత్రి. అప్పటివరకూ భర్తతో కలిసి పనిచేసిన ఆమె- ఆపై ఒంటరిగానే ప్రయాణం కొనసాగించారు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడటానికి 1873లో జ్యోతిరావు ప్రారంభించిన సత్యశోధక్ సమాజ్‌ను విజయవంతంగా నడిపించారు. అంటరానితనం నిర్మూలన, దళితుల విద్యకు ప్రాధాన్యమిచ్చారు. 'కావ్య పులే', 'బవన్ కాశి సుబోధ్ రత్నాకర్' అనే కవితా సంపుటాలను వెలువరించారు. 1897లో ప్లేగు బాధితులకు సేవచేస్తూ తానూ వ్యాధి బారినపడి మరణించారు. ఆ త్యాగమయి జ్ఞాపకార్థం పుణె వర్సిటీ పేరును సావిత్రీబాయి ఫులె విశ్వవిద్యాలయంగా మార్చారు. దేశంలో బాలికల కోసం తొలి పాఠశాలను పెట్టిన సావిత్రీబాయి సేవలకు గుర్తింపుగా ఆమె జయంతిని 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవం'గా నిర్వహించుకుంటున్నాం.

– పి.పవిత్ర



మానవాళి నేడు ఎదుర్కొంటున్న సమస్యల్లో సగం చేజేతులా కొనితెచ్చుకున్నవే. ప్రకృతి వనరులను నాశనం చేసుకున్న ఫలితాన్ని అనుభవిస్తున్నాం. మన తరవాత తరం మరింత ఎక్కువగా ఆ నష్టాన్ని భరించాల్సి వస్తుంది. ఇప్పటికీ మేలుకోకపోతే ముందుతరాలవారు మనల్ని క్షమించరు.

– సుగతకుమారి, రచయిత్రి, సామాజిక కార్యకర్త



హింసతో విలవిల

ఎడతెగని హింస కారణంగా ప్రపంచ ఆర్థికానికి 2024లో 19.97 లక్షల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లింది. విశ్వ జీడీపీలో అది 11.6శాతానికి సమానం. 2023తో పోలిస్తే హింస 3.8శాతం మేర పెరిగింది. దానివల్ల 2024లో వాటిల్లిన నష్టంలో ఆయా పరిస్థితుల వాటా (శాతాల్లో)

ప్రాంతం	సైనిక ఘర్షణలు	అంతర్గత, ప్రైవేటు భద్రత	ఘోర నేరాలూ ఆత్మహత్యలు	సాయుధ ఘర్షణలు	ఇతరాలు
పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా	61.2	26.9	5.0	5.8	1.1
ఉత్తర, మధ్య అమెరికా	52.2	29	15.5	1.6	1.6
ఆసియా పసిఫిక్	46.4	44.5	7.2	0.7	1.2
దక్షిణాసియా	40.1	45.1	10.1	3.9	0.8
దక్షిణ అమెరికా	18.5	29.6	29.9	20	2


(ఆధారం: గ్లోబల్ పీస్ ఇండెక్స్-2025)

జీవిత ప్రయాణం

మనిషి జీవితం ఎంతో ఉత్కృష్టమైంది. అమూల్యమైంది. దాని విలువ తెలిసిన మనిషి ప్రతి క్షణాన్నీ సద్వినియోగం చేసుకుంటాడు. తన జీవన గమనాన్ని నిరంతరం పరిశీలించుకుంటాడు. అవసరమైన మార్పులు చేసుకుంటాడు. జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలనే ఆశయం ప్రతి మనిషికీ ఉంటుంది. సహజమైన ఈ లక్ష్య సిద్ధి కోసం ప్రయాణించే మార్గం ఎల్లప్పుడూ ధర్మబద్ధంగా ఉండాలి. అది ఇతరులకు మేలు చేసేటట్లు కూడా ఉండాలి.

ఈ జీవిత ప్రయాణంలో ఎన్నో బంధాలు, పరిచయాలు ఏర్పడతాయి. మరెన్నో అనుభవాలు కలుగుతూంటాయి. మనతో కలిసి ప్రయాణించేవారు ఎందరో ఉంటారు. కానీ ఎవరూ శాశ్వతంగా మనతో ఉండరు. అయినా నిరాశపడకూడదు. ధర్మబద్ధమైన నడవడికతో ముందుకుసాగాలి. అదే మనల్ని రక్షిస్తుంది.

మంచి నడవడికతో ముందుకు సాగినా ఒక్కొక్కప్పుడు ఓటమిని కూడా అనుభవించక తప్పదు. విజయానికి పొంగిపోకుండా, పరాజయానికి కుంగిపోకుండా స్థితప్రజ్ఞతతో ముందుకు సాగిన మనిషి మాత్రమే తానాశించిన లక్ష్యాన్ని చేరుకోగలడు. నిజానికి ఈ ప్రపంచంలో ఏ ఒక్కరి జీవిత ప్రయాణమూ సాఫీగా సాగదు. ప్రయాణించే దారి ఎప్పుడూ పూలబాటగానే ఉండదు. ఆ దారిలో ముళ్లుంటాయి. రాళ్లుంటాయి. ఎన్నో ఎత్తుపల్లాలుంటాయి. అందరూ పడుతూంటారు. లేస్తూంటారు. ముందుకు సాగుతుంటారు. కిందపడినా మనోధైర్యంతో పైకి లేచేవాడే విజయం సాధించగలడని భర్తృహరి బోధిస్తాడు.



అంతర్యామి

ఇక మనం ప్రయాణించే దారిలో మన ఉన్నతిని చూసి ఈర్ష్యపడే కళ్లుంటాయి. తప్పుల్ని ఎత్తి చూపించే వేళ్లుంటాయి. వెక్కిరించే నోళ్లు కూడా ఉంటాయి. వీటన్నింటికీ భయపడితే ఎవరూ తాము కోరుకున్న గమ్యం చేరలేరు. కార్యసాధకులకు విఘ్నాలు అనేకం. వాటికి తలవంచి వెనకంజ వేయకుండా, ముందుకు సాగితేనే కలలు సాకారమవుతాయి.

జీవనగమనంలో కష్టనష్టాలను మౌనంగా భరించడం; ఓటమిని, అవమానాలను హుందాగా స్వీకరించడం వంటివి ధీర గంభీర వ్యక్తిత్వానికి నిదర్శనాలు. చక్రవర్తి కావాల్సిన శ్రీరాముడు తండ్రి మాటకి తలవంచి అరణ్యాలకు వెళ్లాడు. కారుణ్యమూర్తిగా, ఆదర్శపురుషుడిగా అందరి మన్ననలు పొందాడు. చివరికి రావణ సంహారం చేసి అవతార లక్ష్యాన్ని పూర్తిచేశాడు. పదమూడేళ్లు అరణ్యవాసం, సంవత్సరం అజ్ఞాతవాసం చేయాల్సివచ్చినా పాండవులు ధర్మాన్ని వీడక ముందుకు సాగారు. జీవితం అన్నాక కష్టసుఖాలు పడుగూ పేకల్లా అల్లుకుని ఉంటాయి. ఎంతటివారైనా వాటిని అనుభవించక తప్పదు.

ముళ్ల మధ్య ఉన్నా పువ్వులు ప్రసన్నంగా వికసిస్తూ, పరిమళాలు అందిస్తూ అందరికీ ఆనందాన్ని కలిగిస్తాయి. అదే రీతిగా మనిషి కూడా అడ్డంకులను అధిగమించి తన బాధ్యతలను సక్రమంగా, ధర్మబద్ధంగా నిర్వహిస్తే జీవితం అర్థవంతంగా, ఆదర్శప్రాయంగా సాగుతుంది. ఇతరులు తమను గుర్తించాలని ఆడంబరంగా బతకడం కన్నా సద్భావనలతో అందరికీ సహాయ, సహకారాలందించే వాళ్లే గొప్పవాళ్లు. 'పరోపకారార్థం ఇదం శరీరం' అన్న నీతివాక్యాన్ని అనుసరించి దయ, ప్రేమ, సహకార గుణాలతో పయనం సాగించాలి. అప్పుడే జీవితం ధన్యమవుతుంది.

– విశ్వనాథ రమ

ఉప్పు కయ్యల్లో సిరుల సాగు

చైనా, అమెరికాల తరవాత ఉప్పు ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో నిలుస్తోంది. 1947లో దేశంలో ఉప్పు ఉత్పత్తి 19 లక్షల టన్నులుంటే, 2022-23 నాటికి అది 3.91 కోట్ల టన్నులకు పెరిగింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశీయ అవసరాలకు యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి ఉప్పును దిగుమతి చేసుకునేవాళ్లం. నేడు ఉప్పు ఉత్పత్తిలో ఇండియా స్వయంసమృద్ధి సాధించడమే కాకుండా మిగులు ఉప్పును విదేశాలకు ఎగుమతి చేస్తోంది. 2023-24లో దాదాపు 44 కోట్ల డాలర్ల విలువైన 1.44 కోట్ల టన్నుల ఉప్పును విదేశాలకు పంపించింది. ప్రపంచ ఉప్పు ఎగుమతుల్లో మన వాటా సుమారు పది శాతం. 2030 నాటికి విశ్వవ్యాప్తంగా ఉప్పు మార్కెట్ విలువ 4,860 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ క్రమంలో రాబోయే రోజుల్లో అందివచ్చే ఎగుమతి అవకాశాలను ఇండియా అందిపుచ్చుకోవాలి.

ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ

భారత్‌లో సముద్రపు నీరు, ఉప్పునీటి సరస్సులు, భూగర్భ, రాతి నిక్షేపాలు ఉప్పు ఉత్పత్తికి ప్రధాన వనరులు. దేశవ్యాప్తంగా దాదాపు 7.47 లక్షల ఎకరాల్లో ఉప్పు సాగవుతోంది. వేల సంఖ్యలో ఉత్పత్తిదారులున్నారు. దేశీయ ఉప్పు ఉత్పత్తిలో గుజరాత్ 87.4శాతం వాటాతో అగ్రభాగాన నిలుస్తోంది. తమిళనాడు (4.7శాతం), రాజస్థాన్ (6.7శాతం)లు తరవాతి స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, పశ్చిమ్ బెంగాల్, గోవా, హిమాచల్‌ప్రదేశ్, డామన్ డయ్యూలలోనూ ఉప్పు ఉత్పత్తి అవుతోంది. దేశంలో ఏటా మానవ వినియోగానికి సగటున 74 లక్షల టన్నులు, పారిశ్రామిక వినియోగానికి సుమారు 125 లక్షల టన్నుల ఉప్పు అవసరమవుతోంది. పారిశ్రామికంగా పెరిగిన డిమాండు దృష్ట్యా చైనా, జపాన్, ఆగ్నేయ ఆసియా దేశాలకు మన ఉప్పు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. మొత్తం వంద దేశాలకు మన ఉప్పు వెళ్తోంది. అయోడైజ్డ్ ఉప్పు, రాతి ఉప్పు,



ఉప్పు అనగానే సాధారణంగా వంటలే గుర్తొస్తాయి. అయితే, పారిశ్రామికంగానూ ఉప్పు వినియోగం పెరుగుతోంది. ఈ క్రమంలో ఇండియా పెద్దమొత్తంలో విదేశాలకు ఉప్పును ఎగుమతి చేస్తోంది. అదే సమయంలో సంబంధిత పరిశ్రమలో పనిచేస్తున్నవారి సంరక్షణకూ పలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

హిమాలయన్ పింక్ సాల్ట్‌లను సహజంగా వంటల్లో వాడతారు. అంతే కాకుండా రసాయన, తోలు, గాజు, ప్లాస్టిక్ పరిశ్రమల్లో, క్లోరిన్, సోడాయాష్, కాస్టిక్ సోడా తయారీలోనూ ఉప్పును వినియోగిస్తారు. రహదారులపై మంచును కరిగించడానికీ ఉప్పు తోడ్పడుతుంది. ఈ క్రమంలో శీతల దేశాలకూ ఉప్పు ఎగుమతి అవుతోంది. ఆక్వా పరిశ్రమలోనూ దాని వినియోగం అధికమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని 974 కిలోమీటర్ల తీర ప్రాంతంలో దాదాపు 20 వేల ఉప్పు కొఠారులు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రధానంగా నౌపడ, చినగంజాం, ఇస్కపల్లి, కాకినాడ, కృష్ణపట్నం తదితర ప్రాంతాల్లో ఉప్పు ఎక్కువగా ఉత్పత్తి అవుతోంది. జనవరి నుంచి జూన్ వరకు పంటకాలం ఉంటుంది. 'ఆంధ్రప్రదేశ్ ఉప్పుగిన్నె'గా శ్రీకాకుళం జిల్లాలోని నౌపడ ప్రసిద్ధి చెందింది.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉప్పు పరిశ్రమలో వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. అయితే, ఉప్పు కొఠారులకు వెళ్లడానికి సక్రమమైన రహదారులే చాలా చోట్ల కనిపించవు. గుజరాత్‌తో పోలిస్తే ఏపీలో ఉప్పు సాగు, ఎగుమతుల్లో యంత్రాల వినియోగం తక్కువ. కూలీలే మండే ఎండలో శ్రమిస్తుంటారు. వారికి నల్లకళ్లద్దాలు సమకూర్చాల్సి ఉన్నా ఎక్కడా అవి అందడం లేదు. మరోవైపు ఎక్కువ సమయం ఉప్పులో ఉండటం వల్ల కార్మికులకు చర్మ సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు తలెత్తే ప్రమాదం ఉంది. దేశవ్యాప్తంగా వారి ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. సురక్షిత ఉప్పు సాగుపై తగిన శిక్షణ అందించాలి. వేసవిలో కురుస్తున్న అకాల వర్షాల వల్ల ఉప్పు మడులు పూర్తిగా కరిగిపోయి రైతులు నష్టపోతున్నారు. వరి, మిరప వంటి పంటల మాదిరిగా ఉప్పు సాగుదారులకూ నష్టపరిహారాలు అందించాలి. రాబోయే రోజుల్లో పెరిగే అవసరాలకు అనుగుణంగా ఉప్పు ఉత్పత్తిని, ఎగుమతులను ఇతోధికం చేయడంతో పాటు, సంబంధిత రైతులూ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి. అప్పుడు మన ఉప్పు మరింతగా సిరుల పంట పండిస్తుంది.

– రెడ్లం రామవరప్రసాద్

చిన్న పెన్సిల్.. పెద్ద కథ!

రాహుల్, బిట్టు ఇద్దరూ అన్నాదమ్ముళ్లు. ఒకసారి వాళ్ల తాతయ్య దగ్గరికి వెళ్లి.. 'చూడు తాతయ్యా తమ్ముడు.. రోజూ తన పెన్సిల్ పారేసుకుని నాది తీసుకుంటాడు. అమ్మేమో నేను పారేస్తున్నాను అనుకుంటోంది' అన్నాడు రాహుల్. 'అది సరేగానీ నీకు పెన్సిల్ గురించి తెలుసా?' అడిగారు తాతయ్య. 'తెలీదు.. ఏంటో చెప్పండి తాతయ్యా!' అన్నాడు రాహుల్. 'మీలాంటి పిల్లల నుంచి పెద్దపెద్ద ఇంజినీర్లు, ఆర్కిటెక్టులు, శాస్త్రవేత్తలు, చిత్రకారుల వరకూ ఎంతోమంది పెన్సిల్ వాడతారు. మనదేశంలో పెన్సిల్ తయారీ సంస్థలు ఎన్నో ఉన్నప్పటికీ వందకు పైగా దేశాల నుంచి మనం పెన్సిళ్లను, వాటికి అవసరమైన ముడిసరకును దిగుమతి చేసుకుంటున్నాం. అలాగే తయారైన పెన్సిళ్లను పలు దేశాలకు ఎగుమతులూ చేస్తున్నాం. పెన్సిళ్ల ఎగుమతుల్లో చైనా తరవాత



స్థానం మనదే. పెన్సిల్ తయారీకి గ్రాఫైట్, చెక్క, మట్టి, పెయింట్, రబ్బర్ వంటి పదార్థాలు ఉపయోగిస్తారు. పెన్సిల్‌లో నల్లగా కనిపించే భాగం గ్రాఫైట్. దాన్ని క్లేతో కలిపి పేస్ట్‌గా తయారు చేసి, సన్నని పుల్లలుగా మార్చి, అధిక ఉష్ణోగ్రత దగ్గర కాలుస్తారు. క్లే ఎక్కువైతే పెన్సిల్ 'హార్డ్ (హెచ్)' అవుతుంది. క్లే తక్కువైతే పెన్సిల్ 'డార్క్(బి)' అవుతుంది. రెండూ కలిసి మధ్యస్థంగా ఉండేదాన్ని 'హెచ్‌బి' అంటారు. ఇంకా 'ఫర్మ్(ఎఫ్)' అని ఇంకో రకం కూడా ఉంది. వీటిలోనూ మళ్లీ గ్రేడులుంటాయి. వాటిని డ్రాయింగ్ వేసేవాళ్లు వాడతారు. గ్రాఫైట్ భారత్, చైనా, శ్రీలంకలో లభిస్తుంది. మన దేశంలో ఇది ప్రధానంగా ఝార్ఖండ్, ఒడిశా, తమిళనాడు, రాజస్థాన్, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దొరుకుతుంది. గ్రాఫైట్ చుట్టూ ఉండే చెక్క కోసం సాధారణంగా దేవదారు చెట్టు కలపను వాడతారు. ఇది అమెరికా, బ్రెజిల్, ఇండోనేషియా, రష్యా అడవుల్లో లభిస్తుంది' అని చెప్పారు తాతయ్య. 'ఒక పెన్సిల్ తయారవడానికి ఇన్ని పనులు జరగాలన్నమాట' అన్నాడు రాహుల్. అవునంటూ మనవణ్ని దగ్గరికి తీసుకున్నారు తాతయ్య.

– కోట దామోదర్

హాయ్! బుజ్జీ!!

నేనెవర్ని?

1. అయిదు అక్షరాల ఆంగ్ల పదాన్ని నేను. నాలోని 1,3,4 అక్షరాలను కలిపితే 'కొడుకు' అని.. చివరి నాలుగు అక్షరాలను కలిపితే 'గొంతు' అనే అర్థాన్నిస్తాను నేనెవర్ని?
2. నేనో ఆరు అక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలోని మొదటి నాలుగు అక్షరాలను కలిపితే 'గాలి' అని.. 4,5,6,3 అక్షరాలను కలిపితే కింద అనే అర్థాన్నిస్తాను. ఇంతకీ నేనెవర్ని?

జవాబు: 1.STONE 2.WINDOW

పట్టాలపై మంచు.. పట్టకుంటే ముంచు



గత వారం రోజులుగా నిత్యం తెల్లవారుజామున పొగ మంచు నగరాన్ని కమ్మేస్తోంది. ఉదయం 8గం టలైనా దారి కనిపించని పరిస్థితి. రామవరప్పాడు రైల్వేస్టేషన్ సమీప ప్రాంతాల్లో విద్యార్థులు, కూలీలు రైల్వే ట్రాక్ దాటు కుని వెళ్తుంటారు. మంచు తెరల మధ్య రైలు వస్తున్నా కనిపించని పరిస్థితి. మంచు కురిసే వేళ అప్రమత్తంగా లేకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. -ఈనాడు, అమరావతి

అమరావతిలో గణతంత్ర దినోత్సవం

ఈనాడు, అమరావతి: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. అమరావతి ఏర్పాటైన తర్వాత రాజధాని వేదికగా తొలిసా రిగా ఈ వేడుక నిర్వహించనున్నారు. కొండమరాజుపాలెం పరి ధిలో హైకోర్టుకు వెళ్లే దారిలో మంత్రుల నివాసాల ఎదురుగా ఉన్న స్థలాన్ని దీనికోసం ఎంపిక చేసి యంత్రాంగం పదును చేస్తున్నారు. పార్కింగ్‌కు వీవీఐపీ వాహనాలకు ఒక ఎకరం, వీఐపీ వాహనా లకు నాలుగు ఎకరాలు కేటాయించారు. మైదానంలో మట్టి కవాతు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుక చూడవచ్చే పుల ప్రజలు కూర్చుని వీక్షించేలా సభా వేదిక నిర్మిస్తారు. గణతంత్ర వేడుకలకు గవర్నర్, ముఖ్యమంత్రి, డీజీపీ, వీవీఐపీలు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పాల్గొంటున్నందున సభావేదిక, శక టాల ప్రదర్శన, వాహనాల పార్కింగ్ తదితర అవసరాలకు అను గుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

కళ తెస్తామన్నారు.. కన్నీళ్లు మిగిల్చారు..!

- రూ.4.2 కోట్ల ప్రజాధనం బూడిదలో పోసినట్లే
- వైకాపా సర్కారు నిర్వాకంతో తప్పిన జలకళ

మెట్ట ప్రాంత సాగుకు కళ తెస్తాం.. ఉచితంగా బోర్లు వేసి మోటార్లు బిగించి రైతులకు దన్నుగా ఉంటామని చెప్పిన వైకాపా సర్కారు.. ఊరించి.. ఉసూరుమనిపించింది. కొంతమేర బోర్లు వేసినా మోటార్లు బిగించకపోవడంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. రూ.కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నైంది.

2,548 బోర్లకు 106 మోటార్లేనా?..

- జలకళకు వచ్చిన దరఖాస్తులు: 5,748
- కేటాయించిన నిధులు: రూ.21.8 కోట్లు
- మంజూరైన బోర్లు: 3,580
- ఏర్పాటు చేసిన బోర్లు: 2,548
- వీటిలో మోటార్లు బిగించినవి: 106
- ఖర్చు చేసిన నిధులు: రూ.4.22 కోట్లు

ఇదండీ లెక్క..

జిల్లాలో ఎక్కువ భాగం బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్నారు. 2020లో జలకళ ద్వారా బోర్లు వేసి, మోటార్లు బిగించి.. ఏళ్లుగా విద్యుత్తు సర్వీసులు సైతం ఉచితంగా ఇస్తామని వైకాపా సర్కారు ప్రకటించింది. 2.5 ఎకరాల నుంచి 5 ఎకరాల వారికి పథకం వర్తిం పజేస్తామని చెప్పుకొచ్చారు. కనీసం బోర్లు, మోటార్లు బిగించారా అంటే అవీ పూర్తిగా చేయలేదు. 5 ఎక రాలు మించిన పెద్ద రైతులకు వేగంగా బోర్లు వేసి సన్న కారు రైతులను అవస్థలు పెట్టారు. 2,548 బోర్లు వేసినా వాటిలో కేవలం 106 బోర్లకే మోటార్లు బిగించారు. తర్వాత విద్యుత్తు సర్వీసుల బాధ్యత రైతులదే అని మాట

మార్చారు. దీంతో 368 మంది రైతులు సొంత నిధులతో సర్వీసులు తెచ్చుకుని ఆర్థికంగా చితికిపోయారు. బోర్లు, మోటార్లు, పంపుసెట్లు తది తర పనులు చేపట్టిన గుత్తేదారులకు సైతం రూ.కోట్లలో బకాయిలున్నాయి. నందిగామ, మైలవరం, చందర్లపాడు, తిరువూరు, ఏ.కొండూరు మండలాల్లో చాలా మంది మోటార్లు, విద్యుత్తు సర్వీసులు రప్పించుకునే స్తోమత లేక బోర్లను నిరుపయోగంగా మిగిల్చారు. బోర్లు, మోటార్లు వేసినం దుకు రూ.4.22 కోట్లు ఖర్చు చేసినా ప్రయోజనం పూర్తి స్థాయిలో విద్యుత్తు సర్వీసులు ఇవ్వక పోవడంతో నిరుపయోగంగా మారాయి. కనీసం ముందుచూపు లేకుండా రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక.. ఎన్టీఆర్ జలసిరిగా మారుస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏప్రిల్ నుంచి పట్టాలెక్కిం చనుంది. జలసిరి పథకం మార్గ దర్శకాలు, దరఖాస్తు విధానంపై స్పష్టత రావాల్సి ఉందని డ్వామా డీపీ రాము తెలిపారు.
– ఈనాడు, అమరావతి

పుస్తక వేదిక.. పాఠక వేడుక

36వ ప్రదర్శనను ప్రారంభించిన జస్టిస్ శ్రీనరసింహ ✱ స్టేడియంలో కొలువుదీరిన 309 స్టాళ్లు

ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, విజయవాడ సాంస్కృతికం

36వ విజయవాడ పుస్తక మహోత్సవం శుక్రవారం ఘనంగా ఆరంభమైంది. ఈనెల 12వ తేదీ వరకూ నగరంలోని ఐందిరాగాంధీ మైదానంలో ప్రదర్శన కొనసాగు తుంది. సుప్రీంకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శనను శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ప్రత్యేక అతిథులుగా.. ఐసెటీ పతి రఘురామకృష్ణరాజు, సీపీఐ జాతీయ నేత నారాయణ తదిత రులు హాజరయ్యారు. మొదటి రోజు.. స్టాళ్లలో పుస్తకాలను సర్దు కోవడానికే సాయంత్రం వరకూ సమయం పట్టింది. శని, ఆదివా రాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచే పుస్తక మహోత్సవ ప్రాంగణం తెరుచుకోనుంది. రాత్రి 9 గంటల వరకూ కొనసాగు తుంది. * పుస్తక మహోత్సవానికి



విద్యుత్తు వెలుగుల్లో ప్రాంగణం

హాజరైన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పుస్తక పఠనాసక్తి పెరుగుతోంద న్నారు. గత మూడున్నర దశాబ్దాలుగా పుస్తక మహోత్సవాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తు న్న వీబీఎఫ్ఎస్ ప్రతినిధుల కృషి అభినంద నీయమన్నారు. ✦ ఈ ఏడాది ప్రదర్శనకు కనీసం ఏదిమిది లక్షల మందికి పైగా పుస్తకప్రి యులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తు న్నామని.. విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్ఎస్) సమన్వయకర్త ఎమెస్కో విజయకుమార్ తెలిపారు. ✦ 1989 నుంచి మూడున్నర దశాబ్దాలుగా పైగా పుస్తక మహో త్సవాన్ని దిగ్విజయంగా నిర్వహించడానికి.. ప్రచురణ కర్తలు, పాఠకుల ప్రోత్సాహమే కార ణమని.. వీబీఎఫ్ఎస్ కార్యదర్శి కె.లక్ష్మయ్య



హాజరైన పుస్తకప్రియులు



ఎన్నెన్నో పుస్తకాలు: కొలువుదీరిన స్టాళ్లు



పుస్తక ప్రదర్శనను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ

పేర్కొన్నారు. ✦ పుస్తక ప్రదర్శనకు ఈసారి గతంలో కంటే మరింత ఎక్కువ స్పందన ఉంటుందని.. వీబీఎఫ్ఎస్ అధ్యక్షులు టి.మనోహర్‌నాయుడు తెలి పారు. హైదరాబాద్ పుస్తక ప్రదర్శనకు వచ్చిన స్పందన చూస్తే.. ఈసారి ఇక్కడా భారీగా పుస్తక ప్రియులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు.



పుస్తకాన్ని పరిశీలిస్తున్న జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ

పుస్తక మహోత్సవంలో 'ఈనాడు'

బి.వి.పట్టాభిరామ్ సాహిత్య వేదిక

✦ సాయంత్రం 5 గంటలకు మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'మనుస్మృతిలో ఏముంది' పుస్త కావిష్కరణ. ✦ 5:45 గంటలకు సూరనేని విమల సంస్మరణ సభ. ✦ 6 గంటలకు 'పాఠిక్ల ప్రచురణ రంగం' అంశంపై చర్చా గోష్ఠి సభ.

జయంత్ నార్లికర్ ప్రతిభావేదిక

✦ సీనియర్ విభాగాల్లో విద్యార్థులకు సాయంత్రం 5:30 నుంచి రాత్రి 8 గంటల వరకు పద్యాలు, చిత్రలేఖనం పోటీలు ఉంటాయి.

గొల్లపూడి పచ్చళ్లు.. విదేశాల్లో ఘుమఘుమలు

ఈనాడు, అమరావతి

ప్రతి కుటుంబం నుంచి మహిళా వ్యాపార వేత్త రావాలి' అన్న సీఎం చంద్రబాబు పిలుపే స్ఫూర్తిగా తీసుకుని ఆమె అడు గులు వేశారు. ఇంటి నుంచి బయ టికి రాని పరిస్థితుల నుంచి పచ్చళ్ల వ్యాపారం ఏర్పాటు చేసి విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారు. గొల్లపూడికి చెందిన సుహాసిని వెలుగు రుణాల చేయూతతో మాంసా హార పచ్చళ్లే తన ప్రత్యేకతగా ముందుకు సాగుతున్నారు.

సుహాసిని మధ్య తరగతి కుటుంబం. ఇంట్లో ఖర్చులు, జీవనా ధారం కోసం రొయ్యల పచ్చడి తయారు చేయడం.. చుట్టుపక్కల వారికి అమ్మకాలు మొదలుపెట్టారు. తీసుకున్న వారి నుంచి బాగున్నా యని అభినందనలు రావడం, మరిన్ని ఆర్డర్లు ఇవ్వడంతో చికెన్, మటన్, చేప పచ్చళ్లు తయారు చేయడం మొదలుపెట్టారు. ★ భర్త,

పిల్లల సహకారంతో ఎక్స్‌పోల్లో స్టాళ్లు ఏర్పాటు చేయడం, వాట్సప్ గ్రూపుల ద్వారా ప్రచారం వంటి అనేక పనులు చక్కబెడుతున్నారు. తెలిసినవారు, స్నేహితుల ద్వారా ఈ పచ్చళ్ల రుచులు ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు వ్యాపించాయి. ★ చిత్తూరు, నెల్లూరు, నరసరావుపేట, మహారాష్ట్ర, తమిళనాడు ఇలా అనేక రాష్ట్రాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. క్రమంగా



స్టాల్లో పచ్చళ్లు అమ్ముతున్న సుహాసిని

అమెరికా, యూకే, సౌదీ వంటి దేశాలకు పంపి స్తున్నారు. విజయవాడ ఉత్సవ్, కలెక్టరేట్ ఆవ రణలో తాజాగా వైబ్రెంట్ హాదిత్యాల సద స్సులో సుహాసిని ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. ★ దీంతో పచ్చళ్లకు మరింత ప్రాచుర్యం వచ్చింది. ప్రస్తుతం నెలకు 200 కేజీలకు పైగా పచ్చళ్లు అమ్ముతున్నారు. వీటితో పాటు ప్రోటీన్ లడ్డూ, పప్పుల పొడి, పల్లీలు, కొబ్బరి, నువ్వులు, కరివేపాకు, మునగా కుతో చేసిన కారప్పొడులు తయారు చేసి విక్ర యిస్తున్నారు. ★ ప్రస్తుతం ఏడాదికి రూ.10 లక్షలకు పైగా టర్నోవర్ సాధిస్తున్నారు. సీఎం స్ఫూర్తి, వెలుగు సంఘాల చేయూత, భర్త, పిల్లల ప్రోత్సాహంతోనే ఇవన్నీ చేయగలుగుతు న్నానని సుహాసిని చెబుతున్నారు.

ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్, మచిలీపట్నం- న్యూస్‌టుడే, కలెక్టరేట్, బందరు గ్రామీణం

పీఎన్‌బీఎస్- బెంజ్‌సర్కిల్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలి

- ✦ బెంజ్ సర్కిల్ నుంచి గోసాల వరకు మరో పైవంతెన అవసరం
- ✦ ఎన్‌హెచ్65, 216 అభివృద్ధికి త్వరలో రూ.400 కోట్లు మంజూరు
- ✦ బందరులో ఉమ్మడి జిల్లా ఎన్‌హెచ్ సమీక్షలో ప్రజాప్రతినిధులు

'విజయవాడ బస్టాండ్-బెంజ్ సర్కిల్, బెంజ్ సర్కిల్-గోసాల వరకు రెండు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలి. లేదంటే ఎన్టీఆర్ సర్కిల్, ఆటోనగర్, కానూరు, తాడిగడప, పోరంకి, పెనమలూరు, గంగూరు, గోసాల వరకు వెహికల్ అండర్ పాస్ (వీయూపీ) నిర్మించాలని' మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు బాలశౌరి, కేశినేని శివనాథ్ అధికారులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల ప్రగతి తీరుపై శుక్రవారం మచిలీపట్నంలోని ఎంపీ కార్యాలయంలో సమీక్షించారు. జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ, డీపీఆర్‌లో అభ్యంతరాలు, తదితర అంశాల్లో సమ స్యలపై చర్చించారు. రహదారుల అభివృద్ధికి అధి కారులు చేపడుతున్న కార్యాచరణను ప్రజాప్రతినిధు లకు వివరించారు.

పోర్టు అనుసంధానానికి భారీగా నిధులు..

✦ మచిలీపట్నం పోర్టు నుంచి ఎన్‌హెచ్ 216, 65 అనుసంధాన రోడ్డు నిర్మాణానికి రూ.400 కోట్లు మంజూర వనున్న నేపథ్యంలో తదుపరి చేపట్టా ల్సిన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రజాప్రతినిధులు సూచిం చారు. ✦ ఎన్‌హెచ్65ని ఎన్‌హెచ్16కి అనుసంధానిస్తూ తాడిగడప-ఎనికే పాడు వరకు 4 కిమీ, పోరంకి-నిడమా నూరు 6 కిమీ, కంకిపాడు-కేసరపల్లి 10 కిమీ అనుసంధాన దారులు కావాలి. దీంతో ట్రాఫిక్ భారం తగ్గి విమానాశ్రయానికి ప్రయాణం సునా యాసం అవుతుందన్నారు.
✦ బందరు పోర్టు నుంచి ఎన్‌హెచ్65, ఎన్‌హెచ్216 వరకు నిర్మించే రహదారిలో పోర్టు నుంచి మాచవరం రైస్‌మిల్ సెంటర్ వరకు 3.7 కిమీ వరకు 4 వరసల గ్రీన్ ఫీల్డ్ రహదారి, మాచవరం రైస్ మిల్ నుంచి ఎన్‌హెచ్-65 దగ్గర అండర్ పాస్ వరకు 4 కిమీ వరకు ప్రస్తుతం ఉన్న రెండు వరసలను 4 వరసలుగా విస్తరించాలి.
✦ మంగినపూడి తీరం నుంచి మచిలీపట్నం వరకు 8 కిమీ రోడ్డును 4 వరసల రహదారిగా అభివృద్ధి చేయడా నికి నివేదికలు సిద్ధం చేయాలి. రెండు రహదారుల్లో అవసరమైనచోట్ల ఆర్వోబీల నిర్మాణానికి నిధుల కోసం ప్రతిపాదనలు రూపొందించాలి.
✦ గుడివాడలో ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ప్రస్తుత ఆర్వోబీ నుంచి 3.2 కిమీ మేర 4 వరుసల దారిని ఎన్‌హెచ్-216తో అనుసంధానం కోసం డివైడర్లు, విద్యుదీకరణ, డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రతిపాదించారు.



అధికారులతో చర్చిస్తున్న ఎంపీలు బాలశౌరి, కేశినేని శివనాథ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు తదితరులు

ఎన్‌హెచ్65 డీపీఆర్‌లో మార్పులు చేస్తాం...

☆ ఎన్‌హెచ్ 65 డీపీఆర్‌లో ప్రజాప్రతినిధులు అడిగిన మార్పుల గురించి ఉన్న తస్థాయిలో చర్చించి మళ్లీ సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. గుడివాడ నుంచి కంకిపాడు వరకు 27 కిమీ పొడవున మూడు జాతీయ రహదారులను కలిపేలా రహదారి నిర్మాణం. ☆ గన్నవరం మండలం మర్లపాలెం ఆర్వోబీ దగ్గర అప్రోచ్ రహదారుల నిర్మాణం, విజయవాడ-బందరు రహదారిలో పూర్తిస్థా యిలో లైట్లు ఏర్పాటు ☆ ఒంగోలు- కత్తిపూడి జాతీయ రహదారి పెడన పరి ధిలో లోసరి వంతెన నుంచి మచిలీపట్నం సమీపంలోని తాళ్లపాలెం, గిలకల దిండి మీదుగా కోడూరులోని ఉల్లిపాలెం వంతెన వరకు అనుసంధానం. ☆ ఎన్‌హెచ్-216పై పెడన వద్ద నిర్మిస్తున్న ఆర్వోబీ నిర్మాణం మార్చికల్లా పూర్తి. కంకిపాడు-గుడివాడ రోడ్డు దుస్థితితో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున నిర్మాణం పూర్తి చేయాలి. ☆ గతిశక్తి పథకం ద్వారా పామర్రు, చల్లపల్లి ప్రాంతాలను జాతీయ రహదారులతో అనుసంధానించాలి.☆ గుడివాడ నుంచి పామర్రు మీదుగా నిర్మించిన జాతీయ రహదారి-165 చల్లపల్లి వరకు ఎన్‌హెచ్216కు అనుసంధానించాలి. సమీక్షలో ఎమ్మెల్యేలు బుద్ధప్రసాద్, బోడే ప్రసాద్, ఎన్‌హెచ్ ఆర్వో ఆర్కే సింగ్, మోర్త్ ఆర్వో హరికృష్ణ, మోర్త్ పీడీ సాయిశ్రీనివాస్, అమరావతి ఎన్‌హెచ్ పీడీ పార్వతీశం, ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శంకర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, డీఆర్వో చంద్రశేఖర్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

కృష్ణలంక వద్ద ప్రమాదాలు నివారించాలి...

లక్షకుపైగా జనాభా ఉన్న కృష్ణలంక ప్రాంతంలో తరచూ రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. బస్టాండ్ నుంచి నిర్మించే కారిడార్‌లో కనకదుర్గ వారధి వద్ద హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా నుంచి వచ్చే వాళ్లకు ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలి.
- కేశినేని శివనాథ్(చిన్ని), విజయవాడ ఎంపీ

రూ.450 కోట్లతో పోర్టు అనుసంధాన దారులు

రూ.450 కోట్లతో పోర్టు అనుసంధాన రోడ్లు, రూ.2 వేల కోట్లతో విజయవాడ-మచిలీపట్నం రహదారి విస్తరణ చేపడు తున్నాం. రూ.25 కోట్లతో గుడివాడలో జాతీయ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. కత్తిపూడి-ఒంగోలు రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశాం.
- బాలశౌరి, ఎంపీ, మచిలీపట్నం

భూసేకరణ తగ్గుతుంది..: కొల్లు రవీంద్ర, మంత్రి

లోసరి నుంచి కోడూరులోని ఉల్లిపాలెం వరకు 70 కిమీ తీర ప్రాంతాన్ని కలుపుతూ 216 అభివృద్ధి చేస్తే తీర ప్రాంతంలో కరకట్టగా అభివృద్ధి చెందుతుంది. రహదారితో పోర్టు అనుసం ధానానికి మొదటగా లీఫ్ ఫ్లైఓవర్ నమూనా ప్రతిపాదించాం. రైతుల కోరిక మేరకు మార్చాం. భూసేకరణ తగ్గుతుంది.

జోగి భార్య.. కుమారులకు నోటీసులు

ఈనాడు - అమరావతి: మాజీ మంత్రి జోగి రమేష్ సతీమణి, కుమా రులకు మాచవరం పోలీసులు నోటీ సులు ఇచ్చారు. గత నవంబరులో నకిలీ మద్యం కేసులో జోగి సోదరు లను అరెస్టు చేసిన తర్వాత విజయ వాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్ష లకు తేగా వైకాపా శ్రేణులు వీరంగం సృష్టించాయి. అద్దాలు పగలగొట్టి బీభత్సం సృష్టించాయి. ఈ ఘటనపై అప్పట్లో జోగి రమేష్ భార్య, ఇద్దరు కుమారులు, మరికొందరిపై మాచ వరం పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రమేష్ భార్య శకుంతల, కుమారులు రాజీవ్, రోహి త్‌లతోపాటు రాము, శివాజీలకు శుక్ర వారం నోటీసులు ఇచ్చారు. ఘటన జరిగిన రోజు వారిని పోలీసులు ఆపే ప్రయత్నం చేసినా ఆగకుండా రచ్చ చేశారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. సాక్షులను బెదిరించకూడదనీ, మరో నేరానికి పాల్పడకూడదనీ, దర్యాప్తు అధికారి పిలిచినప్పుడు విచారణకు రావాలనీ, దర్యాప్తునకు సహకరించా లనీ, రాతపూర్వకంగా వివరణ ఇవ్వా లని నిందితులకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ డిప్లొమా ప్రవేశ పరీక్షకు శిక్షణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన అభ్య ర్థులు నేరుగా పాలిటెక్నిక్ డిప్లమా రెండో ఏడాదిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఆ పరీక్ష రాసే అభ్యర్థులకు విజయవాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ఈ నెల 5వ తేదీ నుంచి ఫిబ్రవరి నాలుగో తేదీ వరకు శిక్షణ తరగ తులు ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.కనకారావు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువప త్రాలు, జెరాక్స్ కాపీలతో సంప్రదిం చాలని సూచించారు.

దాటలేక దండాలు.. దారిపై గండాలు..





విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో స్థానికులు రోడ్డు దాటే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్వహణ సక్రమంగా లేక ఆకతాయిలకు అడ్డాగా మారాయి. కొందరు మద్యం తాగి సీసాలను వాటిపై పడేస్తున్నారు. ఫ్లెక్సీల కారణంగా వాటిపై చీకట్లు అలముకుంటున్నాయి. రాత్రివేళ విద్యుత్తు దీపాలు లేక వాటిపై నుంచి వెళ్లడానికి జంకుతున్నారు. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉన్నా.. విద్యార్థులు, స్థానికులు డివైడర్‌పై ఉన్న ఇనుప చువ్వల మధ్యలో నుంచి దూరి ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యలకు పరిష్కారం చూపాల్సి ఉంది. - ఈనాడు, అమరావతి

చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా..

తెలుగు పండగ ఆరంభం నేడే



ప్రాంగణంలో సరస్వతీ విగ్రహం

ప్రాంగణం: 20 ఎకరాలు
వేదికలు: 5
కార్యక్రమాలు: 3 రోజులు

న్యూస్‌టుడే - గుంటూరు సాంస్కృతికం: తెలుగు వెలుగులకు గుంటూరు నగరం ఏటుకూరురోడ్డులోని సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ముస్తాబైంది. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజులపాటు ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించనున్నారు. ఇందుకోసం ఐదు సువిశాల వేదికలను సిద్ధం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై తెలుగు సంస్కృతి.. సంప్రదాయాలను అనుసరించి లక్ష్మీగణపతి హోమంతో శనివారం ఉదయం 5 గంటల నుంచే కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ✦ తొలిరోజు పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణం.. రెండోరోజు శివపార్వతుల కల్యాణం.. మూడోరోజు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ఇక్కడే విష్ణుసహస్ర నామ, హనుమాన్ చాలీసా పారాయణాలు, అన్నమాచార్య సంకీర్తన ఉంటాయి. ✦ ఘంటసాల, ఎస్పీ బాలు కళా వేదికపై పలు రాష్ట్రాల నుంచి వచ్చిన గాయకులు వీనులవిందుగా గానాలాపన చేయనున్నారు. ✦ మూడో వేదికను జానపద కళాప్రదర్శనలకు ఉద్దేశించారు. అంతరించి పోతున్న కళల ప్రదర్శనలు ఉంటాయి. ✦ శ్రీనాథమహాకవి పేరుతో ఏర్పాటు చేసిన వేదికపై సంప్రదాయ సాహిత్యంపై చర్చలు, సెమినార్లు, సుప్రసిద్ధ సాహిత్య ప్రముఖుల ప్రసంగాలు, అవధానాలు ఉంటాయి.

స్మరణ... ✦ ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు సహా ఎన్టీఆర్, మంగళంపల్లి బాలమురళీకృష్ణ తదితరుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. ✦ వివిధ ద్వారాలకు ధూళిపాళ సీతారామ శాస్త్రి లాంటి చలన చిత్ర, నాటక రంగ ప్రముఖుల పేర్లు పెట్టారు.

తెలుగింటి రుచులతో.... తెలుగు నాట డొక్కా సీతమ్మ పేరు విననివారుండరు. ఆమె ఔన్నత్యాన్ని తలచుకునేలా వంటశాలకు డొక్కా సీతమ్మ పేరు పెట్టారు.

కళల సమాహారంగా... తెలుగు నాట విశేషాదరణ పొందిన, ప్రాచీన కళారూపాల ప్రదర్శనలుంటాయి.

హస్తకళా ప్రదర్శనలు... పుస్తకాల ప్రదర్శనలకు వీలుగా అంగళ్లు ఏర్పాటు చేశారు. వివిధ వస్తువుల విక్రయాలకు మరికొన్ని కేటాయించారు. హస్తకళా ప్రదర్శనల కోసం ఒక వేదిక నిర్మించారు. తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ చెప్పారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు


పీవీపీ సిద్ధార్థలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


విజేతలతో ప్రిన్సిపల్ శివాజీబాబు, ప్రీతిరంగమణి, లక్ష్మీతులసీ తదితరులు

కానూరు, న్యూస్‌టుడే : సంక్రాంతి సంబరాల్లో భాగంగా కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఈనాడు' ఈఎఫ్ఎం 91.9 ఆధ్వర్యంలో శుక్రవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని పండగ విశిష్టత, పర్యావరణ పరిరక్షణపై సందేశాత్మక ముగ్గులు వేసి ఔరా అనిపించారు. తోటి విద్యార్థినులను ప్రోత్సహిస్తూ, విద్యార్థులంతా సందడి చేశారు. ద్వితీయ సంవత్సరం సివిల్ విభాగానికి చెందిన బి.కావేరి మొదటి బహుమతి, ఈఈఈ మూడో సంవత్సరం చదువుతున్న కె.వేదశ్రీ ద్వితీయ బహుమతి, సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.సుప్రియ తృతీయ బహుమతి సాధించారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీబాబు, అధ్యాపకులు ప్రీతిరంగమణి, లక్ష్మీతులసీ తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి మెయిన్ స్పాన్సర్‌గా డైమండ్ నెక్ట్స్, సపోర్ట్ స్పాన్సర్‌గా పద్మజాసుజుకీ, అసోసియేట్ స్పాన్సర్‌గా ప్రియా ఫుడ్స్ వ్యవహరించాయి.


విశ్వవిద్యాలయంలో రంగులు అద్దుతూ..


విజేతలతో పద్మజా సుజుకీ సీఈవో అనురాధ, ఉపకులపతి వెంకటేశ్వరరావు, రత్నప్రసాద్, రవిచంద్, డైమండ్ నెక్ట్స్ మేనేజర్ నజీర్ అహ్మద్

సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో.. పండగ వాతావరణం

సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'ఈనాడు' ఈఎఫ్ఎం 91.9 నేతృత్వంలో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సుందరంగా ముగ్గులు వేశారు. పండగ వాతావరణాన్ని సృష్టించారు. ఈసీఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జ్ఞానశ్రీ మొదటి బహుమతి, సీఎస్ఈ ఏఐ డీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎ.గౌరీ గీతిక ద్వితీయ బహుమతి, ఎంసీఏ మొదటి సంవత్సరం బిందుశ్రీ తృతీయ బహుమతి సాధించారు. వారికి పద్మజ సుజుకీ సీఈవో సీహెచ్ అనురాధ, డైమండ్ నెక్ట్స్ మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్, విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు, ప్రో వైస్‌ఛాన్స్‌లర్ ఏవి రత్నప్రసాద్, రిజిస్ట్రార్ రవిచంద్ బహుమతులు అందించారు. కార్యక్రమానికి మెయిన్ స్పాన్సర్‌గా డైమండ్ నెక్ట్స్, సపోర్ట్ స్పాన్సర్‌గా పద్మజాసుజుకీ, అసోసియేట్ స్పాన్సర్‌గా ప్రియా ఫుడ్స్ వ్యవహరించాయి.

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్‌లు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించడానికి విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటలకు రెవెన్యూ క్లినిక్‌లను నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఫిర్యాదులను వేగంగా, నాణ్యతతో పరిష్కరించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పష్టత, పారదర్శకత అనేది అధికారులకు ముఖ్యమని వివరించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాలకు సంబంధించిన అన్ని రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రిసెప్షన్, రిజిస్ట్రేషన్ కౌంటర్లలో సరైన విధంగా అర్జీల నమోదు చేయించాలని సూచించారు. అర్జీదారులు సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన పత్రాలను ఇవ్వాల్సిందిగా పిటిషనర్‌కు మార్గనిర్దేశం చేయాలన్నారు. అనంతరం విచారణ సిబ్బంది టేబుల్ వద్దకు వెళ్లాలని అర్జీదారులకు సూచనలు చేయాలన్నారు.

ఈ అంశాలపై ఫిర్యాదు చేయవచ్చు...

★ అడంగల్‌లో తప్పుల సవరణ (భూ వ్యత్యాసాలు, భూ వర్గీకరణ, విస్తీర్ణ సవరణ, సర్వే నంబరులో తప్పులు తదితరాలు). ★ ఎఫ్ లైన్‌లో అర్జీలు, రీ సర్వే సమస్యలు, జాయింట్ ఎల్పీఎం సమస్యలు. ★ ఆర్వోఆర్ అప్పీలు చేసుకోవడం. ★ 22ఏ నిషేధిత భూముల రిజిస్టరు నుంచి పట్టా భూములను తొలగించడం. ★ ఆక్రమణల తొలగింపు, ఆర్వోఎఫ్ఆర్ పట్టా, డీ పట్టా సమస్యలు, ఇళ్ల స్థలాల పట్టాలు. ★ భూ సేకరణ సమస్యలు. ★ ఇతర రెవెన్యూ సంబంధిత ఇబ్బందులు.

దుర్గగుడిలో ఆరుద్రోత్సవాలు ప్రారంభం


ఉత్సవమూర్తులకు మంగళ స్నానాలు నిర్వహిస్తున్న రుత్వికులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై నటరాజస్వామి ఆలయంలో ఆరుద్రోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈవో శీనానాయక్‌తో రుత్వికులు గణపతి పూజ చేయించారు. శివకామసుందరీ సమేత నటరాజస్వామి వార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా మంగళ స్నానాలు చేయించి వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం అంకురార్పణ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం నటరాజస్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు దివ్య లీలా కల్యాణం, రాత్రి 10 గంటలకు ఆరుద్రోత్సవ కార్యక్రమాలు భక్తుల సమక్షంలో నిర్వహిస్తామని ఈవో శీనా నాయక్ తెలిపారు. కార్యక్రమంలో వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, ఆలయ నిర్మాణ దాతలు చెన్నాప్రగడ కోటంరాజు వంశీకులు లీలా నాగేశ్వరి, విశ్రాంత ఏఈవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీఆర్‌టీలో స్వర్ణ సంక్రాంతి ఆఫర్లు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని జీఆర్‌టీ జ్యువెలర్స్‌లో స్వర్ణ సంక్రాంతి ఆఫర్లతో పండగ సీజన్‌ని మరింత ఆనందమయం చేసుకోవాలని మేనేజింగ్ డైరెక్టర్ జి.ఆర్.ఆనంద్ అనంత పద్మనాభన్ కోరారు. దక్షిణాదిలోని 65 షోరూమ్‌ల్లో బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి, రత్నాలతో కూడిన విభిన్న శ్రేణుల ఆభరణాలు జీఆర్‌టీలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా బంగారు ఆభరణాలకు వేస్టేజీపై 20 శాతం, వెండి విభాగంలో వేస్టేజీపై 25 శాతం, వెండి ఆభరణాల ఎంఆర్‌పీపై 10 శాతం తగ్గింపు ఉంటుందని వివరించారు. ప్లాటినం ఆభరణాల మేకింగ్ ఛార్జీలపై ఫ్లాట్ 30 శాతం తగ్గింపు వర్తిస్తుందని పేర్కొన్నారు.

టిప్పర్ల రాక్షస వేగానికి ఒకరి దుర్మరణం


వాహనం కింది భాగంలో ఇరుక్కున్న బాబూరావు


రహదారిపై పడిన కంకర డస్ట్

ఇబ్రహీంపట్నం గ్రామీణం, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: అతి వేగం ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకోగా మరొకరిని గాయాలపాలు చేసింది. ఇంటి పెద్దను దూరం చేసి ఆ కుటుంబాన్ని అనాథగా మార్చింది. కంకర, బూడిద, ఆయిల్ టిప్పర్ల అతి వేగానికి రెండు రోజుల్లోనే మూడో ప్రాణం పోయిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం మధిరకు చెందిన వి.బాబూరావు(55), ఆయన భార్య మరియమ్మ(50)తో కలిసి ద్విచక్ర వాహనంపై గుంటుపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. [illegible] జాతీయ రహదారిపై ఉన్న యూటర్న్ వద్దకు చేరుకోగానే ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కంకర డస్ట్ టిప్పర్ వేగంగా వచ్చి వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో మరియమ్మ కింద పడిపోగా బాబురావు ద్విచక్ర వాహనంతో పాటు టిప్పర్ కిందకు వెళ్లిపోయారు. టిప్పర్ వేగం అదుపు కాక డివైడర్‌ను ఢీకొని నిలిచిపోయింది. ఈ ప్రమాదం మరో పది నిమిషాల తర్వాత జరిగి ఉంటే రెండు పాఠశాలల పిల్లలు రోడ్డుపైకి చేరుకునే వారని, పెద్ద విపత్తే సంభవించి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు వచ్చి ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మరియమ్మను విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

స్తంభించిన ట్రాఫిక్..

ప్రమాదానికి కారణమైన టిప్పర్ రోడ్డుకు అడ్డంగా నిలవడంతో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు అక్కడికి చేరుకుని రెండు భారీ క్రేన్ల సాయంతో టిప్పర్‌ను తీయించి, రోడ్డుపై పడిన కంకర డస్ట్‌ను తొలగించారు. దీనిపై కేసు నమోదు చేసి డ్రైవర్‌తో పాటు వాహన యజమానులను బాధ్యులను చేస్తామని సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ క్రీడాకారులు

విజయవాడ క్రీడలు: గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ఈఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ (పురుషులు), బెంగళూరులోని వ్యాస్ వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఆలిండియా అంతర్ వర్సిటీ యోగాసన (మహిళలు) పోటీల్లో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ జట్లను శుక్రవారం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులకు శుక్రవారం వర్సిటీ ప్రాంగణంలో వీడ్కోలు పలికారు. సమావేశానికి వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి సౌరభ్ గౌర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థులు కూడా క్రీడా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ బహూకరించారు. బ్యాడ్మింటన్ జట్టులో పి.రవితేజ, దర్ష్ జైన్, వి.కీర్తివాసన్, ఎస్.నాయుడు, ఎం.గురుసాగర్ రెడ్డి, వి.జోసెఫ్ ఆనంద్, పి.సూర్య ప్రకాష్ స్థానం సంపాదించారు. యోగాసన జట్టులో కె.హరిణి, టి.హేమ కావ్య, ఎం.వర్షిత, కె.అంజని, కె.రక్షిత, ఎం.జ్యోతి కాళి ప్రియ, టి.చందనలకు చోటు దక్కింది. జట్టు సభ్యులను వర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి తదితరులు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో (కి రూ.లలో)

నెక్‌కాట్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -147 రిటైల్ ధర 174 చికెన్ విత్ స్కిన్ - 252, చికెన్ స్కిన్‌లెస్ - 287.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 172, 181, 192 చికెన్ విత్ స్కిన్ - 334 చికెన్ స్కిన్‌లెస్ - 344.

పోలియో నిర్మూలనకు సహకారం అందించండి


ఫెయిర్‌ని ప్రారంభిస్తున్న రోటరీ 3020 జిల్లా గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పోలియో నిర్మూలన కోసం విరాళాలు సేకరించేందుకు ఏర్పాటు చేసిన రోటరీ ఫెయిర్‌లో ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేసి తమ వంతు సహకారం అందించాలని రోటరీ 3020 జిల్లా గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి కోరారు. లబ్బీపేట ఎస్.ఎస్. కన్వెన్షన్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో మూడ్రోజుల పాటు నిర్వహించే రోటరీ ఫెయిర్‌ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. రోటరీ ఫెయిర్ కమిటీ ఛైర్మన్లు అమూల్య శ్రీనివాస్, చిన్నం మధుబాబు, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఈ నెల నాలుగో తేదీ వరకు ఫెయిర్ ఉంటుందని, మొత్తం 120 స్టాళ్లలో చీరలు, బంగారు, డైమండ్, లెదర్, గృహోపకరణాలు తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సందర్శించి వాటిని కొనుగోలు చేయాలని కోరారు. ✦ రోటరీ ఫెయిర్‌కు కో స్పాన్సర్‌గా మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవహరించింది. ప్రదర్శనలోని మార్గదర్శి స్టాల్‌ని పలువురు సందర్శించారు. వివిధ చిట్ల వివరాలు అడగ్గా.. సిబ్బంది తెలియజేశారు. మార్గదర్శి చిట్ ఫండ్ చీఫ్ మేనేజర్ కొల్లి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

డప్పులతో నాట్యం చేస్తున్నారని కత్తితో దాడి

పటమట, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డప్పులతో నాట్యం చేస్తున్న వారిపై ఇద్దరు యువకులు కత్తితో దాడి చేసిన ఘటన గంగిరెద్దుల దిబ్బపై చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా రాత్రి 12 గంటల సమయంలో గంగిరెద్దుల దిబ్బ వద్ద ఒరుసు దుర్గాప్రసాద్‌తో పాటు మరికొంతమంది యువకులు కేక్ కోసి డప్పులు కొడుతూ నాట్యం చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న అదే ప్రాంతానికి చెందిన మాచర్ల కరుణ్ కుమార్ అలియాస్ చిన్ను, మాచర్ల కిరణ్‌కుమార్ అలియాస్ బ్రేవో డప్పులతో నాట్యం చేస్తున్న వారితో ఘర్షణ పడ్డారు. దాంతో వారు డప్పులు వాయించడం ఆపేసి వెళ్లిపోతున్నారు. డప్పులు వాయించడం ఎందుకు ఆపారంటూ మళ్లీ వారితో గొడవ పడ్డారు. ఆ క్రమంలో చిన్ను జేబులోని పదునైన కత్తిని బ్రేవో బయటకు తీశాడు. దాంతో దుర్గాప్రసాద్ తొడపై, కోటయ్య భుజంపై దాడి చేశాడు. స్థానికులు వెంటనే గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉంది. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట రమణ తెలిపారు.

రౌడీషీటర్ హల్‌చల్

పటమట, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం రోజున నడిరోడ్డుపై రౌడీషీటర్ హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో రోడ్డుపై వెళ్తున్న వారిపై దాడి చేసి ప్రజలను భయాందోళనకు గురి చేశాడు. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. స్థానికుల వివరాల మేరకు.. క్రీస్తురాజపురానికి చెందిన గొల్ల ప్రభుకుమార్‌పై మాచవరం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ప్రభు కుమార్ మద్యం మత్తులో బుధవారం రాత్రి రెండు గంటల సమయంలో అమ్మ కల్యాణ మండపం వద్ద హల్‌చల్ చేశాడు. రోడ్డుపై వెళ్తున్న వారిపై దాడులకు పాల్పడ్డాడు. అటుగా వెళ్తున్న సురేష్ అనే వ్యక్తిని ఆపి గొడవ పడ్డాడు. పదునైన ఆయుధంతో సురేష్ తలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను అటుగా వెళ్తున్న ప్రయాణికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స తీసుకుని సురేష్ ఆసుపత్రి నుంచి వెళ్లిపోయాడు. దాడి చేసింది రౌడీషీటర్ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయకుండా బాధితుడు వెళ్లిపోయాడు. నడిరోడ్డుపై రౌడీషీటర్ హల్‌చల్ చేసి దాడికి పాల్పడినా ఫిర్యాదు అందలేదని మాచవరం పోలీసులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఘనంగా క్రైస్తవాలయం వార్షికోత్సవం

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రం లోని పడమర ఎస్సీవాడలో కృపా సంఘం క్రైస్తవాలయం 5వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కె.ప్రకాశ బాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుల ఆధ్వర్యంలో విశ్వాసులకు భోజనం ఏర్పాటు చేశారు.


కార్యక్రమంలో పాల్గొన్న విశ్వాసులు

6 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో ఈ నెల 6 నుంచి పశ్చిమ ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు కబడ్డీ కమిటీ అధ్యక్షుడు ఫణి తెలిపారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



★ మునగపాడు గ్రామంలో ఎస్సీ ఏరియాలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మనోజ్ సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

★ తాతకుంట్ల యాదవుల బజారులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం. . మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవో గోపాలకృష్ణ స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

సాగర్ జలాలు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు శుక్రవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కొప్పులబంధం నియంత్రిక నుంచి 1200 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదల య్యాయని ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 587 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు- 1కి 80, పెదకొమిర 30, మధిర 60, నిదానపురం 70 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశం

గంపలగూడెం : మండలంలోని మేడూరు పంచాయతీని ఎంపీడీవో టి.సరస్వతి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలో చెత్త నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్త అందజేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి రోజు ఇంటింటా వ్యర్థాలను సేకరించాలని ఆదేశించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ అధికారులకు సూచించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

రెడ్డిగూడెం : మండల కేంద్రమైన రెడ్డిగూడెంలో శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తామని ఏఈ కిరణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. నూతన విద్యుత్తు లైన్లు ఏర్పాటు పనుల నిమిత్తం సరఫరా నిలుపుతున్నట్లు చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

లావాదేవీలకు పరిమితం.. కొరవడిన సహకారం

అనుమతులకు ఎదురుచూస్తున్న రైతులు

మైలవరం, న్యూస్‌టుడే

సభ్యత్వం ఉన్న రైతులు 700 మంది.. ఏడాదికి రూ.45 కోట్లకు పైగా లావాదేవీలు. అయినా ఒక యూరియా కట్ట కూడా పరపతి సంఘంలోని వారికి దక్కడం లేదు. 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' చందంగా... ఎరువుల అమ్మకాలకు అనుమతుల కోసం ఎదురు చూస్తుంటే, సీజన్ ముగుస్తున్నా ఆచూకీ కన్పించడం లేదు. పరస్పర సహకార పరపతి పేరులోనే తప్ప, ఎరువుల విషయంలో లేదంటూ రైతులు నిట్టూర్చుతున్నారు.

పెద్ద ఎత్తున సాగు.. మైలవరం నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం రుణ లావాదేవీలకు పరిమితమైంది. మైలవరంతో పాటు పొందుగల పంచాయతీల్లోని రైతులకు రుణాలు, ఇతర లావాదేవీలు దీర్ఘకాలంగా నిర్వహిస్తున్నారు. సంఘం పరిధిలో వ్యవసాయం పెద్ద ఎత్తున సాగుతుంది. అందులో భాగంగా ప్రతి ఏటా రుణాల టర్నోవర్ సైతం భారీగా ఉంటోంది. అయితే ఆ మేరకు ఎరువుల అమ్మకాలకు చొరవ చూపడం లేదు. ఫలితంగా గడిచిన దశాబ్ద కాలంగా రైతులు రుణాలకే పరిమితమయ్యారు.

కట్ట కావాలన్నా..

దాదాపు రెండు దశాబ్దాల నుంచి సహకార సంఘాల్లో ఎరువులను విక్రయిస్తున్నారు. దాని వల్ల ఆయా సంఘాలకు కొంత ఆదాయంతో పాటు ప్రభుత్వ ధరలకే రైతులకు ఎరువులు అందడంతో బ్లాకు మార్కెట్ చాలా వరకు తగ్గేది. ఈ నేపథ్యంలో మండలంలో ఏడు సహకార సంఘాలుండగా అందులో మైలవరం మినహా సంఘాలకు ఎరువుల సరఫరా, విక్రయాలు సాగుతున్నాయి. దాంతో ఈ సంఘం పరిధిలో గల రెండు పంచాయతీల్లోని వందలాది మంది రైతులు కొన్నేళ్లుగా చుట్టు పక్కల సంఘాలకు పరుగులు పెడుతున్నారు. అక్కడ స్థానిక ప్రాధాన్యం మేరకు ఎరువులు విక్రయాలు ఉండటంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. దాంతో ప్రైవేటు దుకాణాల్లో వారు చెప్పిన ధరలకే కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ఎరువుల సరఫరాకు చర్యలు: ఎరువుల విక్రయాలకు సంబంధించి వ్యవసాయ సంబంధిత గుర్తింపు కలిగిన వ్యక్తుల పేరిట అనుమతులు ఇస్తారు. ప్రస్తుతం మైలవరం సొసైటీ నుంచి ఒకరిని ప్రతిపాదించగా అతని పేరిట ఐడీ కోసం సిఫారసు చేశాం. మరో వారంలో అనుమతి వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు రైతులకు ఇబ్బందులు లేకుండా మైలవరంలోని గ్రోమోర్ సెంటర్ ద్వారా ఎరువుల సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.

- సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారి, మైలవరం

ట్రాఫిక్ నియమాలపై అవగాహన అవసరం


ప్రసంగిస్తున్న గిరిబాబు, పక్కన అధికారులు

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజరు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం రహదారి భద్రత మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. దీనికి సీఐ.గిరిబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రజల్లో ట్రాఫిక్ నియామాలపై అవగాహన అవసరమని చెప్పారు. రహదారి భద్రత నియమాలపై జనాలకు అవగాహన కల్పించాలని సూచించారు. జనవరి 1 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు శాతకర్ణి, రాజు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు


రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో మాధురి

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణ పరిధిలోని పలు రేషన్ దుకాణాలను ఆర్డీవో కె.మాధురి శుక్రవారం తనిఖీ చేశారు. బియ్యం, పంచదార తదితర నిత్యావసరాల నిల్వలు, పంపిణీ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనిఖీలో 40వ నంబరు రేషన్ దుకాణంలో 460 కిలోల బియ్యం వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. డీలర్ వీరంకి శ్రీను పై కేసు నమోదు చేశామని, ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ డీలర్లు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆమె సూచించారు. తహసీల్దార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో చేప పిల్లల విడుదల నేడు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : కృష్ణానదిలో చేప పిల్లలు వదిలే కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్‌లో శనివారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, పురపాలిక ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

ప్రతిభ చాటాలి.. బహుమతులు పొందాలి

మైలవరం, న్యూస్‌టుడే : పాఠశాలలో విద్యార్థి దశ నుంచే పోటీల్లో ప్రతిభ చాటాలని స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్ సూచించారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా శుక్రవారం ఆ పాఠశాలలో ఇంటర్ విద్యార్థినులకు జనరల్ నాలెడ్జ్ అంశంపై క్విజ్ పోటీలు జరిగాయి. ఇందులో సీనియర్ బైపీసీ విద్యార్థిని మొదటి స్థానం లక్ష్మీప్రసన్న, జూనియర్ ఎంపీసీ విద్యార్థినులు పుల్లూరు రాధిక, త్రివేణి వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఎ.సూరిబాబు, కె.గోపాలం, పి.శంకర్‌నారాయణ్ బహుమతులు అందజేసి అభినందించారు.


మైలవరం : విజేతలతో హెచ్‌ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు


విస్సన్నపేట: గెలుపొందిన వారితో కృష్ణమాచారి, ధర్మయ్య, చిన్న రవి, నరసింహారావు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన శక్తులను వెలికి తీయడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని వికాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ నరెడ్ల నర్సిరెడ్డి అన్నారు. స్థానిక వికాస్ జూనియర్ కళాశాలలో జరిగిన పోటీల్లో టి.లోకేశ్, పి.సంహిత్ (సీఈసీ, రెండవ సంవత్సరం), వి.వెంకట సాయి(ఎంపీసీ, మొదటి ఏడాది) విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి వికాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ నరెడ్ల నర్సిరెడ్డి, డైరెక్టర్ కుమారి ఎన్.కీర్తి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ వి.కృష్ణమాచారి, అధ్యాపకులు బి.ధర్మయ్య, బి.చిన్న రవి, జి.నరసింహరావు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడమే లక్ష్యం

మారేపల్లి(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : ప్రజల స్వార్జితమైన ఆస్తులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రైతులకు రాజముద్రతో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మారేపల్లిలో 765 మంది అన్నదాతలకు మంజూరైన కొత్త భూ హక్కు పత్రాలు పంపిణీకి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ అరవింద్ ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభ ఏర్పాటు చేయగా సర్పంచి తాళ్లూరి నాగేశ్వరరావు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, ఆర్ఐ దివ్యప్రసాద్, వీఆర్వో మధుబాబు తదితరులు పాల్గొన్నారు.


మారేపల్లిలో రైతుకు పాసు పుస్తకం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కనుమూరు, అనుముల్లంక(గంపలగూడెం), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కనుమూరులో 1414, అనుముల్లంకలో 729 కొత్త పట్టాదారు పుస్తకాలను ఆయన రైతులకు పంపిణీ చేశారు. తహసీల్దారు వి.రాజకుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. కనుమూరులో సర్పంచి ఎం.మారేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షుడు టి.అప్పిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు జె.చెంచురెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పి.రాజేశ్వరి, తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు ఆర్.సిద్దారెడ్డి పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలం వాముకుంట్లలో నిర్వహించిన సభలో 885 మంది రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు పంపిణీ చేశారు. మండల రెవెన్యూ అధికారి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన కొలికపూడి..

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని కనుమూరులో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని స్థానిక తెదేపా నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. వై.రంగారెడ్డి, కె.కుమారి, ఎం.శేషుకుమారి, పి.పద్మావతి తదితరుల గృహాలకు వెళ్లి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు.

నిధులు కేటాయించారు.. పనులు వదిలేశారు

కొండపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో కొండపల్లిలో అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు శ్రామికులు ఎదురు చూస్తున్నారు. తెదేపా హయాంలో కొండపల్లి బీ.కాలనీ సెంటరులో ఏర్పాటు చేసిన దాంట్లో రోజుకు దాదాపు వంద మందికి పైగా అతి తక్కువ ధరకు భోజనం చేసేవారు. ఇందులో భాగంగా శాశ్వత భవన నిర్మాణానికి రూ.36 లక్షల నిధులు కేటాయించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి పారిశ్రామిక కార్మికులు జీవనం కోసం ఇబ్రహీంపట్నం, కొండపల్లికి వచ్చేవారు. గతంలో వారు ఉదయం పనులకు వచ్చేటప్పుడు మధ్యాహ్నం భోజనం ఇంటి నుంచి తెచ్చుకునే వారు. దూరభారం నుంచి వచ్చే శ్రామికులు స్థానికంగా ఉన్న హోటళ్లలో భోజనం చేసేవారు. దీంతో వారి రోజు వారి సంపాదనలో అగ్రభాగం దీనికే వినియోగించాల్సి వచ్చేది. ఆనాడు తెదేపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో రూ.5లకే మధ్యాహ్న భోజనం చేసేవారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు వీటిని అటకెక్కించడంతో భవన నిర్మాణం కూడా పునాదులకే పరిమితమైంది. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో తెదేపా నాయకులు కొద్ది రోజులు తాత్కాలికంగా కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో అన్న క్యాంటీన్ తరహాలో మధ్యాహ్న భోజనం అందించారు. పునాదుల వరకు వచ్చిన భవన నిర్మాణ స్థలం ప్రస్తుతం చెత్త నిల్వ కేంద్రమైంది.


చెత్త నిల్వ కేంద్రంగా భవన నిర్మాణ స్థలం

చోదకులు నిబంధనలు ఉల్లంఘించొద్దు


మాట్లాడుతున్న ఎంవీఐ శివరాం

మైలవరం, న్యూస్‌టుడే : వాహన చోదకులు మోటారు వెహికల్ చట్టాల నిబంధనలను ఉల్లంఘించొద్దని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శివరాం గౌడ్, ఎండీ ఆలీ, జీవీఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. 37వ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతా, ప్రమాదాల నివారణ అంశంపై చోదకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేగ నియంత్రణ ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు, ఉప ప్రిన్సిపల్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌లో బోలెడు అవకాశాలు


విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రిన్సిపల్ రంగారావు

మైలవరం, న్యూస్‌టుడే : రోబోటిక్స్ రంగంలో విద్యార్థులకు అనేక అవకాశాలు లభిస్తున్నాయని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.రంగారావు తెలిపారు. కళాశాలలో రోబోటిక్స్‌పై రెండ్రోజుల కార్యశాలను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో రోబోల పాత్ర కీలకంగా ఉందని, వాటి తయారీపై దృష్టి సారించేలా శిక్షణ పొందాలని సూచించారు. ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను జోడించి తయారు చేయడం ద్వారా అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ ఉమాలక్ష్మి, అధ్యాపకులు ఫణికుమార్, జె.రాముడు, వెంకటాద్రి, ఐక్వాక్ కోఆర్డినేటర్ సుభాషిణి పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించండి


ఆసుపత్రి ముందు నినాదాలు చేస్తున్న సుధాకర్, కార్మికులు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, బకాయిలను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.సుధాకర్ పేర్కొన్నారు. బకాయిలు చెల్లించాలంటూ శుక్రవారం ఆసుపత్రి ముందు నిల్చొని నిరసన తెలిపారు. పండగల సమయంలోనూ బకాయిలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కొత్తగా వచ్చిన పారిశుద్ధ్య గుత్తేదారు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక నాయకులు రమేష్‌బాబు, రూతుమ్మ, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొలతల కచ్చితత్వానికి రోవర్లు వినియోగం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : భూమి కొలతల కచ్చితత్వం కోసం ఆధునిక సర్వే పరికరాలైన రోవర్ల ద్వారా రీసర్వేను నిర్వహిస్తున్నామని విస్సన్నపేట మండలం తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి తెలిపారు. మండలంలోని విస్సన్నపేట, నరసాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూముల రీసర్వేను ఆమె శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజాత, సర్వేయర్ డీటీ విజయ భాస్కర్, మండల సర్వేయర్ శంకరరావు, కె.సత్యవతి, వీఆర్‌వోలు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.


రీసర్వే ప్రారంభిస్తున్న తహసీల్దార్ లక్ష్మీకల్యాణి తదితరులు

అష్టోత్తర శత దీపాలంకరణ సేవ

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి గుడిలో శుక్రవారం రాత్రి అష్టోత్తర శత దీపాలంకరణ సేవ నిర్వహించారు. అర్చకుడు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.


గోసవీడు: సంతాన వేణుగోపాల స్వామి

వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని గోసవీడు, ఊటుకూరు, గంపలగూడెం, పెనుగొలను, వినగడప, నెమలిలోని వైష్ణవాలయాల్లో శుక్రవారం ధనుర్మాసం సందర్భంగా గోదా రంగనాథులకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. గోదాదేవి తిరుప్పావై పాశురం పఠించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.


రెడ్డిగూడెం : గోదాదేవికి సారె సమర్పించి పూజలు చేస్తున్న భక్తులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని శ్రీరాజగోపాల స్వామి దేవాలయంలో మహిళా భక్తులు గోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు.

గొల్లపూడిలో హిందూ సమ్మేళనం రేపు


గోడపత్రులు ఆవిష్కరిస్తున్న బాలకోటేశ్వరరావు, నాయకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)ను స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 4న గొల్లపూడి గ్రామంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భాజపా మైలవరం నియోజకవర్గ బాధ్యుడు నూతలపాటి బాలకోటేశ్వరరావు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రుల ఆవిష్కరణ కార్యక్రమం గొల్లపూడిలోని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు బాబూ రాజేంద్రప్రసాద్, కాపూరి రవికృష్ణ, దుర్గాకిషోర్, బెనర్జీ, ఎం.వి.రాజేంద్రకుమార్, సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ ఏ.కాలనీ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 4న హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భాజపా నియోజకవర్గ నాయకుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మెనోపాజ్ దశపై అవగాహన

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో లయన్స్, వాకర్స్, సమతా, లెజెండ్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్త్రీలలో మెనోపాజ్ దశపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ వి.పద్మజ మాట్లాడుతూ మగువల్లో మెనోపాజ్ సమయంలో ఎదురయ్యే పలు శారీరక, మానసిక మార్పులు, ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్న కోతులు


ఎంపీడీవో రాట్నాలుకు వినతిపత్రం ఇస్తున్న కొండపర్వ గ్రామస్థులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కోతుల బెడద నుంచి తమను కాపాడాలని కోరుతూ కొండపర్వ గ్రామస్థులు ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలుకు స్థానిక కార్యాలయంలో శుక్రవారం అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త బొట్ల శివ సత్యనారాయణ మాట్లాడుతూ ఎనిమిది నెలల నుంచి కోతుల బెడద తీవ్ర స్థాయికి చేరిందని, సుమారు 1000 కోతులకు పైగా నివాసాల్లో సంచరిస్తూ ఇంట్లోని వస్తువులను తీసుకెళ్లడం తదితర పనులు చేస్తున్నాయన్నారు. అడ్డు వచ్చిన వారిపై దాడి చేస్తున్నాయని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని వాపోయారు. వేముల గోపి, మహమ్మద్ సుభాని, కొవ్వూరి సురేష్, కుక్కల పూర్ణచంద్రరావు, కారంగుల శివ కిరణ్ పాల్గొన్నారు.

క్యాలెండరు.. దైనందిని ఆవిష్కరణ

మైలవరం, న్యూస్‌టుడే : పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన ఏడాది క్యాలండర్లు, దైనందినిలను శుక్రవారం స్థానిక ఎస్వీఆర్‌జీఎన్నార్ జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఆ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.రాజశేఖర్, నాయకులు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. హెచ్‌ఎం సతీష్, సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.పుల్లారెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శి సీహెచ్ సతీష్, ఎం.వెంకటేష్, నాయకులు గోపాల్, శేషగిరిరావు, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.


ఎస్వీఆర్‌జీఎన్నార్ జడ్పీ బాలుర హైస్కూల్‌లో..


తునికిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండరు, డైరీలను తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఎంఈవో పి.రమేష్‌బాబు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరరావు శుక్రవారం ఆవిష్కరించినట్లు సంఘ మండల అధ్యక్షుడు బి.అనిల్ కుమార్ తెలిపారు. వై.మోహన్ కృష్ణ, వై.పిచ్చియ్య, ఎన్.శ్రీనివాసరావు, టి.రామారావు, వి.చంద్రయ్య, ఎన్.నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.


రెడ్డిగూడెం ఎమ్మార్సీ కార్యాలయం దగ్గర..

పంపిణీ.. **గంపలగూడెం, న్యూస్‌టుడే :** డీపీఆర్టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన 2026 దైనందిని, కాలమానినిలను సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు బి.జమలయ్య, కె.సుందరరావు, వనం శ్రీనివాసరావు, ఎన్.నరసింహరావు, ఏవీ.నరసింహరావు తదితరుల ఆధ్వర్యంలో మండల పరిధి ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు శుక్రవారం పంపిణీ చేశారు. తునికిపాడులో హెచ్ఎం పీవీఎస్ఏ.శర్మ, సంఘం నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనంపై నుంచి పడి యువకుడి మృతి

భవానీపురం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై నుంచి పడి యువకుడు చనిపోయినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి... గొల్లపూడి పశువుల ఆసుపత్రి వద్ద షేక్.రఫీక్(25) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆటోనగర్‌లోని కారు షెడ్డులో మెకానిక్‌గా పని చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ ఉదయం పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గొల్లపూడి వై-జంక్షన్ వద్దకు వచ్చే సరికి అతడికి ఫిట్స్ రావడంతో ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిపోయాడు. తల డివైడర్‌కు తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు


చిన్నారులను పరామర్శిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు ఆంధ్రా శివారు తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలం మొద్దులగూడెంలోని వివేకనంద విద్యాలయానికి చెందిన పాఠశాల బస్సు ప్రమాదవశాత్తు గణేష్‌పాడు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్నారులకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108లో 27 మంది విద్యార్థులను తిరువూరులోని పలు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో వంద మందికి పైగా చిన్నారులున్నారు. వీరిలో ఒకరి తలకు బలమైన గాయం తగలడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తీసుకెళ్లారు. ప్రమాద వార్త తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా.రాగమయి తిరువూరు చేరుకుని చిన్నారుల పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: రామరాజ్యనగర్ ప్రాంతంలో కె.సత్యనారాయణ భార్యతో పదేళ్ల కిందట విడిపోయి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. గత నెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సత్యనారాయణ తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువులను విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో తల్లి అప్పాయమ్మ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు.. **పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే :** మండలంలోని పెనుగొలనులో శుక్రవారం నిర్వహించిన దాడిలో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

తెలంగాణకు ఇసుక తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని అమ్మిరెడ్డిగూడెం సమీప కట్లేరు నుంచి ఇసుకను అక్రమంగా తెలంగాణకు తరలిస్తున్న తన్నీరు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై అనిల్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కొణిజెర్ల సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా తెలంగాణ తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

సమాధానం ఇవ్వడం... సమస్యగా మారితే..!

సెల్‌ఫోన్‌లో నోటిఫికేషన్ శబ్దం వచ్చిందా.. వెంటనే బదులివ్వాలనే తొందర.. తింటున్నా, వాష్‌రూమ్‌లో ఉన్నా, తల్లిదండ్రులతో మాట్లాడుతున్నా.. వేలివేళ్లు కీబోర్డుపైకి వెళ్లాల్సిందే. మితిమీరిన ఈ ఎవైలబిలిటీ భవిష్యత్తును గందరగోళంలో పడేస్తుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు.

మనకు నచ్చిన వారి మెసేజ్ నోటిఫికేషన్ పడిన వెంటనే రిప్లై ఇవ్వాలన్న ఆలోచన మొదట మంచిగానే అనిపిస్తుంది. బాధ్యతగా ఉంటున్నామని, ఎదుటివారికి ఎప్పుడూ అందుబాటులో ఉన్నామని భావిస్తాం. కానీ ఇదే అలవాటుగా మారడంతో మన లక్ష్యాలు, బాధ్యతలను కూడా మర్చిపోతుంటాం. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం ఉండదు...అలాగే కాలం చేజారాక బాధపడినా ప్రయోజనం శూన్యం.



- బీటెక్ సెకండియర్ చదువుతున్న రమేశ్ ఎంత పనిలో ఉన్నా సరే నోటిఫికేషన్ శబ్దం వస్తే చాలు ఆ పని ఆపేసి రిప్లై ఇస్తాడు. ఇవ్వకపోతే ఎవరేమనుకుంటారోనన్న ఆందోళన దీనికి కారణం. ఒక సారి వాష్‌రూమ్‌లో ఉన్నప్పుడు మెసేజ్ వచ్చింది. ఆ శబ్దం విని ఫోన్ తీసుకొని పడానికి బయటకు వచ్చే క్రమంలో కాలు జారి కింద పడ్డాడు. కాసేపాగి కూడా రిప్లై ఇవ్వొచ్చన్న విచక్షణ కూడా అతడిలో లేకపోయింది.
- కొత్తగా సాఫ్ట్‌వేర్ జాబ్‌లో చేరిన అనూజకు మంచి పేరు తెచ్చుకోవాలని కోరిక. అందుకే బాస్, సహోద్యోగులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఆఫీస్ వాట్సప్ గ్రూప్‌లో యాక్టివ్‌గా ఉండేది. ఏ టాస్క్ ఇచ్చినా నేనున్నా అంటూ తీసుకునేది. కొన్నాళ్ల తర్వాత తాను తీరికలేని పనిలో ఉన్నా సరే పనులు చెప్పడం మొదలుపెట్టారు. మితిమీరిన ఎవైలబిలిటీ ఇంత చేటు చేస్తుందని అమెకు ఆలస్యంగా అర్థమైంది.

డ్రగ్స్ కన్నా తక్కువేం కాదు..

- క్రష్ లేదా గర్ల్ ఫ్రెండ్ విషయంలో అబ్బాయిల్లో ఇన్‌స్టెంట్ రిప్లయింగ్ మరీ విపరీతానికి చేరుతోంది.
- వెంటనే బదులివ్వాలని చేస్తున్న పని పక్కనపెట్టి మరీ ఫోన్ పట్టుకుని కూర్చుంటున్నారు.
- బదులు రాకపోతే మానసిక ఆందోళనకు గురవుతుంటారు.
- డ్రగ్స్ సమయానికి తీసుకోకపోతే ఎదురయ్యే అనుభవం కన్నా ఇది తక్కువేమీ కాదు.
- ఈ అలవాటు క్రమంగా కెరీర్‌ను దెబ్బతీయడమే కాక మానసిక అనారోగ్యానికి దారితీస్తుంది.
- పైగా ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వెంటనే ప్రతిస్పందించే వారికి కాలగమనంలో అంత విలువా ఉండదు.

మనసు చెదిరి.. కాలం కరిగి..

- కంపల్సివ్ రెస్పాన్సివ్‌నెస్, నోటిఫికేషన్ డ్రివెన్ బిహేవియర్, ఇన్‌స్టెంట్ రిప్లయింగ్.. పేరేదైనా ఈ దురలవాటు మానసికంగా చేటు చేస్తుందని అనేక అధ్యయనాలు వెలువడ్డాయి.
- ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులపై ఆగడంతో ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది.
- మెదడులో ఆలోచనల ఎప్పుడూ ఆ నోటిఫికేషన్ చుట్టే తిరుగుతుండడంతో పని మీద దృష్టి కొరవడి స్థాయికి చేరుకుంటారు.
- క్రమంగా చేతిలోని కాలం కరిగిపోతుంది.
- మన ఎవైలబిలిటీ ఎదుటివారికి అలుసుగా మారి బంధాలు బీటలు వారుతాయి.
- ఆఫీస్ ఒత్తిడి, కుటుంబ సమస్యలు, అభద్రతా భావం వంటి సమస్యలు ఎదురవుతాయి.
- తల్లిదండ్రులు, స్నేహితులతో సరిగ్గా మాట్లాడకపోవడంతో వారి ప్రేమకు దూరం కావాల్సి వస్తుంది.
- ఇన్‌స్టెంట్ మెసేజింగ్ చూడ్డానికి నిమిషాల వ్యవహారంగా కనిపిస్తున్నా.. ఒక దశకు వచ్చేసరికి సరిదిద్దుకోలేని సమస్యగా మారిపోతుంది.

ఇలా ప్రయత్నిద్దాం..

- రోజుకు కొద్ది సమయాన్నే రిప్లైలకు కేటాయించాలి.
- ఆఫీస్ బాస్, కొద్ది మంది కుటుంబ సభ్యుల మెసేజ్‌లకు నోటిఫికేషన్ వచ్చే సెట్టింగ్ ప్రయత్నించవచ్చు.
- మెసేజ్ నోటిఫికేషన్ శబ్దం, ఫోన్ లైట్ మన మెదడులో డోపమైన్‌ను పెంచుతాయి. దీని రిప్లై ఇచ్చేలా ఉత్సాహపరుస్తాయి.
- అందుకే ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టుకుంటే క్రమంగా మెదడు అలవాటు పడుతుంది.
- ఇంతకు ముందు వెంటనే రిప్లై ఇచ్చేవారు.. ఇప్పుడేంటి ఇలా అని కొందరు అడగవచ్చు.
- దానికి అపరాధంతో సమాధానం ఇవ్వకుండా కాస్త బిజీగా ఉంటున్నానని చెప్పవచ్చు.
- లేదంటే కాల్ యు లేటర్, బయాం బిజీ.. లాంటి మెసేజ్‌లు ఆటోమేటిక్‌గా వెళ్లిపోయే విధంగా ఎనేబుల్ చేసుకోవచ్చు.

- ఈనాడు, ఆంధ్రప్రదేశ్ డెస్క్

హత్యాయత్నం కేసులో వంశీకి.. అరెస్టు నుంచి ఉపశమనం


ఈనాడు, అమరావతి: విజయవాడ నగరంలోని మాచవరం పోలీసులు నమోదు చేసిన కేసులో వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి హైకోర్టులో ఊరట లభించింది. తదుపరి విచారణ వరకు వంశీని అరెస్ట్ చేయొద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. బెయిల్ పిటిషన్‌పై సంక్రాంతి సెలవుల అనంతరం విచారించనున్నట్లు పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఈ ఉత్తర్వులిచ్చారు. తనపై దాడికి పాల్పడ్డారంటూ నూతక్కి సునీల్ అనే వ్యక్తి ఫిర్యాదు ఆధారంగా వంశీ తదితరులపై హత్యాయత్నం, వివిధ సెక్షన్ల కింద మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిలు కోసం వంశీ హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం నాటి విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది సత్యశ్రీ వాదనలు వినిపించారు. అయితే, పిటిషనర్‌పై మొత్తం 19 కేసులున్నాయని, ఆ వివరాలేవీ బెయిల్ పిటిషన్లో పేర్కొనలేదని ఏపీపీ న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. న్యాయమూర్తి స్పందిస్తూ ఘటన జరిగిన 16 నెలల తర్వాత కేసు పెట్టారని గుర్తుచేశారు. ముందస్తు బెయిల్‌పై పూర్తిస్థాయిలో విచారణ జరిపేందుకు సమయం లేనందున.. తదుపరి విచారణ వరకు పిటిషనర్‌ను అరెస్ట్ చేయొద్దని పోలీసులను ఆదేశించారు.

కాకినాడ ఐఐఎఫ్‌టీకి రూ.57.10 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: కాకినాడలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ క్యాంపస్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.57.10 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని ఐఐఎఫ్‌టీ బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలని పేర్కొంది.

పెద్ద చేపలపై నిఘా పెంచాం

- బినామీల గుట్టువిప్పేందుకు కృత్రిమ మేధ టూల్స్ వినియోగం
- అవినీతి, అక్రమాస్తుల కేసు నమోదైన మూడేళ్లలో శిక్షలు పడేలా చేస్తాం
- ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్



ఈనాడు, అమరావతి: 'వివిధ ప్రభుత్వశాఖల్లో తీవ్ర అవినీతిపరులైన కొన్ని పెద్ద చేపలపై నిఘా పెంచాం. ఈ ఏడాదిలో అక్రమాస్తుల కేసులు భారీగా నమోదుచేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం' అని ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్ తెలిపారు. గత సంవత్సరం అక్రమాస్తుల కేసులు కొంత తక్కువగా ఉన్నాయని, ఈ ఏడాది వాటిని మరింత పెంచుతామని అన్నారు. కొందరు బినామీల పేరిట అక్రమాస్తులు కూడబెడుతున్నారని, వారి గుట్టు విప్పేందుకు త్వరలో కృత్రిమమేధ (ఏఐ) టూల్స్ వినియోగిస్తామని చెప్పారు. ప్రధానంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సమాచారం, బ్యాంకు లావాదేవీల వివరాలు విశ్లేషించి బినామీ సంబంధాలు వెలికి తీస్తామని అన్నారు. విజయవాడలోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతేడాది ఏసీబీ పనితీరు, ఈ సంవత్సరం లక్ష్యాలను వివరించారు. 'ఏసీబీ కేసుల్లో విచారణ పూర్తయ్యి శిక్ష పడేసరికి 10-12 ఏళ్లు పడుతోంది. ఇకపై మూడేళ్లలో విచారణ పూర్తిచేయించి శిక్షలు పడేలా చేయాలనేది లక్ష్యం. అందుకు తగినట్లు సిద్ధమవుతున్నాం' అని వివరించారు. ఇతర ప్రధానాంశాలివి.

★ వాట్సప్ గవర్నెన్స్ ద్వారా కూడా ఏసీబీకి ఫిర్యాదు చేసే వ్యవస్థను త్వరలో అందుబాటులోకి తెస్తాం. వివిధ శాఖల్లో అవినీతిపై ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వస్తున్న ఫిర్యాదులు ఏసీబీకి చేరుతున్నాయి. వాటి ఆధారంగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకంగా జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారిని నియమించాం.

★ ఏసీబీ కేసుల్లో కనీసం 75% మేర శిక్షలు పడాలనేది లక్ష్యం. అంతకుముందుతో పోలిస్తే గతేడాది శిక్షల శాతం పెరిగింది. మొత్తం 36 కేసుల్లో విచారణ పూర్తికాగా.. 12 కేసుల్లో (46%) శిక్షలు పడ్డాయి. ఏసీబీలో ఉండాల్సిన సిబ్బందిలో 55-60% మందే ఉన్నారు. సిబ్బందిని పెంచాలని ప్రభుత్వాన్ని కోరాం.

ట్రాప్ కేసుల్లో ఎక్కువమంది రెవెన్యూ శాఖ ఉద్యోగులే

★ గతేడాది మొత్తం 69 ట్రాప్ కేసులు (లంచం తీసుకుంటుండగా పట్టుకోవడం) నమోదు చేయగా.. అందులో 19 కేసుల్లో (25.73%) నిందితులు రెవెన్యూశాఖ ఉద్యోగులే ఉన్నారు. పాస్‌బుక్‌లు, మ్యుటేషన్లు, కొలతల కోసం లంచాలు తీసుకుంటూ వీరు పట్టుబడ్డారు.

★ రెవెన్యూ తర్వాత అత్యధికంగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉద్యోగులపై 5 ట్రాప్ కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాతి స్థానాల్లో హోమ్, ఫైనాన్స్ శాఖలున్నాయి.

★ లంచం తీసుకున్న వారిపై, అవినీతి అధికారులపై ఏసీబీకి టోల్‌ఫ్రీ నంబర్: 1064 లేదా 9440440057 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

గతేడాది ఏసీబీ నమోదుచేసిన కేసులు

ట్రాప్ కేసులు	69
అక్రమాస్తుల కేసులు	8
నేరపూరిత దుష్ప్రవర్తన	7
రెగ్యులర్ ఎంక్వైరీస్	19
ఆకస్మిక తనిఖీలు	12
మొత్తం	115

బీసీల భద్రతకు చట్టం చేయడం హర్షణీయం

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీల భద్రతకు రక్షణ చట్టాన్ని తీసుకురావడం హర్షణీయమని అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. కొన్నేళ్లుగా బీసీలకు జరుగుతున్న అన్యాయానికి అడ్డుకట్ట వేయడానికి ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. ఈ చట్టం ప్రధాన ఉద్దేశం మానవ హక్కుల్ని కాపాడడమేనని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు తీసుకొచ్చి బీసీల గుండెల్లో చిరస్థాయిగా నిలవాలని, ఇందుకోసం తమిళనాడు తరహాలో చట్టం చేయాలని ఆయన సూచించారు.

8న విజయవాడలో బీసీ ఉద్యోగుల సభ: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, న్యూస్‌టుడే: బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేస్తూ.. రెండు తెలుగు రాష్ట్రాల బీసీ ఉద్యోగుల సభను ఈ నెల 8న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు బీసీ ఐకాస ఛైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు హాజరవుతారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తర్‌ప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం ఉద్యోగుల సంఖ్య లేకుంటే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లను కల్పించాలని తీర్పునిచ్చింది. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా అన్యాయం చేస్తున్నాయి' అని మండిపడ్డారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న కూఫీఆర్‌ఐ ముఖ్య ప్రతినిధి అపర్ణ, ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ వీసీ చంద్రశేఖర్, చిత్రంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి తదితరులు

వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు నిలువరించే వ్యూహం

కూఫీఆర్‌ఐ సంస్థతో ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ ఒప్పందం

ఈనాడు, అమరావతి: వైద్య విద్యార్థుల్లో ఒత్తిడి, ఆత్మహత్యలను తగ్గించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు మానసిక వికాసం దిశగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం.. కూఫీఆర్‌ఐ సంస్థతో శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, కూఫీఆర్‌ఐ ముఖ్య ప్రతినిధి, ప్రవాసాంధ్రులు.. డాక్టర్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు, వైద్య విద్య బోధకులకు ఎంపిక చేసిన తేదీల్లో ఈ శిక్షణ ఇస్తారు. ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ వీసీ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కూఫీఆర్‌ఐ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు.

రెండు విమానాల అత్యవసర ల్యాండింగ్

గన్నవరం (గ్రామీణం), న్యూస్‌టుడే: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం రెండు విమానాలు అత్యవసరంగా ల్యాండయ్యాయి. హైదరాబాద్ విమానాశ్రయంలో ఉదయం ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో పలు విమానాలను దారి మళ్లించారు. దిల్లీ, ముంబయి నుంచి వచ్చిన ఇండిగో సంస్థకు చెందిన రెండు విమానాలను స్థానిక విమానాశ్రయంలో ఉదయం 9 గంటల సమయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించారు. గంటసేపటి తర్వాత అవి తిరిగి హైదరాబాద్ బయలుదేరి వెళ్లాయి.

మారిషస్ అధ్యక్షుడి రాకతో ప్రత్యేక బందోబస్తు



దేవస్థానం, పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఈనెల 5న దుర్గమ్మ దర్శనానికి మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ రానున్న నేపథ్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో శీనానాయక్ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై మహామండపం నాలుగో అంతస్తులోని ఈవో కార్యాలయంలో ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం, ఏసీపీ రామకృష్ణలతో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ.. రాష్ట్ర పర్యటనలో భాగంగా దుర్గమ్మను దర్శించుకునేందుకు వస్తున్నారని చెప్పారు. వీవీఐపీ కావడంతో వారి వాహనాల పార్కింగ్, దర్శనం అన్ని నిర్దిష్ట సమయంలో ప్రోటోకాల్ పాటించాలన్నారు. రెవెన్యూ, పోలీస్, కార్పొరేషన్, దేవస్థానం అధికారులు వారికి కేటాయించిన విధుల్లో అలసత్వం లేకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు దుర్గారావు, రామచంద్రరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై అఘాయిత్యం.. యువకుడికి 20 ఏళ్ల జైలు

విజయవాడ (భవానీపురం), న్యూస్‌టుడే: చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. భవానీపురం ప్రాంతంలో చిన్నారి (5) కుటుంబం నివసిస్తోంది. 2024లో 9 సెప్టెంబరు రాత్రి ఇంటి పైభాగంలోకి వెళ్లింది. అదే సమయంలో అక్కడ ఉన్న షేక్ ఖాసీం(24) చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి ఏడుస్తుండడంతో తల్లి అడగ్గా.. జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. విచారించిన పోలీసులు అదే నెలలో ఖాసీంను అరెస్టు చేసి.. ఆధారాలను కోర్టు ముందు ఉంచారు. 11 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.5 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీని ఆదేశించారు.

మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితులకు కోర్టు రిమాండ్ పొడిగించింది. శుక్రవారంతో నిందితులకు రిమాండ్ ముగియనుండటంతో న్యాయస్థానంలో హాజరుపరిచారు. విజయవాడ, గుంటూరు కారాగారాల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితులను శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టుకు తీసుకొచ్చారు. ఈనెల 16 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. అనంతరం నిందితులను కారాగారాలకు తరలించారు. బెయిల్‌పై విడుదలైన బాలాజీ గోవిందప్ప, మిథున్‌రెడ్డి కోర్టుకు హాజరుకాలేదు. వారి తరఫున న్యాయవాదులు గైర్హాజరు పిటిషన్ వేశారు. చాణక్య రిమాండ్ గడువు పెంపునకు ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన మెమోలో రెండు పేరాలపై అతని తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిని రికార్డు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు.

- తాను చాలా రోజులుగా జైలు ఆహారం తింటున్నాననీ, సరిగా పడడం లేదనీ. . ఇంటి నుంచి భోజనం తెప్పించుకునేందుకు అనుమతి కావాలని చాణక్య కోర్టును కోరారు. పిటిషన్ దాఖలు చేసుకోవాలని కోర్టు సూచించింది.
- తనకు ఉబ్బసం ఉందని.. తాగేందుకు వేడి నీటిని అందజేసేలా ఆదేశాలివ్వాలని అనిల్ చోక్రా కోర్టును కోరారు. పిటిషన్ దాఖలు చేసుకోవాలని న్యాయాధికారి సూచించారు.
- మరోవైపు సిట్ అధికారులు సీజ్ చేసిన తమ వాహనాన్ని తిరిగి ఇప్పించాలని కోరుతూ ఇస్పాత్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఇటీవల వాహనాన్ని తిరిగి ఇచ్చేయాలని ఆదేశించింది. వాహనదారుడు రూ.10 లక్షలు పూచీకత్తు మరొక వ్యక్తి రూ.లక్ష పూచీకత్తు సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది.

మావోయిస్టులపై బీజాపూర్ పోలీసుల పీటీ వారెంట్ దాఖలు

ఈనాడు, అమరావతి: విజయవాడ నగరంలో అరెస్టు అయి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నలుగురు మావోయిస్టుల కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. శుక్రవారం బీజాపూర్ నుంచి వచ్చిన పోలీసులు.. విజయవాడలోని కోర్టులో వారెంట్ ఫైల్ చేశారు. అక్కడి కేసుల్లో పటమట పోలీసులు అరెస్టు చేసిన రంగు, మనీలా, మదన్, మంగి నిందితులుగా ఉన్నారు.



ఒక పైసా నుంచి 20 రూపాయల వరకు..



పుస్తక మహోత్సవంలో ఆకర్షణగా నిలిచిన నాణేల స్టాల్



సేకరించిన వాటితో హేమంత్

అరుదైన నాణేలు... కరెన్సీ నోట్లు...

విజయవాడ నగరానికి చెందిన హేమంత్ అరుదైన నాణేలు, కరెన్సీ నోట్లు, విదేశీ కరెన్సీ, ఫ్యాన్సీ నంబర్ల కరెన్సీ సేకరించి పుస్తక మహోత్సవంలో స్టాల్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఆసక్తి ఉన్న ఆయా నాణేలని, కరెన్సీని కొనుగోలు చేసుకోవచ్చు. ఒక పైసా నాణెం నుంచి 20 రూపాయల నాణేలను ఒక బోర్డు మీద ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. దీంతో పుస్తక మహోత్సవంలో ఈ స్టాల్ కాస్తంత ఆకర్షణీయంగా మారింది.

- ఈనాడు, అమరావతి

రాయితీపై మురుగు శుద్ధి వాహనాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సఫాయి కర్మచారిలకు రాయితీపై ఎన్.ఎస్.కె.ఎఫ్.డి.సి. పథకం కింద మురుగు శుద్ధి (సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్) వాహనాలు మంజూరు చేయడానికి దరఖాస్తుల గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ షేక్ షాహిద్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క వాహనం విలువ రూ.31,67,326 ఉంటుంది. ఇందులో రూ.14,16,831.50లు రాయితీగా వస్తుంది, మిగతా రూ.17,50,494.50లు ఎన్.ఎస్.కె.ఎఫ్.డి.సి. రుణంగా పొందవచ్చన్నారు. అయిదుగురు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడాలి. దరఖాస్తులను నేరుగా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలి. ఇతర వివరాలకు చరవాణి నంబరు 96520 57244లో సంప్రదించాలని ఆయన సూచించారు.

సమాజంపై సంధించిన అస్త్రాలే 'సత్యాన్వేషణ'



'సత్యాన్వేషణ' వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రచయిత బండారు రాధాకృష్ణ తదితరులు

పటమట, న్యూస్‌టుడే: సీనియర్ పాత్రికేయుడు, కాలమిస్టు బండారు రాధాకృష్ణ అక్షరాలు సమాజంపై సంధించిన అస్త్రశస్త్రాలని అవనిగడ్డ ఎమ్మెల్యే, ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బండారు రాధాకృష్ణ రచించిన 'సత్యాన్వేషణ' వ్యాస సంపుటిని శుక్రవారం బెంజ్ సర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయ భవనంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాత్రికేయుడికి తప్పనిసరిగా ప్రశ్నించే గుణం ఉండాలన్నారు. రాధాకృష్ణ పాత్రికేయుడిగా సుదీర్ఘకాలం సమాజాన్ని లోతుగా పరిశీలిస్తూ.. వ్యాసాలు రాస్తున్నారని గుర్తు చేశారు. నేటి ప్రజాస్వామ్యం క్రమంగా ధనస్వామ్యంగా మారిపోతోందని, అనేక సందర్భాల్లో అవినీతి రాజ్యమేలుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు సంపుటిని సమీక్షిస్తూ, రాధాకృష్ణ వ్యాసాలు సరళ శైలిలో ఉంటూ.. లోతైన ఆలోచనలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. గతంలో ఆయన వందలాది వ్యాసాలు రాయగా, వాటిలో ఎంపిక చేసిన 50 వ్యాసాలు 'సత్యాన్వేషణ' పేరుతో సంపుటిగా వెలువరించినట్లు తెలిపారు. తన రచనలకు ప్రేరణనిచ్చిన అంశాలను రచయిత వివరించారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు సభకు అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకాశవాణి-దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు గుత్తికొండ కొండలరావు, సంపాదకుడు కలిమిశ్రీ, సర్వోత్తమ గ్రంథాలయ కార్యదర్శి రావి శారద పాల్గొన్నారు.

తొలుత అండాల దానం.. ఆనక కమీషన్‌కు మధ్యవర్తిత్వం

ఈనాడు, అమరావతి

నిందితురాలు సరోజిని విచారణలో వెలుగులోకి..

పిల్లల విక్రయాల కేసులో కస్టడీకి

తొలుత సరోజిని ఫెర్టిలిటీ సెంటర్లలో అండాలను దానం చేసేది. పరిచయాలు పెరగడంతో కమీషన్ల కోసం ఎగ్ డోనార్స్, సంతాన సాఫల్య కేంద్రాల నడుమ మధ్యవర్తి అవతారం ఎత్తింది. తర్వాత సంతానం లేని వారిని గుర్తించి డబ్బులు తీసుకుని పిల్లల్ని అప్పజెప్పేది. పిల్లల విక్రయాల కేసులో నిందితుల నుంచి అసలు విషయాలు రాబట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కోర్టు ఆదేశాలతో నిందితులు సరోజిని, బర్తిలను భవానీపురం పోలీసులు ఏడు రోజుల కస్టడీలో భాగంగా శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 9వ తేదీ వరకు నిందితులను విచారించనున్నారు. వీరిపై భవానీపురం స్టేషన్‌తో పాటు మహిళా స్టేషన్, నున్న, రెండో పట్టణ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. దీంతో నున్న, రెండో పట్టణ పోలీసులు కూడా విచారించారు. ఈ సందర్భంగా నిందితులు పలు అంశాలను వెల్లడించినట్లు తెలిసింది.

ఆదాయం కోసం అడ్డదారులు: హైదరాబాద్‌లోని పలు సంతాన సాఫల్య కేంద్రాలకు వెళ్లి ప్రధాన నిందితురాలు సరోజిని అండాలను దానం చేసేది. దీనికి గాను కేంద్రాల నిర్వాహకులు డబ్బులు ఇచ్చేవారు. పరిచయాలు విస్తృతంగా పెరగడంతో అండాలను దానం చేసేందుకు ఆసక్తి చూపించే వారిని గుర్తించి ఫెర్టిలిటీ కేంద్రాలకు తీసుకెళ్లే అవతారం ఎత్తింది. దీనికిగాను ఆమెకు రూ.25వేలు వరకు ముట్టేది. ఇలా అన్ని విధాలా ఆదాయం వస్తున్న సమయంలో పిల్లల విక్రయ ముఠా పరిచయమైంది. ఇదే సమయంలో సంతానం లేని పలువురు దంపతులు పెంచుకునేందుకు తమకు పిల్లలు కావాలని సరోజినిని అడుగుతుండడంతో ఆమె ముఠాలతో పూర్తి స్థాయిలో సంబంధాలు పెట్టుకుని పిల్లల్ని తెప్పించి విక్రయించేది. ఒక్కో శిశువు అమ్మకంలో ఆమెకు రూ.50వేలు వరకు మిగిలేదని పోలీసుల విచారణలో వెల్లడించింది. పిల్లల ముఠాతో తనకు సంబంధం లేదని బర్తి చెప్పినట్లు సమాచారం. సహాయంగా రమ్మని కోరితేనే తాను దిల్లీ నుంచి విజయవాడ వచ్చానని, రూ.5వేలకు ఆశపడి వచ్చి కేసులో ఇరుక్కున్నానని అన్నట్లు తెలిసింది.

దుర్గగుడికి విద్యుత్తు నిలిపివేత ఉదంతంలో డీఈఈపై చర్య

సీపీడీసీఎల్ కార్యాలయానికి సరెండర్ చేసిన ఎస్ఈ

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: దుర్గగుడికి విద్యుత్తు సరఫరా నిలిపివేత ఘటనపై విద్యుత్తు శాఖ అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. కనెక్షన్‌ను తొలగించిన విద్యుత్తు డీఈఈ ఎంవీవీ రామకృష్ణను సీపీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్‌కు సరెండర్ చేస్తూ ఎస్ఈ ఉత్తర్వులిచ్చారు. ఉన్నతాధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండానే విద్యుత్తు సరఫరా ఆపేశారనే కారణంతో ఆయనపై అధికారులు చర్యలు తీసుకున్నారు. దుర్గగుడికి విద్యుత్తు సరఫరా నిలిపివేత ఘటన రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపగా.. అనంతర పరిస్థితులపై ఇరుశాఖల అధికారులు పలుమార్లు సమావేశమయ్యారు. మంత్రులు సైతం దీనిలో జోక్యం చేసుకుని విద్యుత్తు బకాయిలపై ఒక నిర్ణయం తీసుకునేలా సమాలోచనలు జరిపారు. సరఫరా నిలిపివేతకు కారకులెవరో తేల్చాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి... డీఈఈ రామకృష్ణ కారకులని తేల్చారు. దీంతో అతడిని కార్పొరేట్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వ్యులు జారీ చేశారు.

వివాదాస్పద వైఖరి... డీఈఈ వ్యవహారశైలి ఆది నుంచి వివాదాస్పదమేనని వినిపిస్తోంది. ఆటోనగర్ ఏఈగా విధులు నిర్వహించే సమయంలో సామగ్రి మాయం ఘటనపై ఆయనను అప్పటి గుణదల డీఈగా పని చేసిన శివప్రసాద్‌రెడ్డి సస్పెండ్ చేశారు. దసరా ఉత్సవాల్లో ఇతని వ్యవహారశైలిపై కలెక్టర్ లక్ష్మీశ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు శాఖ ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాట్లకు ఆయన అంగీకరించకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్గగుడి విద్యుత్తు బకాయిల చెల్లింపుపై ఆలయ అధికారులతో ఆయనే చర్చించారు. పలుమార్లు నోటీసులు జారీ చేశారు. జరిగిన వ్యవహారానికి ఆయనే బాధ్యుడని అధికారులు తేల్చారు.

ఆవకాయ్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

8 నుంచి 10 వరకు నిర్వహణ



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా


ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు నిర్వహించే అమరావతి అవకాయ్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. సినిమా, సంస్కృతి, సాహిత్య ఉత్సవాలకు సమన్వయ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. నగరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం సన్నద్ధతా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నగరంలోని పున్నమి ఘాట్, భవానీ ద్వీపం (ఐల్యాండ్)లో నిర్వహించే ఉత్సవాలకు ప్రవేశం ఉచితమన్నారు. సందర్శకుల నమోదు, సీటింగ్ ఏర్పాట్లు, భద్రత, ట్రాఫిక్ ప్రణాళిక, వేదికల వద్ద ఏర్పాట్లు తదితరాలపై చర్చించారు. 8న ఉత్సవాల ప్రారంభోత్సవ ఊరేగింపు మొదలు, పదో తేదీ సాయంత్రం జావేద్ అలీ సంగీత కచేరీ వరకు వివిధ కార్యక్రమాల షెడ్యూల్‌ను పరిశీలించారు. ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. సీఎం చంద్రబాబు, ప్రముఖుల సందర్శన నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జేసీ ఎస్.ఇలక్కియా, టీమ్ వర్క్ (సెలబ్రేటింగ్ ది ఆర్ట్స్) సంస్థ ప్రతినిధి సయ్యద్ శామ్స్, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీసీపీ షేక్ షెరీన్ బేగం, అదనపు డీసీపీ జి.రామకృష్ణ, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి ఎ.శిల్ప, ఏడీసీ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

పేదరికం తగ్గాలి, భూమిని సంరక్షించుకోవాలి, ప్రపంచమంతా శాంతితో నిండిపోవాలి... ఇలాంటి 17 లక్ష్యాలను 2030 కల్లా సాధించే దిశగా పనిచేస్తోంది ఐక్యరాజ్య సమితి. దానికి సంబంధించి తాజాగా థాయ్‌లాండ్‌లో 'యునైటెడ్ నేషన్స్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (యూఎన్- ఎస్‌డీజీఎస్)' ఓ సదస్సును నిర్వహించింది. దానికి హాజరయ్యే అవకాశాన్ని అందుకున్నారు **ఆర్. సునీత**. ఆ విశేషాలను 'వసుంధర'తో పంచుకున్నారిలా...

ఐరాస సదస్సులో తెలుగులో మాట్లాడా!



సునీత

మాది విశాఖపట్నం. సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఈసీఈ విభాగాధిపతిగా పని చేస్తున్నా. నాకు మొదట్నుంచి ప్రాజెక్టులు చేయడం, జర్నల్స్ రాయడం ఇష్టం. ఏయూలో కేన్సర్ చికిత్స గుర్తింపులో ఉపయోగించే బయోమెడికల్ యాంటెనాల మీద పరిశోధన చేశా. ఐరాస లక్ష్యాలను అనుసరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో అన్ని సంస్థలకూ పిలుపునిచ్చాయి. వాటిల్లో మా కళాశాలకు కొన్ని సరిపోతాయనిపించి కొన్ని నెలలుగా సంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందుకోసం మల్టీడిసిప్లినరీ విభాగం, బోధన సిబ్బంది, విద్యార్థులతో ఒక కమిటీని ఏర్పాటుచేశాం. శిక్షణ, నైపుణ్యాల పెంపు వంటివాటితోపాటు... ఆరోగ్య సంరక్షణలో ఏఐ, ఐవోటీల అమలు, గ్రామాల్లో తడి, పొడి చెత్త నిర్వహణ, నీటి సమస్య, విద్యుదుత్పత్తి, ప్రభుత్వ పాఠశాలల్లో లింగ సమానత్వం, ఆర్థిక అసమానతలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలనూ నిర్వహించాం. విద్యార్థులు, వివిధ విభాగాల అధ్యాపకులనీ ఇందులో భాగస్వాములుగా చేశాం. అవగాహన కోసం యూఎన్ వెబ్‌సైట్‌ని అనుసరించేదాన్ని. గత ఏడాది కాలుష్య నియంత్రణ మీద చేపట్టిన ప్రాజెక్టుకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. యూఎన్ ఫర్ సౌత్ ఏషియన్ కేటగిరీలో పదో స్థానంలో నిలవడమే కాదు, నిధులూ అందాయి.

అవకాశం అలా...

మా కళాశాలలో చేపట్టిన కార్యక్రమాలన్నింటి మీద నివేదిక తయారుచేసి యూఎన్- ఎస్‌డీజీఎస్‌కి పంపా. అమలు తీరు నచ్చి, సదస్సుకి హాజరవ్వాలని ఆహ్వానం పంపారు. దీన్లో 108 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. వాళ్లలో ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు, వివిధ విభాగాల అధికారులు, పారిశ్రామికవేత్తలు ఇలా ఎందరో ఉన్నారు. దేశం నుంచి ముగ్గురు ఎంపికవ్వగా తెలుగు రాష్ట్రాల నుంచి నేనొక్కదాన్నే. నాలుగు రోజులు జరిగిన ఈ కార్యక్రమంలో యూఎన్ 17 లక్ష్యాలపైనా చర్చ జరిగింది. ఇందులో నేను ప్రజాప్రయోజనాల కోణంలో ఏఐ ఉపయోగం మీద ప్రసంగించా. కొత్త కొలువులు రావడం, పాతవి కనుమరుగవడం పరిణామ క్రమంలో భాగమే. అందుకు భయపడాల్సిన పనిలేదు. కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే సరి. అయితే నైతికత, భద్రతా విషయాలకీ ప్రాధాన్యమివ్వాలి. ఈ క్రమంలో ఏర్పడే సమస్యలను ఎలా అధిగమించొచ్చో చెప్పి... హాజరైన వారి నుంచి ప్రశంసలూ అందుకున్నా. సదస్సు అనంతరం... కార్యక్రమంపై ఫీడ్ బ్యాక్ ఇవ్వమన్నారు. దాన్ని మాతృభాషలో చెప్పొచ్చన్నప్పుడు తెలుగులో మాట్లాడా. అది మరిచిపోలేని అనుభూతి.

– సురేశ్ రావివలస, విశాఖపట్నం



గొప్ప విజయాలన్నీ చిన్న సంకల్పంతోనే ప్రారంభమవుతాయనేందుకు నిదర్శనం **బాలసాని నిర్మల**. కష్టకాలంలో కుటుంబాన్ని ఆర్థికంగా పడిపోకుండా నిలబెట్టుకున్నారు. పీఎం స్వనిధిని పక్కాగా వినియోగించుకుని చిరువ్యాపారిగా మారారు. డిజిటల్ లావాదేవీల నిర్వహణతో... ఆర్థిక సామాజిక పురోగతి సాధించినందుకు దిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానాన్ని అందుకున్నారు. ఆ ప్రయాణాన్ని మనతో పంచుకున్నారిలా..

కష్టకాలంలో పథకం అండగా..!



మాది పెద్దపల్లి జిల్లాలోని రామగుండం నగరపాలికలోని అల్లూరు. మావారు రవి గౌడ్ గీత కార్మికుడు. ఓరోజు పనికి వెళ్లినప్పుడు ప్రమాదవశాత్తు కాలువిరిగింది. దీంతో కొన్నాళ్లు ఆయన కదల్లేని పరిస్థితి. అది చాలదన్నట్లు తరవాత అనారోగ్య సమస్యలు వెంటాడాయి. దాంతో కుటుంబం, ముగ్గురు పిల్లల చదువుల భారం నామీద పడింది. అది కరోనా సమయం. రోజు గడవడం కష్టమయ్యేది. ఎంతమందిని అడిగినా చిల్లిగవ్వ కూడా అప్పు పుట్టలేదు. దాంతో కుట్టు మెషీన్ కొనుగోలు చేసి బట్టలు కుట్టేదాన్ని. ఆదాయం సరిపోయేది కాదు. 2020లో పీఎం స్వనిధిలో రూ.10వేలు రుణం తీసుకుని ఇంట్లోనే కిరాణా దుకాణం పెట్టుకున్నా. సకాలంలో రుణం తీర్చడంతో రెండో విడత రూ.20వేలు మంజూరు కాగా చీరల వ్యాపారం మొదలుపెట్టా. ఇటీవల మూడో విడతగా రూ50వేలు రుణం తీసుకుని వ్యాపారాన్ని మరింత మెరుగుపరుచుకున్నాను. వ్యాపార మెలకువలూ తెలుసుకున్నా. ఇప్పుడు డిజిటల్ లావాదేవీలు పెరిగాయి. దానికి అనుగుణంగానే నా వ్యాపారాన్నీ మార్చుకున్నా. దీంతో ఈ ఏడాది మా జిల్లా అదనపు కలెక్టరు అరుణశ్రీ చేతుల మీదుగా రూ.5,340 ప్రోత్సాహకాన్ని అందుకున్నాను. ప్రభుత్వ సాయం పొంది ఆర్థిక పురోగతి సాధించడంతో జనవరి 26న దిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు కేంద్రం నుంచి పిలుపు అందింది. ఇప్పుడు ఇంటి వద్దే ఉంటూ నెలకు రూ.10-15వేల వరకూ ఆదాయం అందుకుంటున్నాను. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయమే నన్ను నిలబెట్టింది. అందుకే మా ఊరిలో మహిళలను ఈ దిశగా ప్రోత్సహిస్తున్నా.

– తుమ్మల శ్రీనివాస్, కరీంనగర్

వైరల్

భవిష్యత్తులోకి చూడండి!


సెలిన్

- అందరూ చేసే పని చేయకండి. భిన్నంగా ఆలోచించండి. కొత్త అనుభవాలెన్నో నేర్చుకుంటారు. మిమ్మల్ని మీరు తెలుసుకునేందుకూ మీ సామర్థ్యం ప్రపంచానికి తెలిసేందుకూ తోడ్పడుతాయవి. అందుకే మా క్లాస్‌లో అంతా స్పానిష్ తీసుకుంటే నేను చైనీస్ తీసుకున్నా.
- కష్టపడి పనిచేస్తేనే ఫలితం ఉండదు. కృషితోపాటు ఎంచుకునే మార్గం, లక్ష్యంపట్ల స్పష్టత ఉన్నప్పుడే విజయాన్ని అందుకోగలం. ఓ చెట్టుకి నిచ్చెన పెట్టి ఎంతో కష్టపడి పైకి ఎక్కుతాం. పైన పండ్లు లేవన్న విషయాన్ని అప్పుడు గుర్తిస్తే ఏంటి ఉపయోగం? ఆ చెట్టు ఎంత ఎత్తు ఉందన్నది మాత్రమే తెలుస్తుంది. అదే, ముందే తలెత్తి తోటలోని చెట్లన్నీ పరిశీలించి దేనికి పండ్లున్నాయో దానికే నిచ్చెన వేస్తే కష్టానికి తగ్గ ఫలం దక్కుతుంది. కాబట్టి విజయం సాధించాలంటే ఎంపికే సరైనది ఉండాలి.
- ఐదు, పది, యాభై ఏళ్ల భవిష్యత్తులోకి చూడండి. అప్పుడే మీరు విజయం సాధించగలరు.

ఇవన్నీ చెబుతున్నది ఎవరంటే...

21 ఏళ్లకే స్టార్టప్ కంపెనీ 'డెల్వ్'ని రూ. 2,700 కోట్లకి చేర్చిన **సెలిన్ కోకలార్.** భారత సంతతికి చెందిన కరుణ్ కౌశిక్‌తోపాటు ఏఐ విభాగంలో ఈ ఏడాది ఫోర్బ్స్ 30 అండర్-30(అమెరికా) జాబితాలో నిలిచిందీ ఎమ్ఐటీ(మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) డ్రాపవుట్. తాజాగా ఆమె ఓ వ్లాగర్‌కి ఇచ్చిన రోడ్‌సైడ్ ఇంటర్వ్యూ వైరల్ కావడంతో వార్తల్లోకి వచ్చింది. 2023లో ఎమ్ఐటీలో కరుణ్‌ని కలిసిందీ అమ్మాయి. ఇద్దరి అభిప్రాయాలూ కలవడంతో చదువుని వదిలేసి అతనితో కలిసి 'డెల్వ్' స్టార్టప్‌ను ప్రారంభించింది. 'ఏఐ ఏజెంట్ల సాయంతో సంక్లిష్టమైన రెగ్యులేటరీ కంప్లైయన్స్(నియంత్రణ సమ్మతి) ప్రక్రియను ఆటోమేట్ చేసే సంస్థ మాది. దీనివల్ల ఆయా సంస్థలకి సమయం, డబ్బూ ఆదా అవుతాయి. ఏఐ అభివృద్ధి చెందేకొద్దీ మా టెక్నాలజీని మరింత మెరుగుపరచుకుంటాం. భవిష్యత్తుని ఊహించి మా ప్రత్యేకత నిలిచేలా మా బేస్ ఏర్పరచుకున్నాం. స్టార్టప్ ప్రారంభించడానికి ముందే క్షుణ్ణంగా అధ్యయనం చేశా. ఇరవయ్యేళ్లకే ఎనిమిది పబ్లికేషన్స్‌నీ రాశా' అంటోందీ డెల్వ్ కో-ఫౌండర్, సీఓఓ సెలిన్. ఆమె స్మార్ట్ విజన్‌ని మెచ్చుకోవాల్సిందే మరి!

రోజ్‌మెరీ... వాస్తవమేనా?



సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా రోజ్‌మెరీ నూనె ప్రస్తావనే! జుట్టు వేగంగా పెరిగేలా చేస్తుంది, తెల్లజుట్టును నల్లగా చేయగలదంటూ విపరీతంగా ప్రచారం జరుగుతోంది. ఇదంతా వాస్తవమేనా?

రోజ్‌మెరీలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలెక్కువ. ఇవి రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. దీంతో కుదుళ్లు గట్టిపడి, కురులు రాలడం తగ్గుతుంది. యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చుండ్రుతోపాటు ఇన్‌ఫ్లమేషన్‌నీ తగ్గిస్తాయి. తద్వారా కురులు పెరుగుదలకు సాయపడతాయి. ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గిస్తుంది కాబట్టి, కురులు సహజ రంగును కోల్పోవు. కాబట్టి, తెలుపు రంగులోకి మారే ప్రక్రియ ఆలస్యమవుతుంది. అయితే అప్పటికే తెలుపులోకి వచ్చిన వాటిని నలుపుగా మారుస్తాయన్న దానికి శాస్త్రీయంగా రుజువులు మాత్రం లేవు. అయితే దీన్ని నేరుగా కూడా రాయకూడదు. క్యారియర్ ఆయిల్ తప్పనిసరి. అంటే కొబ్బరి, జొజొబా, ఆముదం వంటి వాటిల్లో కలిపే వాడాలి. పావుకప్పు నూనెకు కొన్ని చుక్కలు కలిపి రాసుకుంటే సరిపోతుంది. నూనె పట్టించాక కనీసం అయిదు నిమిషాలు మర్దన చేయాలి. సమయం లేదనుకుంటే షాంపూ నీటిలో 3-5 చుక్కలు చేర్చి, తలంటుకున్నా మంచిదేనట. కాబట్టి, మీకెలా అనువో చూసుకోండి. అలా వాడి చూడండి. అయితే ఇదీ అందరికీ పడుతుందన్న నమ్మకం లేదు. స్కిన్ టెస్ట్ తప్పనిసరి. దురద, ఎరుపుదనం వంటివి లేనప్పుడే కొనసాగించండి.

కొత్త శక్తి కోసం... శక్తి ముద్ర



శక్తి అంటే జీవశక్తి లేదంటే శక్తికి ప్రతిరూపమైన దుర్గాదేవి అని అర్థం. ముద్ర అంటే చేత్తో చేసే సంజ్ఞ.

చేసే విధానం: యోగా మ్యాట్‌పైన(పద్మాసనం, వజ్రాసనం లేదంటే) రెండు కాళ్లు మడిచి కూర్చోండి. ఇప్పుడు సున్నితంగా రెండు చేతుల బొటనవేళ్లని అరచేతి వైపుగా మడిచి ఉంచి దానిమీద చూపుడు, మధ్య వేళ్లతో మూసి పెట్టండి. అలాగే రెండు చేతుల ఉంగరం, చిటికెన వేళ్ళ కొనలను సున్నితంగా ఒత్తి ఉంచండి. ఆపై ఫొటోలో చూపిన విధంగా చేతుల్ని సాధ్యమైనంత దగ్గరగా ఉండేలా చూడండి. ఈ ముద్రను హృదయానికి దగ్గరగా తీసుకురండి. ఇప్పుడు ప్రశాంతంగా కళ్లను మూసి వుంచి 15-30 సెకన్లు ఉండే ప్రయత్నం చేయండి.



ఉపయోగాలు: శరీరానికీ, మనసుకూ నూతన ఉత్సాహాన్నీ, శక్తినీ ఇస్తుంది. ముఖానికి తేజస్సును తెస్తుంది. దడ, వణుకు లాంటివాటిని తగ్గిస్తుంది. నిద్రలేమి, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు పరిష్కారమవుతాయి. ఆహారం: ప్రొటీన్లు, మంచి కొవ్వులు శరీరానికి అందాలి. వేరుశనగ, బాదం, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోండి. తక్షణ శక్తి కోసం అరటిపండ్లను ఆశ్రయించండి. వీటిద్వారా విటమిన్లు, ఐరన్, కాల్షియం, పొటాషియం... వంటివి పుష్కలంగా లభిస్తాయి.

- శిరీష, యోగ గురు

అల్లికలు... గోళ్ల మీదా!






శీతకాలం అనగానే గుర్తొచ్చేది ఊలు దుస్తులే కదూ! ఒకప్పటిలా కాదు వాటిలోనూ ఎన్నో ఫ్యాషన్లు. మరి అన్నింటా మ్యాచింగ్‌ని ఫాలో అయ్యే అమ్మాయిలు ఈ దుస్తుల్ని మాత్రం ఎందుకు వదలాలి అనుకున్నారేమో! 'స్వెటర్ నెయిల్స్' అంటూ గోళ్ల మీదా అల్లికల్ని తెచ్చేశారు. కేబుల్ నిట్, ప్లెయిడ్, ఆర్గైల్... వంటి ఎన్నో ఉన్ని అల్లికలను అచ్చు గుద్దినట్టు దింపేస్తున్నారు. సాఫ్ట్ బెయిజ్... దాని పక్కనే బ్రౌన్ రంగు షేడ్... లేదంటే నచ్చిన ముదురు రంగుకు తెలుపును జత చేస్తూ ఇంకా కావాలంటే ఒకే రంగుతోనూ ఎన్నెన్ని డిజైన్లో! ఏదైనా ఆకర్షించడం మాత్రం ఖాయం. కాబట్టే, స్వెటర్ నెయిల్స్‌కి 'అల్టిమేట్ కోల్డ్ వెదర్ మానిక్యూర్ ట్రెండ్'గానూ పేరొచ్చింది. 'వింటర్ వైబ్' అంటూ సోషల్‌మీడియాలోనూ వైరలవుతోంది. స్నో, గ్లిటరీ రంగులు, ప్లెయిడ్ తరహా డిజైన్లకైతే అభిమానులూ బోలెడు. మరి మీ సంగతేంటి? మీకూ నచ్చాయా ఈ స్వెటర్ నెయిల్స్? ఇంకేం ఆన్‌లైన్‌లో డీఐవై చూసి ప్రయత్నించేయండి మరి!







నేటి ఫ్యాషన్

ఏం చేసినా... మీకోసం చేయండి!

ఉదయం లేచింది మొదలు పనులే... రోజు గడుస్తున్నా ఓ పట్టాన పూర్తవవు. ఒకవేళ పూర్తయినా విశ్రాంతి తీసుకునే సమయం ఉండదు. కాఫీ కప్పు పట్టుకుని కూర్చోగానే... మళ్లీ ఏదో కొత్త పని గుర్తుకు వస్తుంది. లేచి దాని వెనక పడతాం. ఇంత చేసినా 'కూర బాలేదు. దిండ్లు శుభ్రం చేయలేదా? దుప్పట్లు ఉతకలేదా' అంటూ చేయని వాటి జాబితానే చదువుతారంతా. ఉద్యోగినులదీ ఇదే పరిస్థితి. ఇచ్చిన టాస్కులు పూర్తిచేయడానికి పొద్దస్తమానం కష్టపడతారు. ఇంతలా పనిచేసినా... ఎక్కడో చోట అనుకున్న స్థాయిలో ఫలితాలు ఉండవు. అంతా బాగానే జరిగింది అని తృప్తి పడదాం అన్నా... వెంటనే ఏదో తప్పుతో తిట్లు తయారుగా ఉంటాయి. ఇవన్నీ తెచ్చే ఒత్తిడి అంతా ఇంతా కాదు. అయితే దీనికి కారణం ఏ పనైనా మనది, మనమే పూర్తిచేయాలి అనుకుని చేయకపోవడమే అంటారు నిపుణులు. ఒకే పనిని ఏళ్ల తరబడి చేయడమో లేదా చేస్తున్న దాని మీద ఆసక్తి లేకపోవడం కూడా కారణం కావొచ్చు. ఇవన్నీ మైండ్‌ఫుల్‌నెస్‌ని దెబ్బతీసే అంశాలే.



అందుకే ఏ పని చేసినా... అది చిన్నదైనా, పెద్దదైనా నేను తప్ప ఇంకెవరూ దీన్ని పూర్తిచేయలేరు అన్న దృక్పథంతోనే మొదలుపెట్టండి. అప్పుడే దానిమీద ఆసక్తి వస్తుంది. అందరూ చేస్తున్నట్లు కాకుండా, భిన్నంగా దాన్ని ఎలా పూర్తిచేయొచ్చు అన్న దానిమీద ధ్యాస పెట్టండి. దీనివల్ల ఆలస్యం అవుతుందేమో కానీ, కొత్త నైపుణ్యం, మెలకువలు మీ సొంతం అవుతాయి. ఎవరికోసమో ఈ పనిని చేస్తున్నాం అన్న ఆలోచన మీ మనసులోకి అస్సలు రానివ్వొద్దు. అది వచ్చిందంటే... అక్కడితో పనులకు చరమగీతం పాడినట్లే. ఈ ఆలోచన మనిషిలో ఓ తెలియని అలసత్వానికి కారణం అవుతుంది. కొన్నిసార్లు అది నిర్లక్ష్యానికీ దారితీస్తుంది. అందుకే ఏ పని చేసినా మీకోసం, మీ అభివృద్ధి, ఎదుగుదల, లక్ష్యాల్ని దృష్టిలో పెట్టుకుని చేస్తే... పర్ఫెక్ట్‌నెస్ మీ సొంతం అవుతుంది. ప్రయత్నిస్తారు కదూ!

ఉద్యోగం వదిలి... ప్రకృతి రక్షణ వైపు!

విదేశాల్లో ఉద్యోగం... లక్షల్లో జీతం... వాటన్నింటిని వదిలి సొంత దేశాన్ని కాలుష్యం నుంచి రక్షించాలనుకున్నారు. పర్యావరణ హితంకోసం వినూత్నంగా 'రెనో గ్రీన్' ద్వారా పాత దుస్తుల్ని కొత్త డిజైనర్ దుస్తులుగానూ, గృహాలంకరణ ఉత్పత్తులుగా రీసైకిల్ చేస్తున్నారు 36 ఏళ్ల నేహా మొహంతి.



నేహా


షాపింగ్‌కి వెళతామా టీషర్ట్ బాగుందని కొనేస్తాం. తీరా ఒకసారి వేసి పక్కన పెట్టేస్తాం. ఎప్పుడో అల్మారా సర్దుతున్నప్పుడు కనిపిస్తే దీన్ని వేసుకోను, ఇక అవసరం లేదంటూ బయట పడేస్తాం. ఇలా మన ఇంట్లోనే ఇన్ని ఉంటే నగరం మొత్తమ్మీద ఇంకెన్ని వ్యర్థాలు పోగవుతాయో. వీటితో పర్యావరణానికి వచ్చే చిక్కులెన్నో అనుకున్నారు నేహా. అందుకే రెనో గ్రీన్ సంస్థ ద్వారా పాత బట్టల్ని డిజైనర్ దుస్తులుగా మారుస్తున్నారు. ఈ క్రమంలో ఘన వ్యర్థాల నిర్వహణ పెద్ద సవాల్‌గా మారిందామెకు. ఇందుకు నేహా కటక్, భువనేశ్వర్‌లోని డంపింగ్ యార్డులను పరిశీలించారు. 'మన దేశంలో ప్రధాన నగరాలు ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయడానికి మార్గాలు వెతుకుతున్నాయి. కానీ, వాడని బట్టలు కుప్పలుగా చెత్తలో ఉండిపోతున్నాయి. ఈ వ్యర్థాల గురించి ఎవరూ ఆలోచించడం లేదు. అందుకే వీటినే రీసైక్లింగ్ చేయాలనుకున్నా. మొదట పైలట్ ప్రాజెక్టుగా కటక్‌లోని ఒక హౌసింగ్ కాలనీ ఎంచుకున్నా. ఇకపై అక్కడివాళ్లంతా వాడని దుస్తుల్ని దానం చేయాలనే నిబంధన పెట్టాను. ఒక నెలలోనే దాదాపు 500కిలోల పాత బట్టల్ని సేకరించాం. అలా సేకరించిన వాటిలో ప్రైజ్ ట్యాగ్‌లు తీయనివీ ఉన్నాయి. అది చూసి ఆశ్చర్యపోయా. ఈ వస్త్ర వ్యర్థాలను రీసైకిల్ చేసే ప్రక్రియను తెలుసుకోవడానికి హరియాణాలోని పానిపత్ టెక్స్‌టైల్ రీసైక్లింగ్ హబ్‌కు వెళ్లా. అక్కడ నేర్చుకున్న మెలకువలతో వాడని వస్త్రాల్ని పునర్వినియోగ వస్తువులుగా, గృహోపకరణాలుగా మారుస్తున్నా' అంటారీమె.

ఎంతోమందికి ఉపాధి...

నేహా దగ్గర చాలామంది టైలర్లు, ఫ్యాషన్ డిజైనర్లు పనిచేస్తున్నారు. కొందరు ఫ్రీలాన్స్ వర్క్ కూడా చేస్తున్నారు. అంతేకాదు, చాలామంది తమ పాత వస్తువుల్ని ఇచ్చి వారికి అవసరమైన వస్తువులను తయారుచేయించుకుంటున్నారు. 'ఈ వ్యాపారంలో లాభాపేక్ష ఉండదు. మా లక్ష్యం దుస్తుల్ని రీసైక్లింగ్ చేయడం మాత్రమే కాదు, బట్టలు కొనడం, వాటిని ఎలా జాగ్రత్తగా ఉపయోగించాలనేదీ చెప్పడం కూడా. పాత ఇల్లు, కారు.. వంటివాటిని తిరిగి ఎలా రీమోడల్ చేసి వాడుకుంటామో అలా... దుస్తుల్నీ రీయూజ్ చేసుకోవచ్చు' అంటారు నేహా.


రంగవల్లిక

17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకూ



ఆర్. ఇందిర, బొబ్బిలి

18 చుక్కలు
10 వరుసలు
10 వచ్చేవరకూ



పి. అలివేలు, విశాఖపట్నం



కె. భవాని, హైదరాబాద్

18 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకూ

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email: vasundhara@eenadu.in

బంగారం - వెండి



2న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,38,240	1,25,250	2,38,732
విజయవాడ	1,34,440	1,24,850	2,43,000
ప్రొద్దుటూరు	1,38,400	1,27,330	2,42,500
రాజమహేంద్రవరం	1,36,200	1,24,850	2,60,000
విశాఖపట్నం	1,36,210	1,24,850	2,28,000
తమిళనాడు	-----	1,25,800	2,60,000

చాంపియన్

నాన్న షరతు.. కెరీర్లో మలుపు

- కార్ల్‌సన్‌లో అందుకే ఆ అసహనం
- 'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖిలో అర్జున్

అర్జున్ ఇరిగేశి.. ఇప్పుడు భారత చెస్‌లో మార్మోగుతున్న పేరు. కొన్నేళ్లుగా ప్రపంచ చెస్‌లో అంచెలంచెలుగా ఎదుగుతున్న ఈ తెలంగాణ కుర్రాడు.. తాజాగా ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో సంచలన ప్రదర్శన చేశాడు. ఆనంద్ తర్వాత ఈ ఛాంపియన్‌షిప్‌లో ఒకేసారి రెండు పతకాలు గెలిచిన భారత క్రీడాకారుడిగా రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో ప్రపంచ నంబర్‌వన్, అయిదు సార్లు ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను సైతం అర్జున్ ఓడించాడు. ఈ అద్భుత ప్రదర్శన తర్వాత అర్జున్ తన స్వస్థలం వరంగల్‌కు వచ్చాడు. రానున్న రోజుల్లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడమే లక్ష్యమంటున్న అర్జున్‌తో 'ఈనాడు-ఈటీవీ'తో ముఖాముఖి విశేషాలు తన మాటల్లోనే..


అర్జున్

పాఠశాల స్థాయిలో చెస్‌పై ఆసక్తి పెంచుకున్నా. పోటీలకు వెళ్లిన సందర్భాల్లో సెలవులు పెట్టాల్సి వచ్చేది. చదువుకు సమయం కేటాయించలేకపోయేవాణ్ని. ఆరో తరగతిలో ఉన్నప్పుడు పోటీలకు వెళ్లేందుకు సెలవులు పెడితే స్కూల్ యాజమాన్యం అభ్యంతరం చెప్పింది. దీంతో నాన్న తర్వాత నన్ను ఆటలకు అనుమతించే బడిలోకి మార్చారు. పదో తరగతికి వచ్చినా కూడా చెస్‌లో అనుకున్న స్థాయిలో రాణించలేకపోయా. దీంతో అటు చదువు, ఇటు ఆట ఏదీ కాకుండా పోతుందేమో అన్న భయంతో నాన్న నాకు ఒక షరతు పెట్టారు. పదో తరగతి వార్షిక పరీక్షల లోపు గ్రాండ్‌మాస్టర్ హోదా వస్తే సరే, లేకుంటే తాను చెప్పినట్లు చదువుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. నాన్న చెప్పినట్లు గ్రాండ్ మాస్టర్ అయ్యాను. చెస్‌లోనే కొనసాగాను. ఆ తర్వాత నాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. నాన్న అలా షరతు పెట్టడంతో పట్టుదలతో ప్రయత్నించడం వల్లే తెలంగాణ నుంచి తొలి గ్రాండ్‌మాస్టర్‌గా 15 ఏళ్లకే ఘనత సాధించాను.

ఒత్తిడిని జయించడానికి..



చదరంగం అంటేనే.. ప్రత్యర్థి ఎత్తులకు పైఎత్తులు వేయడం. ఆటలో ఒత్తిడి తీవ్రంగానే ఉంటుంది. గేమ్‌లో చిన్న పొరపాటు చేసినా.. గెలుపు అవకాశాలు చేజారుతాయి. పరిస్థితిని అర్థం చేసుకొని.. ఒత్తిడిని అధిగమించటమే ఏ క్రీడాకారుడికైనా కీలకం. ఆటపై ఏ ప్రతికూల ప్రభావం పడకుండా చూసుకోవాలి. చెస్‌లో కేవలం మానసికంగా.. దృఢంగా ఉంటే సరిపోదు. శారీరకంగా కూడా ఫిట్‌గానే ఉండాలి. ఆట మొదట్లో ఎలా శక్తిమంతంగా ఉంటామో.. చివరి వరకు ఆ స్థితిలోనే కొనసాగాలి. అందుకే నేను ధ్యానం, వ్యాయామానికి ప్రాధాన్యమిస్తూ రెండు విధాలా దృఢంగా ఉండేలా చూసుకుంటా. ఒత్తిడిని జయించడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

అతడు ఎందుకలా చేశాడంటే..

ప్రపంచ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్ 9వ రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించటం నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. సాధనతో కూడిన నైపుణ్యం, ఎన్నో గేమ్‌లు ఆడిన అనుభవం ప్రత్యర్థి ఎంత పెద్ద క్రీడాకారుడైనా భయం లేకుండా ఆడేలా చేసింది. నా చేతిలో ఓడిపోయాక కార్ల్‌సన్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. బల్లను గట్టిగా కొట్టి వెళ్లాడు. ఆ గేమ్‌లో అతను ఆరంభంలోనే వెనుకబడ్డాడు. క్రమంగా పుంజుకొని.. డ్రా చేసుకోవాలని ప్రయత్నిస్తున్న సమయంలోనే గేమ్‌ను ముగించాను. ఈ గేమ్‌లో తనే గెలుస్తాననుకున్నాడు. ఓటమిని ఊహించలేకపోయాడు. అందుకే ఫలితాన్ని జీర్ణించుకోలేక అలా చేశాడనిపించింది.

ఆ అమ్మ మాటలు ప్రేరణ

నాన్న వైద్యవృత్తిలో బిజీగా ఉండేవారు. నేను పోటీలకు వెళ్లిన సందర్భంలో నాతో అమ్మ తోడుగా వచ్చేది. ఆటకు ప్రారంభానికి ముందు, మధ్యలో నాలోని ఒత్తిడిని గమించి.. దాన్ని అధిగమించేలా, ఆత్మవిశ్వాసం పెంపొందేలా తన మాటలతో ప్రేరణ ఇచ్చేది. ఓటమి పాలైన సందర్భాల్లోనూ నిరుత్సాహ పడకుండా తోడ్పాటు అందించేది. గెలుపోటములు సహజం అంటూ నన్ను ప్రోత్సహించేది.

అదే లక్ష్యం

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్లలో కాంస్య పతకాలు గెలవటం సంతోషాన్నిచ్చింది. ఈ పతకాలు నా ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచాయి. ఈ టోర్నీలో చిన్న పొరపాట్ల వల్ల ఛాంపియన్‌గా నిలిచే అవకాశం త్రుటిలో తప్పింది. బ్లిట్జ్‌లో లీగ్ దశలో గెలిచిన క్రీడాకారుడి చేతిలోనే సెమీస్‌లో ఓడా. మ్యాచ్‌ను డ్రా చేసుకొనే అవకాశం ఉన్నప్పటికీ.. గెలుద్దామని ప్రయత్నించే క్రమంలో ఆలస్యమై, పొరపాటు జరిగింది. ఇలాంటివి సరిచేసుకుని, రానున్న రోజుల్లో పసిడి పతకాన్ని గెలుచుకొని ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడమే లక్ష్యంగా ముందుకు సాగుతా.

– ఈనాడు, వరంగల్, వరంగల్ స్పోర్ట్స్, న్యూస్‌టుడే

కివీస్‌తో సిరీస్‌కు భారత జట్టు ఎంపిక నేడు

దిల్లీ: న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు భారత జట్టును శనివారం ఎంపిక చేయనున్నారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శుక్రవారమే జట్టును ఎంపిక చేస్తుందని వార్తలు వచ్చినా.. ఈ సమావేశం తర్వాతి రోజు జరుగుతుందని వెల్లడైంది. వచ్చే నెలలో ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యలకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించనున్నట్లు తెలిసింది. వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్, హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌ల వన్డే భవితవ్యంపై సెలక్టర్లు ఓ నిర్ణయానికి వచ్చే అవకాశముంది. ఈ సిరీస్‌కు వీరు ఎంపిక కాకుంటే వన్డేల్లో వీరి కెరీర్ ముందుకు సాగడం కష్టమవుతుంది. ఈ ఫార్మాట్లో వీరి ఫామ్ గొప్పగా లేదు. ఈ ఇద్దరూ తుది జట్టులో ఆడి కూడా చాన్నాళ్లయింది. దేశవాళీల్లో సత్తా చాటుకున్న సీనియర్ పేసర్ మహ్మద్ షమి.. కివీస్‌తో సిరీస్‌కు ఎంపికవుతాననే ఆశాభావంతో ఉన్నాడు. కివీస్‌తో మూడు వన్డేలు ఈ నెల 11, 14, 18 తేదీల్లో జరుగుతాయి. 21 నుంచి జరిగే అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం ఇప్పటికే భారత జట్టును ఎంపిక చేశారు.

మళ్లీ మరైన్

మహిళల హాకీ జట్టు కోచ్‌గా నియామకం


మరైన్

దిల్లీ: భారత మహిళల హాకీ జట్టు కోచ్‌గా షూవర్డ్ మరైన్ (నెదర్లాండ్స్) మళ్లీ నియమితుడయ్యాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టుకు మరైన్ కోచ్‌గా ఉన్నాడు. తర్వాత పదవీ కాలం పూర్తవడంతో కోచ్‌గా తప్పుకొన్నాడు. గత ఏడాది హరేంద్ర సింగ్ శిక్షణలో భారత జట్టు పేలవ ప్రదర్శన చేసింది. తనదే పైచేయిగా ఉండాలన్న అతడి వ్యవహార శైలి జట్టుపై ప్రతికూల ప్రభావాన్ని చూపించింది. దీంతో డిసెంబర్‌లో హరేంద్ర తన పదవికి రాజీనామా చేశాడు. ఈ నేపథ్యంలో హాకీ ఇండియా మరోసారి మరైన్‌కు కోచ్ బాధ్యతలు అప్పగించింది. "నాలుగున్నర ఏళ్ల తర్వాత తిరిగి భారత జట్టుతో పని చేయబోతుండడం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ వచ్చా. ప్రపంచ స్థాయిలో భారత్ తిరిగి పుంజుకోవడానికి నా వంతు కృషి చేస్తాను" అని మరైన్ చెప్పాడు. రెండుసార్లు (2017, 2021) భారత జట్టు కోచ్‌గా పని చేసిన మరైన్‌కు మథియాస్ విలా (విశ్లేషకుడు), వేన్ లాంబర్డ్ (సాంకేతిక సలహాదారు) మద్దతుగా నిలవనున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన తర్వాత భారత జట్టు.. సంధి దశను ఎదుర్కొంటోంది. అప్పటి కెప్టెన్ రాణి రాంపాల్, సీనియర్లు వందన కటారియా, దీప్ గ్రేస్ ఆటకు వీడ్కోలు పలికారు. 2022 కామన్వెల్త్ క్రీడలు, 2023 ఆసియాక్రీడల్లో కాంస్య పతకాలు అందుకున్నా.. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ అర్హత సాధించలేకపోయింది. గతేడాది నేషన్స్ కప్‌లో 16 మ్యాచ్‌ల్లో రెండే విజయాలు సాధించింది. మార్చి 8న హైదరాబాద్‌లో ఆరంభమయ్యే ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో భారత్ మెరుగైన ప్రదర్శన చేసేలా చూడడం మరైన్ తక్షణ కర్తవ్యం. ఈ టోర్నీకి ముందు ఈనెల 19న బెంగళూరులో సాయ్ శిక్షణ శిబిరం ఆరంభం కానుంది. ఈలోగా మరైన్ జట్టును చేరుకుంటాడు.

స్టబ్స్‌పై వేటు.. రబాడ పునరాగమనం




రబాడ

జొహానెస్‌బర్గ్: టీ20 ప్రపంచకప్‌లో బరిలోకి దిగే దక్షిణాఫ్రికా జట్టును ప్రకటించారు. ఇటీవల వరుస వైఫల్యాలు చవిచూస్తున్న మిడిలార్డర్ బ్యాటర్ ట్రిస్టన్ స్టబ్స్‌పై సెలక్టర్లు వేటు వేశారు. గత నెల భారత్‌తో టీ20 సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు ఆడిన స్టబ్స్.. వరుసగా 14, 9 పరుగులే చేశాడు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లోనూ అతను విఫలమవుతున్నాడు. గాయం కారణంగా భారత పర్యటనలో ఆడలేకపోయిన ప్రధాన పేసర్ కాగిసో రబాడ.. జట్టులోకి పునరాగమనం చేశాడు. అతడితో పాటు కార్బిన్ బోష్, మార్కో యాన్సెన్, క్వెనా మఫాకా, లుంగి ఎంగిడి, అన్‌రిచ్ నోకియా పేస్ కోటాలో ఎంపికయ్యారు. కేశవ్ మహరాజ్, జార్జ్ లిండే స్పెషలిస్టు స్పిన్నర్లుగా అవకాశం దక్కించుకున్నారు. కెప్టెన్ ఐడెన్ మార్‌క్రమ్‌తో పాటు డొనోవన్ ఫెరీరా, జేసన్ స్మిత్ పార్ట్‌టైం స్పిన్ వేయగల ఆటగాళ్లు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టోర్నీ ఫిబ్రవరి 7న మొదలై మార్చి 8న ముగుస్తుంది.

టీ20 ప్రపంచకప్‌నకు దక్షిణాఫ్రికా జట్టు

దక్షిణాఫ్రికా జట్టు: ఐడెన్ మార్‌క్రమ్ (కెప్టెన్), క్వింటన్ డికాక్, టోనీ డి జోర్జి, డెవాల్డ్ బ్రెవిస్, డేవిడ్ మిల్లర్, డొనోవన్ ఫెరీరా, జేసన్ స్మిత్, మార్కో యాన్సెన్, జార్జ్ లిండే, కేశవ్ మహరాజ్, క్వెనా మఫాకా, లుంగి ఎంగిడి, అన్‌రిచ్ నోకియా, కాగిసో రబాడ.

ఆ అవమానాలు తట్టుకోలేకే..


గిలెస్పీ

కరాచి: పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా పని చేసిన సమయంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని.. అవి తట్టుకోలేకే ఈ పదవి నుంచి తప్పుకున్నానని ఆస్ట్రేలియా మాజీ పేసర్ జేసన్ గిలెస్పీ చెప్పాడు. టెస్టుల్లో సహాయక కోచ్ టిమ్ నీల్సన్‌ను తనకు తెలియకుండానే తొలగించడం ఆశ్చర్యాన్ని కలిగించిందని అతడన్నాడు. "పాకిస్థాన్ టెస్టు జట్టుకు కోచ్‌గా నియమించినప్పుడు ఎంతో ఉత్సాహంగా ఆ పదవిని స్వీకరించాను. నా సొంత ఆలోచనలతో మార్పులు తీసుకురావాలని అనుకున్నా. కానీ ఏదీ అనుకున్నట్లు సాగలేదు. దీనికి తోడు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే మా సహాయక కోచ్ టిమ్ నీల్సన్‌ను తప్పించారు. ఒక ప్రధాన కోచ్‌గా వాళ్లు తీసుకున్న నిర్ణయం ఏమాత్రం ఆమోదయోగ్యంగా అనిపించలేదు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి చాలా ఉన్నాయి. ఆ సంఘటనలు ఎంతో అవమానంగా అనిపించాయి. పీసీబీ కోచ్‌లను ఇష్టం వచ్చినట్లు మార్చింది'' అని గిలెస్పీ అన్నాడు. 2024 ఏప్రిల్‌లో గిలెస్పీ టెస్టు జట్టు కోచ్‌గా నియమితుడయ్యాడు. తెల్ల బంతి ఫార్మాట్లలో గ్యారీ కిర్‌స్టెన్ ఈ పదవికి ఎంపికయ్యాడు. జట్టు సెలక్షన్‌లో తన పాత్రను తగ్గించడంతో కొన్ని నెలలకే కిర్‌స్టెన్ కోచ్‌గా తప్పుకున్నాడు. డిసెంబర్‌లో గిలెస్పీ కూడా రాజీనామా చేశాడు.

ఖవాజా.. ఇంకొక్క టెస్టే

యాషెస్ చివరి పోరు తర్వాత రిటైర్మెంట్


ఉస్మాన్ ఖవాజా

సిడ్నీ: ఆస్ట్రేలియా వెటరన్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్‌తో చివరిదైన అయిదో టెస్టు తర్వాత తాను రిటైరవనున్నట్లు అతను వెల్లడించాడు. సిడ్నీలో ఆదివారం ఆరంభమయ్యే ఈ టెస్టు 39 ఏళ్ల ఖవాజా కెరీర్‌లో 88వది. ఇదే మైదానంలో అతడు ఫస్ట్‌క్లాస్ కెరీర్‌ను ఆరంభించాడు. 2011లో ఇంగ్లాండ్‌పైనే ఖవాజా తొలి టెస్టు ఆడాడు. ఇప్పటిదాకా 87 టెస్టుల్లో 43.49 సగటుతో 6206 పరుగులు చేశాడు. అందులో 16 సెంచరీలు, 28 అర్ధసెంచరీలు ఉన్నాయి. అతను 40 వన్డేలాడి 1554 పరుగులు, 9 టీ20ల్లో 241 పరుగులు సాధించాడు. ప్రస్తుత యాషెస్ తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఖవాజాకు వెన్నుకు గాయమైంది. దీంతో బ్రిస్బేన్‌లో జరిగిన రెండో టెస్టులో ఆడలేదు. మొదట మూడో టెస్టు జట్టులోనూ అతడు లేడు. కానీ స్టీవ్ స్మిత్ అనారోగ్యానికి గురి కావడంతో ఖవాజాకు అవకాశం దక్కింది. ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లో నాలుగు ఇన్నింగ్స్‌లు ఆడిన అతను.. ఒక్క అర్ధసెంచరీనే చేశాడు.

జాతివివక్షను ఎదుర్కొన్నా..

సుదీర్ఘ కెరీర్‌లో జాతి వివక్షను ఎదుర్కొన్నానని ఖవాజా తెలిపాడు. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో పుట్టిన ఖవాజా.. ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాడు. అతడి కుటుంబం ఆస్ట్రేలియాలో స్థిరపడడంతో క్రికెట్లోకి అడుగుపెట్టి సత్తా చాటాడు. 'పాక్ నుంచి వచ్చావు.. ఆస్ట్రేలియాకు ఆడలేవు' అన్న వాళ్ల అంచనాలను తలకిందులు చేస్తూ.. జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఆసీస్‌కు ప్రాతినిధ్యం వహించిన తొలి ముస్లిం ఆటగాడిగా నిలిచాడు. "సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలను చూశా. నన్ను భిన్నంగా చూసేవాళ్లు. ఇలాంటి పరిస్థితిని చాలాసార్లు ఎదుర్కొన్నా. సొంత జట్టు ఆటగాళ్లే ఇబ్బంది పెట్టేవాళ్లు. నా నేపథ్యం వల్లే ఇలాంటి వివక్షకు గురయ్యానని తెలుసు. ప్రస్తుత యాషెస్ సిరీస్‌లో వెన్ను నొప్పి కారణంగా ఆడలేకపోయినా విమర్శించారు. ఏ ఆసీస్ ఆటగాడు ఇంతలా విమర్శలు ఎదుర్కొని ఉండడు. ఆస్ట్రేలియాకు ఇన్ని టెస్టులు ఆడడం అదృష్టంగా భావిస్తున్నా" అని ఖవాజా అన్నాడు. "ఆస్ట్రేలియా క్రికెట్‌కు ఖవాజా అందించిన సేవలను మరిచిపోలేం. సుదీర్ఘ కెరీర్‌లో అతడు నమ్మదగ్గ బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. మైదానం బయట ఉస్మాన్ ఖవాజా ఫౌండేషన్ ద్వారా శరణార్థులకు సేవలందించాడు'' అని క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ టాడ్ గ్రీన్‌బర్గ్ అన్నాడు.

యాషెస్ చివరి టెస్టుకు పాట్స్, బషీర్


మాథ్యూ పాట్స్

సిడ్నీ: ఆస్ట్రేలియాతో ఆదివారం మొదలయ్యే యాషెస్ చివరి టెస్టుకు ఇంగ్లాండ్ జట్టును ప్రకటించారు. పేసర్ గస్ అట్కిన్సన్ గాయపడ్డ నేపథ్యంలో మాథ్యూ పాట్స్‌కు జట్టులో చోటు దక్కింది. ఈ పేసర్‌తో పాటు స్పిన్నర్ షోయబ్ బషీర్‌కు 12 మంది సభ్యుల జట్టులో అవకాశం లభించింది. ఈ ఇద్దరిలో ఒకరు తుది జట్టులో ఉంటారు. చివరి టెస్టుకు వేదికైన సిడ్నీలో పిచ్ కొంచెం స్పిన్నర్లకు సహకరిస్తుంది కాబట్టి బషీర్‌కే అవకాశం దక్కొచ్చు. జట్టులో ఇంకేం మార్పులు లేవు. తొలి మూడు టెస్టుల్లో ఓడి సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లాండ్.. నాలుగో టెస్టులో పుంజుకుని విజయం సాధించింది.

ఇంగ్లాండ్ జట్టు: బెన్ స్టోక్స్ (కెప్టెన్), జాక్ క్రాలీ, బెన్ డకెట్, జాకబ్ బెతెల్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్, విల్ జాక్స్, మాథ్యూ పాట్స్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, షోయబ్ బషీర్.

పీడబ్ల్యూఎల్ వేలంలో 250 మందికిపైగా..

దిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్ వేలానికి వేళైంది. రెజ్లింగ్ సంఘంలో వివాదాల కారణంగా ఆరేళ్ల విరామం తర్వాత జరగబోతున్న ఈ లీగ్ కోసం శనివారం వేలం నిర్వహిస్తున్నారు. 250 మందికి పైగా రెజ్లర్లు అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పారిస్ ఒలింపిక్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత దీపక్ పునియా, ప్రపంచ ఛాంపియన్‌షిప్ పసిడి గెలిచిన అంతిమ్ పంఘాల్ లాంటి స్టార్లు వేలంలో ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలను బట్టి రెజ్లర్లను ఎ-ప్లస్ (మార్క్యూ), ఎ, బి, సి విభాగాలుగా విభజించారు. 'ఎ-ప్లస్' రెజ్లర్లకు రూ.18 లక్షలు, 'ఎ' కేటగిరికి రూ.12 లక్షలు, 'బి'కి 8 లక్షలు, 'సి'కి రూ.3 లక్షలు కనీస ధరగా నిర్ణయించారు. దిల్లీ సుల్తాన్స్, హరియాణా హ్యామర్స్, ముంబయి మహారథి, పంజాబ్ రాయల్స్, యూపీ దంగల్, ఎంపీ యోధ ఫ్రాంఛైజీలు ఈ వేలంలో పాల్గొంటాయి. ఈ నెల 15న ప్రొ రెజ్లింగ్ లీగ్ ఆరంభం కానుంది. లీగ్‌లో ఇప్పటిదాకా నాలుగు సీజన్లు జరిగాయి. చివరగా 2019లో టోర్నీని నిర్వహించారు.

సుదర్శన్‌కు గాయం.. ఆరు వారాలు దూరం


సాయి సుదర్శన్

దిల్లీ: భారత యువ బ్యాటర్ సాయి సుదర్శన్ ఆరు వారాల పాటు ఆటకు దూరం కానున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో మధ్యప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు బ్యాటర్ సాయి పక్కటెముక విరిగింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చేరుకున్న సాయికి స్కానింగ్ చేయించగా.. కుడివైపు ఏడో పక్కటెముక విరిగినట్లు నివేదికలో తేలింది. దీంతో నెల రోజులకు పైగా అతను ఆటకు దూరమయ్యే అవకాశముందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. సాయి ఐపీఎల్‌కు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. లీగ్‌లో కొన్నేళ్లుగా అతను అతను గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.

వీనస్ అయిదేళ్ల తర్వాత..


వీనస్

మెల్‌బోర్న్: ఏడుసార్లు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ ఛాంపియన్ వీనస్ విలియమ్స్.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పునరాగమనం చేయనుంది. 2021లో చివరిసారిగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలో దిగిన వీనస్.. అయిదేళ్ల తర్వాత మళ్లీ మెల్‌బోర్న్ కోర్టులో మెరవనుంది. ఆమెకు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ లభించింది. 1998లో తొలిసారిగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలో దిగిన వీనస్.. 2003, 2017లలో మహిళల సింగిల్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. రెండు ఫైనల్స్‌లోనూ సోదరి సెరెనా విలియమ్స్ చేతిలో వీనస్ పరాజయం చవిచూసింది. "ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పునరాగమనం పట్ల ఉత్సాహంగా ఉన్నా. టోర్నీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. అక్కడ నాకు అద్భుతమైన జ్ఞాపకాలు ఉన్నాయి. కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడిన ప్రాంతానికి తిరిగి వచ్చే అవకాశం లభించినందుకు కృతజ్ఞతలు" అని 45 ఏళ్ల వీనస్ తెలిపింది. ఈ నెల 18న మెల్‌బోర్న్‌లో ఈ టోర్నీ ప్రారంభంకానుంది. గత ఏడాది యుఎస్ ఓపెన్‌లోనూ వైల్డ్‌కార్డ్ ఎంట్రీతోనే ఆడింది.

సెప్టెంబర్‌లో బంగ్లాకు భారత్!


ఢాకా: ఈ ఏడాది సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్‌లో భారత్ పర్యటించే అవకాశం ఉంది. ఈ టూర్‌లో టీమ్ఇండియా మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడుతుందని బంగ్లాదేశ్ బోర్డు శుక్రవారం తెలిపింది. బీసీసీఐ ఈ పర్యటనకు అంగీకారం తెలిపిందా లేదా అనే స్పష్టత లేదు. భారత్-బంగ్లాదేశ్ సెప్టెంబర్ 1, 3, 6 తేదీల్లో వన్డేలు, 9, 12, 13 తేదీల్లో టీ20ల్లో తలపడతాయని.. ఆగస్టు 28న భారత్ జట్టు తమ దేశానికి చేరుకుంటుందని బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) వెల్లడించింది. బంగ్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో గతేడాది జులైలో బంగ్లాదేశ్‌లో భారత్ పర్యటనను బీసీసీఐ రద్దు చేసింది. తర్వాత ఈ పర్యటనపై ఏ ప్రకటనా చేయలేదు. "2025 ఆగస్టులో రద్దయిన సిరీస్‌కు బదులు భారత్-బంగ్లాదేశ్ మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌లు ఆడేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ, సూత్రప్రాయంగా అంగీకారం తెలిపాయి. త్వరలోనే ఈ సిరీస్‌కు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడిస్తాం" అని బీసీబీ తెలిపింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుస దాడుల నేపథ్యంలో టీమ్ఇండియా ఆ దేశంలో పర్యటించొద్దని మెజారిటీ భారత అభిమానులు కోరుకుంటున్నారు. బంగ్లాదేశ్ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్‌కు ఎంచుకోవడం మీదా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయితే ఇది బంగ్లాదేశ్ ఆటగాళ్లను లీగ్‌కు అనుమతించాలా లేదా అన్నది తమ చేతుల్లో లేని విషయమని బీసీసీఐ అంటోంది.

శ్రీలంక ప్రతిపాదనకు బీసీసీఐ నో

కొలంబో: తమ దేశ పర్యటనలో భారత్ జట్టు రెండు ఛారిటీ మ్యాచ్‌లు ఆడాల్సిందిగా శ్రీలంక క్రికెట్ బోర్డు చేసిన ప్రతిపాదనను బీసీసీఐ తోసిపుచ్చింది. ఈ ఆగస్టులో లంకలో భారత్ రెండు టెస్టులు, రెండు టీ20లు ఆడాల్సి ఉంది. దిత్వా తుపాను బాధితుల సహాయార్థం నిధుల సమీకరణకు భారత్ డిసెంబర్ 27, 29 తేదీల్లో రెండు ఛారిటీ మ్యాచ్‌లు ఆడాలని శ్రీలంక బోర్డు బీసీసీఐని కోరింది. కానీ వాణిజ్యపరమైన ఇబ్బందుల కారణంగా భారత బోర్డు ఈ ప్రతిపాదనను అంగీకరించలేదు. దిత్వా తుపాను కారణంగా శ్రీలంకలో దాదాపు 600 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. లంకకు భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్‌నకు భారత్‌తో కలిసి లంక ఉమ్మడిగా ఆతిథ్యం ఇస్తుంది.

సంఘం శరణం గచ్ఛామి!





ఎంత మందిలో ఉన్నావ్?

రాజేష్ అనేక వాట్సప్ గ్రూపుల్లో సభ్యుడు...

రకరకాల సమాచారాలు చలామణీ చేస్తుంటాడు. ఒక రోజు హఠాత్తుగా ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసింది. అంతా ఆశ్చర్యపోయారు.

ఎందుకు అలా చేశాడు? అని ఎవరో వాట్సాప్ గ్రూపుల్లో ప్రశ్నించారు.

ఏ ఒక్కరి నుంచీ సమాధానం రాలేదు. ఎవరికి వారే తమకు తెలియదంటే తమకు తెలియదని చెబుతూపోయారు.

ఇంతమందితో సంబంధ బాంధవ్యాలు ఉన్న ఆ మనిషికి ఎవరితోనూ మనసు విప్పి మాట్లాడుకునేంత బంధం లేదు.

అందుకే మనకు కావాల్సింది వందల మందితో నెట్‌వర్క్ కాదు.. నలుగురైనా ఆత్మీయులు ఉండటం. చక్కని హృదయపూర్వక సంబంధం. మనసులో విషయాలను పంచుకోగలిగే సాన్నిహిత్యం.

ఊరంతా... అమ్మే!

తూర్పుగోదావరి జిల్లాలో అదో ఊరు.

రాత్రి ఏడు అయ్యేసరికి ఆ వీధి మధ్యలో అటు, ఇటు ఉన్న పెద్ద వీధి అరుగుల ఇళ్ల మీదకు ఆ వీధిలో ఉండేవారంతా చేరేవారు.

ముసలి నుంచి చిన్న వాళ్ల వరకు... ఎన్నో కబుర్లు...వర్తం యోగక్షేమాలు...ఆ ఊరి మంచి చెడ్డలు...అందరి విషయాలూ చర్చకు వచ్చేవి.

ఓ రోజు ఎవరో అన్నారు. వీరమ్మ గారు ఇంకా రాలేదేమిటి అని...

ఊళ్లో మరెవరో అన్నారు. వాళ్లింట్లో వాళ్లంతా పెళ్లికి వెళ్లారు. ఆవిడ పెద్దావిడని రాలేనంటే విడిచి వెళ్లారు. రాత్రికి వచ్చేస్తామన్నారు అని.

అమ్మా సుశీలా ఒకసారి వెళ్లి చూసిరా... మరో పెద్దాయన పురమాయించారు.

ఆమె వెళ్లి చూస్తే వీరమ్మ సాయంత్రం నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారని తెలిసింది. ఒక్కసారిగా అందరూ స్పందించారు.

ఎవరో ఒకరి ఇంట్లో ల్యాండ్ లైన్ ఫోను ఉంటే డాక్టర్ ఉన్నారో లేదో కనుక్కునేందుకు పరుగు తీశారు. మరొకరు రిక్షా తీసుకువచ్చేందుకు సైకిల్ ఎక్కారు.

మరో ఇద్దరు, ముగ్గురు మహిళలు ఆమె దగ్గరకు వెళ్లి పరామర్శిస్తున్నారు. వైద్యుని దగ్గరకు వెళ్లేలా సిద్ధం చేశారు.

ఆఖరికి ఓ పదిమంది కలిసి ఆమెను డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లారు. ఇంకి ఉన్నాయన దగ్గరలో టౌన్‌కు వెళ్లి మందులు తెచ్చారు.

(దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి 'వీధి అరుగు'లో ఓ భాగం...)

కాంటాక్ట్ లిస్ట్ పెద్దగా ఉండటం కాదు... కనెక్టివిటీ ఎంతుందనేది కీలకం.

నలుగురితో కలిసి ఉండటం అత్యవసరమైన ప్రస్తుత పరిస్థితుల్లో
అందరికీ దూరంగా, ఒంటరిగా బతికేస్తే ఎలా?
నీకోసం తపించే నలుగురిని పోగేసుకోకుంటే ఎలా?
డిజిటల్ కనెక్షన్ ఉంది. కానీ మనుషుల కనెక్షన్ లేదు...ఇది ఈ యుగపు ప్రమాదం!
ఈ కొత్త సంవత్సరం వేళ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి.
మన మూలాల్లోకి వెళ్లాలి.
సామాజిక సంబంధాలు బలపరుచుకోవాలి.
ఒకరికి కష్టం వస్తే పదుగురు నిలబడాలి.

- ఈనాడు అమరావతి, ప్రత్యేక విభాగం

మనకు...

చదువు, ఉద్యోగం సేవింగ్స్, ఇన్సూరెన్స్...ఉంటే భరోసా!

ఇప్పుడూ ఇవన్నీ అవసరమే... కానీ సరిపోవు!

ఒకప్పటి కాలం మన ముందుచూపు ప్లాన్‌తో పాటు బంధాలు, అనుబంధాలు, సంబంధాలను కూడా పరికిస్తోంది.

అన్ని సందర్భాల్లోనూ డబ్బు ఉంటేనే అన్నీ సెట్ అవవు. జీవితంలో డబ్బు ఉన్నా తోటి మనిషి లేకుంటే సమస్య మొదలవుతుంది. బంధాలు, అనుబంధాలు, సమాజం కల్పించే భద్రత... మనకు కనిపించని సంపద! ఇది బ్యాంకు పాస్ బుక్కుల్లోనో, బ్యాంక్ స్టేట్‌మెంట్లలోనో... ఏటీఎం కార్డుల్లోనో, ప్రామిసరీ నోట్లలోనో కనిపించదు. కానీ సంక్షోభ సమయాల్లో పనికొచ్చే అతిపెద్ద కరెన్సీ అదే!

మనింట్లో ఏదో ఫంక్షన్ పెట్టుకున్నాం. చుట్టాలు, పక్కాలు ఎవ్వరూ లేకుండా కేవలం మనింట్లో సభ్యులే ఉంటే...

బంధువులంతా సమయానికి అలా వచ్చి ఇలా వెళ్లిపోతే ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించుకోండి.

ఏదో అనుకోని ఉపద్రవం ఏర్పడి... ఇంట్లో ఎవరో చనిపోయారనుకుందాం. పలకరించేవారు, పక్కన కూడా లేకపోతే ఎలా ఉంటుందో ఊహించుకోవటానికి కూడా ఇబ్బంది పడతాం!

ఓ కాలనీలో అన్నీ మధ్య తరగతి కుటుంబాలే...
ఒకరికి కొలువు పోయింది...
ఇంకొకరికి ఆసుపత్రి బిల్లు పెరిగింది
మరొకరికి స్కూల్ ఫీజు సమస్య...
ఒకరు పలానా చోట ట్రై చేయి అంటూ ఉద్యోగ రిఫరెన్స్ ఇచ్చారు
ఇంకొకరు తెలిసిన డాక్టర్‌తో చెప్పించి బిల్లు తగ్గించారు
మరొకరు స్కూల్ కరస్పాండెంట్‌తో మాట్లాడించి... ఫీజు వాయిదాకు ఒప్పించారు.
వీటన్నింటి వెనకా ఉన్నది నమ్మకం. పరస్పర నమ్మకం. అదే అతిపెద్ద సామాజిక పెట్టుబడి. నమ్మకం అత్యంత విలువైన కరెన్సీ

ఎలా పెరుగుతుంది?

ఈ సామాజిక భద్రత డబ్బుతోనో, హోదాతోనో, పదవులతోనో పెరగదు. కమ్యూనిటీ కార్యక్రమాల్లో పాల్గొనటం ద్వారా, మన సేవల్ని ఏదో రూపంలో పంచుకోవటం ద్వారా, నమ్మకం నిలబెట్టుకోవటం ద్వారా పెరుగుతాయి. డబ్బుందనో, హోదా ఉందనో, మరొకటనో అందరికీ దూరంగా ఉండకుండా చుట్టూ ఉన్న సమాజపు కార్యక్రమాల్లో భాగం కావాలి. చుట్టు పక్కల వారితో పరిచయాలు పెంచుకోవాలి. అవసరమైనప్పుడు చేతనైనంత సాయం చేయాలి. అందరితో కలిసిపోవాలి. అందరికీ ఉపయోగపడాలి. మన చుట్టూ ఉన్న సంఘానికి విలువ ఇవ్వాలి. అనుభవాల్ని పంచుకోవాలి. కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి. మాట నిలబెట్టుకోవాలి. భద్రతను వ్యక్తిగతంగానే కాకుండా సామూహికంగానూ పెంచుకోవటం ఈ కాలపు అవసరం.

ఐక్యూనా... ఈక్యూనా!

ఈక్యూ అంటే ఎమోషనల్ కోషెంట్...భావోద్వేగ ఇంటెలిజెన్సీ కుటుంబ బంధాలకు చాలా ముఖ్యమని ప్రముఖ రచయిత డేనియల్ గోల్‌మెన్ అంటారు. బంధాలు బలంగా ఉన్నచోట ఈక్యూ కూడా ఎక్కువగా ఉంటుంది. అవతలి వారి విషయంలో సహానుభూతి, మంచి కమ్యూనికేషన్ ఉంటాయి. దీనివల్ల కుటుంబాల్లో సంఘర్షణ తగ్గుతుంది. సామాజిక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.



మాట.. బంధం..

రెండక్షరాల మంత్రాలు

హెచ్‌ఆర్ నుంచి పిలుపు వచ్చిందంటే అంతే సంగతులనే దశలో...

రాత్రి 10 గంటలకు మెయిల్ వచ్చింది... రేపు హెచ్‌ఆర్‌తో మీటింగ్ అని...

హార్ట్‌బీట్ పెరిగింది. నిద్రపట్టడం లేదు.

ఆ క్షణంలో...

మీ భాగస్వామి "ఉద్యోగం పోయినంత మాత్రాన జీవితం పోయినట్లు కాదు. ఏమైనా ఇద్దరం కలసి చూసుకుందాం.... టెన్షన్ వద్దు!"

– ఆ ఒక్కమాట... మనసును కుదుట పరిచింది. జీవితాన్ని గెలవగలుగుతాననే ధైర్యాన్నిచ్చింది.

అఖిల్ ఇంటర్వ్యూల్లో బాగా చేసినా క్యాంపస్ ప్లేస్‌మెంట్ రాలేదు.

ఫోన్ స్విచాఫ్... సోషల్ మీడియా అకౌంట్లన్నీ బంద్.

ఇంట్లో కంగారు...

ఆ క్షణంలో ఫ్రెండ్‌వాళ్ల అన్నయ్య అఖిల్‌తో మాట్లాడాడు. 'నాక్కూడా ఇలాగే జరిగింది. కొన్నిసార్లు కష్టపడ్డా ఫలితం రాదు. బహుశా ఇంతకంటే మంచిదేదో నీకోసం వేచి చూస్తోందేమో. అందుకే ఇది రాలేదేమో! ట్రై చేసి చూడు'

ఈ సలహా అఖిల్ దారి మార్చింది. వెయ్యి ఏనుగుల బలాన్ని నింపింది. ఈ మార్పు వెనక మనుషులే ఉన్నారు.

నిద్రకు సిద్ధమవుతుండగా...

రాత్రి 11 గంటలకు...

ఫోన్ ట్రింగ్ మంది.

అపార్ట్‌మెంట్ వాట్సప్ గ్రూప్‌లో ఏదో మెసేజ్ వచ్చింది...

అపార్ట్‌మెంటులో అందరికీ తలలో నాలుకలా మెలిగే రాకేశ్ నుంచి వచ్చిందది.

ఏమైనా ఆక్సిజన్ కాంటాక్ట్ ఉందా... అర్జెంట్- అన్నది సారాంశం.

తెలిసిన ఆక్సిజన్ కాంటాక్ట్‌లు ఇచ్చిన వారు కొందరైతే...

ఏమైందని వెంటనే రాకేశ్ ఫ్లాట్‌కు పరుగెత్తినవారు మరికొందరు!

అందుకే... బ్యాంక్ బ్యాలెన్స్ కంటే మన సోషల్ కాంటాక్ట్ బలమైనదై ఉండాలి!

పిల్లలు అమెరికాలో...

తల్లిదండ్రులిద్దరూ హైదరాబాద్‌లో

నిమోనియాతో మంచం పట్టింది పెద్దావిడ...

ఆవిడకు సేవ చేస్తూ కాలుజారి పడగా, తొంటి ఎముక విరిగింది పెద్దాయనకు...

రోజూ పొద్దున్నే వాకింగ్‌కు వచ్చే పెద్దాయన రాకపోవటంతో వాకింగ్ ఫ్రెండ్స్ ఇంటికి వచ్చేసరికి కూలబడి ఉన్నాడాయన. అద్దె పోర్షన్లో వాళ్లను పిలవటంతో అంతా కలసి ఆసుపత్రికి చేర్చారు.

ఇక్కడ ఆదుకున్నది డబ్బు కాదు. బంధాలే!

ముగ్గురూ ముగ్గురే!

1 మనవాళ్లు.... కుటుంబం, స్నేహితులు...

వీళ్లు మన కన్నీళ్లు తుడుస్తారు. భావోద్వేగ రక్షణనిస్తారు. ఇది డబ్బుతో కొనలేనిది. బీమాతో రానిది. జీవితం కూలినప్పుడూ, కుంగినప్పుడూ మనల్ని నిలబెట్టేది వీళ్లే. సమస్యను పరిష్కరించలేకపోవచ్చు... కానీ మనసును కుదుట పర్చగలుగుతారు.

2 పరిచయాలు... సహోద్యోగులు, నెట్‌వర్క్‌లు..

వీళ్లు అవకాశాల తలుపులు తెరుస్తారు. నమ్మకం మీద నిలబడ్డ సంబంధాలు (నెట్‌వర్క్) అక్కరకొస్తాయి. ఆదుకుంటాయి.

3 వ్యవస్థలతో బంధాలు...

ముఖ పరిచయాలు, చిరునవ్వులు పనులను సులభం చేస్తాయి. ఆఫీసుల్లో, బ్యాంకుల్లో, ఆసుపత్రుల్లో అనేక చోట్ల మార్గం చూపిస్తాయి.

ఈ మూడూ లేకపోతే... మన ప్రయాణం ఒంటరిగా మారుతుంది.

వాతావరణ మార్పుల అంచనాలు మరింత దగ్గరగా

కొత్త పరికరం రూపొందించిన ఎన్ఐఓటీ

చెన్నై, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులను ముందుగానే క్షుణ్ణంగా అంచనా వేసేలా చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) సరికొత్త పరికరాన్ని రూపొందించి పరిశీలిస్తోంది. తుపాను, వర్షం, శీతోష్ణ స్థితిలో మార్పులను ముందుగానే నిశితంగా అంచనా వేసేలా 'మిషన్ మౌసమ్' ప్రాజెక్టు కింద సముద్రం నుంచి ఎక్కువ డేటాను పొందేలా ఈ పరికరాన్ని రూపొందించారు. దీనిద్వారా వాతావరణంలో ఏర్పడే మార్పులను సులభంగా అంచనా వేయొచ్చని ఎన్ఐఓటీ సంచాలకులు బాలాజీ రామకృష్ణన్ తెలిపారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న.. సముద్రంలో తేలియాడే పరికరాలు సముద్ర మట్టం నుంచి 3 మీటర్ల ఎత్తులోనే డేటా సేకరించగలవని, కొత్త పరికరం ద్వారా 10-20 కి.మీ. ఎత్తు వరకు గాలి వేగం, దిశ, మేఘాల స్థితి, సముద్ర శీతోష్ణస్థితి మార్పులను అంచనా వేయనుంది. వాతావరణ పరిశోధన కేంద్రానికి కచ్చితమైన వివరాలు అందించవచ్చని, రైతులకు ప్రతి 3 నెలలకు వర్షపాతం గురించి ముందస్తు సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు. ఇప్పటివరకు తేలియాడే పరికరాల్లో సెన్సర్లు అమర్చలేదని, కొత్త విధానంలో సెన్సర్లు అమర్చి వాటిద్వారా డేటాను నిశితంగా పొందేలా అల్గరిథం రూపొందించామన్నారు.

నకిలీ పత్రాలతో నిషేధిత భూముల్ని రిజిస్ట్రేషన్ చేస్తే దస్తావేజు రద్దు

- రిజిస్ట్రేషన్ల చట్టానికి సవరణ చేస్తూ ఉత్తర్వులు జారీ
- ఉద్దేశపూర్వకంగా చేస్తే అధికారులపైనా చర్యలు

ఈనాడు, అమరావతి: నకిలీ పత్రాలతో నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. వాటిని రద్దు చేసే అధికారాన్ని జిల్లా కలెక్టర్ సారథ్యంలోని కమిటీకి అప్పగించింది. రిజిస్ట్రార్ కన్వీనర్‌గా ఉండే కమిటీలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ల చట్టానికి సవరణ చేస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులిచ్చారు. రిజిస్ట్రేషన్ అధికారి ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటారు. ఐజీ అనుమతితో క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

సుమోటోగా విచారణ

◆ 22ఎ, 22బి, 22సి జాబితాలోని నిషేధిత భూముల్ని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే సంబంధిత రిజిస్ట్రార్ సుమోటోగా దస్తావేజు రద్దుకు చర్యలు ప్రారంభించవచ్చు. ఫిర్యాదుదారు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

◆ ఫిర్యాదు అందిన 15 రోజుల్లో రిజిస్ట్రార్ ప్రాథమిక విచారణ చేయాలి. ఆధారాలున్నాయని తేలితే రద్దు చర్యలు ప్రారంభించాలి. ఆధారాలు లేవంటే ఫిర్యాదును తిరస్కరించాలి. అందుకు కారణాలను ఫారం-3లో నిర్వహించే రిజిస్టర్‌లో నమోదు చేయాలి. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలితే.. విచారణ ప్రారంభించి దస్తావేజులో పేర్కొన్న పార్టీలకు నోటీసులు జారీ చేయాలి.

◆ దస్తావేజు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్టర్ అయిందని తేలితే రాతపూర్వకంగా నమోదు చేసి రద్దు ప్రక్రియ కొనసాగించాలి. దాన్ని జిల్లాస్థాయి కమిటీకి పంపాలి.

◆ రిజిస్ట్రార్ నుంచి వచ్చిన విచారణ నివేదికపై 15 రోజుల్లోపు జిల్లా కలెక్టర్ సారథ్యంలోని కమిటీ సమావేశమై.. రిజిస్ట్రార్ ప్రతిపాదనలతోపాటు సంబంధిత పక్షాల నుంచి వచ్చిన సమాధానాలు, సాక్ష్యాలను సమీక్షిస్తుంది. తమ నిర్ణయాన్ని రిజిస్ట్రార్‌కు పంపిస్తుంది.

◆ కమిటీ నిర్ణయం అందిన 7 రోజుల్లో రిజిస్ట్రార్ తుది ఉత్తర్వులు జారీ చేయాలి. దస్తావేజు రద్దు/తిరస్కరణకు సంబంధించిన నిర్ణయాన్ని అన్ని పక్షాలకూ పంపాలి.

◆ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తిస్తే ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) నేరుగా చర్యలు తీసుకోవచ్చు. సంబంధిత పార్టీలకు నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చు. తర్వాత ఆ దస్తావేజు రద్దు లేదా ఫిర్యాదు కొట్టివేస్తూ నిర్ణయం తీసుకోవచ్చు.

◆ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తే దానికి సంబంధించిన ఉత్తర్వులు సబ్ రిజిస్ట్రార్‌కు పంపిస్తారు. ఈ సమాచారాన్ని రెవెన్యూ, పురపాలక, పంచాయతీ అధికారులకు పంపాలి. వారు తమ రికార్డుల్లో (అడంగల్/మ్యుటేషన్) తగిన మార్పులు చేయాలి.

◆ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత 30 రోజుల్లో ఐజీకి అప్పీలు చేసుకోవచ్చు. ఆయన ఆరు నెలల్లో పరిష్కరించి ఉత్తర్వులు జారీ చేయాలి. ఐజీ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే రెవెన్యూ (రిజిస్ట్రేషన్)శాఖ ముఖ్య కార్యదర్శి ఛైర్మన్‌గా ఉండే కమిటీకి అప్పీలు చేసుకోవచ్చు. వారు ఆరు నెలల్లో నిర్ణయం తీసుకోవాలి. కమిటీ నిర్ణయం తీసుకున్న మూడు వారాల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుంది.

◆ ఏదైనా పత్రం నకిలీదని తేలితే.. దాని ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయకూడదు. బుక్‌నంబర్-2లో విధిగా నమోదు చేయాలి. కోర్టు, ట్రైబ్యునళ్లు తాత్కాలిక/శాశ్వత ఎటాచ్‌మెంట్ చేస్తే.. వాటిని రిజిస్ట్రేషన్ చేయకూడదు.

◆ గతంలో రిజిస్టర్ అయిన అమ్మకపు దస్తావేజు రద్దు చేయాలంటే.. క్రయ విక్రయదారులు విధిగా సంతకాలు చేయాలి. పార్టీల మధ్య పరస్పర అంగీకారం తెలిపే డిక్లరేషన్ ఉండాలి. లేదా సివిల్‌కోర్టు, హైకోర్టు లేదా కేంద్ర, రాష్ట్రాలు జారీ చేసిన అధికారిక ఉత్తర్వులు ఉండాలి.

పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది

పాకిస్థాన్‌ను ఉద్దేశించి జైశంకర్ వ్యాఖ్య



చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: ఉగ్రవాదం నుంచి తనను తాను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉందని, ఆ హక్కును ఎలా వినియోగించుకోవాలన్నది ఇతరులు నిర్దేశించలేరని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ఐఐటీ మద్రాస్‌లో శుక్రవారం జరిగిన 'టెక్నో-ఎంటర్‌టైన్‌మెంట్ ఫెస్ట్'లో ఆయన మాట్లాడారు. "చాలా ఏళ్ల కిందట భారత్.. పాకిస్థాన్‌తో నదీజలాల ఒప్పందం చేసుకుంది. పాకిస్థాన్ దశాబ్దాల తరబడి ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది. బంగ్లాదేశ్‌తో మన దేశ సంబంధాలు త్వరలో మెరుగవుతాయి. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో ఎప్పుడూ భాగమే" అని స్పష్టం చేశారు.

నాకు సెలవుల్లేవు: తనకు సెలవులు లేకపోయినా జీవితం సమతుల్యంగానే ఉందని జైశంకర్ చెప్పారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే పనిచేస్తానని తాను చెప్పలేనని శని, ఆదివారాల్లోనూ ప్రపంచం నడుస్తుంది కదా అని పేర్కొన్నారు. స్విచ్ ఆన్, స్విచ్ ఆఫ్‌లాగా పనిలో విరామం తీసుకోలేనని, విశ్రాంతి కోసం సంగీతం వింటానని, పుస్తకాలు చదువుతానని, సినిమాలు, క్రీడలు చూస్తానని తెలిపారు. మొత్తానికి తన జీవితం సమతుల్యంగా ఉందని చెప్పారు. అయితే ఈ విషయంలో ఇక్కడే కూర్చుని ఉన్న తన సతీమణి విభేదించవచ్చని పేర్కొన్నారు.

నకిలీ మద్యం గురించి తెలియదు!

ఎక్సైజ్ పోలీసుల విచారణలో జోగి రమేష్

ఈనాడు, అన్నమయ్య: ములకలచెరువు నకిలీ మద్యం గురించి తనకేమీ తెలియదని మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్ పోలీసు విచారణలో పేర్కొన్నారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దన్‌రావుతో చిరకాలంగా పరిచయం ఉందని, ఇద్దరి మధ్య వ్యాపార లావాదేవీలున్నాయని అంగీకరించినట్లు సమాచారం. ఈ కేసులో నిందితులైన మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాములను ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. విజయవాడ జైల్లో ఉన్న ఇద్దరినీ ఉదయం 11.30 గంటలకుఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. వారిని సిట్, ఎక్సైజ్ అధికారులు వేర్వేరుగా విచారించారు. జనార్దన్‌రావుతో కలిసి ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేయడానికి కారణాలేమిటి? ఈ కుట్రలో తెరవెనుక ఎవరున్నారు? రాజకీయ కోణమేమైనా ఉందా అని ప్రశ్నించారు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ విషయం తనకేమీ తెలియదని, జనార్దన్‌రావే అంతా చేశారని జోగి రమేష్ చెప్పుకొచ్చారు. బ్యాంకు ఖాతాల వివరాలు చూపించి నగదు చెల్లింపులపై ప్రశ్నించగా మౌనం వహించారు. పలు ప్రశ్నలకు తనకు జ్ఞాపకం లేదని, జనార్దన్‌రావుకు అంతా తెలుసని ఆయనపై నెపం నెట్టేసే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. జోగి రాము మాత్రం అంతా తన సోదరుడు జోగి రమేష్ చెప్పినట్లు నడుచుకున్నానని, ఈ విషయంలో నిమిత్తమాత్రుడినంటూ విచారణలో సమాధానం ఇచ్చారు. కుటుంబంలో ఏనాడూ తాను స్వతహాగా పని చేయలేదని, రమేష్ సూచనల మేరకు నడుచుకున్నానని వివరించారు. నకిలీ మద్యమా కాదా అన్నది కేసు నమోదు చేసే వరకు తనకు తెలియదని చెప్పినట్లు తెలిసింది. వీరిద్దరినీ సిట్, ఎక్సైజ్ అధికారులు మరో రెండు రోజుల పాటు విచారించనున్నారు.

అమ్మో.. చిరుత మళ్లీ వచ్చిందేంటి!

రెండోసారి అదే ఇంటి ఆవరణలో సంచారం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలం శివారు ప్రాంతంలోని పాతాళగంగ మెట్ల వైపు ఉన్న సత్యనారాయణ ఇంటి వద్దకు రెండోసారి గురువారం అర్ధరాత్రి చిరుత రావడంతో భయాందోళన నెలకొంది. గత ఏడాది తొలిసారి చిరుత సంచరించడంతో యజమాని ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చుకున్నారు. తాజాగా గురువారం కూడా చిరుత సంచార దృశ్యాలు ఇందులో నమోదయ్యాయి.



ఆగస్టు వరకు ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు

ఈనాడు, అమరావతి: ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను ఆగస్టు వరకు క్లియర్ చేసినట్లు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈవో దినేష్ కుమార్ తెలిపారు. ఉద్యోగుల వైద్య బిల్లులు, హెల్త్ కార్డులు, నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల్లో చికిత్సలపై ఉద్యోగ సంఘాల నేతలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "అన్ని క్లెయింలను వీలైనంత త్వరగా పరిష్కరించి పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 14 నెలలుగా మెడికల్ బిల్లులు పెండింగ్‌లో ఉంటే ఆగస్టు వరకు అన్నీ క్లియర్ చేశాం. ఇకపై ఈహెచ్‌ఎస్‌కు సంబంధించిన మొత్తం సమాచారం, మెడికల్ బిల్లుల తాజా పరిస్థితిని వాట్సప్ ద్వారా మొబైల్ ఫోన్లకు పంపిస్తాం. ఆన్‌లైన్ పోర్టల్‌లోనూ సమాచారం ఉంటుంది. ఎలాంటి పెండింగ్ బిల్లులు లేకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. మరోవైపు ఈహెచ్‌ఎస్ ఆరోగ్య కార్డుల్లో మార్పులు, చేర్పులను ఉద్యోగులు ఆన్‌లైన్‌లోనే చేసుకునేలా అవకాశం కల్పించారు.

దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి అనుమతి

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పోర్టు అభివృద్ధికి 2 వేల ఎకరాల సేకరణ

ఈనాడు, అమరావతి: తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో కొత్త పోర్టు, నౌకా నిర్మాణ క్లస్టర్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఏపీ మారిటైం బోర్డుకు అనుమతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఓడరేవులు, జలమార్గాల మంత్రిత్వ శాఖ షిప్‌బిల్డింగ్ డెవలప్‌మెంట్ పథకంలో భాగంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రాజెక్టు అమలుకు అవసరమైన 2 వేల ఎకరాలను సేకరించేందుకు మారిటైం బోర్డుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ మారిటైం బోర్డు సీఈవోను ప్రభుత్వం ఆదేశించింది.

◆ దుగరాజపట్నంలో పోర్టు, షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌లో ఒక యాంకర్ షిప్‌యార్డు (ఏడాదికి 0.5 మిలియన్ టన్నుల స్థూల రవాణా) ప్రారంభించినప్పటి నుంచి పదేళ్లలో నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలి.

◆ రైట్స్ సంస్థ టెక్నో ఎకనమిక్ ఫీజుబులిటీ రిపోర్టు ఆధారంగా పోర్టు ఏర్పాటుకు నిర్ణయం.

◆ ఏపీ మారిటైం బోర్డు, విశాఖ పోర్టు ట్రస్టు సమన్వయంతో ప్రాజెక్టు అమలు.

◆ ఈ ప్రాజెక్టు దేశ షిప్‌బిల్డింగ్ రంగాన్ని బలోపేతం చేయడంలో దోహదం. మారిటైం ఇండియా విజన్ 2030, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ఏర్పాటు.

◆ కేంద్ర మంత్రిత్వ శాఖ నిబంధనల మేరకు విశాఖ పోర్టు ట్రస్టుతో కలిపి ఎస్‌పీవీ ఏర్పాటు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం, విశాఖ పోర్టుకు సమాన వాటా. బోర్డు డైరెక్టర్లలో ఇరువురికీ సమాన అవకాశం.

◆ ప్రాజెక్టు అమలుకు సేకరించిన భూములను ఎస్‌పీవీకి బదిలీ చేసేందుకు అనుమతి. వాటిని రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీ కింద పరిగణించాలని నిర్ణయం.

◆ పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా షిప్‌యార్డు అభివృద్ధికి భాగస్వామ్య సంస్థను మారిటైం బోర్డు ఎంపిక చేస్తుంది.

7 నుంచి రెండో విడత భూ సమీకరణ పనులు

తుళ్లూరు (ఏఎన్‌యూ), న్యూస్‌టుడే: రాజధాని అవసరాల కోసం ఈ నెల 7వ తేదీ నుంచి రెండో విడత భూ సమీకరణ పనులు ప్రారంభిస్తామని మంత్రి నారాయణ చెప్పారు. రాజధాని గ్రామాల అభివృద్ధిలో భాగంగా తుళ్లూరు మండలం నేలపాడు, మల్కాపురాల్లో నిర్వహించిన గ్రామసభలకు మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, సీఆర్‌డీఏ అధికారులు హాజరయ్యారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇంటింటికి తాగునీటి పైప్‌లైన్లు, 24 గంటల తాగునీటి సరఫరా, వీధిలైట్లు, డ్రైనేజీ పనులను చేపడుతున్నట్లు సీఆర్‌డీఏ అధికారులు వివరించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో రాబోయే ఆరు నెలల్లో అభివృద్ధి పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ప్రజల సహకారంతో, వారు సూచించిన విధంగా ఇక్కడ పనులు చేపడతామని సీఈ ధనుంజయ్ చెప్పారు. 2058 నాటి జనాభా అవసరాలను దృష్టిలోపెట్టుకుని అనుగుణంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు ఒక్కో గ్రామానికి రూ.10 నుంచి రూ.10.50 కోట్ల వరకు ఖర్చు అవుతోందన్నారు. గ్రామస్థులు అడిగినవన్నీ నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



మల్కాపురంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

సమస్యలు పరిష్కరించాలని కోరిన గ్రామస్థులు: పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. సీఆర్‌డీఏ ఇచ్చిన స్థలాలకు రోడ్డు పోటు ఉందని వాటిని మార్చాలని, గ్రామ కంఠాల సమస్యలు తీర్చాలని, పూలింగ్‌కు ఇవ్వని ప్రాంతాల్లో ప్లాట్లు వచ్చాయని.. ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి నారాయణ దృష్టికి తీసుకొచ్చారు.


నెమ్మదిగా శ్వాస తీసుకోవడాన్ని సాధన చేయండి



శ్వాస నెమ్మదిగా తీసుకోవడం (నిమిషానికి 5/6 సార్లు గాలి పీల్చి వదలడం) ద్వారా కలిగే ప్రయోజనాలు:
✦ మొదటి నిమిషం పూర్తయ్యేసరికి హృదయ స్పందన రేటు తగ్గుతుంది. ✦ మూడు నిమిషాల్లోపు గుండె, మెదడుకు సమాచారాన్ని చేరవేసే వేగస్ నాడి మరింత చురుగ్గా మారుతుంది. ✦ అయిదు నిమిషాలయ్యేసరికి శరీరంలో కార్టిసాల్ తగ్గి ఆందోళన మాయమవుతుంది. ఈ ప్రక్రియను రోజూ సాధన చేస్తే రక్తపోటు నియంత్రణలో ఉండటంతో పాటు నిద్ర మెరుగవుతుంది. – శ్రద్ధ కటియార్, వైద్య నిపుణులు

భూసమస్యలపై మంత్రులు, కలెక్టర్లు చొరవ తీసుకోవాలి

- పాసుపుస్తకాల పంపిణీపై విదేశాల నుంచి చంద్రబాబు సమీక్ష



ఈనాడు, అమరావతి: భూమిని ప్రాణంగా భావిస్తూ బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వ తప్పిదాలతో ప్రతి గ్రామంలో రెవెన్యూ సమస్యలు పట్టి పీడిస్తున్నాయని గుర్తుచేశారు. భూవివాదాలను నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించడానికి మంత్రులు, కలెక్టర్లు చొరవ తీసుకోవాలని నిర్దేశించారు. నూతన సంవత్సర కానుకగా రాజముద్రతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. విదేశీ పర్యటనలో ఉన్న చంద్రబాబు శుక్రవారం అక్కడి నుంచే పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీపై మంత్రులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 'గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి, ప్రజల్ని అభద్రత నుంచి దూరం చేశాం. వైకాపా ప్రభుత్వంలో వివాదాల్లేని స్థలాల్ని కూడా రీసర్వే పేరుతో వివాదాస్పదం చేశారు. అప్పటి సీఎం భూహక్కు పత్రాలపై తన బొమ్మలకు రూ.22 కోట్లు తగలేశారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి రాజముద్రతో 22 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆయనకు వివరించారు. రీసర్వే తప్పులు సరిదిద్ది, కొత్త పాసుపుస్తకాలు ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు 9వ తేదీ వరకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

రెవెన్యూలో సంస్కరణల అమలు

రీసర్వే సమస్యల్ని పరిష్కరించడంతోపాటు 2027 నాటికి భూవివాదాలకు శాశ్వత ముగింపు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఏఐ ఆధారిత డిజిటలైజేషన్ ద్వారా రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయడంలో భాగంగా అడంగల్, ఎఫ్ఎంబీ, 22(ఎ) రిజిస్టర్లు, డీకేటీ, సీలింగ్, కోర్టు కేసుల వివరాలన్నీ డిజిటల్ వ్యవస్థలోకి తెస్తున్నామని ఒక ప్రకటనలో వివరించారు. తప్పుడు రిజిస్ట్రేషన్ల రద్దుకు కలెక్టర్లకు అధికారాలతో పాటు ప్రైవేట్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే చట్ట సవరణ తీసుకొచ్చామని వివరించారు. రెవెన్యూ సంస్కరణలంటే పత్రాల మార్పు కాదని, రైతులకు భూమిపై నమ్మకం కల్పించి, భవిష్యత్తు ఇవ్వడమే అని పేర్కొన్నారు.

రీ సర్వేలో దేశంలోనే ఏపీ మొదటిస్థానం

- కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



పట్టాదారు పాసుపుస్తకం అందజేస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, చిత్రంలో డీసీసీబీ ఛైర్మన్ మల్లికార్జునరావు, ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: 'దేశంలో భూసంస్కరణలకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇది నా శాఖ పరిధిలోనే ఉంది. నేను రాకముందే రీసర్వేను దేశవ్యాప్తంగా ప్రారంభించింది. ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది' అని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో శుక్రవారం జరిగిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'ఒకప్పుడు చైన్ ద్వారా భూమిని కొలిచేవారు. ప్రస్తుతం డ్రోన్, రోవర్ ద్వారా కచ్చితంగా కొలిచి హద్దులు ఇస్తున్నారు. ఇందులో ఏపీ ముందుండడంతో కేంద్రం రాష్ట్రానికి రూ.400 కోట్ల ప్రోత్సాహకాన్ని ఇచ్చింది. పాసుపుస్తకంపై జగన్ బొమ్మ చూసి చాలామంది బాధపడ్డారు. అందుకే సీఎం చంద్రబాబు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందిస్తున్నాం' అని తెలిపారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

6700 గ్రామాల్లో రీసర్వే పూర్తి

సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఆర్. కూర్మనాథ్ మాట్లాడుతూ 'గతంలో చేపట్టిన రీ సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సభలు నిర్వహించాం. మొత్తంగా 7.50 లక్షల అర్జీలు వచ్చాయి. రీసర్వేలోని తప్పిదాలను సవరిస్తూ జాయింట్ ఎల్పీఎం, సంబంధిత తప్పులు లేకుండా రాజముద్రతో నిజమైన హక్కుదారులకు వారి పేరుతో పాసుపుస్తకాలు ఇస్తున్నాం. రాష్ట్రంలో 6,700 గ్రామాల్లో రీసర్వే చేశాం' అని తెలిపారు.

అర్జీ ఆగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఆదేశాలిచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఉద్దేశపూర్వక జాప్యం చేసినా, రెవెన్యూ/రిజిస్ట్రేషన్ దస్త్రాల్ని అప్‌డేట్ చేయక పోయినా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా భావించి వివరణ కోరతారని స్పష్టం చేశారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని ఆ అధికారాలను కలెక్టర్లకు అప్పగించారు. రెవెన్యూ సదస్సుల, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో వివిధ రకాల భూసమస్యలపై అర్జీలు వస్తున్నాయి.. వాటి పరిష్కారంలో భాగంగా వాటి అనువర్తనాలు తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు ఇచ్చారు. నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ప్రభుత్వ సంకల్పమని మార్గదర్శకాలు తెలిపారు. ప్రజా సంతృప్తి కొలమానం అనే విషయాన్ని రెవెన్యూ అధికారులు, అర్జీలు, సంయుక్త కలెక్టర్లు, కలెక్టర్లు గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. మార్గదర్శకాలకు అనుగుణంగా స్థాయిలు, రిజిస్ట్రేషన్లు, సీఎంఎఫ్ విభాగాలు వెంటనే సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

22ఎ అర్జీలన్నీ 3 నెలల్లో పరిష్కరించాల్సిందే

తమ భూముల్ని 22ఎ జాబితా నుంచి తొలగించాలంటూ వచ్చిన అర్జీలన్నీ మూడు నెలల్లో తప్పనిసరిగా పరిష్కరించాల్సిందే. రెటిఫ్ చేసిన వాటిని తిరస్కరించకూడదు. చట్టం, నిబంధనలు, ప్రభుత్వ ఆదేశాలు సహా స్పష్టమైన కారణాలు ఉదహరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి.

- నిర్దేశించిన 10 రకాల పత్రాల్లో ఏ ఒక్కటి ఉన్నా వాటి ఆధారంగా 22ఎ జాబితా నుంచి తొలగించవచ్చు. రకరకాల పత్రాలు, వాటి రికార్డులు కావాలని పట్టుబట్టకూడదు. ఒక రికార్డును పక్కన పెట్టాలంటే.. సంబంధిత అధికారి మెరిట్ ప్రాతిపదికన నిర్ణయం తీసుకోవాలి.
- 10 సంవత్సరాల కంటే ముందు ఎస్టేట్‌మెంట్ జరిగి, నిర్దేశిత పత్రాలుంటే జేసీ వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. నిర్దేశిత పత్రాలున్నా 22ఎ (1)(ఈ) కింద ఉంటే కలెక్టర్ సిఫారసులతో ప్రభుత్వానికి పంపాలి. ప్రైవేటు పట్టా భూముల్ని ఆటోమేటిగ్గా తొలగించాలి. ఒక సర్వే నంబరు మొత్తాన్ని పొరపాటుగా చేర్చితే తొలగించాలి. అవసరమైనా సబ్‌డివిజన్ విస్తీర్ణం చేర్చాలి.
- 22ఎ జాబితా నుంచి తొలగించే అధికారం ఆర్డీవోకు ఉంటుంది. ఆర్డీవో ఉత్తర్వులపై 30 రోజుల్లో జేసీకి అప్పీల్ చేసుకోవచ్చు. 22ఎ జాబితాలో చేర్చే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది. వీటిపై ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

పోరంబోకు భూముల్ని ఏడబ్ల్యూ, ఏయూడబ్ల్యూగా మార్చాల్సింది ఆర్డీవోలే

గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు అప్పగించని పోరంబోకు భూముల్ని ఎస్ఏ/ ఎస్ఏ వెస్ట్ భూములుగా మార్చే అధికారం ఆర్డీవోకే ఇచ్చారు. నీటి వనరుల హానికి సంబంధించిన పోరంబోకు భూముల సర్వేలను ప్రభుత్వ ఆదేశం లేకుండా మార్చకూడదు. 10 ఏళ్లకు ముందే కలెక్టర్ల వాటిని ఎస్ఏ చేసి ఉంటే రద్దు చేయకూడదు. ప్రత్యేకంగా పరిష్కరించాలి.

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తోనే వారసత్వ భూముల రిజిస్ట్రేషన్

వారసత్వ భూముల (వ్యవసాయ) రిజిస్ట్రేషన్ చేయాలంటే కుటుంబసభ్యుల (ఫ్యామిలీ మెంబర్) సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. వాటితో వాస్తవమెంత తెలుసుకునేందుకు అన్ని సర్టిఫికేషన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందుబాటులో ఉండాలి. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక ఆటోమ్యుటేషన్ చేయాలి. వెంటనే వెబ్‌ల్యాండ్‌లో ఆ భూముల వివరాలు కనిపించాలి.

రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో పెడితే కారణాలు లిఖితపూర్వకంగా ఇవ్వాలి

అన్ని రిజిస్ట్రేషన్ చేయకుండా రెవెన్యూ సమస్యలతో పెండింగ్‌లో పెడితే అందుకు కారణాల్ని తెలియజేయాలి. నోటీసుకాగా కాకుండా ప్రింట్ తీసి ఇవ్వాలి. ఆర్జీదారు ప్రతీరిజిస్ట్రేషన్ సేవలు అందించాలి.

మూడు నెలల్లో పూర్తి చేయాలి

- అన్ని ప్రైవేటు నోషనల్ ఖాతాల్ని రెగ్యులర్ ఖాతాలుగా మార్చాలి. ప్రైవేట్ భూములకు వర్తించే సేవల న్నింటికి వాటికి అందుబాటులో ఉండాలి.
- సున్నా ఖాతాల్ని ఆర్వోఆర్ చట్ట నిబంధనల ప్రకారం రెగ్యులర్ ఖాతాలుగా మార్చాలి. మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలి.
- వెబ్‌ల్యాండ్‌లో డూప్లికేట్ సర్వే నంబర్లు సవరించాలి. ఒకే సర్వే నంబరు (/), (-)తో సృష్టిస్తే వాటిని తహసీల్దార్లు తొలగించాలి.

అధికారాల బదలాయింపు

వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ నంబరు మార్చాలన్నా ఇప్పుడు జేసీ వద్దకే వెళ్లాల్సి వస్తోంది. చనిపోయిన పట్టాదారుల ఖాతా నంబర్లు తొలగించి వారసుల పేర్లు పొందుపరచాలన్నా ఆయనే చేయాలి. కొన్ని అంశాల్లో ఎవరు నిర్ణయం తీసుకోవాలనే స్పష్టత కూడా లేక పెద్దఎత్తున దరఖాస్తులు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి. దీంతో అధికారాలు అప్పగించడంతోపాటు ఇప్పటి వరకు జేసీ వద్ద ఉన్న వాటిని తహసీల్దార్లకు బదలాయిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మార్గదర్శకాలు ఇచ్చారు. సైనికులు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు భూమి కేటాయింపు, ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మార్చే అధి కారాల్ని సంయుక్త కలెక్టర్లకే కొనసాగించారు.

జేసీ నుంచి తహసీల్దార్లకు: ఒక పట్టాదారు ఒకే గ్రామంలో ఒకటికి మించిన ఖాతాలుంటే వాటిని తొలగించాలి. చనిపోయిన పట్టాదారుల ఖాతా నంబర్లు తొలగించి వారసుల పేర్లతో వాటిని నమోదు చేయాలన్నా ఇప్పుడు వరకు జేసీ వద్దనే అధికారాలున్నాయి. వీటిని తహసీల్దార్లకు బదలాయిస్తున్నారు.

- ప్రైవేటు నోషనల్ ఖాతాల్ని శాశ్వత ఖాతాలుగా మార్చడం, ఆర్ఓఆర్ చట్టం ప్రకారం సున్నా ఖాతాల్ని శాశ్వత ఖాతాలుగా మార్చు, డూప్లికేట్ సర్వే నంబర్ల తొలగింపు, భూముల వర్గీకరణ, కోర్టు ఆదేశాల అమలు (సివిల్/రెవెన్యూ కోర్టులు), భూకేటాయింపులు, భూసేకరణ, ఎసైన్‌మెంట్, ఆర్ఓఆర్ నంబరు సవరణ తదితర అధికారాలు జేసీ నుంచి తహసీల్దార్లకు ఇచ్చారు.

జేసీ నుంచి ఆర్డీవోకు: రీసర్వే గ్రామాల్లో ఎల్పీఎం, భూమి స్వభావం సవరణ, ఆర్ఓఆర్‌తో పోలిస్తే వాస్తవ విస్తీర్ణంలో తేడాల్ని సరిచేయడం, ఖాతా నంబర్లలో తప్పుగా అనుసంధానించిన ఎల్పీఎంలు సవరించడం తదితర అంశాలు ఇప్పటి వరకు జేసీ వద్ద ఉండగా ఇక నుంచి సబ్‌కలెక్టర్/ ఆర్డీవోలకు అప్పగించారు. దరఖాస్తు ద్వారా ఇప్పటికే ఉన్న ఎల్పీఎంలు కలపడం, తొలగించడం, సర్వే నంబర్ల గల్లంతు, భూమి స్వభావం, వర్గీకరణలో మార్పులు, వివాద రిజిస్టర్‌లో చేర్చడం, తొలగింపుల అధికారాలు ఆర్డీవోలకు ఇచ్చారు.

గ్రామ/వార్డు సచివాలయాల్లో కొత్త మ్యుటేషన్ సేవలివే

- కోర్టు ఆదేశాలకు సంబంధించిన మ్యుటేషన్లు
- 2000వ సంవత్సరం ముందు రిజిస్టరైన లావాదేవీలు
- ఎసైన్డ్ వారసులకు మ్యుటేషన్ (ఇతర వారసత్వ కేసులూ)
- గల్లంతైన/ డూప్లికేట్ సర్వే నంబర్ల జోడింపు, తొలగింపు
- ఒక గ్రామంలో పట్టాదారుకు ఒకటికి మించిన ఖాతాలు ఉంటే వాటిని తొలగించడం, వారసుల పేర్ల నమోదు చేయడం

రీసర్వేతో భూ వివాదాలకు స్వస్తి

- మంత్రి అనగాని సత్యప్రసాద్

కొల్లూరు, న్యూస్‌టుడే: భూ వివాదాలతో రైతులు, అధికారులు న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. భావితరాలకు నిరిష్టమైన హక్కుపత్రాలు అందజేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రీసర్వేను ప్రారంభించిందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం దోనేపూడిలో రీసర్వే పూర్తిచేసిన భూముల రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేసే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, సులువుగా భూముల వివరాలను తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి.. ఎవరి ఫొటోలు లేని రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్నాం. రాష్ట్రంలో 17,500 రెవెన్యూ గ్రామాలున్నాయి. వాటిలో భూవివాదాలు కోకొల్లలు. వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తోంది'' అని తెలిపారు.

- సీసీఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటివరకు రీసర్వే చేసిన భూములకు క్యూఆర్ కోడ్‌తో కూడిన 21.86 లక్షల పాసుపుస్తకాలను, వెబ్‌ల్యాండ్‌తో కూడిన వివరాలతో ముద్రించినట్లు తెలిపారు. వీటిని త్వరలోనే రైతులకు అందజేస్తామని తెలిపారు. రీసర్వేతో పాటు రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అనగాని సత్యప్రసాద్ తరచూ సమీక్షలు చేసి తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారని.. అందుకు అనుగుణంగానే రెవెన్యూ శాఖలో కీలక మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి వెస్ట్‌బైపాస్‌లో.. కాజ-గొల్లపూడి మధ్య ఒకవైపు కార్లు, బైక్‌లకు అనుమతి

- చిన్నఅవుటపల్లి, ఏలూరు వైపు వెళ్లేందుకు అవకాశం
- బైపాస్‌లో పాక్షికంగా పరుగులు పెట్టనున్న వాహనాలు
- నెలాఖరుకు గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలు హాయ్‌ల్యాండ్ రోడ్డులో దిగేలా ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి: సంక్రాంతి వేళ..విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కాజ నుంచి గొల్లపూడి వరకు ఒకవైపు వాహనాలు పరుగులు పెట్టనున్నాయి. మొదట కార్లు, ద్విచక్ర వాహనాలను ఈ మార్గంలో వెళ్లేందుకు అవకాశం కల్పిస్తారు. దీంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఈ బైపాస్ మీదుగా నేరుగా గొల్లపూడి, అక్కడి నుంచి చిన్నఅవుటపల్లి మీదుగా ఏలూరు వైపు వెళ్లవచ్చు. ఈ మేరకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాక్షికంగా ఒకవైపు వాహనాలు వెళ్లేలా చూడనున్నారు.

- వెస్ట్ బైపాస్‌లో భాగంగా కాజ-గొల్లపూడి మధ్య 17.88 కి.మీ., గొల్లపూడి-చిన్నఅవుటపల్లి మధ్య 30 కి.మీ. ఆరు వరుసల హైవే నిర్మాణం చేపట్టారు. ఇందులో గొల్లపూడి-చిన్నఅవుటపల్లి మధ్య నిర్మాణం పూర్తికాగా నవంబరు నుంచి ఇందులో అన్ని వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నారు.
- ఇప్పుడు కాజ-గొల్లపూడి మధ్య కూడా ఒకవైపు వాహనాలను అనుమతించనున్నారు. తొలుత కాజ నుంచి గొల్లపూడి వైపు (ఒకవైపు) మార్గాన్ని సంక్రాంతికి సిద్ధం చేస్తున్నారు.
- చెన్నై-కోల్‌కతా హైవేకు ఈ వెస్ట్ బైపాస్‌లోకి అనుసంధానం అయ్యే పనుల్లో ఒకవైపు పూర్తయ్యాయి. దీంతో చెన్నై, ఒంగోలు, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలను కాజ సమీపంలో వెస్ట్ బైపాస్‌లోకి వెళ్లి.. గొల్లపూడి చేరుకొని, అక్కడ విజయవాడ-హైదరాబాద్ హైవేలో కలవవచ్చు. ఏలూరు వైపు వెళ్లే వాహనాలు గొల్లపూడి వద్ద దిగకుండా నేరుగా చిన్నఅవుటపల్లి మీదుగా ఏలూరు రోడ్డుపైకి చేరుకోవచ్చు.
- దీనివల్ల గుంటూరు వైపు నుంచి వచ్చే కార్లు.. విజయవాడ నగరంలోకి రావాల్సి అవసరం లేకుండానే బైపాస్‌లో ఒకవైపు ప్రయాణించి హైదరాబాద్ వైపుగాని, ఏలూరువైపు వెళ్లవచ్చు. ఇందుకు వీలుగా సంక్రాంతి నాటికి అధికారులు పనులు పూర్తి చేయనున్నారు.

నెలాఖరుకు హాయ్‌ల్యాండ్ రోడ్డు వరకు..

- వెస్ట్ బైపాస్‌లో అటు ఏలూరు, గొల్లపూడి వైపు నుంచి వచ్చే కార్లు, బైకులు తదితర వాహనాలను ప్రస్తుతం రాష్ట్ర సచివాలయం, హైకోర్టులకు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ వాహనాలు కృష్ణా నది వంతెన, సీడ్ యాక్సెస్ రోడ్డు దాటిన తర్వాత వచ్చే టోల్ ప్లాజా సమీపంలో మంగళగిరి-మందడం రోడ్డులోకి చేరుకొని, అక్కడి నుంచి సచివాలయం వైపు వెళ్తున్నాయి.
- ఇలా గొల్లపూడి వైపు నుంచి వాహనాలను ఈ నెలాఖరుకు హాయ్‌ల్యాండ్ రోడ్డు వరకు అనుమతించేలా బైపాస్‌లో రెండో వైపు కూడా పనులు పూర్తిచేయనున్నారు.
- వెస్ట్ బైపాస్ నుంచి హాయ్‌ల్యాండ్ రోడ్‌లో దిగే వాహనాలు..చెన్నై-కోల్‌కతా హైవే సర్వీస్ రోడ్డులోకి వెళ్తాయి.

ఏప్రిల్ నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు

మార్చి నెలాఖరులోపు వెస్ట్ బైపాస్‌లో పెండింగ్ పనులన్నీ పూర్తిచేయనున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి చెన్నై-కోల్‌కతా హైవేపై వెళ్లే అన్ని వాహనాలను.. వెస్ట్ బైపాస్ మీదుగా ఇరువైపులా పూర్తిస్థాయిలో రాకపోకలు సాగించేలా అనుమతిస్తారు. అధికారికంగా ఆనాటి నుంచే వెస్ట్ బైపాస్ పూర్తిగా తెరిచినట్లు అవుతుందని, అప్పటి వరకు చిన్న వాహనాలను ప్రయోగాత్మకంగానే వదులుతామని అధికారులు చెబుతున్నారు. ఈ బైపాస్‌లో కృష్ణానదిపై లైటింగ్ ఏర్పాటు చేయగా, పాలవాగు, కొండవీటి వాగుల వద్ద నిర్మించిన వంతెనలు, ఇతర అండర్‌పాస్‌ల వద్ద కూడా..వంతెనలకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు.

పారామోటరింగ్‌లో ఆమ్రపాలి



ఈనాడు, విశాఖపట్నం: విశాఖపట్నంలోని రుషికొండ వద్ద ఉన్న సాహస పర్యాటక విన్యాసాలను ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఎండీ ఆమ్రపాలి పరిశీలించారు. శుక్రవారం విశాఖ వచ్చిన ఆమె రుషికొండ బీచ్‌ను తనిఖీ చేశారు. జల విన్యాసాలు, బోటింగ్, స్కూబా డైవింగ్ వంటి జల క్రీడల నిర్వహణపై ఆరా తీశారు. సందర్శకులకు ఏ రకమైన భద్రత కల్పిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. బ్లూఫ్లాగ్ బీచ్‌ను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను ఆదేశించారు. అనంతరం బీచ్‌లో నిర్వహిస్తున్న పారామోటరింగ్ విన్యాసాలను పరిశీలించి, పారామోటరింగ్ చేశారు.

వచ్చే విద్యా సంవత్సరంలో 1-8 తరగతుల సిలబస్ మార్పు

ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌కు అనుగుణంగా రూపకల్పన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 1-8 తరగతుల సిలబస్‌ను పాఠశాల విద్యాశాఖ మార్పు చేస్తోంది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఈ మార్పులను చేపట్టింది. 1-5 తరగతులకు సంబంధించి 40% సిలబస్ మారుతుండగా.. 6,7,8 తరగతుల్లో పూర్తి సిలబస్‌లో మార్పు చేస్తోంది. దీనికి సంబంధించిన కసరత్తును రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ) చేపట్టింది. రాష్ట్రంలో జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) సిలబస్‌ను ఇప్పటికే అమలు చేస్తుండగా, ఎన్‌సీఈఆర్టీ ఇటీవల సిలబస్‌ను మార్పు చేసింది. దీనికి అనువుగా పాఠ్యపుస్తకాలను మార్పు చేస్తున్నారు. 6,7,8 తరగతుల్లో తెలుగు, హిందీ సబ్జెక్టుల్లో మార్పులు పెద్దగా ఉండవు. సాంఘికశాస్త్రంలో చరిత్ర, భౌగోళశాస్త్రాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్పు చేస్తారు. మిగతా సబ్జెక్టుల్లో ఎన్‌సీఈఆర్టీ సిలబసే ఉంటుంది. ప్రశ్నల విధానంలోనూ మార్పు చేస్తున్నారు. నేరుగా జవాబు రాసేలా కాకుండా పాఠ్యపుస్తకం మొత్తం చదివితేనే ప్రశ్నలకు జవాబులు రాసేలా విధానాన్ని తెస్తున్నారు.

సంవత్సరాంతంలో పశ్చాత్తాపపడొద్దంటే..



కొత్త ఏడాది ఆరంభంలో అందరూ ప్రణాళికలు వేసుకోవడం, లక్ష్యాలు విధించుకోవడంపై ఎంతో ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే ప్రణాళికలు వేసుకుంటున్నప్పుడు ఉత్సుకత, ఉత్సాహం కలుగుతాయి. కానీ వాటి ఆచరణ మొదలుపెట్టేసరికి చాలా క్లిష్టంగా అనిపిస్తుంది. దీంతో చాలా మంది కొన్ని రోజులకే తమ లక్ష్యాలను గాలికొదిలేస్తుంటారు. మీరు అలాంటి ఆరంభశూరుల సమూహంలో చేరకుండా, స్థిరత్వంతో శ్రమిస్తేనే కోరుకున్న ఫలితాలను సాధిస్తారు. లేకపోతే సంవత్సరాంతంలో మీకు పశ్చాత్తాపమే మిగులుతుంది.

– శరణ్ శ్రీవత్స, అంత్రప్రెన్యూర్


శ్రేయ ఇన్‌ఫ్రా అండ్ మార్కెటింగ్ సంస్థ ఆస్తుల జప్తు

- కర్నూలు జిల్లాలో రూ.206 కోట్ల మేర మోసానికి పాల్పడిన సంస్థ

ఈనాడు, అమరావతి: వివిధ రకాల ఆకర్షణీయ పథకాల పేరిట ప్రజల నుంచి దాదాపు రూ.206 కోట్ల డిపాజిట్లు సేకరించి, బోర్డు తిప్పేసిన కర్నూలులోని శ్రేయ ఇన్‌ఫ్రా అండ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆస్తుల జప్తు కోసం తదుపరి చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సీఐడీకి అనుమతిచ్చింది. ప్రిన్సిపల్-ప్రాఫిట్-బోత్, గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్, వెహికల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ వంటి పథకాల ద్వారా అధిక రిటర్న్‌లు చెల్లిస్తామని, భారీగా అదనపు ప్రయోజనాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి.. శ్రేయ ఇన్‌ఫ్రా సంస్థ 8,128 మంది నుంచి రూ.206 కోట్ల మేర డిపాజిట్లు సేకరించింది. ఆ డబ్బు మళ్లించి పలు చోట్ల స్థిరాస్తులు కొనుగోలు చేసింది. డిపాజిట్లు చేసిన వారికి తిరిగి సొమ్ములు చెల్లించకుండా మోసానికి పాల్పడింది. దీనికి సంబంధించి కర్నూలులో తొలుత కేసులు నమోదు కాగా.. ఆ తర్వాత అవి సీఐడీకి బదిలీ అయ్యాయి. వీటిపై దర్యాప్తు చేసిన సీఐడీ.. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లాలోని పారుమంచాల గ్రామంలో శ్రేయ ఇన్‌ఫ్రా అండ్ మార్కెటింగ్ సంస్థ పేరిట దాని ప్రతినిధులు హేమంత్‌కుమార్ రాయ్, సంగీత రాయ్‌లు 51.55 ఎకరాలు కొన్నట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో రూ.3.12 కోట్ల విలువైన ఈ ఆస్తుల జప్తునకు చర్యలు చేపట్టింది. దీని కోసం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలుకు సీఐడీకి అనుమతిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మాతృభాషపై పట్టున్న రెండు తరాలే మిగిలాయి

- తెలుగును కాపాడుకునే బాధ్యత మనపైనే ఉంది
- 36 ఏళ్లుగా పుస్తక మహోత్సవం హర్షణీయం
- మన భాషను కాపాడుకోగలమనే నమ్మకం వచ్చింది
- నేను తెలుగు చదవడం 'ఈనాడు'తో ఆరంభించాను
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహకు తెలుగువారి చరిత్ర పుస్తకాన్ని బహూకరిస్తున్న మనోహర్‌నాయుడు. చిత్రంలో ఎమెస్కో విజయకుమార్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రఘురామకృష్ణరాజు, సీపీఐ జాతీయ నేత నారాయణ, కె.రామచంద్రమూర్తి

ఈనాడు, అమరావతి: "మన మాతృభాషపై పట్టున్న మరో రెండు తరాలే మిగిలాయి. మన తర్వాత తెలుగు భాషను కాపాడుకోవడం కష్టం. అందుకే.. మాతృభాషను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉంది. భవిష్యత్తు తరాలకు తెలుగును నేర్పించాలి, మాతృభాషలో పుస్తకాలను చదివించాలి" అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ సూచించారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జస్టిస్ నరసింహ మాట్లాడుతూ, మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే కాదు.. ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. న్యాయమూర్తిగా ఉండగా మాతృభాషతో తనకున్న ఓ అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. "నేను 1987లో దిల్లీ విశ్వవిద్యాలయంలో లా చదువుతున్న సమయంలో మా అమ్మకు తెలుగులో ఉత్తరం రాశాను. దాన్ని మా నాన్న చదివారు. ఆయన అప్పటికి ట్రిబ్యునల్ జడ్జి. నా లేఖకు సమాధానం ఆంగ్లంలో రాసి పంపించారు. 'నువ్వు తెలుగు మాట్లాడితే బ్రిటిష్ దొరలా ఉంటుంది, ఇంగ్లిష్ మాట్లాడితే శాస్త్రిలా ఉంటుంది' అనేది ఆ లేఖ సారాంశం. రెండూ సరిగా రావన్నది ఆయన ఉద్దేశం. నేనూ అందరిలా నగరంలోనే పుట్టి, కాన్వెంట్‌లో చదువుకున్నవాడినే. తెలుగులో మాట్లాడినా స్కూల్లో కొట్టేవారు. మా నాన్న సమాధానం చూశాక.. నాకు కొంచెం భయం వేసి తెలుగు చదవడం మొదలుపెట్టాను. 'ఈనాడు' పత్రిక తెప్పించుకుని చదవడం ఆరంభించి.. తర్వాత రామాయణం, మహాభారతం చదవడం అలవాటైంది" అంటూ మాతృభాషపై తాను ఎలా పట్టు సాధించారో జస్టిస్ నరసింహ వివరించారు.

పుస్తకాలు... ప్రాణం పోసుకున్న జీవులు

పుస్తకాలు ప్రాణం పోసుకున్న జీవులని జస్టిస్ నరసింహ పేర్కొన్నారు. 'పుస్తకాలు మనల్ని ఎన్నటికీ వదిలిపెట్టవు. నన్ను చదువు అని మన దగ్గరికి వస్తాయి. మన తోపాటు ప్రయాణంలో, చివరికి మంచంపైనా ఉంటాయి. పుస్తకాలు మనందరి మధ్యలోనే పెరుగుతాయి. కొన్ని తొందరగా చచ్చిపోతాయి. కొన్ని కలకాలం ఉంటాయి. నవ్విస్తాయి, ఏడిపిస్తాయి.. అందుకే పుస్తకాలను మనం అంతగా ప్రేమిస్తాం. కొన్ని పుస్తకాల విషయంలో నేను చాలా జాగ్రత్తగా ఉంటాను' అని వెల్లడించారు.

రాజ్యాంగం చదువుతుంటే ఒళ్లు పులకరిస్తుంది

'తీర్పు ఇచ్చే సమయంలో రాజ్యాంగాన్ని చూస్తూ.. దానిలోని అక్షరాలు చదువుతుంటే ఒళ్లు పులకరిస్తుంది. రాజ్యాంగంలో స్వేచ్ఛ, సమానత్వం, బంధుత్వం.. ఈ మూడు విలువలు ఉంటాయి. మన భాష కూడా ఒక బంధుత్వమే. తెలుగుభాష ద్వారా.. ఓ బంధుత్వం మనందరి మధ్య ఉంటుంది' అని జస్టిస్ నరసింహ పేర్కొన్నారు. పుస్తకాల్లోని ఒక్కో అక్షరం నుంచి ఒక్కో కొత్త ఆలోచన పుడుతుందన్నారు.

మాతృభాష రుణం తీర్చుకోకుండా చనిపోకూడదు

ఇలాంటి పుస్తక మహోత్సవాలకు అందరూ వచ్చి, పుస్తకాలను చదవడం ఒక సంస్కృతిగా మార్చుకోవాలని జస్టిస్ నరసింహ సూచించారు. 'తల్లిదండ్రులంతా వారి పిల్లలను తీసుకురావాలి. పుస్తకాలు చదివించాలి. అప్పుడే మన మాతృభాష రుణం తీర్చుకోగలం. ఆ రుణం తీర్చుకోకుండా చనిపోకూడదు. పుస్తకాల్లో రచయితలు, ప్రచురణకర్తలు, మార్కెటింగ్ చేసేవాళ్లు, ప్రదర్శనలు నిర్వహించేవాళ్లు.. ఒక్కొక్కరిదీ ఒక్కో లోకం. 36 ఏళ్లుగా ఈ లోకంలో కలిసిపోయి పెట్టుకున్న మహోత్సవాన్ని నిర్వహిస్తూ విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం (వీబీఎఫ్ఎస్) ప్రతినిధులు కూర్చున్నారంటే చెప్పాలి' అని జస్టిస్ నరసింహ వెల్లడించారు.

ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను

'నేను ఏదో పని మీద విజయవాడ వచ్చానని తెలిసి.. ఈ ప్రదర్శన ప్రారంభోత్సవానికి రాగలరా.. అంటూ సీనియర్ పాత్రికేయులు కృష్ణారావు అడిగారు. నేను చాలా సంతోషంగా అంగీకరించాను. ఇది నా అదృష్టంగా భావిస్తున్నానని చెప్పాను. ఈ అవకాశం నాకు కల్పించినందుకు ధన్యవాదాలు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ పేర్కొన్నారు.



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు

మన తెలుగును లాటిన్‌లా మారనివ్వకూడదు

విజయవాడలో 36 ఏళ్ల నుంచి పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నారని తెలిసి ఆశ్చర్యపోయానని జస్టిస్ నరసింహ అన్నారు. ఇది సాధారణ విషయం కాదన్నారు. పుస్తక మహోత్సవానికి ఇంతమంది రావడం మరింత ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. 'తెలుగు భాషను మనం కాపాడుకోలేమేమో అని ఒకప్పుడు అనుకునేవాడిని. నగరంలో తెలుగు మాట్లాడేవాళ్లు ఎవరూ లేరు. ఇంట్లో పిల్లలు కూడా ఆంగ్లంలోనే మాట్లాడుకుంటున్నారు. ఇవన్నీ చూశాక.. మన భాషను కాపాడుకోవడానికి ఏమీ చేయలేమేమో అనుకునేవాడిని. ఇక్కడికి వచ్చాక, తెలుగుపై ఇంతమంది ఆసక్తిని చూపించడం చూశాక. . నాలో మళ్లీ ఆశ చిగురించింది. తెలుగును కాపాడుకోవడానికి అందరం కలిస్తే.. ఏదో ఒకటి తప్పకుండా చేయగలం అనిపిస్తోంది. ప్రస్తుతం తెలుగు వచ్చిన వాళ్లం ఒకటి.. రెండు తరాలే మిగిలాం. మన భాషను మనమే కాపాడుకోలేకపోతే ఆ తర్వాత కుదరని పని. లాటిన్ లాంటి భాషల్లా మన తెలుగు కూడా కనుమరుగైపోతుంది' అని జస్టిస్ నరసింహ ఆందోళన వ్యక్తం చేశారు. అలా జరగకూడదంటే.. తెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పుస్తకాలకు.. మంచిరోజులొచ్చాయ్

విజయవాడ పుస్తక మహోత్సవంలో ఉపసభాపతి రఘురామకృష్ణరాజు

ఈనాడు, అమరావతి: పుస్తకాలకు మళ్లీ ఆదరణ పెరుగుతోందని, పాఠకులు టికెట్ కొనుక్కుని మరీ పుస్తక ప్రదర్శనలకు వచ్చే రోజులు వస్తాయని.. శాసనసభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవం ప్రారంభోత్సవానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రఘురామ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ తెరలపై పీడీఎఫ్‌లను చదువుతుండటంతో పుస్తకాలను ఎవరు కొంటారని అనుకున్నామన్నారు. కానీ డిజిటల్ తెరలపై గంటకు మించి చదివితే అనారోగ్యమనే విషయం అందరికీ అర్థమైందన్నారు. అందుకే పుస్తక ప్రదర్శనలకు మళ్లీ జనం బారులు తీరుతున్నారని పేర్కొన్నారు. అమరావతిలో శాశ్వత పుస్తక మహోత్సవానికి అవసరమైన స్థలం కోసం.. తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమానికి విజయవాడ పుస్తక మహోత్సవ సమన్వయకర్త ఎమెస్కో విజయకుమార్ ప్రారంభోపన్యాసం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి, సీనియర్ పాత్రికేయులు కృష్ణారావు, వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు, కార్యదర్శి కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై ప్రేమ కాదు.. అదో కుట్ర..

- నారాయణ, సీపీఐ జాతీయ నేత

'చదువుకున్న మూర్ఖులు కొందరొచ్చారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి విజయవాడలో అన్ని కార్యక్రమాలు, ప్రజా సదస్సులు, పుస్తక మహోత్సవాలు నిర్వహిస్తూ.. సామాజిక చైతన్యానికి కేంద్రంగా ఉన్న స్వరాజ్య మైదానాన్ని.. అంబేడ్కర్ విగ్రహం అడ్డంపెట్టి ఆక్రమించారు. అక్కడ ఏ కార్యక్రమం జరగనివ్వకుండా చేశారు. జాతీయ పతాకాన్ని మొదటిసారి ఎగరేసిన ప్రాంతం అది. దీనిపై ఏం మాట్లాడితే.. ఎవరైనా ప్రశ్నిస్తే.. అంబేడ్కర్‌కు వ్యతిరేకులంటారు. ఇలాంటి బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలు ఎక్కువైపోయాయి. అది అంబేడ్కర్‌పై ప్రేమతో పెట్టింది కాదు.. రాజకీయ చైతన్యం లేకుండా చేయాలనే కుట్రతో చేసింది. కృష్ణా నదీ తీరంలో అందమైన ప్రదేశంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉంటే బాగుండేది. ఎంత విజ్ఞానం పెరిగితే సమాజ అభివృద్ధి అంత జరుగుతుంది. విజ్ఞానాన్ని ఆపాలని ఎంత ప్రయత్నిస్తే అంత ఆరాటం పెరుగుతుంది. అందుకే విజ్ఞానం కావాలా? ఆరాటం కావాలా అనేది ప్రజలే తేల్చుకోవాలి. పుస్తక ప్రదర్శనలకు అనుమతుల విషయంలో ప్రసవ వేదన అనుభవించాల్సి వస్తోంది. ఇలాంటి వాటికి కూడా అనుమతి ఇవ్వకుండా వేధిస్తున్నారు. అమరావతిలో పుస్తక మహోత్సవాలను పెట్టడానికి పది ఎకరాలు శాశ్వతంగా కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను' అని సీపీఐ జాతీయ నేత నారాయణ అభిప్రాయపడ్డారు.

కొండగట్టు ఆంజనేయ క్షేత్రానికి నేడు పవన్ కల్యాణ్



ఈనాడు, అమరావతి: తెలంగాణలోని జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం సందర్శించనున్నారు. అక్కడ తిరుమల తిరుపతి దేవస్థానం సమకూర్చే నిధులతో నిర్మించనున్న భవనాలకు శంకుస్థాపన చేస్తారు. కొండగట్టు ఆంజనేయస్వామిని పవన్‌కల్యాణ్ ఇలవేల్పుగా కొలుస్తారు. గత ఎన్నికల్లో విజయం సాధించాక ఆ ఆలయాన్ని సందర్శించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆ సందర్భంలో ఆయన ఆలయ అధికారులు, అర్చకులతో మాట్లాడినప్పుడు ఈ క్షేత్రానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలు లేవని, దీక్ష విరమణ మండపం, విశ్రాంతి గదులతో కూడిన సత్రం అవసరమని వివరించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. తితిదే నిధులతో ఈ పనులు చేపట్టేందుకు పవన్ కల్యాణ్ ప్రతిపాదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. తితిదే బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడుతోనూ పవన్ చర్చించారు. దీంతో తితిదే బోర్డు రూ. 35.19 కోట్లు మంజూరు చేసేందుకు ఆమోదం తెలిపింది. శనివారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల మధ్య జరిగే కార్యక్రమంలో.. ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఏపీ ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తితిదే బోర్డు సభ్యులు బి.మహేందర్‌రెడ్డి, ఎన్.శంకర్‌గౌడ్, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కల్యాణం శివశ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు.

కార్యకర్తలతోనూ భేటీ: ఈ కార్యక్రమం తర్వాత పవన్‌కల్యాణ్ తెలంగాణ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కొడిమ్యాల సమీపంలోని బృందావనం రిసార్ట్‌లో భేటీ కానున్నారు. ఇటీవల తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యులతోనూ సమావేశమవుతారు.



రాజధానిలో హైకోర్టు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించిన న్యాయమూర్తులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో హైకోర్టు భవన నిర్మాణం జరుగుతున్న ప్రదేశాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు శుక్రవారం సందర్శించారు. సీఆర్‌డీఏ కమిషనర్ కె. కన్నబాబు, ఇతర అధికారులు వారికి స్వాగతం పలికారు. రాజధాని అమరావతి, పరిపాలన నగరం సమగ్ర ప్రణాళిక, పనుల పురోగతిని కన్నబాబు వారికి వివరించారు. హైకోర్టు భవనం నమూనా, అందులో ఉండే సదుపాయాలు, ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయి, నిర్మాణం ఎప్పటికి పూర్తి అవుతుందన్న వివరాలను ఆయన ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అమరావతిలోని జ్యుడీషియల్ సిటీలో వస్తున్న మొత్తం సదుపాయాలు, నిర్మాణాలు, మౌలిక వసతుల గురించి న్యాయమూర్తులు అడిగి తెలుసుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తుల నివాసం కోసం నిర్మించిన నమూనా భవనాన్ని సందర్శించారు. భవనం డిజైన్, నిర్మాణంలో పాటిస్తున్న ప్రమాణాలు, పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. పిచ్చుకలపాలెం వద్ద ఐదు ఎకరాల్లో నిర్మిస్తున్న ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి సంబంధించిన కాన్సెప్ట్ డిజైన్లను న్యాయమూర్తులకు సీఆర్‌డీఏ అధికారులు చూపించి వివరించారు.





హైకోర్టు న్యాయమూర్తుల నివాస భవనాన్ని పరిశీలిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ. చిత్రంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ★ అమరావతిలో హైకోర్టు భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

సర్వదర్శనానికి బారులుదీరిన భక్తులు

- తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం నుంచి ఈనెల 8 వరకు ఏ టోకెన్లూ లేని భక్తులకు నేరుగా వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామని తితిదే ప్రకటించిన నేపథ్యంలో.. యాత్రికులు గురువారం సాయంత్రం నుంచే తిరుమలకు చేరుకున్నారు. వీరిని అర్ధరాత్రి దాటాక దర్శనానికి అనుమతించారు. భక్తులు స్థానిక రింగురోడ్డులోని బాటగంగమ్మ ఆలయం వద్ద క్యూలైన్‌లోకి ప్రవేశిస్తే.. గోగర్భం కూడలి, బాటగంగమ్మ ఆలయం, శిలాతోరణం మీదుగా కృష్ణతేజ నుంచి నారాయణగిరి షెడ్డులోకి చేరుకుంటున్నారు. అనంతరం వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 షెడ్డులోకి, అక్కడి నుంచి క్యూలైన్ల ద్వారా ఆలయ ప్రవేశం చేస్తున్నారు. మొత్తంగా దాదాపు 6 కిలోమీటర్లు క్యూలైన్‌లో నడుస్తున్నారు. సర్వదర్శనానికి 16 గంటల సమయం పడుతోంది.



రింగురోడ్డులో దర్శనానికి వెళ్తున్న భక్తులు

రాత్రి 7 తర్వాత క్యూలైన్ నిలిపివేత

భక్తుల రద్దీ కారణంగా శుక్రవారం రాత్రి 7 గంటల తర్వాత సర్వదర్శనం క్యూలైన్‌లోకి కొత్తగా భక్తుల రాకను తితిదే నిలిపివేసింది. శనివారం ఉదయం వరకు కంపార్ట్‌మెంట్లు, క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు మాత్రమే దర్శనం కల్పిస్తామని అధికారులు పేర్కొన్నారు. అప్పటిదాకా భక్తులు తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయాల్లో సేదతీరాలని, ఉదయం క్యూలైన్‌లోకి చేరుకోవాలని సూచించారు. పోలీసులు భారీగా మోహరించి, తోపులాటలకు వీల్లేకుండా నియంత్రిస్తున్నారు. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తున్నారు.

తిరుమలలో నేడు పౌర్ణమి గరుడసేవ రద్దు

ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి నిర్వహిస్తున్న గరుడసేవను శనివారం తితిదే రద్దు చేసింది. శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు జరుగుతున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తితిదే పేర్కొంది.

'పైడాల' నుంచి రూ.4.33 కోట్ల రికవరీకి ఆదేశాలు

- రాష్ట్రంలో ఎక్కడ పనులుచేస్తున్నా.. ఆ డిపాజిట్ల నుంచి రికవరీ చేయాలి
- నెల్లూరు ఎస్ఈకి ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల ఆదేశాలు
- 'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు, అమరావతి: నాణ్యతలేని రహదారి పనులు చేసినందుకుగానూ విధించిన జరిమానాను చెల్లించకుండా, కనీసం ఆ రహదారి రెన్యువల్ పనులు చేయకుండా పదేళ్లుగా దర్జాగా తప్పించుకుంటున్న పైడాల తిరుపతిరెడ్డి అండ్ బ్రదర్స్ అనే గుత్తేదారు సంస్థపై ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. ఆ సంస్థ నుంచి రూ.4.33 కోట్లు రికవరీ చేయాలని, రాష్ట్రంలో ఎక్కడ పనులు చేస్తున్నా.. వాటి డిపాజిట్ల నుంచి ఆ సొమ్ము రాబట్టాలని ఆదేశించారు. నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు నుంచి సోమశిల వరకు 23.2 కి.మీ. రహదారి విస్తరణ పనులను రూ.17.05 కోట్లకు పైడాల తిరుపతిరెడ్డి అండ్ బ్రదర్స్ సంస్థ 2012-13లో దక్కించుకుంది. తర్వాత రోడ్డు నిర్మించగా.. అందులో నాణ్యతలేదంటూ ఫిర్యాదులు వచ్చాయి. ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు పరిశీలించి, నాణ్యత లోపాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎక్కడెక్కడ నాణ్యతలేదో.. అక్కడ అదే గుత్తేదారు సంస్థతో మళ్లీ బీటీ లేయర్‌తో రెన్యువల్ పనులు చేయించాలని, లేకపోతే జరిమానా అయినా వసూలు చేయాలని 2015-16లో క్వాలిటీ కంట్రోల్ అధికారులు నివేదిక ఇచ్చారు. అయినా పదేళ్లుగా ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు ఎవరూ ఆ గుత్తేదారు సంస్థపై చర్యలు తీసుకోలేదు. ఇందుకు పైడాల సంస్థ రాజకీయ పలుకుబడి కూడా ఉపయోగించింది. దీనికి తోడు ఆ సంస్థకు రూ.వందల కోట్లు పనులు దక్కేలా చూస్తున్నారు. దీంతో 'పైడాలపై జరిమానాకు బదులు నజరానాలు' అనే శీర్షికతో 'ఈనాడు'లో గతనెల 22న కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులంతా కళ్లు తెరిచారు. వెంటనే గుత్తేదారు సంస్థ నుంచి రూ.4.33 కోట్లు రికవరీ చేయాలని ఇంజినీర్ ఇన్ చీఫ్.. నెల్లూరు జిల్లా ఎస్ఈకి మెమో జారీచేశారు. అయితే నెల్లూరు జిల్లా పరిధిలో ఆ గుత్తేదారుకు ఎక్కువ పనులు లేవని, వాటిలో రూ.4.33 కోట్లు రికవరీ చేసేంత డిపాజిట్లు కూడా లేవని ఎస్ఈ పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో మరే జిల్లాలోఅయినా ఆ గుత్తేదారు సంస్థ పనులు చేస్తుంటే.. దానికి చెందిన డిపాజిట్ల నుంచి జరిమానా మొత్తాన్ని వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీచేశారు.

ఓడినప్పుడు ఈవీఎంల తప్పంటున్నవారు.. గెలిచినప్పుడు నోరు మెదపరే!

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఈనాడు, దిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లోని ఎన్నికల ప్రక్రియను వేలెత్తి చూపడం సరికాదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హితవు పలికారు. ఓడితే ఈవీఎంల తప్పు అంటున్న కొంతమంది అదే ఈవీఎంల ద్వారా గెలిచినప్పుడు మాత్రం తప్పుబట్టడం లేదని వ్యాఖ్యానించారు. శుక్రవారం సింగపూర్‌లో 'శ్రీ సాంస్కృతిక కళాసారథి' సంస్థ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కుటుంబంలో, సమాజంలో, దేశంలో ఐక్యత ఉన్నప్పుడే ప్రపంచం ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. గతంలో మనం ఐక్యంగా లేకపోవడం వల్లే చిన్నచిన్న దేశాలు కూడా వచ్చి, మనల్ని ఆక్రమించి సంపదను దోచుకెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల వరకే ప్రత్యర్థులు, తర్వాత అందరం భారతీయులం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. భారత ఆర్థిక వ్యవస్థపై అవాంఛిత వ్యాఖ్యలు చేసే వారికి మన అభివృద్ధి ద్వారా ప్రధాని మోదీ తగిన సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.

కుక్క కరిచినా.. టీకా వేయించని తల్లిదండ్రులు

రేబిస్ సోకి బాలుడి మృతి



పూర్ణానంద్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కుక్కకాటుకు గురైన బాలుడికి వ్యాక్సిన్ వేయించకపోవడంతో రేబిస్ సోకి మృతి చెందాడు. ఈ విషాద ఘటన అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం దుప్పితూరులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలుడు గుడియా పూర్ణానంద్(12) ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పది రోజుల కిందట ఇతడు ఇద్దరు స్నేహితులతో ఆడుకుంటున్న సమయంలో ముగ్గురినీ కుక్క కరిసింది. ఇందులో ఇద్దరు చిన్నారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకాలు వేయించుకోగా, పూర్ణానంద్ మాత్రం వేసుకోలేదు. తండ్రి మద్యానికి బానిసై పట్టించుకోకపోవడం, తల్లి రుక్మిణి అనారోగ్యానికి గురై మంచానికే పరిమితం కావడంతో ఈ బాలుడికి చికిత్స చేయించేవారు లేకపోయారు. ఈ క్రమంలో బాలుడి ఆరోగ్యం క్షీణించడంతో స్థానికులు విశాఖ కేజీహెచ్‌లోచేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ప్రాణాలు కోల్పోయాడు. కాగా, కొద్ది నెలల కిందట తల్లి అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చేరినప్పుడు బాలుడు తల్లికి అన్నీతానై చూసుకున్నాడు. కుమారుడు చనిపోవడంతో ఆమె కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఫసల్ బీమా యోజనలో పొగాకు పంట చేర్చేలా కృషి

- పొగాకు బోర్డు 50 వసంతాల వేడుకల్లో ఛైర్మన్ యశ్వంత్‌కుమార్



కేంద్ర మాజీ మంత్రి కొత్త రఘురామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్, చిత్రంలో ఈడీ విశ్వశ్రీ తదితరులు

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: 'పొగాకు ఓ విశిష్టమైన పంట..తరతరాలకు పొగాకు పంటతో అనుబంధం ఏర్పడింది. రానున్న రబీ సీజన్ నాటికి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పొగాకు పంటను చేర్చేలా చూస్తాం' అని భారత పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అన్నారు. గుంటూరులోని శ్రీకన్వెన్షన్‌లో పొగాకు బోర్డు 50వ వసంతాల వేడుకలు శుక్రవారం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ 1976లో అప్పటి కేంద్ర మంత్రి కొత్త రఘురామయ్య, ఆచార్య ఎన్.జి.రంగా తదితర నాయకుల కృషితో గుంటూరులో ఏర్పాటైన పొగాకు బోర్డు రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం 50 సంవత్సరాలుగా కృషి చేస్తోందన్నారు. భారత్ నుంచి 100 మిలియన్ కిలోల పొగాకును విదేశాలకు విక్రయిస్తుంటే..అనధికారికంగా 30 మిలియన్ కిలోలను విక్రయించడం వల్ల రూ.750 కోట్లు కోల్పోతుండటంతో అనధికారిక విక్రయాలను నివారించేలా ప్రధాని మోదీ ఆదేశాలు జారీ చేశారన్నారు. పొగాకు బోర్డు కార్యనిర్వాహక సంచాలకులు(ఈడీ) బి.విశ్వశ్రీ మాట్లాడుతూ సంపూర్ణ ఆన్‌లైన్ విధానంలో రైతుల పేర్ల నమోదు, యాప్‌ను తీసుకొస్తున్నామని వివరించారు. పొగాకు బోర్డు వేలం విభాగం సంచాలకుడు శ్రీనివాస్, ఐసీఏఆర్-నిర్కా సంచాలకుడు ఎం.శేషుమాధవ్,ఐటీఏ కార్యదర్శి వై.అంకమ్మచౌదరి ప్రసంగించారు. బ్యారన్ ఎన్యుమరేషన్ యాప్‌తోపాటు తెలుగు, కన్నడ, ఆంగ్లం, హిందీ భాషల్లో పొగాకు బోర్డు వెబ్‌సైట్లను అతిథులు ప్రారంభించారు. ఈడీ విశ్వశ్రీ పొగాకు బోర్డు 2026 డైరీని, తెలుగుభాషలో గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ పుస్తకాలను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 26 మంది ఉత్తమ రైతులకు పురస్కారాలు అందజేశారు. సమావేశంలో పొగాకు బోర్డు కార్యదర్శి డి.వేణుగోపాల్, మాజీ ఛైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, మాజీ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, పాలకమండలి సభ్యులు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయంతో విద్యుత్తు వినియోగదారులకు ఊరట

ఏపీ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పట్నుంచి ప్రజలపై విద్యుత్తు భారం పడకుండా చర్యలు తీసుకుంటోందని ఏపీ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "ప్రజలపై రూ.4,492 కోట్ల ట్రూ అప్ ఛార్జీలు భారం పడకుండా సీఎం చంద్రబాబు కొత్త సంవత్సరం వేళ కీలక నిర్ణయం తీసుకున్నారు. చంద్రబాబు నిర్ణయాలతో విద్యుత్తు వినియోగదారులకు ఊరట కలుగుతుంటే.. వైకాపా తప్పుడు ప్రచారాలు చేస్తోంది" అని ధ్వజమెత్తారు.

ఆదర్శ పాఠశాలల్లో 74 పీజీటీ అతిథి అధ్యాపకులు

ఈనాడు, అమరావతి: ఆదర్శ పాఠశాలల్లో బోధన సిబ్బంది కొరతను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జనవరి నుంచి ఏప్రిల్ వరకు తాత్కాలికంగా అతిథి అధ్యాపకులను నియమించుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 74 పీజీటీ పోస్టులకు అనుమతి తెలిపింది. పీజీటీలకు గంటకు రూ.250 చొప్పున నెలకు రూ.12వేలు మించకుండా గౌరవవేతనం చెల్లిస్తారు. ఎంపిక పాఠశాల స్థాయిలోనే చేస్తారు.

కయాక్ స్ప్రింట్ చేస్తూ కాలువలో పడిన కలెక్టర్

లైఫ్‌జాకెట్ ధరించి ఉండడంతో తప్పిన ప్రమాదం





కయాక్ స్ప్రింట్ నడుపుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్ ★ అదుపుతప్పి నీటిలో పడిన కలెక్టర్

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు ప్రమాదం తప్పింది. సంక్రాంతి సంబరాలకు సంబంధించి ఆత్రేయపురం మండలం పులిదిండి వద్ద గోదావరి ప్రధాన పంట కాలువలో ఈ నెల 11 నుంచి 'సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ' పడవ పోటీలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం అక్కడి కాలువలో ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్ స్వయంగా తెడ్డు ఉపయోగించి పడవ (కయాక్ స్ప్రింట్) నడుపుతున్నారు. ఆయనతో పాటు ఆ పడవ సారథి ఉన్నారు. ప్రవాహంలో ముందుకు సాగుతున్న క్రమంలో అదుపు తప్పి కలెక్టర్ నీటిలో పడిపోయారు. లైఫ్ జాకెట్ ధరించి ఉండటంతో ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. చెంతనే ఉన్న ఈతగాళ్లు, కయాక్ స్ప్రింట్ సారథులు ఆయనను పట్టుకుని వేరే పడవలోకి ఎక్కించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని కలెక్టర్ మళ్లీ పడవ నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈతలో తనకు అనుభవం ఉందని, నీటిలో ప్రయాణించే వారెవరైనా ముందు జాగ్రత్తగా లైఫ్ జాకెట్ ధరించడం మంచిదని చెప్పారు.

EENADU Vol: 52, Issue: 144 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



సంక్రాంతి సంబరాలు
CMR SHOPPING MALL
The joy of life
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Sankranti BIG SALE SPOT GIFTS and more...
₹999* పై బడిన కొనుగోలుపై స్పాట్ గిఫ్ట్స్
UPTO 51% Off
1+1 ఆఫర్స్ కాంబో ఆఫర్స్ ఇంకా మరెన్నో!
SOWBHAGYA PATTU SAREE MRP ₹1699* GET SECOND SAREE@ ₹19 ONLY
MAHALXMI PATTU SAREE MRP ₹2699* GET SECOND SAREE@ ₹29 ONLY
FANCY SAREES
SUNFLOWER SAREE BUY 2 @ ₹299*
CORAL SILK BUY 2 @ ₹549*
THAMANNA SAREE BUY 2 @ ₹599*
FANCY SAREE BUY 2 @ ₹649*
FANCY SAREE BUY 2 @ ₹699*
FANCY SAREE BUY 2 @ ₹749*
FANCY BOX SAREE ₹949 ₹749*
SAMANTHA SAREES BUY 2 @ ₹799*
FANCY SAREE BUY 2 @ ₹849*
JASMINE SILK SAREE BUY 2 @ ₹899*
VRINDAVAN FANCY SAREE BUY 2 @ ₹999*
ANMOL SILK SAREE BUY 2 @ ₹1099*
• చీరలు • చుడీదార్స్ • గాగ్రాస్ • ఉమెన్స్ వేర్ • మెన్స్‌వేర్ • కిడ్స్ రెడీమేడ్స్ • కాస్మెటిక్స్
Pattu Sarees
AKSHARA PATTU BUY 2 ₹899*
PATTU SAREE BUY 2 ₹1199*
PATTU SAREE BUY 2 ₹1299*
SANKRATHI BUY 2 ₹1599*
VAISHALI BUY 2 ₹1899*
KANJEEVARAM BUY 2 ₹2999*
SRIDEVI PATTU BUY 2 ₹999*
VARAHI BUY 2 ₹3499*
MAHADEVA BUY 2 ₹3799*
KAUSHALYA BUY 2 ₹4999*
PATTU FANCY ₹4299 ₹2999*
KANCHI SAREE ₹5799 ₹3999*
Women's Wear
KURTA BUY 3 ₹299*
KURTA BUY 2 ₹499*
KURTA BUY 2 ₹699*
WESTERN DRESS BUY 3 ₹999*
NIGHTIES BUY 2 ₹499*
JEANS BUY 3 ₹999*
CO-ORD SETS BUY 3 ₹1499*
Cotton & Catalogue Sarees
COTTON SAREE ₹879 ₹699*
COTTON SAREE ₹949 ₹749*
BANARAS FANCY SAREE BUY 2 ₹2399*
Chudidhar & Dress Material
DRESS MATERIAL BUY 2 ₹999*
CHUDIDHAR ₹1469 ₹1099*
FASHION CHUDIDHAR ₹1759 ₹1299*
FANCY CHUDIDHAR BUY 2 ₹1299*
FANCY CHUDIDHAR BUY 2 ₹1499*
FANCY CHUDIDHAR BUY 2 ₹1699*
Gagra
FANCY GAGRA BUY 2 ₹1499*
KIDS WEAR
BOYS JEANS BUY 2 ₹899*
COTTON FROCKS BUY 3 ₹599*
GIRLS SKIRTS BUY 2 ₹799*
BOYS SHIRTS BUY 2 ₹499*
BOYS SHIRTS BUY 2 ₹699*
BOYS CHINOS BUY 4 ₹899*
GIRLS PALAZZO BUY 4 ₹499*
GIRLS NIGT SUIT BUY 2 ₹699*
GIRLS SKIRTS BUY 3 ₹999*
BED SHEETS
BED SHEETS BUY 2 ₹199*
BED SHEETS BUY 2 ₹299*
PREMIUM BEDSHEETS BUY 2 ₹799*
TOWELS BUY 2 ₹99*
Handloom Sarees
COTTON SAREE BUY 2 @ ₹699*
KANCHI COTTON BUY 2 @ ₹799*
VENKATAGIRI BUY 2 @ ₹999*
YELLAMPALLI BUY 2 @ ₹999*
ARAPUKOTTAI BUY 2 @ ₹1199*
KUPPADAM BUY 2 @ ₹1599*
UPPADA BUY 2 @ ₹2999*
HI Fancy Saree
ROYAL QUEEN BUY 2 @ ₹3299*
SPACE SILK BUY 2 @ ₹3499*
KHATAN SILK BUY 2 @ ₹3699*
HASTHAKALA SILK BUY 2 @ ₹3899*
JAHNAVI SILK BUY 2 @ ₹4299*
CHINAN SILK BUY 2 @ ₹4599*
MENS WEAR
SHIRTS BUY 4 ₹999*
SHIRTS BUY 3 ₹999*
SHIRTS BUY 2 ₹1199*
SHIRTS BUY 2 ₹1299*
TROUSERS BUY 2 ₹1299*
TROUSERS BUY 2 ₹1499*
JEANS BUY 2 ₹1299*
JEANS BUY 2 ₹1499*
CRIMSOUNE CLUB BUY 2 GET 2 Free | BUY 2 @ 40% OFF | BUY 1 @ 30% OFF
BUY 2 @ 30% OFF | BUY 1 @ 20% OFF
OXEMBERG SHOP FOR ₹2999 GET A BACK PACK @ ₹199
Levi's BUY 6 @ 50% OFF | BUY 2 GET 2 Free | BUY 1 GET 1 Free
THINC INDIAN TERRAIN BUY 4 @ 50% OFF | BUY 3 @ 40% OFF | BUY 2 @ 30% OFF | BUY 1 @ 20% OFF
JACK&JONES spykar BUY 2 @ 50% OFF | BUY 1 @ 40% OFF
rock.it BUY 2 @ 50% OFF | BUY 1 @ 30% OFF
BLACKBERRYS RARE RABBIT BUY 3 @ 40% OFF | BUY 2 @ 30% OFF | BUY 1 @ 20% OFF
Celebrity Flat 15% OFF
Pepe Jeans BUY 2 GET 2 Free | BUY 3 @ 40% OFF | BUY 2 @ 30% OFF | BUY 1 @ 20% OFF
Heniis ITALIAN COUTUR Flat 30% OFF
U.S. POLO ASSN. ARROW parx BUY 2 GET 2 Free | BUY 2 @ 30% OFF | BUY 1 @ 20% OFF
FLYING MACHINE BUY 1 GET 1 Free | BUY 1 @ 20% OFF
Cavallo TURTLE LINEN CLUB BUY 3 @ 50% OFF | BUY 2 @ 40% OFF | BUY 1 @ 25% OFF
mufti BUY 2 @ 50% OFF | BUY 1 @ 25% OFF
BEYOND BLUE JEANS CLOUD 9 BUY 3 @ 40% OFF | BUY 2 @ 30% OFF | BUY 1 @ 20% OFF
celio* KILLER BUY 3 @ 50% OFF | BUY 2 @ 40% OFF | BUY 1 @ 30% OFF
CLOUD 9 ONLY BUY 3 @ ₹1599*
TWILLS OXEMBERG COOL COLORS
ఎం.జి.రోడ్, విజయవాడ 91333 87124
బస్టాండ్ ఎదురుగా, మచిలీపట్నం 7799971833
నెహ్రూ చౌక్ సెంటర్, గుడివాడ 7799971839



సంక్రాంతి సంబరాలు
జనవరి 15 వరకు
స్పాట్ గిఫ్ట్స్
1500 పైబడి వస్త్రాల కొనుగోలు పై ఉచిత బహుమతులు
సంక్రాంతి షాపింగ్ చేయండి...
వెండి ఉచితంగా పొందండి
FREE SILVER
HDFC BANK
5% DISCOUNT*
Get upto 5% Instant Discount* using EMI on HDFC Bank Credit Cards and HDFC Bank Debit Cards
Min Txn Rs.5,000 - Max Cap Rs.4,000
సంక్రాంతి కాంబో ఆఫర్స్
A Unit of marri Retail Private Limited
ది చెన్నయ్ షాపింగ్ మాల్
1800 309 9989 | 9000 999 444
ఎం.జి. రోడ్, విజయవాడ

ఈనాడు సినిమా



ట్రైలర్‌తో సందడి

సంక్రాంతి సందర్భంగా రఫ్ ఆడించేందుకు సిద్ధమయ్యారు 'మన శంకరవరప్రసాద్‌గారు'. చిరంజీవి కథానాయకుడిగా నటించిన ఈ సినిమా ప్రచార సందడి ఇప్పటికే షురూ అయ్యింది. పాటలు, ప్రత్యేక వీడియోల్ని విడుదల చేస్తూ చిత్రబృందం సినిమాపై ఆసక్తిని రెట్టిస్తోంది. ఈ నెల 4న ట్రైలర్‌ని విడుదల చేయనున్నట్లు సినీ వర్గాలు శుక్రవారం ప్రకటించాయి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో... షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. చిరంజీవి సరసన నయనతార నటించారు. వెంకటేశ్, కథరిన్ ప్రత్యేక పాత్రల్లో నటిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: సమీర్‌రెడ్డి, ప్రొడక్షన్ డిజైన్: ఎ.ఎస్.ప్రకాశ్, కూర్పు: తమ్మిరాజు.

ప్రదీప్ రంగనాథన్ సరసన మీనాక్షి?

'లవ్ టుడే'తో నటుడిగా, దర్శకుడిగా తన ప్రతిభను నిరూపించుకున్నారు తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్. యువతను ఆకట్టుకునే కథలతో మెప్పించే ఈయన.. ఇప్పుడు మరోసారి కెప్టెన్ కుర్చీలో కూర్చోబోతున్నట్లు తెలుస్తోంది. ఆయన సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో ఓ చిత్రాన్ని తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో ప్రదీప్ సరసన మీనాక్షి చౌదరి కనిపించనుందట. "ప్రస్తుతం దక్షిణాదిలో వరుస సినిమాలతో బిజీగా ఉన్న మీనాక్షికి.. ఇప్పుడు రాబోయే ప్రాజెక్టు ఆమె కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవనుంది. ప్రదీప్ స్వీయ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్రదీప్ మునుపటి చిత్రాల మాదిరిగా కాకుండా.. భిన్నంగా ఉండనుందీ సినిమా. మార్చిలో సెట్స్‌పైకి తీసుకెళ్లి.. ఒకే షెడ్యూల్‌లో చిత్రీకరణను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నార"ని ప్రదీప్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ప్రదీప్, మీనాక్షిల జోడీ తెరపై చేసే మ్యాజిక్ ఎలా ఉంటుందో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



మీనాక్షి చౌదరి



డింపుల్, రవితేజ, ఆషిక రంగనాథ్

వామ్మో వాయ్యో.. మాస్ గీతమయ్యో

రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల రూపొందించిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా ఈనెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం వరంగల్‌లో ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "వామ్మో వాయ్యో" అంటూ సాగిన ఈ జానపద పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. దేవ్ పవార్ సాహిత్యమందించారు. స్వాతి రెడ్డి ఆలపించారు. శేఖర్ మాస్టర్ నృత్యరీతులందించారు. ఈ పాటలో రవితేజ, ఆషికా, డింపుల్ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా దర్శకుడు కిశోర్ తిరుమల మాట్లాడుతూ.. "ఇది ఆద్యంతం వినోదాత్మకంగా సాగే కుటుంబ కథా చిత్రం. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. థియేటర్లకు వచ్చి ఆస్వాదించండి" అన్నారు. "చాలా రోజుల తర్వాత 'వామ్మో వాయ్యో' లాంటి మాస్ పాట చేశాను. ఇది మాకెంతో ప్రత్యేకమైన గీతం" అంది నటి డింపుల్. ఆషికా మాట్లాడుతూ.. "థియేటర్లో ఈ పాట అందర్నీ అలరిస్తుంది. చాలా ఎనర్జీతో నిండిన మాస్ నెంబర్ ఇది. ఈ పాట కోసం నేను.. డింపుల్ చాలా కష్టపడి డ్యాన్స్ చేశాం" అంది.




కావ్య థాపర్, హవీశ్

ప్రేమపక్షులు రెడీ

హవీశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'నేను రెడీ'. త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. కావ్య థాపర్ కథానాయిక. నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా నుంచి ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో ప్రేమపక్షుల్లా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు కావ్య, హవీశ్. కుటుంబం, ప్రేమ, భావోద్వేగాలు లాంటి యువతను ఆకర్షించే అంశాలతో పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని రూపొందిస్తున్నారు. ఓ పాట మినహా ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు, త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు సినీ వర్గాలు తెలిపాయి. వెన్నెల కిశోర్, హరితేజ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈసారి ప్రేమకథతో



రోషన్

ప్రస్తుతం 'ఛాంపియన్' చిత్రంతో థియేటర్లలో సందడి చేస్తున్నారు యువ హీరో రోషన్. దీని తర్వాత ఆయన చేయనున్న చిత్రమేదన్నది అధికారికంగా వెల్లడి కాకున్నా.. మూడు ప్రాజెక్ట్‌లకు సంతకాలు చేసినట్లు తెలిసింది. అయితే వీటిలో ముందుగా పట్టాలెక్కేది దర్శకుడు శైలేశ్ కొలను చిత్రమని సమాచారం. ఆయన దర్శకత్వంలో రోషన్ నటించనున్న ఈ సినిమా రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఉండనున్నట్లు తెలిసింది. దీన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించే అవకాశముంది. ఈనెలలోనే దీనిపై ప్రకటన వెలువడనుందట.

కొత్త కలయికలు!



నాగచైతన్య

తళుక్కుమని కాంతులీనుతూ 2026 క్యాలెండర్ తెరుచుకుంది. ఈ నయా జోష్‌లోనే కొత్త కబురు వినిపించేందుకు పలువురు కథానాయకులు సిద్ధమవుతున్నారు. నాగచైతన్య ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో 'వృషకర్మ' అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇది ముగింపు దశలో ఉంది. అయితే దీని తర్వాత చైతన్య చేయనున్న చిత్రమేదన్నది ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. 'బెదురులంక' సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు క్లాక్స్‌తో చైతూ చేతులు కలపనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర విషయమై చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని తెలుస్తోంది. దీన్ని నిర్మాత బన్నీవాస్ మరో నిర్మాణ సంస్థతో కలిసి నిర్మించే అవకాశముంది.

శ్రీవిష్ణు జోరు



శ్రీవిష్ణు

'సింగిల్' విజయంతో జోరుమీదున్న శ్రీవిష్ణు ఈ కొత్త ఏడాది వరుస సినిమాలతో బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'మృత్యుంజయ్', 'కామ్రేడ్ కళ్యాణ్' సినిమాలు ముగింపు దశలో ఉన్న సంగతి తెలిసిందే. మరోవైపు 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజుతో రెండో సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇది మార్చి నుంచి చిత్రీకరణ ప్రారంభించుకునే అవకాశముంది. ఇప్పుడీ లైనప్‌లోకి కొత్తగా మరో రెండు చిత్రాలు చేరినట్లు తెలుస్తోంది. ఈటీవీ విన్ నుంచి వచ్చిన 'అనగనగా' చిత్రంతో అలరించిన దర్శకుడు సన్నీ సంజయ్. ఇప్పుడాయనతో శ్రీవిష్ణు ఓ వినోదాత్మక సినిమా చేయనున్నారని, దీన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించే అవకాశముంది. ఇక మరోవైపు ఓ కొత్త దర్శకుడితో జీఏ2 బ్యానర్‌లోనూ శ్రీవిష్ణు ఓ సినిమా చేయనున్నట్లు తెలిసింది.

'చందు ఛాంపియన్' దర్శకుడితో..?



కార్తీక్ ఆర్యన్

'చందు ఛాంపియన్'తో మంచి విజయాన్ని అందుకున్నారు బాలీవుడ్ కథానాయకుడు కార్తీక్ ఆర్యన్, దర్శకుడు కబీర్ ఖాన్. ఇప్పుడీ హిట్ కలయికలో మరో సినిమా రాబోతున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ ఓ స్పోర్ట్స్ అడ్వెంచర్ చిత్రం కోసం చేతులు కలిపినట్లు సమాచారం. "కార్తీక్, కబీర్ కాంబినేషన్‌లో మరో శక్తిమంతమైన చిత్రం రానుంది. ఈసారి కథ కశ్మీర్ నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో రూపొందించనున్నారు. ఇందులోని పాత్ర కోసం ఇప్పటికే శారీరకంగా తనను తాను మార్చుకునే పనిలో పడ్డాడు కార్తీక్. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అక్టోబరు వరకు ఏకకాలంలో చిత్రీకరణ చేయాలని నిర్ణయించుకున్నారు. ఇంకా పేరు ఖరారు కానీ ఈ సినిమాని అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించనుంద"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కార్తీక్ 'నాగ్జిల్లా' సినిమా చిత్రీకరణలో బిజీగా ఉన్నాడు.

తెలుగులోకి 'ది టాస్క్'



జయసూర్య, సాగర్ రామ్

కన్నడలో విజయవంతమైన 'ది టాస్క్' చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య కుమారుడు ముత్యాల అనంతకిశోర్. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో అంతా కొత్తవాళ్లే అయినా... ఎంతో బాగా నటించారని, కథలోని డ్రామా తెలుగు ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని చెప్పారు అనంతకిశోర్. విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. జయసూర్య ఆర్.ఆజాద్, సాగర్ రామ్, శ్రీలక్ష్మి, రఘు శివమొగ్గ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమే 'ది టాస్క్'. రఘు శివమొగ్గ దర్శకత్వం వహించారు.

డియర్ కామ్రేడ్ హిందీ రీమేక్‌లో?

ప్రతిభ రంతా



"వచ్చినప్పుడు ఎంతో అందంగా ఉన్న ప్రేమ.. వెళ్లిపోయాక ఎందుకింత బాధపెడుతుంది" అంటూ ఎంతో మంది ప్రేక్షకుల్ని మెప్పించింది 'డియర్ కామ్రేడ్' చిత్రం. ఇందులో విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా కనిపించి హిట్ జోడీ అనిపించుకున్నారు. ఇప్పుడీ సినిమా హిందీ రీమేక్ కోసం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ ధర్మ ప్రొడక్షన్స్.. ఇప్పటికే దీనికి సంబంధించిన హక్కులను కూడా సొంతం చేసుకున్నట్లు సమాచారం. "కరణ్ జోహార్ నిర్మాణ సంస్థ.. 'డియర్ కామ్రేడ్' హిందీ రీమేక్ గురించి చాలా కాలంగానే చర్చలు చేస్తుంది. దీన్ని రొటీన్ రీమేక్‌లా కాకుండా.. అసలు కథకు ఏమాత్రం తగ్గకుండా రూపొందించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో యువకథానాయకుడు సిద్ధాంత్ చతుర్వేది, 'లాపతా లేడీస్' ఫేమ్ ప్రతిభ రంతాలను హీరోహీరోయిన్లుగా ఎంపిక చేయాలనే ఆలోచనలో ఉన్నారు. త్వరలో ఈ విషయంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంద"ని కరణ్ జోహార్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

గోదారిలో విహారంలా...!




నిధి, సుమంత్

ఒక కిటికీ నుంచి అందమైన పల్లెటూరిని చూసినట్టుగా... గోదావరి నదిలో పడవ ఎక్కి విహరించినట్టుగా ఉంటుంది మా సినిమా అంటున్నారు సుమంత్ ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'గోదారి గట్టుపైన'. నిధి ప్రదీప్ కథానాయిక. సుభాష్‌చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అభినవ్ రావు నిర్మాత. జగపతిబాబు, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. ఆస్కార్ గ్యాంగ్ అని పేరున్న స్నేహితుల చుట్టూ సాగే పల్లెటూరి కథతో ఈ చిత్రం రూపొందినట్టు టీజర్ చాటుతోంది. ఈ సందర్భంగా కథానాయకుడు మాట్లాడుతూ "తొలిసారి ఈ సినిమా చిత్రీకరణ కోసమే గోదావరి జిల్లాలకు వెళ్లాను. ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు అర్థమైంది గోదావరి అంటే అదొక ప్రాంతం కాదు, అదొక సంస్కృతి, భావోద్వేగం అని. అక్కడి ప్రజలు మాట్లాడే విధానం, ఆ మర్యాద అద్భుతమైన అనుభూతిని కలిగించాయి. కేరళ కంటే అందమైన లొకేషన్లు గోదావరి ప్రాంతంలో ఉన్నాయి. ఈ సినిమాకి ముందు నేను 80 కథలు విన్నా. వందకు పైగా లఘు చిత్రాలు చేసిన దర్శకుడు సుభాశ్ చెప్పిన ఈ కథ ఎంతగానో నచ్చింది. నా రెండో సినిమాకి ఆయన దర్శకుడు కావడం ఆనందంగా ఉంది" అన్నారు. కథానాయిక నిధి ప్రదీప్ మాట్లాడుతూ "ఇందులో నేను మాయ అనే యువతిగా నటించా. ఆ పాత్రలోని ప్రతి భావోద్వేగాన్నీ సరికొత్తగా బయటకు తీసుకొచ్చారు దర్శకుడు. చాలామంది అమ్మాయిలకు దగ్గరగా ఉండే పాత్ర అది" అన్నారు. ప్రతి ఒక్కరూ తమను తాము చూసుకునే కథ ఇదన్నారు దర్శకుడు. ఈ కార్యక్రమంలో నటులు సుదర్శన్, రాజ్‌కుమార్ కసిరెడ్డితోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

ఒత్తిడిని తీసుకోను.. ఇవ్వను!

గతేడాది 'తేరే ఇష్క్ మే' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించింది బాలీవుడ్ నాయిక కృతి సనన్. వైవిధ్యమైన పాత్రలతో ప్రయాణిస్తున్న ఆమె.. ఈ కొత్త ఏడాదిలో తన 20వ చిత్రం 'కాక్‌టెయిల్ 2'తో తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి.. బాక్సాఫీస్ ఒత్తిళ్ల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "నేను ఎంచుకునే ప్రతి సినిమా ఒకదానికొకటి భిన్నంగా ఉండాలని అనుకుంటా. నటించిన ప్రతీ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని ఆశించకూడదు. ఇలా సినిమాలు, బాక్సాఫీస్ లెక్కల విషయంలో ఆందోళన పడను. మనం చేయగలిగేది కష్టపడి, నిజాయతీగా పనిచేయడమే. మీరు ప్రతి చిత్రానికి వంద శాతం న్యాయం చేయాలి. అంతకు మించి మన చేతుల్లో ఏం లేదు. ఎందుకంటే బాక్సాఫీస్ వద్ద ఒక సినిమాను ప్రభావితం చేయడానికి ఎన్నో అంశాలు ఉంటాయి. కాబట్టి నేను ఆ ఒత్తిడిని తీసుకోకూడదనుకుంటున్నా. నా చిత్రనిర్మాతలకు కూడా ఆ ఒత్తిడిని ఇవ్వను. బదులుగా ఈ ప్రయాణాన్ని ఆస్వాదిస్తాను" అని చెప్పుకొచ్చింది.

కృతి సనన్




'డాన్ 3'లో హృతిక్ రోషన్?



కొత్త ఏడాదిలో ప్రేక్షకులకు కొత్త డాన్ పరిచయం కాబోతున్నాడా..? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ సినీవర్గాలు. గతేడాది 'ధురంధర్'తో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నారు రణ్‌వీర్ సింగ్. ఆయన 'డాన్ 3' నుంచి తప్పుకున్నట్లు కొన్ని రోజులుగా నెట్టింట్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడాయన స్థానంలో నటించడానికి హిందీ యాక్షన్ హీరో హృతిక్ రోషన్ చర్చలు చేస్తున్నట్లు తెలుస్తోంది. "రణ్‌వీర్ తర్వాత.. హృతిక్ మాత్రమే ఆ పాత్రకు సరిగ్గా సరిపోతారని భావిస్తోంది చిత్రబృందం. చర్చలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ.. హృతిక్ చివరకు బోర్డులోకి వస్తాడా? లేదా అనేది త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయ"ని హృతిక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఇందులో నిజమెంత ఉందో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

సిద్ధార్థ్ కొత్త చిత్రం




సిద్ధార్థ్ మల్హోత్రా

గతేడాది 'పరమ్ సుందరి' చిత్రంలో ఉత్తరాది అబ్బాయిగా పరమ్ పాత్రలో ప్రేక్షకుల్ని అలరించారు కథానాయకుడు సిద్ధార్థ్ మల్హోత్రా. తన తదుపరి చిత్రాలలో భాగంగా నిర్మాత మహావీర్ జైన్‌తో కలిసి ఓ చిత్రం చేయనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాని దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి తెరకెక్కించనున్నారని సమాచారం. "ఏ జానర్‌లోనైనా ప్రేక్షకులను మెప్పించగల దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి. ఇప్పుడాయన తన రాబోయే సినిమాలో కామెడీతో పాటు థ్రిల్ పంచేందుకు సన్నద్ధమయ్యారు. ఇందులో హీరోగా నటించనున్న సిద్ధార్థ్.. ఈ చిత్రంలోని తన పాత్ర కోసం ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నార"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

సరికొత్త కియా సెల్టోస్


రూ.10.99 లక్షల నుంచి



కియా ఇండియా, సరికొత్తగా ఆవిష్కరించిన సెల్టోస్ ధర రూ.10.99 లక్షల నుంచి రూ.19.99 లక్షలు (ఎక్స్‌షోరూం) అని సంస్థ తెలిపింది. గత నెలలో ఈ కారును ఆవిష్కరించిన సంస్థ, రూ.25,000 చెల్లించి బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే ధరను మాత్రం శుక్రవారం వెల్లడించింది. ఈనెల మధ్య నుంచి ఈ కారు డెలివరీలు ప్రారంభమవుతాయని సంస్థ పేర్కొంది. 1.5 లీటర్ పెట్రోల్, టర్బో పెట్రోల్, డీజిల్ ఇంజిన్లతో మ్యానువల్, ఆటోగేర్ పద్ధతిలో ఈ ఎస్‌యూవీ లభించనుంది. హ్యుందాయ్ క్రెటా, మారుతీ సుజుకీ విక్టోరిస్ - గ్రాండ్ విటారా, టాటా సియారా, టయోటా అర్బన్ క్రూయిజర్ హైరైడర్, హోండా ఎలివేట్ వంటి మోడళ్లతో ఈ కారు పోటీ పడే అవకాశముంది.

ఐటీసీ షేరు పతనం..
ఎల్ఐసీకి రూ.11,468 కోట్ల నష్టం

మరో 2 బీమా సంస్థలకూ





సిగరెట్లపై కొత్త ఎక్సైజ్ సుంకం విధింపు ప్రభావంతో ఐటీసీ షేరుకు రెండో రోజూ నష్టాలు కొనసాగాయి. గురువారం 9.69% నష్టపోయిన ఈ షేరు.. శుక్రవారం మరో 3.79% డీలాపడి రూ.350.15 వద్ద ముగిసింది. కొత్త ఏడాది తొలి రెండు రోజుల్లో కలిపి ఐటీసీ షేరు 14% వరకు పడటంతో, ఇందులో భారీ వాటాలున్న లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఎల్ఐసీ), ఇతర ప్రభుత్వ రంగ బీమా సంస్థలూ ఆ మేరకు నష్టపోయాయి. ఎల్ఐసీకి 15.86%, జనరల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు (జీఐసీ) 1.73%, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీకి 1.4% మేర ఐటీసీలో వాటాలున్నాయి.

✦ రెండు రోజుల్లో ఐటీసీ షేరు 14% నష్టపోవడంతో ఎల్ఐసీ తన వాటా విలువలో రూ.11,468 కోట్లను కోల్పోయింది. ఐటీసీలో జీఐసీ వాటా విలువ రూ.1,254 కోట్లు, న్యూ ఇండియా అస్యూరెన్స్ వాటా విలువ రూ.1,018 కోట్ల మేర తగ్గింది. ఈ 3 బీమా సంస్థలకు కలిపి రూ.13,740 కోట్ల నష్టం వాటిల్లింది. ✦ ఐటీసీ మార్కెట్ విలువ రూ.72,000 కోట్లు హరించుకుపోయింది.

ఎంసీఎక్స్ షేరు 80% తగ్గిందా?

1:5 నిష్పత్తిలో విభజనే కారణం



మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్) షేరు ట్రేడింగ్‌ను గమనిస్తున్న వారికి శుక్రవారం ఒక్కసారిగా షాక్ తగిలినట్లయ్యింది. గురువారం ఈ షేరు ముగింపు ధర రూ.10,989 కాగా.. శుక్రవారం ఎన్ఎస్ఈలో ట్రేడింగ్ రూ.2230 వద్ద ప్రారంభం కావడమే ఇందుకు కారణం. ఎంసీఎక్స్ షేరును 1:5 గా విభజిస్తూ, తీసుకున్న నిర్ణయం జనవరి 2 నుంచి అమల్లోకి వచ్చింది. దీనికనుగుణంగానే షేరు ధర భారీగా తగ్గినట్లు కనిపించింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఎంసీఎక్స్ షేరును, రూ.2 ముఖ విలువ కలిగిన 5 షేర్లుగా విభజించారు. అంటే ఈనెల 1న ముగింపు ధర రూ.10,989గా ఉన్న ఒక షేరు, రూ.2 ముఖవిలువ కలిగిన 5 షేర్లుగా మారాక, ట్రేడింగ్ ప్రారంభమే రూ.11,150 (5X2230) వద్ద ప్రారంభమైనట్లు లెక్క. ఒక దశలో 4% పెరిగి 52 వారాల గరిష్ఠమైన రూ.2,278 ను తాకింది. చివరకు రూ.2,219 వద్ద ముగిసింది. అంటే రూ.11,095 వద్ద స్థిర పడినట్లు లెక్క. ముగింపు చూసుకున్నా, షేరుకు లాభమే వచ్చింది.

ఈనాడు బిజినెస్

సెబీ నుంచి కృత్రిమ మేధ టూల్




ముంబయి: నియంత్రిత సంస్థల సైబర్ భద్రతా సన్నద్ధతను విశ్లేషించడానికి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత టూల్‌ను అభివృద్ధి చేసే పనిలో ఉన్నట్లు సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే వెల్లడించారు. మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఎంఐఐలు) కోసం టెక్నాలజీ రోడ్‌మ్యాప్‌ను అభివృద్ధి చేయడానికి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీఎస్ఈ నిర్వహించిన 40 వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ ఆడిట్ నివేదికలు, నియంత్రణ లోపాలను గుర్తించడం, రిస్క్ ఆధారంగా సంస్థలను వర్గీకరించడం కోసమే ఏఐ టూల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పాండే వివరించారు.

టై హైదరాబాద్ ప్రెసిడెంట్‌గా మురళీ కాకర్ల

ఈనాడు, హైదరాబాద్: ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టై) హైదరాబాద్ విభాగం 2026 ప్రెసిడెంట్‌గా ఇన్ఫోబ్రిక్ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ మురళీ కాకర్ల బాధ్యతలు చేపట్టారు. సెమీకండక్టర్స్, ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్, వైర్‌లెస్ సాంకేతికతలపై ఆయనకు అనుభవం ఉంది. టై వైస్ ప్రెసిడెంట్‌గా ఈజోన్ సెక్యూరిటీ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ రవి చెప్పుపాటి కొనసాగుతారు. యువ పారిశ్రామికవేత్తలకు అనుభవజ్ఞులతో దిశానిర్దేశం చేయడంతో పాటు, వారిని పెట్టుబడిదారులతో అనుసంధానం చేస్తామని మురళి పేర్కొన్నారు. స్థానిక అంకురాలు అంతర్జాతీయ మార్కెట్లలోకి వెళ్లేందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తామన్నారు.

ఎగుమతిదార్లకు రూ.7,295 కోట్ల ప్యాకేజీ



దిల్లీ: ఎగుమతిదార్లకు రుణాల లభ్యత మెరుగుపరచడానికి రూ.7,295 కోట్ల ఎగుమతుల తోడ్పాటు ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో రూ.5,181 కోట్ల వడ్డీ సబ్‌వెన్షన్ పథకంతో పాటు రూ.2,114 కోట్ల తనఖా తోడ్పాటు ఉన్నాయి. ఈ రెండు పథకాలను, ఆరు సంవత్సరాల (2025-31) కాలవ్యవధిలో అమలు చేయనున్నారు. వీటితో ఎగుమతిదార్ల వాణిజ్య రుణ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అజయ్ భాదూ తెలిపారు. వడ్డీ సబ్‌వెన్షన్ పథకం కింద, ఎగుమతిదార్లు తమ షిప్‌మెంట్లకు ముందు, తర్వాత రుణాలపై సబ్సిడీ పొందొచ్చు. 2025 నవంబరులో ఆమోదించిన రూ.25,060 కోట్ల ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం)లో ఇవి రెండో భాగం. అంతర్జాతీయ వాణిజ్యం ఒడుదొడుకులు ఎదుర్కొంటున్న సమయంలో, పోటీ రేట్లకే ఎగుమతిదార్లు రుణాలు పొందేందుకు ఈ సబ్‌వెన్షన్ పథకం తోడ్పడనుంది. ఇందులో అర్హత కలిగిన ఎంఎస్ఎంఈ ఎగుమతిదార్లకు ప్రభుత్వం 2.75% శ్రేణిలో సబ్సిడీ ప్రయోజనాలను అందిస్తుంది. వార్షిక ప్రయోజనాన్ని సంస్థకు రూ.50 లక్షలుగా పరిమితి విధించారు.

కోడి గుడ్డు

3న ఫారం వద్ద వంద అమ్మకం ధరలు (నెక్)
(వందకు రూపాయల్లో)

హైదరాబాద్	630
వరంగల్	632
విజయవాడ	640
తూ/ప గోదావరి	625
విశాఖపట్నం	610
చిత్తూరు	693

రద్దయిన పాలసీలకు మళ్లీ జీవం: ఎల్ఐసీ

ఈనాడు, హైదరాబాద్: వివిధ కారణాలతో గడువులోపు ప్రీమియం చెల్లించకుండా నిలిచిపోయిన (ల్యాప్స్) వ్యక్తిగత జీవిత బీమా పాలసీలను పునరుద్ధరించుకునే అవకాశాన్ని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం దేశ వ్యాప్తంగా ప్రత్యేక పునరుద్ధరణ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. మార్చి 2 వరకు ఇది కొనసాగుతుంది. ఈ పథకం కింద అర్హత కలిగిన అన్ని నాన్-లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్ల ఆలస్య రుసుములో 30% వరకు రాయితీ కల్పిస్తోంది. పాలసీదారులు చెల్లించాల్సిన మొత్తం ప్రీమియం ఆధారంగా ఈ రాయితీ వర్తిస్తుంది. మొదటిసారి ప్రీమియం చెల్లించిన తేదీ నుంచి 5 ఏళ్ల లోపు ఉన్న పాలసీలను నిబంధనల మేరకు పునరుద్ధరించుకోవచ్చు. ప్రీమియం చెల్లింపు కాల పరిమితిలో ఉన్న పాలసీలకే ఇది వర్తిస్తుంది. అవసరాన్ని బట్టి ఆరోగ్యనివేదికలు సమర్పించాల్సి ఉంటుంది.

ఎయిర్, వాటర్ ప్యూరిఫయర్లపై జీఎస్‌టీ కోత!

15 రోజుల్లో మండలి సమావేశంలో నిర్ణయం



దేశంలో కాలుష్య ఇబ్బందులు పెరుగుతున్న నేపథ్యంలో.. కొత్త సూచనల మేరకు, వాటర్, ఎయిర్ ప్యూరిఫయర్లపై వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)ని 18% నుంచి 5 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రతిపాదనను పరిశీలించడానికి కేంద్ర, రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉన్న జీఎస్‌టీ మండలి వచ్చే 15 రోజుల్లోగా సమావేశమయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దిల్లీతో పాటు పలు నగరాల్లో వాయు కాలుష్యం కారణంగా ప్రజారోగ్యానికి చేటు వాటిల్లుతోందనే ఆందోళనలు, కోర్టుల జోక్యం, పరిశ్రమ, రాజకీయ నాయకుల డిమాండ్ నేపథ్యంలో వస్తువుల తగ్గింపును ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఇప్పటివరకు త్రైమాసికానికి ఒకసారి జీఎస్‌టీ మండలి సమావేశమవుతోంది. ఇంతకు ముందు చివరిసారిగా సెప్టెంబరులో మండలి సమావేశం జరిగింది. ప్యూరిఫయర్లపై పన్ను తగ్గింపునకు రాష్ట్రాల ఆర్థిక మంత్రుల మధ్య ఏకాభిప్రాయం అవసరమవుతుంది. ఈ ఉత్పత్తులను అత్యవసర వస్తువులుగా వర్గీకరించి, జీఎస్‌టీని 18% నుంచి 5 శాతానికి తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది.

✦ గృహ అవసరాల కోసం వినియోగించే కొన్ని పురుగుమందులు, ఎలుకలను చంపడానికి వాడే ఉత్పత్తులపై జీఎస్‌టీని తగ్గించడంపైనా మండలి చర్చించనుంది. వీటిపై ప్రస్తుతం 18% జీఎస్‌టీ ఉంది. ఈ ఉత్పత్తులను కూడా 5% శ్లాబ్‌కు మార్చొచ్చని అంటున్నారు.


ఇదీ నేపథ్యం: దేశంలోని ప్రధాన నగరాల్లో గాలి నాణ్యత క్షీణించడం, సురక్షిత తాగునీరు లభించడం లేదన్న ఆందోళనలతో ఎయిర్, వాటర్ ప్యూరిఫయర్లపై జీఎస్‌టీ తగ్గించాలన్న డిమాండ్లు పెరిగాయి. పన్ను రేట్ల తగ్గింపు ప్రతిపాదన పరిశీలనకు సాధ్యమైనంత త్వరగా జీఎస్‌టీ మండలి సమావేశాన్ని నిర్వహించాలని కేంద్రాన్ని గత నెల 24న దిల్లీ హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో రాజకీయ డిమాండ్లూ కూడా పెరిగాయి. వాటర్ ప్యూరిఫయర్లపై జీఎస్‌టీ తగ్గించాలని దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలి పార్లమెంట్ సమావేశాల్లో కూడా ఈ అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తింది. వీటిపై పన్నును 5 శాతానికి తగ్గించాలని పరిశ్రమ, వాణిజ్య సంస్థలు ప్రభుత్వానికి విడివిడిగా విజ్ఞప్తులు సమర్పించాయి.

బీవైడీ సీలయన్ 7 ధర రూ.50,000 పెంపు



చైనాకు చెందిన విద్యుత్తు కార్ల తయారీ సంస్థ బీవైడీ అనుబంధ బీవైడీ ఇండియా, తమ ఎస్‌యూవీ సీలయన్ 7 ప్రీమియం వేరియంట్ ధరను రూ.50,000 పెంచుతున్నట్లు శుక్రవారం తెలిపింది. ఇంతకుముందు ఈ కారు ధర రూ.48.9 లక్షలు (ఎక్స్‌షోరూం) కాగా, ఈనెల 1 నుంచి రూ.49.4 లక్షలు (ఎక్స్‌షోరూం) అయ్యిందని సంస్థ తెలిపింది. బీవైడీ సీలయన్ పర్ఫామెన్స్ వేరియంట్ ధరను మాత్రం మార్చకుండా, రూ.54.9 లక్షల వద్దే ఉంచింది. ఇప్పటివరకు దేశీయంగా సీలయన్ కార్లు 2,300 విక్రయమైనట్లు సంస్థ తెలిపింది.

ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీకి రూ.41,863 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం



ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం (ఈసీఎంఎస్) కింద రూ.41,863 కోట్ల పెట్టుబడితో తలపెట్టిన 22 నూతన ప్రతిపాదనలను ఆమోదించినట్లు ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖ శుక్రవారం తెలిపింది. ఇందువల్ల రూ.2,58,152 కోట్ల విలువైన ఉత్పత్తుల తయారీ వీలవుతుందని, 33,791 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వెల్లడించింది. గతంలో రూ.12,704 కోట్ల పెట్టుబడి అంచనాలతో 24 ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇవి అమల్లోకి వస్తే, కీలకమైన ఎలక్ట్రానిక్స్ విడిభాగాల కోసం విదేశాలపై ఆధారపడటమూ తగ్గుతుంది. ఐఫోన్ల సంస్థ యాపిల్ తన తయారీని చైనా వెలుపల విస్తరించాలని చూస్తున్న నేపథ్యంలో, ఆ సంస్థకు విడిభాగాలను సరఫరా చేసే కొత్త వెండర్లు ఇప్పుడు దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది.

ఈ కంపెనీలు: టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్, డిక్సన్, హిందాల్కో ఇండస్ట్రీస్, మదర్‌సన్ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్, శామ్‌సంగ్ డిస్‌ప్లే నోయిడా, వంటివి ఈ పథకం కింద తాజాగా దరఖాస్తు చేసుకున్నాయి.

వీటి తయారీకి: పీసీబీలు, కెపాసిటర్లు, కనెక్టర్లు, ఎంక్లోజర్లు, లిథియం అయాన్ సెల్స్, కెమేరా మాడ్యూల్స్, డిస్‌ప్లే మాడ్యూల్స్, ఆప్టికల్ ట్రాన్స్‌సీవర్స్, మొబైల్ తయారీ, టెలికాం, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్, వాహన, ఐటీ హార్డ్‌వేర్ తయారీకి తాజా ప్రతిపాదనలు వచ్చాయి.

✦ మొబైల్ తయారీలో వినియోగించే విడిభాగాల తయారీకి రూ.27,166 కోట్లు; పీసీబీ విభాగంలో రూ.7377 కోట్లు, లిథియం అయాన్ సెల్ విభాగంలో రూ.2922 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి.

ఆంధ్రప్రదేశ్ సహా 8 రాష్ట్రాల్లో: ఆంధ్రప్రదేశ్, హరియాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో కొత్త యూనిట్లు ఏర్పాటు కానున్నాయి.

2025లో 22.55 లక్షల వాహనాల తయారీ: మారుతీ



2025లో మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) 22.55 లక్షల వాహనాలను తయారుచేసింది. 2024లో తయారుచేసిన 20.63 లక్షలతో పోలిస్తే ఈ సంఖ్య 9.3% ఎక్కువ. మారుతీ ఒక ఏడాదిలో 20 లక్షలకు మించి వాహనాలను తయారుచేయడం వరసగా ఇది రెండో ఏడాది. దేశీయ విపణిలో విక్రయానికి, విదేశాలకు ఎగుమతి చేసేందుకు, ఇతర కంపెనీలకు విడిభాగాల రూపంలో అందించినవి వీటిల్లో ఉన్నాయి.

విదేశీ మారకపు నిల్వలు పెరిగాయ్



డిసెంబరు 26తో ముగిసిన వారంలో మన విదేశీ మారకపు నిల్వలు 3.293 బిలియన్ డాలర్లు పెరిగి 696.61 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. విదేశీ మారకపు నిల్వల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 184 మి.డాలర్లు పెరిగి 559.612 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 2.956 బిలియన్ డాలర్లు అధికమై 113.32 బిలియన్ డాలర్లకు పెరిగాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 60 మిలియన్ డాలర్లు పెరిగి 18.803 బిలియన్ డాలర్లకు; అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వద్ద భారత నిల్వల స్థితి 93 మి.డాలర్లు అధికమై 4.875 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఏక్విటాస్ ఎండీ హఠాన్మరణం

పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సేవల సంస్థ ఏక్విటాస్ మేనేజింగ్ డైరెక్టరు సిద్ధార్థ భైయా (47) కార్డియాక్ అరెస్ట్‌తో మరణించారు. కుటుంబంతో కలిసి విహారయాత్ర కోసం న్యూజిలాండ్‌కు వెళ్లిన సమయంలో ఈ సంఘటన జరిగిందని కంపెనీ తెలిపింది. 2012లో వ్యవస్థాపితమైన దగ్గర నుంచి, కంపెనీ అభివృద్ధిలో సిద్ధార్థ కీలక పాత్ర పోషించారని వెల్లడించింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.1000 కోట్ల ఎన్‌సీడీ ఇష్యూ



అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడో విడత ఎన్‌సీడీ (మార్పిడి రహిత డిబెంచర్ల) పబ్లిక్ ఇష్యూ జనవరి 6న ప్రారంభమై 19న ముగియనుంది. ప్రాథమిక ఇష్యూ పరిమాణం రూ.500 కోట్లు కాగా.. స్పందన ఆధారంగా దీనిని మరో రూ.500 కోట్లకు పెంచుకోనుంది. వార్షికంగా ఈ ఎన్‌సీడీలపై 8.9% ప్రతిఫలాన్ని సంస్థ ఆఫర్ చేస్తోంది. ఇష్యూ అనంతరం బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో ఎన్‌సీడీలను నమోదు చేయాలని అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రతిపాదించింది. దరఖాస్తు చేసుకున్న క్రమం (ఫస్ట్ కమ్, ఫస్ట్ సర్వ్‌డ్) ఆధారంగా ఎన్‌సీడీల కేటాయింపునకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది.

టొరెంట్, అదానీ టోటల్ సీఎన్‌జీ, పీఎన్‌జీ ధరల్లో కోత

సీఎన్‌జీ రిటెయిల్ ధరను కిలోకు రూ.3.50 వరకు; దేశీయంగా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) రిటెయిల్ ధరను స్టాండర్డ్ క్యూబిక్ మీటర్‌కు రూ.2 వరకు తగ్గించినట్లు టొరెంట్ గ్యాస్ పేర్కొంది. తాజా తగ్గింపుతో పెట్రోలుతో పోలిస్తే సీఎన్‌జీ ధర 43% చౌకగా మారినట్లు వెల్లడించింది. అదానీ టోటల్ గ్యాస్ కూడా సీఎన్‌జీ, దేశీయంగా పీఎన్‌జీ ధరలను రూ.4 వరకు తగ్గించినట్లు ప్రకటించింది. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లకు గ్యాస్ రవాణా ఛార్జీలను, ముడి సరకు వ్యయాలను తగ్గిస్తూ పెట్రోలియమ్ అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో గ్యాస్ ధరను సంస్థలు తగ్గిస్తున్నాయి.

రూ.4 లక్షల కోట్లు పెరిగిన సంపద

ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.289.80 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.677.38 కోట్లు



సెన్సెక్స్ ▲573 85762 | నిఫ్టీ ▲182 26329

బ్యాంకింగ్, లోహ, విద్యుత్ షేర్ల జోరుతో సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎన్ఎస్ఈ ప్రామాణిక సూచీ నిఫ్టీ 50 జీవనకాల గరిష్ఠాన్ని తాకినా, వెనక్కి వచ్చింది. విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాల ప్రభావంతో దేశీయ సంస్థాగత మదుపర్ల కొనుగోళ్లు కొనసాగడమూ మార్కెట్ లాభాలకు ఉపకరించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 22 పైసలు తగ్గి రూ.90.20 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.97% నష్టంతో 60.26 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.32 లక్షల కోట్లు పెరిగి రూ.481.24 లక్షల కోట్ల (5.34 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

క్రమక్రమంగా పైకి..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 85,188.60) ట్రేడింగ్ స్వల్ప లాభాల్లో 85,259.36 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత లాభాలను క్రమక్రమంగా పెంచుకుంటూ, ఒక దశలో 85,812.27 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 573.41 పాయింట్ల లాభంతో 85,762.01 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 182 పాయింట్లు పెరిగి 26,328.55 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,340 వద్ద జీవనకాల గరిష్ఠాన్ని; 26,118.40 వద్ద కనిష్ఠాన్ని తాకింది.

అన్నీ లాభాల్లో: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 5 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. ఎన్‌టీపీసీ 4.67%, ట్రెంట్ 2.58%, బజాజ్ ఫైనాన్స్ 1.9%, పవర్‌గ్రిడ్ 1.57%, ఎస్‌బీఐ 1.49%, మారుతీ సుజుకీ 1.47%, బెల్ 1.36% లాభపడ్డాయి. ఐటీసీ 3.79%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.04%, యాక్సిస్ బ్యాంక్ 0.16%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.01% నష్టపోయాయి.

'పొగాకు' షేర్లకు నష్టాల సెగ

సిగరెట్, పొగాకు ఉత్పత్తులపై ఫిబ్రవరి 1 నుంచి అదనంగా ఎక్సైజ్ సుంకాన్ని విధించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో వీటి తయారీ కంపెనీల షేర్లకు నష్టాలు కొనసాగాయి. శుక్రవారం ఐటీసీ 3.79%, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా 1.7%, వీఎస్‌టీ ఇండస్ట్రీస్ 1.49% పడ్డాయి. గురువారం ఐటీసీ 9.69%, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ 17.09%, వీఎస్‌టీ ఇండస్ట్రీస్ 0.6% నష్టపోయాయి.

రెండేళ్ల కనిష్ఠానికి 'తయారీ' వృద్ధి



దిల్లీ: డిసెంబరులో దేశీయ తయారీ రంగ వృద్ధి రెండేళ్ల కనిష్ఠమైన 55 పాయింట్లుగా నమోదైంది. నవంబరులో ఈ సూచీ 56.6 పాయింట్లుగా ఉంది. కొత్త ఆర్డర్లు నెమ్మదించడంతో కంపెనీలు ముడివస్తువుల కొనుగోళ్లు తగ్గించాయని, ఉద్యోగాల సృష్టి పరిమితమైందని హెచ్ఎస్‌బీసీ ఇండియా మ్యాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ (పీఎంఐ) నివేదిక తెలిపింది. పీఎంఐ పరిభాషలో పీఎంఐ సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు, 50 పాయింట్ల దిగువన ఉంటే క్షీణతగా పరిగణిస్తారు. డిసెంబరులో సూచీ 50 పాయింట్ల పైనే ఉన్నప్పటికీ.. గత రెండేళ్లలోనే తక్కువగా నమోదైంది. 'ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి చేరడంతో కొత్త ఆర్డర్లతో కంపెనీలు ముందుకువెళ్లొచ్చు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు లేకపోవడంతో, గిరాకీ కొనసాగే అవకాశం ఉంది' అని ఎస్ అండ్ పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పాలీయానా డీ లిమా పేర్కొన్నారు.

దేశంలో విదేశీ బ్యాంకు శాఖల ప్రతిపాదనలను పరిశీలించిన ఐడీసీ



విదేశీ బ్యాంకులు తమ శాఖలు, అధికారిక కార్యాలయాలు లేదా అనుబంధ సంస్థలను మన దేశంలో ప్రారంభించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చేసిన ప్రతిపాదనలను, ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం.నాగరాజు నేతృత్వంలోని ఇంటర్- డిపార్ట్‌మెంటల్ కమిటీ (ఐడీసీ) శుక్రవారం పరిశీలించింది. 'విదేశీ, దేశీయ బ్యాంకుల నుంచి వచ్చే ప్రతిపాదనలను ఆర్థిక సేవల విభాగానికి చెందిన ఐడీసీ మదింపు చేస్తుంది. ఒక అభిప్రాయానికి వచ్చే ముందు, హోం వ్యవహారాల శాఖ, విదేశీ వ్యవహారాల శాఖ, వాణిజ్య శాఖ వంటి సభ్య మంత్రిత్వ/విభాగాలతో కమిటీ సంప్రదింపులు జరుపుతుంది. భద్రత, రాజకీయ, ఆర్థిక కోణాల్లో వారి అభిప్రాయాలను తెలుసుకుంటుంది'అని అధికారిక ప్రకటన వివరించింది. ఆర్‌బీఐ ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ ఇండియా 2024-25 నివేదిక ప్రకారం.. భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న విదేశీ బ్యాంకుల సంఖ్య 44కు తగ్గింది.

రూ.11.93 లక్షల కోట్లు

- బీమా ప్రీమియం వసూళ్లలో రికార్డు
- స్వల్పంగా తగ్గిన జీవిత బీమా విస్తృతి
- నిర్వహణలో రూ.74.43 లక్షల కోట్లు
- ఐఆర్‌డీఏఐ 2024-25 వార్షిక నివేదిక

ఈనాడు - హైదరాబాద్

ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్నా, దేశీయ బీమా పరిశ్రమలో ప్రీమియం వసూళ్లు కొత్త శిఖరాలను తాకాయి. గత ఆర్థిక సంవత్సరంలో బీమా కంపెనీల మొత్తం ప్రీమియం వసూళ్లు రూ.11,93,444 కోట్లకు చేరినట్లు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) తాజాగా వెల్లడించింది. 2047 నాటికి 'అందరికీ బీమా' కల్పించాలనే లక్ష్యంతో సంస్థ చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నా, బీమా వ్యాప్తి తగ్గడం, తప్పుడు సమాచారంతో పాలసీల విక్రయం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి.

గత ఆర్థిక సంవత్సరంలో జీవిత బీమా సంస్థలు మొత్తం రూ.8,85,772 కోట్ల ప్రీమియాన్ని వసూలు చేశాయి. సాధారణ బీమా విభాగం ప్రీమియం వసూళ్లు రూ.1,80,218 కోట్లుగా ఉన్నాయి. ఆరోగ్య బీమా పాలసీల రంగం (వ్యక్తిగత ప్రమాద, ప్రయాణ బీమాతో కలిసి) రూ.1,27,454 కోట్ల ప్రీమియం ఆదాయాన్ని ఆర్జించింది.

✦ జీవిత బీమా విభాగంలో కొత్త పాలసీల ద్వారా వచ్చిన ప్రీమియం రూ.3,97,764 కోట్లకు చేరింది. ప్రైవేటు సంస్థలు 12.07%, ప్రభుత్వ రంగ ఎల్ఐసీ 2.75% వృద్ధిని నమోదు చేశాయి.



దేశంలో జీవిత బీమా సంస్థలు 26, సాధారణ బీమా సంస్థలు 25, ఆరోగ్య బీమా సంస్థలు 8, రీ ఇన్సూరెన్స్ సంస్థలు 12 ఉన్నాయి.

ఫిర్యాదుల పరిష్కారం..

పాలసీదారుల్లో విశ్వాసాన్ని పెంచేందుకు ఐఆర్‌డీఏఐ ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 2,57,790 ఫిర్యాదులు అందాయి. వీటిలో జీవిత బీమాపై 1,20,429 ఫిర్యాదులు వచ్చాయి. సాధారణ, ఆరోగ్య బీమాలకు సంబంధించి 1,37,361 ఫిర్యాదులు అందాయి. ప్రతి లక్ష పాలసీలకు సగటున 8 ఫిర్యాదులు నమోదైనట్లు ఐఆర్‌డీఏఐ తెలిపింది.

✦ బీమా రంగంలో పాలసీదారులను తప్పుదోవ పట్టించి పాలసీలను విక్రయించడం (మిస్-సెల్లింగ్) ప్రధాన సమస్యగా మారుతోందని నియంత్రణ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. జీవిత బీమా పాలసీలపై వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా ఇలానే ఉన్నాయి. దీనిని అరికట్టేందుకు కంపెనీలు కఠిన చర్యలు తీసుకోవాలని ఐఆర్‌డీఏఐ ఆదేశించింది.

లాభాల బాటలో..

బీమా సంస్థల ఆర్థిక పరిస్థితులూ గణనీయంగా మెరుగుపడ్డాయి. జీవిత బీమా సంస్థలు పన్ను తర్వాత రూ.56,006 కోట్ల నికర లాభాన్ని గడించాయి. 2023-24తో పోలిస్తే ఇది 18.14% అధికం. సాధారణ బీమా కంపెనీల నికర లాభం రూ.13,154 కోట్లుగా నమోదయ్యింది. క్లెయింల విషయానికి వస్తే.. మొత్తం బీమా రంగం రూ.8,35,980 కోట్ల విలువైన క్లెయింలను పరిష్కరించింది. ఇందులో జీవిత బీమా రంగం రూ.6,30,171 కోట్లు, సాధారణ బీమా రంగం రూ.1,06,777 కోట్లు, ఆరోగ్య బీమా రంగం రూ.99,032 కోట్ల క్లెయింలను చెల్లించాయి.

ఆస్తుల నిర్వహణలో వృద్ధి

బీమా రంగం నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) 10.14% వృద్ధితో రూ.74,43,516 కోట్లకు చేరింది. ఇందులో ప్రభుత్వ రంగ సంస్థల వాటా 68.40%, ప్రైవేటు బీమా సంస్థల వాటా 31.60 శాతంగా ఉంది. బీమా కంపెనీలు తమ పెట్టుబడులను ప్రభుత్వ సెక్యూరిటీలు, మౌలిక సదుపాయాల రంగం, ఇతర ఆమోదిత పెట్టుబడులకే మళ్లిస్తాయి.

బీమా విస్తృతి

ప్రపంచ బీమా మార్కెట్లో భారత్ పదో అతిపెద్ద మార్కెట్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. దేశంలో బీమా విస్తృతి జీడీపీలో 3.7%. జీవిత బీమా వ్యాప్తి 2.7% కాగా, సాధారణ బీమా వ్యాపి 1.0 శాతంగా ఉంది. 2023-24లో జీవిత బీమా వ్యాప్తి 2.8 శాతమే. తలసరి బీమా ప్రీమియం 95 డాలర్ల నుంచి 97 డాలర్లకు పెరిగింది. ఇందులో జీవిత బీమా 72 డాలర్లు కాగా, సాధారణ బీమా 25 డాలర్లుగా ఉంది.

55 లక్షల మంది ఏజెంట్లు

దేశంలో బీమాను ప్రజలకు చేరువ చేయడంలో ఏజెంట్లు, మధ్యవర్తులు కీలకపాత్ర పోషిస్తున్నారు. 2025 మార్చి నాటికి దేశ వ్యాప్తంగా 55 లక్షల మంది వ్యక్తిగత బీమా సలహాదారులు పనిచేస్తున్నారు. ఇందులో జీవిత బీమా విభాగంలోనే 31.23 లక్షల మంది ఉన్నారు. వీరితోపాటు 27 లక్షల మంది పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్స్, కార్పొరేట్ ఏజెంట్లు 661, బీమా బ్రోకర్లు 771, వెబ్ అగ్రిగేటర్లు 22 మంది బీమా సేవలను అందిస్తున్నారు.

ఈతరం

youthpage@eenadu.in

ఊరందరిదీ ఒక దారైతే..

90 ల్లోకి వెళ్దామా..



మన చుట్టూ ఒక టైప్ జనాలు ఉంటారు. ఎవరు ఏది వద్దంటే అదే చేస్తూ.. ఇబ్బందులు కొని తెచ్చుకునే రకం. నా చిన్నప్పుడు నేను కూడా అంతే. ఊరందరిదీ ఒక దారైతే మనదో దారి. ఏడేళ్ల వయసులోనే మెట్ల మీద నుంచి దూకి కుడి చెయ్యి విరగ్గొట్టుకున్నాను. ఆ తర్వాత క్రికెట్ బాల్ గట్టిగా తగిలి నుదుటి మీద బొప్పి కట్టింది. మరోసారి ఓ కర్ర తల మీద గుచ్చుకుని చాలా రక్తం పోయింది. ఇలా చిన్నప్పటి నుంచి దెబ్బలే.. ఏ రోజూ కుదురుగా ఉన్నది లేదు. ఎవరైనా 'జాగ్రత్త..' అంటే దానికి సరిగ్గా ఆపోజిట్‌లో చేసి తన్నులు తినడం మన విధానమన్నమాట.

పీజీ చదువుతున్న రోజుల్లో ఓసారి ఫ్రెండ్స్‌తో కలిసి దగ్గర్లో ఉన్న కొండ ఎక్కా. అక్కడున్న గుడిలో దర్శనం చేసుకున్న అనంతరం... 'ఒరేయ్, మెట్ల మీద నుంచి దిగడంలో ఏం ఉందిరా.. ఈ అడ్డదారిలో దిగుదాం రా' అని పిలిచాడు నా ఫ్రెండు గాడు. అలాంటివి వినగానే వెయ్యివాల్టుల బల్బులా వెలిగేది మన ఫేసు. దాంతో మొత్తం నలుగురం అలా దిగడం మొదలు పెట్టాం. కొండ ఏటవాలుగా ఉండటం వల్ల మేం దిగే వేగం అంతకంతకూ పెరిగింది. ఎప్పుడు రాయి తగిలిందో తెలియదు.. నేను ముందుకు పడిపోవడం, దొండకాయలా దొర్లిపోవడం చకచకా జరిగిపోయాయి. లేచి చూసేసరికి ఎడమ చేయి మణికట్టు దగ్గర వాపు. మిగతా మిత్రులు ఆసుపత్రికి మోసుకెళ్తే.. ఫ్రాక్చర్ అని చెప్పి పిండికట్టు వేశారు. దాదాపు రెండు నెలలు నానాబాధ పడ్డాను, సెమిస్టర్ పరీక్షలు రాయడం కుదరక, తర్వాత రాసినా.. మంచి ర్యాంకు మిస్ అయ్యింది. ఆ తర్వాత కూడా ఇలాంటి దెబ్బలు మామూలైపోయాయి.

విచిత్రం ఏమిటంటే.. నా పిల్లలకు కూడా ఇలాగే అన్నీ తిక్కతిక్కగా చేసి దెబ్బలు తినే వాటం వచ్చింది. ఏమిటో మరి!

– ఎం.లక్ష్మీ నారాయణ, హైదరాబాద్

నిర్ణయం సరే.. మరి అమలు?



కొత్త సంవత్సరం వచ్చేసింది.. జిమ్‌లు మన యూత్ జనాలతో కళకళలాడిపోతుంటాయి. లైబ్రరీలు చదువరులతో సైలెంట్‌గా మెరుస్తుంటాయి. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు డైలీ రొటీన్‌లోకి వచ్చి చేరతాయి. ఇక్కడి వరకూ అంతా బాగానే ఉంది.

ఓ వారం గడిచేసరికి మాత్రం.. 'ఎక్కడో తేడా కొడుతుంది శీనా' అనిపిస్తుంది. 'ఇంత మంచులో జిమ్‌కి వెళ్లే జులుం చేస్తుందే' అంటుంది మనసు. 'ఒక్క సమోసాకి ఏం కాదులే' అంటుంది పొట్ట. నెమ్మదిగా న్యూఇయర్ రిజల్యూషన్లు 'కరిగిపోయాను కర్పూరదీపంలా' అని పాడుకోవడం మొదలుపెడతాయి.

అందుకే నిర్ణయం తీసుకోవడం కాదు.. దాన్ని కొనసాగించడంలోనే గెలుపు ఉంది అంటారు పెద్దలు. అందులోనూ ముందు ఉత్సాహంగా రేసుగుర్రంలా మొదలుపెట్టే మన కుర్రకారు.. తర్వాత తాబేలులా వేగం తగ్గించకుండా ఉండాలంటే.. ఈ టిప్స్ పాటించేద్దాం!

జిమ్

జిమ్‌కి వెళ్లిన మొదటి రోజు బాగానే ఉన్నా, రెండో రోజుకి కాళ్లు, చేతులకు ఎవరో నట్లు బిగించేసినట్టు ఉండటం చాలా కామన్. దాని వల్ల రెండు మూడు రోజుల తర్వాత వెళ్లడం మానేసేవారు మనలో చాలామంది ఉంటారు. అలా కాకుండా ఉండాలంటే.. ఒకే రోజు అన్నీ చేసేయకుండా నెమ్మదిగా పెంచుకుంటూ వెళ్లాలి. ఒకే రకమైన వ్యాయామం కాకుండా రెండు మూడు రోజులకు ఒకసారి మార్చాలి. జిమ్‌కు సంబంధించి మనకంటూ ఒక షెడ్యూల్ ఉండాలి. అప్పుడు కొనసాగించడం ఈజీ అవుతుంది.

డబ్బు

అనుకున్న ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడానికి ఒక్కొక్కరిదీ ఒక్కో పద్ధతి. కానీ ముందు పొదుపు, మదుపు చేశాకే ఖర్చులు అన్నది ఎక్కువ మంది నిపుణులు సూచించే విధానం. అయితే ఇది అలాగే అమలు కావాలంటే అత్యవసర నిధి, ఆదాయానికి మించి అప్పులు ఉండకుండా ఉండాలి. ఈ ఏడాది వీటన్నింటినీ ఒక్కొక్కటిగా గాడిలో పెట్టే ప్రయత్నాన్ని కొనసాగిద్దాం. ఒక్కసారి ఇదంతా అదుపులోకి వస్తే.. మనీ మేనేజ్‌మెంట్ ఎంత సులభమో మనకే తెలుస్తుంది.

షాపింగ్


నెలలు మారే కొద్దీ మార్కెట్‌లోకి కొత్త రకం దుస్తులు, వస్తువులు వస్తుంటాయి. కానీ వచ్చిన ప్రతిదీ కొనకుండా కట్టడి చేసుకోవాలి. ఇలా కంటికి కనిపించినవల్లా కొనడం జేబు బరువు తగ్గిస్తుంది, ఇంట్లో ఖాళీ లేకుండా చేస్తుంది. అందుకే ఇప్పటికే ఉన్న దుస్తులు, యాక్సెసరీలతో కొత్తకొత్త లుక్స్ ట్రై చేద్దాం. దీనివల్ల షాపింగ్ తక్కువ చేయాలి అనే రిజల్యూషన్ కొనసాగించవచ్చు.

సమయం

గడిచిన కాలం తిరిగిరాదు. ఉన్న సమయాన్నే మనం సద్వినియోగం చేసుకోవాలి. ఏదైనా పనిని రేపు, ఎల్లుండి చేద్దాంలే అన్నట్లు కాకుండా అనుకున్నప్పుడే మొదలు పెట్టడం మేలు. టైం సేవింగ్, మేనేజ్‌మెంట్‌కు అనేకరకాల టెక్నిక్స్ అందుబాటులో ఉన్నాయి. ఊరికే 'టైమ్ వేస్ట్ చేయకూడదు' అనుకోకుండా.. వాటిలో నచ్చిన టెక్నిక్‌ను క్రమం తప్పకుండా ఫాలో అవ్వడం ద్వారా ఈ నిర్ణయం కలకాలం కొనసాగుతుంది.

ఆహారం

'రాత్రుళ్లు అన్నం మానేయాలి, నాన్‌వెజ్ తగ్గించాలి, వేపుళ్లు అసలే వద్దు, స్ట్రీట్‌ఫుడ్ జోలికి పోవద్దు..' ఇలా ఏ రిజల్యూషన్ అయినా తీసుకోండి. కానీ దాన్ని కంటిన్యూ చేయాలంటే అప్పుడప్పుడు చీట్ కూడా చేయాలన్న విషయాన్ని గుర్తించాలి! సెలబ్రిటీలు కూడా కఠినమైన నియమాలు పాటిస్తూనే.. ఎప్పుడైనా ఒకసారి తమకు నచ్చిన ఆహారాన్ని మితంగా తీసుకుంటారు. ఇలా చేయడం ద్వారా మనం అనుకున్న డైట్‌ను మిస్ చేయకుండా ఫాలో కాగలం.



మనపై నమ్మకంతో..

ఎంత అనుకున్నా, ఎన్ని విజయాలు సాధించినా.. ఒక్కోసారి ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతూ ఉంటుంది. అలాంటప్పుడు ఈ టిప్స్ పాటించాలి అంటున్నారు నిపుణులు.

1 **బలాలు:** ప్రతి ఒక్కరికీ కొన్ని నైపుణ్యాలు ఉంటాయి, అవే మన బలం. లేని వాటి గురించి ఆలోచించి బాధపడటం కంటే.. ఉన్న వాటిని గుర్తుచేసుకోవాలి. వాటిలో నిరంతరం సాధన చేయడం ద్వారా ఇంకా నిష్ణాతులమయ్యే వీలుంటుంది. మనపై మనకు పూర్తి విశ్వాసం కలుగుతుంది.

2 **పోలిక వద్దు:** ఇతరులతో పోల్చుకోవడం వల్ల మనకు ఎప్పుడూ ఏదో ఒక లోటు కనిపిస్తూనే ఉంటుంది. ఎవరికి వారు ప్రత్యేకం అనే విషయాన్ని గుర్తించాలి. గతానికీ, ప్రస్తుతానికి మనలో వచ్చిన పాజిటివ్ మార్పులను గమనిస్తూ మనతో మనల్నే పోల్చుకోవాలి. అదే సరైన గీటురాయి.

3 **ఆలోచన:** ఏదైనా విషయం గురించి పాజిటివ్‌గా ఆలోచిస్తే అలాంటి మంచి ఫలితాలే వచ్చేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఏ విషయమైనా.. ముందే 'ఇది నేను చేయలేను' అనేలాంటి ధోరణిలోకి వెళ్లిపోకూడదు. మన ఆలోచనాసరళికి చాలా బలముంది. దాన్ని ఎప్పుడూ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చే ఆలోచనలవైపే నడిపించాలి.

4 **నమ్మకం:** ఏదైనా సరే, మనం కచ్చితంగా సాధించగలం అనే నమ్మకం ఉండాలి. 'నా వల్ల ఇది అవుతుంది' అనే ధీమా.. చేయగలమా లేదా ఆందోళనను, అపనమ్మకాన్ని తగ్గిస్తుంది. తద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

5 **దయ:** ఇతరుల పట్ల దయగా ఉండాలి. మనం ఎవరికైనా సహాయం చేసినప్పుడు వారి నుంచి వచ్చే సంతోషంతో కూడిన స్పందన మనలో చాలా ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. అందుకే ఎప్పుడూ కాన్ఫిడెంట్‌గా అనిపించడానికి చిన్నచిన్న మంచి పనులు చేయడం కూడా ఉపకరిస్తుంది.

నేనే లీడర్



చలికాలంలో..

కాలానికి తగినట్టు పూలు, పండ్లు రావడం చూస్తుంటాం.. కానీ డేటింగ్ కూడా సీజన్‌ను బట్టి మారిపోతుంది అంటే విచిత్రంగా ఉంది కదూ! ఇలాంటిదే 'స్నోమానింగ్'. ఇది ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఓ డేటింగ్ విధానం. మంచులో స్నోమాన్‌తో ఆడుకుని తర్వాత విడిచిపెట్టేస్తారు కదా.. అలాగే స్నోమానింగ్‌లో కూడా కేవలం శీతాకాలం సీజన్‌ను ఎంజాయ్ చేయడం కోసమే అవతలి మనుషులు ఉంటారు. వరసగా వచ్చే పండగల సీజన్ కదా! ఈ టైమ్‌లో ఒంటరితనాన్ని, సామాజిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఇదో తాత్కాలిక బంధం అన్నమాట. ఈ పరిచయం ఎక్కువ రోజులు కొనసాగదు. సీజన్ మారగానే ఎవరి దారి వారిదిగా ఉంటుంది. ఇందులో బలమైన బంధాలేవీ ఉండవు, చలికాలమంతా కలిసి ఉండి తర్వాత విడిపోతారు.



కొంటె కొటేషన్



1. ముందు పొట్ట వెనక బట్ట.. ఇక ఎగిరేదెట్టా?
– రాజశ్రీ, మిర్యాలగూడ

2. ఏం బాలెన్స్ బాసూ.. అక్కర్లేదు వేరే త్రాసు
– ఆర్.హరిశంకర్ గౌడ్, తూప్రాన్

3. సూపర్‌మాన్‌కంటే.. ఈ ఫాట్‌మానే గొప్ప
– దీప్తి, విజయవాడ

ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.



భళా భవానీశంకర్

అందరి కంటే విభిన్నంగా ఉండాలనే ఆలోచన.. పోటీ యుగంలో ముందుండాలనే తపన.. తాను ఎంచుకున్న వైద్యరంగంలో సత్తా చాటాలనే బలమైన సంకల్పం ఆ యువకుడిది. వైద్యరంగంలో రాణిస్తూ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) దిల్లీ నిర్వహించిన జాతీయస్థాయి డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (డీఎం) ప్రవేశపరీక్ష తొలి ప్రయత్నంలోనే మెరిట్ సాధించాడు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన యువ డాక్టర్ దొద్దెటిపల్లి భవానీశంకర్. ఏకంగా మొదటి స్థానంలో నిలిచి వైద్యవిజ్ఞాన రంగంలో తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నాడు.



భవానీశంకర్ తండ్రి సుధాకర్ తిరుపతి సీఐడీ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తల్లి సుధామాధవి గృహిణి. పదోతరగతి వరకూ ప్రొద్దుటూరులో చదివిన ఈ యువకుడు విజయవాడలో ఇంటర్ పూర్తి చేశాడు. వైద్య వృత్తిలో ప్రవేశించాలనే లక్ష్యంతో ఎంసెట్‌లో 115వ ర్యాంకు సాధించి కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందాడు. ఇది పూర్తయ్యాక ఎయిమ్స్ నిర్వహించిన ఐఎన్ఐ-సెట్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ కంబైన్డ్ ఎంట్రన్స్ టెస్ట్) ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 98వ ర్యాంకు సాధించి 2023లో పుదుచ్చేరిలోని జేఐపీఎంఈఆర్ (జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)లో సీటు సంపాదించాడు.

★ సూపర్ స్పెషాలిటీ డీఎం (కార్డియోవాస్క్యులర్ రేడియాలజీ, ఎండోవాస్క్యులర్ ఇంటర్వెన్షన్- 3 సంవత్సరాలు) విభాగంలో దేశంలో కేవలం 5 సీట్లు (దిల్లీ ఎయిమ్స్-2, తిరువనంతపురం ఎస్‌సీటీఐఎం ఎస్‌టీ-3) ఉన్నాయి. దీని గురించి తెలుసుకున్న శంకర్ ఇందులో ప్రవేశం పొందాలని భావించి ప్రవేశ పరీక్షకు హాజరయ్యాడు. తొలి ప్రయత్నంలోనే సత్తా చాటి ఎయిమ్స్ మెరిట్ లిస్ట్ (ఏఎంఎల్)లో మొదటి ర్యాంకు, సీఎంఎల్ (కామన్ మెరిట్‌లిస్ట్)లో రెండో ర్యాంకు సాధించాడు. మెరిట్ సాధించడంతో రెండు చోట్లా ప్రవేశం పొందే సౌలభ్యం ఉంది. పీజీ పూర్తయ్యాక అక్కడ చేరనున్నాడు. తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయి పరీక్షలో మెరిట్ సాధించిన కుమారుడి ప్రతిభపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి దేశంలో కార్డియోవాస్క్యులర్ రేడియాలజీ, ఎండోవాస్క్యులర్ ఇంటర్వెన్షన్ విభాగంలో అతి తక్కువ మంది డాక్టర్లు ఉన్నారు. ఈ విభాగంలో అవకాశాలు కూడా తక్కువ. ఈ కోర్సు చేయడం కష్టమైనది, చాలా సున్నితమైనది, నైపుణ్యం తప్పనిసరి. అందుకే కష్టసాధ్యమైన మార్గాన్ని ఎంచుకున్నా అంటున్నాడు భవానీ శంకర్. వైద్యరంగంలో ప్రవేశించాలని కోరుకునే యువతకు తన ప్రతిభ స్ఫూర్తిదాయకం.

– పెద్దిరెడ్డిగారి పవన్‌కుమార్‌రెడ్డి, కడప

పుస్తకంతో దోస్తీ

ఎంత ఏఐతో పరిగెట్టినా.. పుస్తకం ప్రాధాన్యం మనం ఫీలవుతూనే ఉన్నాం. అందుకే ఇంతటి సోషల్‌మీడియా యుగంలోనూ పుస్తకాలు చదివే వారు, రాసేవారు పెరుగుతున్నారు.. ముఖ్యంగా యూత్‌లో! ఇప్పటికే మనలో చాలామంది 'నెలకు ఒక బుక్ అయినా చదివేయాలి' అని రిజల్యూషన్ పెట్టుకునే ఉంటారు. అయితే ఇలా చదవడంలో చిన్న చిన్న కిటుకులు పాటిస్తే.. అనుకున్న సమయంలో అనుకున్న పుస్తకాలు చదివేయొచ్చు!

★ కాలేజీకి, ఆఫీస్‌లకు.. వెళ్లి వచ్చే దారిలో చదవడం అలవాటు చేసుకోవడం ద్వారా సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

★ అంతగా నచ్చని పుస్తకాన్ని వెనక్కి పెట్టొచ్చు. బాగా చదవాలి అనే ఆసక్తి ఉన్న బుక్‌ను మాత్రమే ముందు తీయాలి. ఆసక్తి ఉంది కదా అని ఏకబిగిన చదివినా త్వరగా బోర్ కొట్టే ప్రమాదం ఉంది. ప్రతిరోజూ కొన్ని పేజీలు చదువుతూ ఆసక్తిని కొనసాగించడం ఉత్తమం.

★ రోజుకు కనీసం 15 నుంచి 20 నిమిషాల పాటైనా చదవాలి. ఎంత బిజీగా ఉన్నా, మూడ్ లేకపోయినా ఈ అలవాటు మానకూడదు. కన్సిస్టెన్సీ చాలా ముఖ్యం.

★ ఏ పుస్తకాన్ని అయినా మనం ఏ ఉద్దేశంతో చదువుతున్నామో ముందే అనుకోవాలి. చదువుతున్నప్పుడు దానికి తగిన విధంగా విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేయాలి. దాని ద్వారా మరిన్ని పుస్తకాలు చదవాలనే ఉత్సాహం కలుగుతుంది.

★ కొత్తభాష నేర్చుకోవాలి, సాధన చేయాలి అంటే.. అందులో తేలిగ్గా అర్థమయ్యేలాంటి పుస్తకాలను ఎంచుకోవాలి. తెలిసిన భాషలో సాహిత్యాన్ని ఆస్వాదించాలంటే ప్రామాణికమైన పుస్తకాలు తీసుకోవాలి. అవసరానికి తగిన విధంగా బుక్స్‌ను ఎన్నుకోవడం కూడా తెలిసి ఉండాలి.



★ చదువుతున్న దాన్ని ఊహించుకోవడం ద్వారా ఇంకా చదవాలనే ఎగ్జైట్‌మెంట్ పెరుగుతుంది.

★ ఏదైనా ఒక పనిని 21 నుంచి 25 రోజులపాటు క్రమం తప్పకుండా చేస్తే అది అలవాటుగా మారుతుంది అనేది ఓ థియరీ.. ముఖ్యంగా పుస్తకపఠనం విషయంలో! అందుకే నచ్చిన పుస్తకాన్ని ప్రతిరోజూ పలకరించండి!

ఏ దుస్తులు.. ఎప్పుడు?

ట్రెక్కింగ్.. వారాంతంలో సంతోషంగా గడపాలి అనుకునే వారికి చక్కని ఆటవిడుపు. ఇలా వెళ్లేటప్పుడు సమయానికి తగిన విధంగా దుస్తులు ధరించడం ద్వారా.. ఉల్లాసపు అనుభూతిని పూర్తిగా ఆస్వాదించగలం. అది ఎలా అంటే..



ఒక్కరోజు అయితే..

ఒక్క రోజులో పూర్తయ్యే చిన్న చిన్న ట్రెక్స్ ఇవి. ఇందులో పర్యాటకులు ఇంటికి దగ్గర్లో ఉన్న ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇలా వెళ్లినప్పుడు తేమను పీల్చే, త్వరగా ఆరిపోయే లాంటి దుస్తులు ధరించాలి. సింథటిక్ మిశ్రమాలు (పాలిస్టర్, నైలాన్) లేదా మెరినో ఉన్నితో తయారు చేసిన పొడవైన చేతులు గలవి వేసుకోవడం మంచిది. దీనివల్ల సూర్యరశ్మి, కీటకాల నుంచి శరీరాన్ని రక్షించుకోవచ్చు. ఈ సమయంలో కాటన్ దుస్తులు వాడకూడదు. కాళ్లకు సరిపోయే హైకింగ్ బూట్లు వాడాలి. వెడల్పు అంచుగల సన్‌టోపీ పెట్టుకోవాలి. కళ్ల కోసం యూవీ రక్షిత సన్‌గ్లాసెస్ వాడితే మంచిది. దీంతోపాటు కావాల్సిన స్నాక్స్, తప్పనిసరి వస్తువుల కోసం డేప్యాక్ వాడాలి.

పర్వతారోహణ

ఇది నిటారుగా ఎత్తయిన మార్గాలుండే కొండలు ఎక్కడం. అక్కడ ఉండే మంచు, గాలికి తగ్గట్లు రెయిన్ ప్యాంట్లు వేసుకోవాలి.

అటవీ ప్రాంతాలు

అడవుల్లో ఉండే చెట్ల నుంచి కాళ్లను రక్షించుకోవడానికి పొడవైన ప్యాంట్లు ఉండాలి. అక్కడ వాతావరణానికి తగ్గట్లుగా గాలి నిరోధక రెయిన్ జాకెట్ బాగుంటుంది. కొన్నిసార్లు తేమ నిండిన పరిస్థితులు కూడా ఉండొచ్చు. తగిన షూ వేసుకోవాలి.

విలేజ్ ట్రెక్కింగ్

ఈ ట్రెక్కింగ్ అనేది ప్రకృతిని, సంస్కృతిని తెలుసుకోవడం కోసం చేస్తారు. ఈ ట్రెక్కింగ్ కోసం ఫ్లీస్ లేదా ఇన్సులేటెడ్ జాకెట్‌ను తీసుకెళ్లండి. ఒకవేళ వర్షం పడే అవకాశం ఉంటే వాటర్‌ప్రూఫ్ జాకెట్ దగ్గర పెట్టుకోవడం మంచిది.

నది/లోయ

నదులు, లోయలు, జలపాతాల వెంబడి ట్రెక్కింగ్ చేసేటప్పుడు.. అక్కడి పరిస్థితికి తగ్గట్లుగా లేయర్స్‌గా ఉండే జాకెట్‌ను వాడాలి. ఫ్లిప్-ఫ్లాప్‌లను వాడొద్దు.

ఎక్కువ రోజులు

ఈ ట్రెక్కింగ్ ఒకటి కంటే ఎక్కువ రోజులు ఉంటుంది. ఒకే ప్రదేశం కాకుండా వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సి రావొచ్చు. ముందు అనుకున్న విధానంలో ఒకటి రెండు జతలు పట్టుకువెళ్లాలి.

ఎడారి ట్రెక్కింగ్

ఇది ఇసుక, పొడి ప్రాంతాల్లో చేసేది. వేడి వాతావరణం అయినా సరే.. రాత్రిపూట లేదా ఎక్కువ ఎత్తులో ఉష్ణోగ్రతలు తగ్గిపోతాయి. అందుకోసం తేలికపాటి ఫ్లీస్ జాకెట్ లేదా పఫీ ఇన్సులేటెడ్ జాకెట్‌ను తీసుకువెళ్లాలి. మెడను ఎండ నుంచి కాపాడుకోవడానికి నెక్ గైటర్ లేదా స్కార్ఫ్ తీసుకువెళ్లడం మంచిది.


శీతాకాలపు..

చలికాలం వస్తే చాలు.. యువత ఎక్కడికి వెళ్దాం అనే ఆలోచిస్తారు. ఏడాదిలో ఎక్కువ ట్రెక్కింగ్‌లు శీతాకాలంలోనే జరుగుతాయి. ఇలాంటి సమయంలో చలిని తట్టుకోగల థర్మల్ టాప్స్ వేసుకోవాలి. మంచు నుంచి శరీరాన్ని రక్షించుకోవడానికి వాటర్‌ప్రూఫ్ లేదా గాలి నిరోధక జాకెట్ ఉంటే మంచిది.

మెయిల్ పంపండి

ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు రాసి పంపండి. మా మెయిల్ అడ్రస్ youthpage@eenadu.in

గులాబీ అత్తరు



పంచుకుందాం

**గులాబీ అత్తరు
గుబాళించింది
నీ మనసు
నన్ను తాకాక
నీ నవ్వు అలలై
నన్ను చేరాక
ఆహా ఏం పరవశమో
ఎంత పరిమళమో
మనసు ఆకాశవీధిలో
ఊయలూగుతోంది
ఆనందంతో!**

- రాళ్లబండి సంగం నాయుడు

చిన్ననాటి ఆసక్తితో..

చిన్నప్పుడు చదువుకున్న గలివర్ అండ్ లిల్లిపుట్ పాఠం అతడికి చాలా ఇష్టం. అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర మన నేలపై తయారైంది అని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. తనకూ అలాంటి సూక్ష్మకళపై ఆసక్తి పెరిగింది. నెమ్మదిగా కళారూపాలు తయారు చేయడం ప్రారంభించాడు. ఇప్పటి వరకూ వెయ్యికిపైగా ఇలాంటివి తయారుచేసి అందరి మెప్పు పొందుతున్నాడు!



కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన **అశోక్ శ్రీనాథ్ శ్రీవైష్ణవ** పెన్సిల్ లెడ్ మీద అనేక రూపాలను సునాయాసంగా చెక్కుతున్నాడు. ప్రస్తుతం సంగారెడ్డిలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తండ్రి పద్మనాభ ఆచార్యులకు తోడుగా ఉండాలనే సంకల్పంతో అర్చకత్వంలోనూ ప్రావీణ్యం సంపాదించాడు. అశోక్ తల్లి లక్ష్మి ప్రైవేటు టీచర్. ఆమె ద్వారా లిల్లీపుట్ గురించి తెలుసుకున్నాడు. ఆ సరదాతో చిన్న చిన్న దుస్తులు, ఆభరణాలు, షూలు వంటివి పెన్సిల్ లెడ్‌తో తయారుచేయటం మొదలుపెట్టాడు. సుద్దముక్కలతోనూ కళారూపాలు తయారు చేశాడు. ఫిజిక్స్‌ను ఆధారంగా చేసుకుని కదిలే బొమ్మలను కూడా చేస్తున్నాడు!

సహస్ర సూక్ష్మలింగాలు

ఇప్పటిదాకా అశోక్ చేసిన బొమ్మల్లో సహస్ర సూక్ష్మ శివలింగాలు ముఖ్యమైనవి. వెయ్యి శివలింగాలను పెన్సిల్‌తో చెక్కటం పెద్ద సాహసమే అయింది. ఇదే సమయంలో 2021లో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు కోసం లెడ్‌తో చైన్‌లింక్ తయారు చేశాడు. కొవిడ్ సమయంలోనూ ప్రజల్లో చైతన్యం తీసుకురావటానికి తన వంతుగా సూక్ష్మ కళను ప్రదర్శించాడు. మాస్కులు, సామాజిక దూరం వంటివి ఇందులో ఉన్నాయి.



2019లో గంటానలభై నిమిషాల్లో 5.3 మిల్లీమీటర్ పరిమాణంతో పెన్సిల్‌పై వినాయకుడి విగ్రహాన్ని చెక్కాడు. ఇప్పటికే అనేక ప్రదర్శనలు చేశాడు. 30కి పైగా అవార్డులు అందుకున్నాడు. 2019లో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్, 2020లో ఓఎన్‌జీ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ అందుకున్నాడు. ఈనాడు 50 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక రూపాన్ని తయారు చేశాడు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 10 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సూక్ష్మకళలో శిక్షణ ఇస్తున్నాడు.

– జీళ్ల సత్యనారాయణ, జిన్నారం, అమీన్‌పూర్

రివర్స్‌లో చెప్పేస్తాం

నచ్చిన వారికి ఏదైనా చెప్పాలి అనిపిస్తుంది. కానీ దానికి అచ్చంగా వ్యతిరేకంగా విషయాన్ని చెబుతారు. 18 నుంచి 26 ఏళ్ల మధ్యనున్న వారిలో దాదాపు 22 శాతం జెన్‌జీలు.. ఇలాంటి ట్రిక్ వాడుతున్నారని డేటింగ్ యాప్ క్వాక్ క్వాక్ చేసిన సర్వేలో తేలింది. అలా అని ఇది మానిప్యులేషన్ కాదు సుమా.. ఫ్లర్టింగ్, సరదాగా మాట్లాడే సందర్భాల్లో ఇలా చేస్తున్నారట. అవతలి వారిని ఆటపట్టించడానికి, మంచి సంభాషణ బిల్డ్ చేయడానికి ఇలా రివర్స్ సైకాలజీని వాడుతున్నారట. మరి మీరు కూడా ట్రై చేస్తారా..!

అన్‌రొమాంటిక్



స్వాతి : 'బేబీ నన్ను నువ్వెప్పుడూ పొగడవు నువ్వు.. ఇప్పుడు సరదాగా ఏమైనా చెప్పొచ్చుగా'

స్వాతి ముత్యం : 'హమ్.. ఎలా పొగడాలబ్బా.. ఆc.. మొక్కజొన్న కుచ్చులా ఉంటుంది నీ జుట్టు. అందుకే బొచ్చు కుక్కపిల్లలా తిరుగుతున్నా నీ చుట్టూ. పదకొండో రోజు చేస్తారు పెద్దకర్మ.. నువ్వే నా అందాల ముద్దుగుమ్మ. రోడ్డు పక్కన ఉంటుంది మట్టి.. నువ్వే నా హనీ క్యూటీ. రైల్లో అమ్ముతారు ఆలూసమోసా.. నువ్వు నా గుండెల్లో పాడతావ్ ప్రేమ పదనిస!

స్వాతి : నీకు దండం.. ఇంకెప్పుడూ అడిగినా సరే ఏం చెప్పకు, ప్లీజ్!

ర్యాగింగ్.. లైంగిక వేధింపులు..

- చికిత్సపొందుతూ విద్యార్థిని మృతి
- హిమాచల్‌లో ప్రొఫెసర్‌తోపాటు ముగ్గురు సీనియర్లపై కేసు

శిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో దారుణం వెలుగుచూసింది. సీనియర్ల ర్యాగింగ్, ప్రొఫెసర్ లైంగిక వేధింపులకు ఓ విద్యార్థిని (19) బలైంది. సీనియర్ల దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విద్యార్థిని ప్రాణాలు విడిచింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు విద్యార్థినులను, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డిసెంబరు 26న లుధియానా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితురాలు ప్రాణాలు విడిచినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు.. ధర్మశాలలోని ఓ ప్రభుత్వ కళాశాలలో బాధితురాలు డిగ్రీ చదువుతోంది. గతేడాది సెప్టెంబరు 18న ఆమెపై ముగ్గురు సీనియర్లు హర్షిత, అక్రితి, కోమోలికా దాడి చేశారు. మరోపక్క ప్రొఫెసర్ అశోక్ కుమార్ లైంగికంగా ఆమెను వేధించేవాడు. దాడిలో గాయపడిన విద్యార్థిని మృతిచెందింది. లైంగిక వేధింపులు, ర్యాగింగ్ కారణంగానే తన కుమార్తె మానసిక ఒత్తిడికి గురైందని, దీంతో ఆమె ఆరోగ్యం క్షీణించిందని బాధితురాలి తండ్రి వాపోయారు. మృత్యువుతో పోరాడుతున్న సమయంలో లైంగిక వేధింపులు, ర్యాగింగ్‌కు సంబంధించి బాధితురాలు మాట్లాడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

యెమెన్‌లో మళ్లీ అంతర్యుద్ధం!

- సౌదీ, యూఏఈల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు



యెమెన్‌లో తాజా ఘర్షణలు పశ్చిమాసియాలో రెండు శక్తిమంతమైన దేశాలైన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. నిన్న మొన్నటివరకు ఒకే తాటిపై ఉన్న ఈ రెండు దేశాలు ప్రస్తుతం యెమెన్‌లో చెరో వర్గానికి మద్దతుగా నిలిచాయి. దీంతో కొన్నాళ్లుగా ఘర్షణలకు దూరంగా ఉన్న ఆ దేశం మళ్లీ అంతర్యుద్ధం ముంగిట నిలబడింది.

ఘర్షణకు బీజాలు పడ్డాయిలా..

యెమెన్‌లో అంతర్యుద్ధం 2014లో ప్రారంభమైంది. ఆ యుద్ధంలో కీలక సనా నగరాన్ని హూతీ తిరుగుబాటుదారులు ఆక్రమించడమే కాదు.. దేశంలో ఉత్తర భాగాలను తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. దక్షిణ, తూర్పు యెమెన్‌లను అంతర్జాతీయ గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వం (ఐఆర్‌జీ) పాలిస్తోంది. ఆ పాలక మండలిలో సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్(ఎస్టీసీ) కీలక భాగస్వామి ఇప్పుడు ఆ భాగస్వామే.. స్వతంత్ర దక్షిణ యెమెన్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు కదలడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. డిసెంబరు నుంచి ఎస్టీసీ కీలక ప్రాంతాలను ఆక్రమించడం ప్రారంభించింది. ఆ నెల రెండో వారంలోనే హద్రమౌత్, అల్-మరాహ్ సహా పలు ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకుంది. ఇంధన వనరులు అధికంగా ఉన్న ఈ భూభాగాలను ఆక్రమించడంతో ఒక్కసారిగా యెమెన్‌లో అలజడి రేగింది.

ఎవరెటువైపు..?

యెమెన్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తోంది. దక్షిణ యెమెన్‌ను స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ఎస్టీసీకి యూఏఈ అండగా నిలబడింది. వాస్తవానికి హూతీలకు వ్యతిరేకంగా ఉన్న గ్రూపులన్నింటిని సౌదీ, యూఏఈలే ఏకం చేశాయి. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఎస్టీసీకి యూఏఈ అండగా నిలిచింది. మరోవైపు యెమెన్ సమైక్యంగా ఉండాలన్న సౌదీ భావన. ఎస్టీసీ దాడులతో హూతీలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం బలహీనమవుతుందని చెబుతోంది. పైగా తమ దేశ సరిహద్దులకు దగ్గరగా ఉన్న ప్రాంతాలను ఎస్టీసీ ఆక్రమించడం.. తమ దేశ అంతర్గత భద్రతకు ముప్పుగా భావిస్తోంది. అందుకే తూర్పు భూభాగాల నుంచి వైదొలగాలని గత నెల 25న ఎస్టీసీకి హెచ్చరిక జారీ చేసింది. దీన్ని ఆ సంస్థ పట్టించుకోకపోవడంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది.

అందుకే దాడి

ఎస్టీసీకి ఆర్థిక సాయమే కాదు.. ఆయుధ సాయమూ యూఏఈ చేస్తోందన్నది సౌదీ అరేబియా ఆరోపణ. అందులో భాగంగానే ఓ నౌక ఆయుధాలతో యూఏఈ నుంచి బయల్దేరి యెమెన్‌లో ముకల్లా ఓడరేవుకు చేరుకుందని పేర్కొంటూ గత నెల 28న భారీస్థాయిలో తమ యుద్ధ విమానాలను రంగంలోకి దింపింది. ముకల్లాపై వైమానిక దాడులు నిర్వహించింది. తర్వాత సౌదీ మద్దతుతో యెమెన్ ఓ కీలక ప్రకటన చేసింది. తమ దేశంలో ఉన్న సైనికులను యూఏఈ 24 గంటల్లో ఉపసంహరించుకోవాలని పేర్కొంది. దీంతో ఒక్కసారిగా సౌదీ, యూఏఈల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి.

మళ్లీ అలజడి

ముకల్లా రేవుపై దాడులతోనే సౌదీ ఆగిపోలేదు. మళ్లీ శుక్రవారం భారీస్థాయిలో హద్రమౌత్‌పై విరుచుకుపడింది. వైమానిక దాడులు నిర్వహించింది. సౌదీ మద్దతుగా ఉన్న నేషనల్ షీల్డ్ ఫోర్సెస్ కూడా క్షేత్రస్థాయిలో ఎస్టీసీ దళాలతో పోరాడుతున్నాయి. ఈ దాడులను తిప్పికొడుతున్నామని ఎస్టీసీ చెబుతోంది. మొత్తానికి మళ్లీ యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమవుతున్న సూచనలు కనబడుతున్నాయి.

- నేషనల్ డెస్క్



పుష్య పౌర్ణమి నేపథ్యంలో శుక్రవారం ప్రయాగరాజ్‌లో పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు

శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ లాగా పాలకుల్ని కుర్చీల్లోంచి లాగి పారేయాలి

- అజయ్ సింగ్ చౌతాలా సంచలన వ్యాఖ్య

చండీగఢ్: శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో మాదిరి మనదేశ పాలకుల్ని కుర్చీల్లోంచి లాగి పారేయాలని, వీధుల్లో పరుగులెత్తించి కొట్టాలని, విదేశాలకు పారిపోయేలా చేయాలని జననాయక్ జనతా పార్టీ(జేజేపీ) అధ్యక్షుడు అజయ్ సింగ్ చౌతాలా యువతకు పిలుపునిచ్చారు. హరియాణా మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా తండ్రి అయిన అజయ్ సింగ్ చౌతాలా మహేంద్రగఢ్‌లో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మార్పును స్వాగతం పలకాలని ఆయన అన్నారు. "పెద్దలారా, యువ మిత్రులారా మార్పు తెచ్చేందుకు సమయం ఆసన్నమైంది. ఆ మార్పును మీరే తేవాలి. మీరు మేము కలిసి మార్పు తేవాలి. మార్పు వచ్చి తీరుతుంది" అని ఆయన అన్నారు. ఇందుకోసం అందరూ ఒకటి కావాల్సిన అవసరం ఉందన్నారు. "అవకాశం వచ్చినప్పుడు శ్రీలంకలో యువత ప్రభుత్వాన్ని కూలదోసి పాలకులు రాత్రికిరాత్రి విదేశాలకు పారిపోయేలా చేసినట్టు, బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాన్ని కూలదోసి పాలకులు పరారయ్యేలా చేసినట్టు, నేపాల్‌లో యువత గుమిగూడి పాలకుల్ని వీధుల్లో చావబాది దేశం విడిచిపోయేలా చేసినట్టు..." అని ఆయన అన్నారు. ఆయాదేశాల్లో చేసినట్టుగా పాలకుల్ని కుర్చీలోంచి లాగి పారేయాలి, వీధుల్లో పరుగెత్తించి కొట్టాలి, దేశం విడిచిపోయేలా చేయాలి, అప్పుడే దుష్పరిపాలన నుంచి మోక్షం లభిస్తుంది, అని ఆయన అన్నారు. చౌతాలా మాటల్ని హరియాణా రవాణా మంత్రి అనిల్ విజ్ ఖండించారు. ఆయనకు ప్రజాస్వామ్యంలో నమ్మకం లేదన్న విషయం ఈ మాటల ద్వారా అర్థమవుతోంది అని మంత్రి అన్నారు.

పుతిన్ నివాసంపై దాడికి సాక్ష్యాలివిగో..

- అమెరికాకు సమర్పించిన రష్యా

ఇంటర్నెట్ డెస్క్: తమ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై ఇటీవల డ్రోన్లతో దాడికి ప్రయత్నం జరిగినట్లు తాము చేసిన ప్రకటనపై పలు దేశాలు సంశయం వ్యక్తం చేస్తుండటంతో రష్యా కీలక చర్యకు ఉపక్రమించింది. దాడి యత్నానికి సంబంధించి లభ్యమైన ఆధారాలను అమెరికాకు అందజేసింది. రష్యా సైనిక నిఘా సంస్థ అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్త్యుకోవ్ మాస్కోలోని అమెరికా మిలిటరీ అటాచ్ అధికారులతో తాజాగా భేటీ అయ్యారు. దాడికి ఉపయోగించిన ఓ డ్రోన్ శకలాలను తాము గుర్తించినట్లు తెలిపారు. తమ బలగాలు కూల్చివేసిన పలు ఇతర డ్రోన్లలోని నేవిగేషన్ వ్యవస్థలు చెక్కు చెదరకుండా ఉన్నాయన్నారు. వీటిని తమ ప్రత్యేక నిపుణులతో విశ్లేషించగా.. డ్రోన్ల దాడి లక్ష్యం నోవ్‌గొరొడ్ ప్రాంతంలోని పుతిన్ నివాసమేనని నిర్ధారణ అయ్యిందని వివరించారు. సంబంధిత వివరాలన్నింటినీ అమెరికా అధికారులకు కోస్త్యుకోవ్ అప్పగించారు.

ఉక్రెయిన్ సైనిక నిఘా విభాగం అధిపతికి కీలక పదవి

కీవ్: రష్యాతో దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించేందుకు దౌత్య ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నవేళ ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ దేశ సైనిక నిఘా విభాగం అధిపతి జనరల్ కిరిలో బుదనోవ్ (39)ను తన కార్యాలయంలో నూతన చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా శుక్రవారం నియమించారు. రక్షణ, భద్రతా బలగాలు, శాంతి చర్చల వంటి అన్ని అంశాలపై ఉక్రెయిన్ మరింతగా దృష్టిసారించాల్సి ఉండటంతో బుదనోవ్‌ను ఈ పదవిలో నియమించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఇంతకుముందు దేశాధ్యక్షుడి కార్యాలయంలో చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఉన్న ఆంద్రీ యెర్మాక్‌పై తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన్ను ఉక్రెయిన్ అధ్యక్షుడు పదవి నుంచి తొలగించిన సంగతి గమనార్హం.

సంఘ విద్రోహ శక్తుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతోంది

- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన



ఉదయ్‌పుర్: సంఘ విద్రోహ, దేశ వ్యతిరేక శక్తుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్న ధోరణి ఆందోళన కలిగిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలో వైట్ కాలర్ ఉగ్రవాదం అధికమవుతోందని తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో భూపాల్ నోబుల్స్ విశ్వవిద్యాలయం 104వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో శుక్రవారం రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. గతేడాది నవంబరు 10న దిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడును ప్రస్తావిస్తూ వైట్ కాలర్ ఉగ్రవాదంపై ఆవేదన వ్యక్తం చేశారు. జ్ఞానంతో పాటు విలువలు, నైతికత ఎంత అవసరమో ఆ ఘటన తెలియజేస్తుందని చెప్పారు. రోగులకు ప్రిస్క్రిప్షన్ రాసే వైద్యుల చేతుల్లో ప్రమాదకర పేలుడు పదార్థాలు ఉండటం దురదృష్టకరమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలోని డిఫెన్స్ స్టార్టప్‌లు అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నాయని చెప్పారు. రాబోయే 15 ఏళ్లలో ఆయుధాల తయారీలో భారత్ పూర్తి స్వయం సమృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఆత్మాభిమానం అహంకారంగా మారకూడదు

ఆత్మాభిమానం చాలా ముఖ్యమని దానిని ఎప్పుడూ అహంకారంగా మారనివ్వరాదని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. "ఆత్మాభిమానం, అహంకారం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. విద్యార్థులు తమ జీవితంలో అహంకారానికి చోటునివ్వకూడదు" అని హితవుపలికారు.

త్వరలో డ్రోన్ శక్తి మిషన్

దిల్లీ: వస్తు పంపిణీ నుంచి యుద్ధ భూమి వరకూ అనేక రంగాల్లో ఉపయోగపడుతున్న డ్రోన్‌ల ఉత్పాదక సాంకేతిక పరిజ్ఞానంలో అత్యున్నత శిఖరానికి చేరడానికి భారత్ త్వరలో ఒక ముఖ్యమైన కార్యక్రమం చేపట్టబోతోంది. ఇందులో భాగంగా డ్రోన్ శక్తి మిషన్‌ను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. "సమీప భవిష్యత్తులో మేం డ్రోన్ శక్తి మిషన్‌ను ప్రారంభించబోతున్నాం. డ్రోన్‌లలో ఉపయోగించే విడిభాగాల ఉత్పాదకులకు ప్రోత్సాహకాలు అందిస్తాం" అని కేంద్ర ప్రభుత్వ ప్రధాన వైజ్ఞానిక సలహాదారు అజయ్ కుమార్ సూద్ పేర్కొన్నారు. ఈ మిషన్ లక్ష్యాలు రెండు. ఒకటి డ్రోన్ విడిభాగాల ఉత్పత్తిదారులను ప్రోత్సహించడం, రెండు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లడమని ఆయన వెల్లడించారు. అనుసంధాన్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రోన్ శక్తి మిషన్ చేపడతామని సూద్ వివరించారు.

భూసేకరణ విధానాన్ని మార్చే ఉద్దేశం లేదు

- కేంద్ర కేబినెట్ కార్యదర్శి సోమనాథన్ వెల్లడి

దిల్లీ: దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భూసేకరణ ప్రధాన అవరోధంగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అధికారి కీలక విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుత భూసేకరణ విధానాన్ని మార్చే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని కేంద్ర కేబినెట్ కార్యదర్శి టి.వి.సోమనాథన్ శుక్రవారం దిల్లీలో తెలిపారు. రూ.85 లక్షల కోట్ల వ్యయమయ్యే 3,300 ప్రాజెక్టులకు గాను 7,735 సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. వీటిలో 7,156 సమస్యలను పరిష్కరించామన్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన నిర్వహించిన ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్ (ప్రగతి) సమావేశం అనంతరం సోమనాథన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వివిధ కారణాలతో ఆలస్యమయ్యే ప్రాజెక్టులకు అవరోధాలను తొలగించి, ఆయా పనులను వేగిరపరిచే లక్ష్యంతో 'ప్రగతి'పేరుతో సమీక్షా యంత్రాంగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రగతి ద్వారా పరిష్కరించిన 7,156 సమస్యల్లో 35శాతం భూసేకరణకు సంబంధించినవేనని సోమనాథన్ వివరించారు. మరో 20శాతం.. అడవులు, వన్యప్రాణులు, పర్యావరణానికి చెందినవని తెలిపారు. 18 శాతం అవరోధాలు వినియోగహక్కులు తదితరాలకు సంబంధించినవని పేర్కొన్నారు.

ఇండోర్ మున్సిపల్ అధికారులపై వేటు

- అదనపు కమిషనర్ నగరం నుంచి బదిలీ
- తాగునీటి కలుషితం బాధ్యులపై చర్యలకు మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ఆదేశం
- నీరు కాదు..విషం సరఫరా చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆగ్రహం

ఇండోర్: కలుషిత తాగునీటి వల్ల పలువురు మృతి చెందిన నేపథ్యంలో ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అదనపు కమిషనర్‌పై క్రమశిక్షణ చర్యలకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఆదేశించారు. అధికారులు ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ కానున్నాయి. అదనపు కమిషనర్‌ను తక్షణమే నగరం నుంచి బదిలీ చేయనున్నారు. వాటర్‌వర్క్స్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను నీటి సరఫరా బాధ్యతల నుంచి తొలగించాలని కూడా సీఎం స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలోని మరే నగరంలోనూ చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని శుక్రవారం సమీక్షా సమావేశం అనంతరం మోహన్ యాదవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. కలుషిత నీరు తాగడం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురైన వారిలో ఇప్పటి వరకూ 15 మంది మృతి చెందినట్లు ఇండోర్‌లోని భగీరథపుర ప్రాంతవాసులు తెలిపారు. అయితే, పది మంది మృతి చెందినట్లుగానే తమకు సమాచారం ఉందని నగర మేయర్ పుష్యమిత్ర భార్గవ పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఈ సంఖ్యను కూడా నిర్ధారించడంలేదు. వాంతులు, విరేచనాలతో చనిపోయిన వారు నలుగురేనని పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతంలో పైపులైన్లను సరిచేసి అధికారులు నీటిసరఫరా పునరుద్ధరించారు.

లేకలేక పుట్టిన చిన్నారి మృతి

కలుషిత నీటి దుష్ప్రభావానికి గురైన భగీరథపురలో మృతి చెందిన వారిలో ఆరు నెలల చిన్నారి అవ్యాన్ సాహూ కూడా ఉన్నారు. దంపతులకు పెళ్లైన తర్వాత పదేళ్లకు పుట్టిన ఆ బాలుడు చనిపోవడంతో వారి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. వైద్యుడి సూచన మేరకు పాలు, పాలపొడిలో నీటిని కలిపి పట్టించామని, అప్పటి వరకూ ఆరోగ్యంగా ఉన్న చిన్నారి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై ప్రాణాలు వదిలాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల పరిహారాన్ని తిరస్కరించారు.

కాంగ్రెస్ అగ్రనేతల ఆగ్రహం



కలుషిత నీటి వల్ల ఇండోర్‌లో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలపై కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా ప్రభుత్వం ఇండోర్ ప్రజలకు నీరు కాకుండా, విషాన్ని పంపిణీ చేస్తోందంటూ రాహుల్ విమర్శలు గుప్పించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని భాజపా సర్కారు విఫలమయ్యాయని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు.

మెక్సికోలో భూకంపం

- విలేకరుల సమావేశాన్ని కొద్దిసేపు నిలిపేసిన దేశాధ్యక్షురాలు

మెక్సికో సిటీ: దక్షిణ, మధ్య మెక్సికో ప్రాంతాన్ని శుక్రవారం భూకంపం కుదిపేసింది. అయితే.. పెద్దగా నష్టం జరగలేదని దేశాధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ ప్రకటించారు. సాన్ మార్కోస్ పట్టణానికి సమీపంలో కేంద్రీకృతమైన ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 6.5గా నమోదైందని మెక్సికో జాతీయ భూకంప కేంద్రం తెలిపింది.



మెక్సికో సిటీలో భూకంపం అనంతరం ఇళ్ల నుంచి బయటకొచ్చిన ప్రజలు

సముద్ర తీర నగరమైన అకాపుల్కో సమీప ప్రాంతంతో పాటు ఇతర జాతీయ రహదారుల వద్ద కొండచరియలు విరిగిపడినట్లు అధికారులు తెలిపారు. భూమి కంపించడం ప్రారంభించడంతో మెక్సికో, అకాపుల్కో నగరాల్లో ప్రజలు ఇళ్ల నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. భూ ప్రకంపనల తీవ్రత నేపథ్యంలో దేశాధ్యక్షురాలు క్లాడియా నూతన సంవత్సర సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాన్ని కొద్దిసేపు నిలిపివేయాల్సి వచ్చింది. తాను భూకంపం సంభవించిన గెర్రెరో రాష్ట్ర గవర్నర్‌తో మాట్లాడానని, భూకంపం కారణంగా పెద్దగా నష్టం జరగలేదని సమాచారం అందినట్లు ఆమె తెలిపారు.

ముడుపుల కేసులో ఐఏఎస్ అరెస్టు



రాజేంద్రకుమార్ పటేల్

అహ్మదాబాద్: ముడుపుల కేసుతో సంబంధమున్న మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గుజరాత్‌లో ఐఏఎస్ అధికారి రాజేంద్రకుమార్ పటేల్‌ను అరెస్టు చేసిందని శుక్రవారం అధికారవర్గాలు వెల్లడించాయి. గతంలో సురేంద్రనగర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన రాజేంద్రకుమార్ 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయన్ను 15 రోజుల క్రితం కలెక్టర్ పదవి నుంచి తొలగించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నారు. ఈడీ దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా గుజరాత్ అవినీతి నిరోధక శాఖ ఐఏఎస్ అధికారిపైన, అతని సహాయకునిపైన, డిప్యూటీ రెవెన్యూ అధికారి చంద్రసింగ్ మోరీపైన ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సురేంద్రనగర్ జిల్లా కలెక్టరు కార్యాలయంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న చంద్రసింగ్ మోరీని గత నెలలో ఈడీ అరెస్టు చేసింది. ఇందులో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో రూ 67.5 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

మోదీతో ట్రంప్‌నకు వ్యక్తిగత విభేదాలు

- అందుకే భారత్‌కు దూరం
- అమెరికా కాంగ్రెస్ సభ్యుడు సుహాస్ సుబ్రమణ్యం



సుహాస్ సుబ్రమణ్యం

ఇంటర్నెట్‌డెస్క్: రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. భారత్‌తో అనుసరిస్తున్న విధానాలను అమెరికా కాంగ్రెస్ సభ్యుడు సుహాస్ సుబ్రమణ్యం తప్పుబట్టారు. ట్రంప్ తన చర్యలతో భారత్-అమెరికాల మధ్య సంబంధాలను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. ఇది ఇరుదేశాల ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు ప్రమాదకరమని హెచ్చరించారు. 'ట్రంప్ తన తొలివిడత పాలనలో తీసుకున్న చర్యలకు పూర్తి వ్యతిరేకంగా ఇప్పుడు వ్యవహరిస్తున్నారు. తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత ప్రధాని మోదీతో సంబంధాలను బలోపేతం చేశారు. ఇప్పుడు మోదీతో ఆయనకు వ్యక్తిగత విభేదాలు ఉన్నట్లుగా కన్పిస్తోంది. దానివల్ల ఏళ్లుగా బలంగా ఉన్న ఇరుదేశాల సంబంధాలను ఆయన చెడగొట్టుకుంటున్నారు. ఇది ఇరుదేశాలకు మంచిది కాదు" అని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సుహాస్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. ట్రంప్ విధించిన సుంకాలు ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడం అమెరికాకు చాలా ముఖ్యమని, చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి ఇది దోహదపడుతుందని సుహాస్ పేర్కొన్నారు.

గ్రోక్‌లో 'ప్రమాదకర ట్రెండ్'!

- నియంత్రించాలంటూ కేంద్రానికి ఎంపీ ప్రియాంకా చతుర్వేది లేఖ

ఇంటర్నెట్ డెస్క్: ఎలాన్ మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ (ఏఐ) చాట్‌బాట్.. గ్రోక్ మరోసారి వివాదంలో చిక్కుకుంది. అసభ్య పదాలు, తిట్లతో విరుచుకుపడుతున్నట్లు గ్రోక్‌పై ఆరంభంలో విమర్శలు వచ్చాయి. రాజకీయంగానూ పక్షపాతంగా ఉందన్న ఆరోపణలూ వినిపించాయి. తాజాగా ఓ కొత్త ట్రెండ్ కారణంగా గ్రోక్ మళ్లీ వార్తల్లో నిలిచింది. సాధారణ మహిళ ఫొటోను అశ్లీలంగా మార్చాలని చెప్పిన వెంటనే.. గ్రోక్ సంకోచం లేకుండా సమాధానం ఇస్తుండడం వివాదస్పదమవుతోంది. దీంతో మహిళల మార్ఫింగ్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంకా చతుర్వేది ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. మహిళల గోప్యతకు సంబంధించిన ఈ అంశంపై తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు.

"సామాజిక మాధ్యమాల్లో, ముఖ్యంగా ఎక్స్‌లో నడుస్తున్న అసభ్యకర ట్రెండ్ గురించి మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నా. ఏఐ గ్రోక్‌ను ఉపయోగించి కొందరు మహిళల చిత్రాలను మార్ఫ్ చేస్తున్నారు. మహిళ ఫొటోలను అశ్లీలంగా మార్చాలని గ్రోక్‌కు ప్రాంప్ట్ ఇచ్చి.. వచ్చిన ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. ఏఐని ఇలా దుర్వినియోగం చేయడం సరి కాదు. గ్రోక్ కూడా ఇలాంటి ప్రాంప్ట్‌లను అంగీకరిస్తోంది. ఇది మహిళల భద్రతకు, వారి హక్కులకు భంగం కలిగిస్తోంది. ఇది కేవలం అనైతికమే కాదు.. నేరం కూడా" అని ప్రియాంకా చతుర్వేది పేర్కొన్నారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. మరోవైపు గ్రోక్‌లో 'రిమూవ్ దిస్ పిక్చర్' పేరిట మరో ట్రెండ్ మొదలైంది. కొందరి వ్యక్తుల ఫొటోలు ఇచ్చి వీరిలో 'అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని తొలగించు' లేదా 'వీరిలో నటన రాని వ్యక్తులను మాత్రమే ఉంచు' వంటి ప్రాంప్ట్‌లు ఇస్తున్నారు. దీనిపై గ్రోక్ ఇచ్చిన సమాధానాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేస్తున్నారు. ఆ పోస్ట్‌తో ఏకీభవించే వారు, విభేదించిన వారి మధ్య కామెంట్ల రూపంలో మాటల యుద్ధం నడుస్తోంది.

పంజాబ్‌లో భారత సైనిక స్థావరాలపై దాడుల దృశ్యాలు అభూత కల్పనలే

- దిల్లీ నిఘా వర్గాల స్పష్టీకరణ

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైనిక స్థావరాలపై దాడులు జరిపి తీవ్ర నష్టం కలిగించినట్లుగా పాకిస్థాన్‌కు చెందిన కొన్ని శక్తులు వ్యాప్తి చేస్తోన్న అనిర్ధారితమైన ఉపగ్రహ చిత్రాలను దిల్లీలో సంబంధిత వర్గాలు తోసిపుచ్చాయి. ఆ చిత్రాలు వాస్తవ దూరమైనవని, పంజాబ్‌లోని భారత సైనిక స్థావరాలపై ఎలాంటి దాడులు జరగలేదని, వివిధ సదుపాయాలకు సమీపంలోనూ పేలుళ్లు జరిగిన ఆనవాళ్లేమీ లేవని తెలిపాయి. మే 7న ప్రారంభమైన ఆపరేషన్ సిందూర్‌లో చావుదెబ్బ తిన్న పాకిస్థాన్... కుట్రపూరితంగా బూటకపు ప్రచారం చేస్తోందని, పదేపదే అసత్య ప్రచారాలతో బాహ్యప్రపంచాన్ని నమ్మించే యత్నం చేస్తోందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. అనిర్ధారితమైన ఉపగ్రహ చిత్రాలు ఏడు నెలల అనంతరం అకస్మాత్తుగా తెరపైకి తీసుకురావడంపై సందేహాలు వ్యక్తం చేశాయి.

చైనా అమ్ములపొదిలో అధునాతన యుద్ధనౌక

బీజింగ్: స్వీయ నౌకాదళాన్ని శరవేగంగా విస్తరిస్తున్న చైనా.. తాజాగా మరో ముందడుగు వేసింది. మరింత మెరుగుపరిచిన మిసైల్ డిస్ట్రాయర్‌ను తన అమ్ములపొదిలో చేర్చింది. టైప్ 052డి తరగతికి చెందిన ఈ యుద్ధనౌకకు లౌడీ అని పేరు పెట్టారు. ఇందులో మెరుగైన రాడార్, ఆయుధ, నెట్‌వర్క్ వ్యవస్థలు ఉన్నాయి. దీనివల్ల ఇది గగనతల రక్షణ, సాగరంలో దాడి, టాస్క్‌ఫోర్స్ కమాండ్ వంటి విధులను నిర్వర్తించగలదు. ఇది లక్షిత యుద్ధనౌకలపై దాడి చేయడంతోపాటు సహచర నౌకలను రక్షించగలదు. చైనా నేవీ సగటున నెలకో కొత్త యుద్ధనౌకను చేర్చుకుంటోంది. అమెరికా నౌకాదళాన్ని లక్ష్యంగా పెట్టుకొని ఈ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం చైనా నౌకాదళంలో 234, అమెరికా నేవీలో 219 చొప్పున యుద్ధనౌకలు ఉన్నాయి. ఆధునిక యుద్ధనౌకలను నిర్మించడంతోపాటు తన మిత్రదేశమైన పాకిస్థాన్‌కూ వాటిని సరఫరా చేస్తోంది. గతనెలలో పాక్ కోసం ఘాజీ పేరుతో ఒక జలాంతర్గామిని రూపొందించింది. 1971లో భారత్‌తో జరిగిన యుద్ధంలో విశాఖపట్నం వద్ద ఇదే పేరుతో ఒక సబ్‌మెరైన్‌ను పాక్ కోల్పోయింది. ఇలాంటి ఎనిమిది జలాంతర్గాములను సరఫరా చేసేందుకు చైనా ఒప్పందం చేసుకుంది.

కడుపులో కత్తెరలతో ఏడాదిన్నర.. తీసే క్రమంలో మహిళ మృతి



బిహార్‌లోని మోతిహారీ జిల్లాలో వైద్యుల నిర్లక్ష్యం ఓ నిరుపేద మహిళ నిండుప్రాణాన్ని బలి తీసుకుంది. మణి భూషణ్ కుమార్ భార్య ఉషాదేవి (25)ని ఏడాదిన్నర క్రితం ప్రసవం కోసమని మోతిహారీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. సిజేరియన్ చేయగా ఆడబిడ్డ పుట్టింది. ఆ సమయంలో వైద్యురాలు సంగీత కుమారి జత కత్తెరలను ఉషాదేవి కడుపులోనే వదిలేసి కుట్లు వేశారు. ఈ విషయం తెలియని బాధితురాలు కడుపునొప్పి అంటూ గత ఏడాదిన్నర కాలంలో పలుమార్లు ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. వైద్యులు తాత్కాలికంగా ఉపశమనం కలిగేలా పెయిన్ కిల్లర్లు ఇచ్చి పంపేవారు. ఇటీవల నొప్పి భరించలేని స్థాయికి చేరడంతో మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ సీటీ స్కానింగు చేయగా, అసలు విషయం బయటపడింది. హుటాహుటిన రెహమానియా మెడికల్ సెంటర్‌కు తరలించి శస్త్రచికిత్స ప్రారంభించారు. అప్పటికే ఆ కత్తెరలు ఆమె పేగుల్ని చీల్చి లోపల తీవ్రమైన ఇన్ఫెక్షను కావడంతో శస్త్రచికిత్స సమయంలోనే ఉషాదేవి ప్రాణాలు విడిచింది. ఈ ఘోరానికి కారణమైన డాక్టర్ సంగీతపై హత్య కేసు నమోదు చేయాలని బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొత్త సంవత్సరాది వేళ.. కేరళ వ్యాపారి భూదానాలు



కొత్త సంవత్సరం వచ్చిందంటే చాలామంది ఏవేవో కొత్త సంకల్పాలు చేసుకుంటారు. కేరళలోని కోజికోడ్ జిల్లా మెప్పయ్యూర్‌కు చెందిన ఆంద్రూ భూదానాలు చేస్తుంటారు. గత 30 ఏళ్లుగా కువైట్‌లో వ్యాపారం చేస్తున్న ఆంద్రూ ఈ ఏడాది ముగ్గురు పిల్లలున్న ఓ నిరుపేద కుటుంబానికి 4 సెంట్ల భూమిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక పెద్దలు దాత ఉదారతను అభినందించారు. స్థానికంగా ఉన్న ఓ చారిత్రక ఆలయం పక్కనే ఈ భూమి ఉండటం విశేషం. 2022 జనవరిలోనూ తన కుమార్తె వివాహ సందర్భంగా ఆంద్రూ నాలుగు కుటుంబాలకు 21 సెంట్ల భూదానం చేశారు. స్థానికుల వైద్య అవసరాలకు, గృహ నిర్మాణాలకు, పేద కుటుంబాలకు చెందిన పిల్లల వివాహాలకు సైతం ఆయన పలుమార్లు ఉదారంగా సాయం చేశారు. 'అందరం ఖాళీ చేతులతో ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోతాం. బతికుండగా లేనివాళ్లను ఆదుకోవడం ముఖ్యం" అని ఆంద్రూ అంటారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ అధికార స్థాపన

బ్రిటిష్ వారు భారతదేశంలో తమ సామ్రాజ్యాన్ని విస్తరించే క్రమంలో అనేక యుద్ధాలు, చట్టాలు చేశారు. స్వదేశీ రాజుల అనైక్యతను ఆసరాగా చేసుకుని ఆయా రాజ్యాలను సునాయాసంగా జయిస్తూ రాజ్య విస్తరణ గావించారు. లార్డ్ వెల్లస్లీలాగే విపరీతమైన సామ్రాజ్యవాద కాంక్ష కలిగిన డల్హౌసీ తన 36వ ఏట 1848లో భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా వచ్చాడు. ఇక్కడి పరిస్థితులను అవలోకనం చేసుకున్న డల్హౌసీ స్వదేశీ రాజ్యాల ఆక్రమణే ధ్యేయంగా పనిచేశాడు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

భారత భూభాగాల ఆక్రమణకే..
రాజ్య సంక్రమణ సిద్ధాంతం

రాజ్య సంక్రమణ సిద్ధాంతం

యుద్ధాలు చేయకుండా రాజ్యాలను బ్రిటిష్ సామ్రాజ్యంలో కలపాలనే కుటిల బుద్ధితో 1848లో రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని డల్హౌసీ ప్రవేశపెట్టాడు. దీని ప్రకారం భారతదేశ రాజులు సంతానం లేకుండా మరణించినట్లయితే ఆ రాజ్యం బ్రిటిష్ వారి అధీనంలోకి వెళ్తుందని ప్రకటించాడు. స్వదేశీ రాజులు ఏళ్లుగా అనుసరించిన దత్తత తీసుకోవడం అనే పద్ధతిని శాశ్వతంగా రద్దు చేశాడు.



✦ డల్హౌసీ ఈ విధానాన్ని అమలు చేసి అనేక రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. అవి:
- 1848లో సతారా రాజ్యం, మహారాష్ట్ర.
- 1849లో సంబాల్‌పూర్ రాజ్యం, ఒరిస్సా.
- 1849లో జైత్‌పూర్ రాజ్యం, బుందేల్‌ఖండ్.
- 1850లో భగత్ రాజ్యం, పంజాబ్.
- 1852లో ఉదయ్‌పూర్ రాజ్యం, ఛత్తీస్‌గఢ్.
- 1853లో ఝాన్సీ రాజ్యం, బుందేల్‌ఖండ్.
- 1854లో నాగపూర్ రాజ్యం, మహారాష్ట్ర.

● 1848లో సతారా పాలకుడు అప్పాసాహెబ్ మరణించాడు. అతడికి వారసులు లేరనే నెపంతో ఆ రాజ్యాన్ని బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనం చేశాడు. ఆఖరి పీష్వా రెండో బాజీరావు మరణానంతరం ఏడాదికి ఇవ్వాల్సిన భరణాన్ని అతడి దత్తపుత్రుడైన నానాసాహెబ్‌కు ఇవ్వడానికి నిరాకరించాడు.

భారత రాజుల ఓటమికి కారణాలు



భారతదేశంలో 1757 ప్లాసీ యుద్ధంతో ప్రారంభమైన ఆంగ్లేయుల ఆక్రమణలు నిరాటంకంగా శతాబ్ద కాలం కొనసాగాయి. దాదాపుగా 500కు పైగా రాజ్యాలను జయించి, భారతదేశంలో బలమైన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని స్థాపించిన ఆంగ్లేయులు మిగిలిన 563 రాజ్యాలను పరోక్షంగా తమ నియంత్రణలోకి తీసుకుని పాలకులను కీలుబొమ్మలుగా చేశారు. ఎంతో శక్తిమంతులైన బెంగాల్ నవాబ్‌లు, మరాఠాలు, మైసూర్ పాలకులు సైతం వీరోచితంగా పోరాడినప్పటికీ ఆంగ్లేయులకు దాసోహమవ్వక తప్పలేదు.

▼ 16, 17వ శతాబ్దాల్లో ఇంగ్లండ్ ఐరోపాలోనే అత్యంత శక్తిమంతమైన ఆధునిక శక్తిగా ఎదిగింది. ఫ్యూడల్ వ్యవస్థను అంతం చేసి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. అదేకాలంలో భారతదేశం ఇంకా మధ్య యుగాల్లోనే ఉంటూ భూస్వామ్య వ్యవస్థ, మతాధిపతుల నియంత్రణలోనే మిగిలిపోయింది. ఆధునికతకు ఆమడ దూరంలో ఉండిపోయింది. అన్ని రంగాల్లో వెనుకబడిన భారతదేశాన్ని ఆధునిక అగ్రరాజ్యంగా ఎదిగిన ఇంగ్లండ్ ఓడించడం విచిత్రమేమీ కాదు. మొగల్ సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తర్వాత భారతదేశంలో రాజకీయ అనైక్యత రాజ్యమేలింది. వందలాది స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించి, తమలో తాము కలహించుకుంటూ బ్రిటిష్ వారి విజయాలకు దోహదం చేశాయి.

▼ ఉత్తర భారతదేశ ఆధిపత్యం కోసం మొగలులు, మరాఠాలు, ఆఫ్ఘన్లు పోరాడగా, దక్షిణాన మరాఠాలు, నిజాం, మైసూర్ పాలకులు నిరంతర యుద్ధాలు చేసి బలహీనపడ్డారు. ఆంగ్లేయులు వీరిపై సునాయాసంగా విజయం సాధించడానికి ఈ రాజకీయ అనైక్యత, పరస్పర ఘర్షణలు ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

▼ ఆంగ్లేయులు ఆధునిక సైనిక సంపత్తిని సమకూర్చుకుని, అత్యంత బలమైన నౌకాదళాన్ని నిర్మించుకున్నారు. ఈ విషయంలో భారత రాజులు చాలా వెనుకబడి ఉన్నారు. వీరు ప్రాచీన యుద్ధ పద్ధతులను అవలంబిస్తూ ఆంగ్లేయుల చేతిలో సునాయసంగా ఓటమిని చవిచూశారు.

▼ 18వ శతాబ్దంలో భారతదేశంలో విచిత్రమైన రాజకీయ పరిస్థితులు నెలకొని ఆంగ్లేయుల విజయాలకు ఊతమిచ్చాయి. భారతదేశంలోని చట్టబద్ధమైన రాజులు సింహాసనాలపై ఉత్సవ విగ్రహాలుగా మిగలగా, వారి ప్రధానమంత్రులు వాస్తవాధికారులు అయ్యారు. మొగల్ చక్రవర్తులపై వారి వజీర్లు, మరాఠా ఛత్రపతిపై పీష్వాలు, మైసూర్ వడయార్ ప్రభువులపై హైదర్‌అలీ ఆధిపత్యం కొనసాగింది. ఈ పరిస్థితుల్లో బలహీనులైన భారతీయ రాజులు ఆంగ్లేయుల జైత్రయాత్రను అడ్డుకోలేకపోయారు.

▼ ఆంగ్లేయులు జాతీయ, అంతర్జాతీయ వ్యాపారం ద్వారా విపరీతమైన సంపదను పోగుచేసుకున్నారు. 1757 ప్లాసీ యుద్ధం తర్వాత బెంగాల్ సిరిసంపదలు వారి సొంతమయ్యాయి. ఈ సంపదను ఆంగ్లేయులు భారతీయులతో చేసిన యుద్ధాల్లో వినియోగించి సునాయాసంగా విజయాలు సాధించారు. భారత రాజులు యథాతథంగా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడేవారు.

ఝాన్సీ రాజ్యం

డల్హౌసీ సామ్రాజ్య కాంక్ష, రాజ్య సంక్రమణ సిద్ధాంతానికి బలైన మరో ప్రముఖ రాజ్యం ఝాన్సీ



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

❖ ఝాన్సీ రాజు గంగాధర్‌రావు, లక్ష్మీబాయికి జన్మించిన ఏకైక సంతానం చిన్నతనంలోనే మరణించారు. దీంతో గంగాధర్‌రావు 1852లో దామోదర్‌రావు అనే బాలుడిని దత్తత తీసుకున్నాడు.

❖ కొద్దికాలం పిదప అనారోగ్యం కారణంగా గంగాధర్‌రావు మరణించాడు. లక్ష్మీబాయి సంరక్షకురాలిగా ఉంటూ దామోదర్‌రావు పేరు మీదుగా పరిపాలన చేపట్టింది.

❖ గంగాధర్ రావు తీసుకున్న దత్తత చెల్లదని, ఝాన్సీ రాజ్యాన్ని బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనం చేస్తున్నట్లు డల్హౌసీ 1854లో ప్రకటించాడు.

❖ లక్ష్మీబాయికి ఏటా రూ.60 వేల భరణం ఇచ్చేట్లుగా ఆంగ్లేయులు ఏర్పాటు చేశారు.

❖ ఝాన్సీ రాజ్యంలో సిపాయిల తిరుగుబాటు చెలరేగగానే, లక్ష్మీబాయి వారితో కలిసి కదనరంగంలోకి దూకింది.

❖ ఆమె నాయకత్వ పటిమ చూసిన జనరల్ హ్యూరోస్ అత్యంత సాహసవంతురాలైన ఏకైక పురుషుడు అని అభివర్ణించాడు.



అవధ్ ఆక్రమణ

అవధ్ పాలకులు ఇరాన్ నుంచి వలస వచ్చి, మొగలుల ఆస్థానంలో ఉన్నత పదవులు పొందిన షియా మతస్థులు. తర్వాతి కాలంలో మొగల్ అధికారాన్ని ధిక్కరించి స్వతంత్ర అవధ్ రాజ్యాన్ని స్థాపించారు.

సాదత్ ఖాన్ బుర్హాన్-ఉల్-ముల్క్ (1722–39): ఇతడు మొగల్ చక్రవర్తి మహమ్మద్ షా రంగీల కొలువులో పనిచేస్తూ 1722లో అవధ్ రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు 1739లో భారతదేశంపై దండెత్తి వచ్చిన నాదిర్షా పట్ల భయంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

సఫ్దర్ జంగ్ (1739–54): మొగల్ చక్రవర్తి మహమ్మద్ షా రంగీల ఇతడికి అలహాబాద్‌ను ఇచ్చి వజీర్‌గా నియమించాడు. అప్పటి నుంచి అవధ్ పాలకులు నవాబ్ వజీర్‌లుగా సుప్రసిద్ధులు.

షుజాఉద్దౌలా (1754–75): ఇతడు బక్సార్ యుద్ధం (1764)లో పాల్గొన్నాడు. 1773లో వారన్ హేస్టింగ్స్ బెనారస్ సంధి ద్వారా కారా, అలహాబాద్‌లను కొనుగోలు చేశాడు. ఇతడు వారన్ హేస్టింగ్స్ సహకారంతో 1774లో ఆఫ్ఘన్‌లను ఓడించి రొహిల్లా రాజ్యాన్ని జయించాడు.

అసఫ్ఉద్దౌలా (1775–97): 1775 ఇతడు అవధ్ రాజధానిని ఫైజాబాద్ నుంచి లక్నోకు మార్చాడు. లక్నోలో బార ఇమాంబర అనే అద్భుత కట్టడాన్ని నిర్మించాడు. ఇది మొహర్రం పండుగ సందర్భంలో శోక ప్రకటన (మాతం) కోసం ఉపయోగించే పవిత్ర మందిరం. 1775లో ఆంగ్లేయులతో ఫైజాబాద్ సంధి చేసుకుని వారికి లొంగిపోయాడు.

సాదత్ అలీఖాన్ (1798–1814): 1801లో ఇతడు ఆంగ్లేయులతో సైన్య సహకార ఒప్పందం కుదుర్చుకుని, రోహిల్‌ఖండ్ ప్రాంతాన్ని ఆంగ్లేయులకు ఇచ్చాడు.

వాజిద్ అలీషా (1847–1856): ఇతడు అవధ్ రాజ్య చివరి నవాబ్. 1856లో దుష్పరిపాలన నెపంతో ఇతడిని తొలగించి అవధ్ రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాజిద్ అలీషాను పెన్షనర్‌గా కలకత్తాకు పంపించాడు. అయితే ఈ చర్యను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించారు.

◆ పరిపాలనా యంత్రాంగం విఫలమైందనే కారణంగా అవధ్‌ను ఆంగ్లేయులు బలవంతంగా విలీనం చేసుకోవడం భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు, తిరుగుబాట్లకు సూచిక అని లక్నో రెసిడెంట్ సీమర్ పేర్కొన్నారు.

◆ రాజ్య సంక్రమణ సిద్ధాంతం కారణంగా అన్ని రకాల నైతిక విలువలు సమాధి అయ్యాయని, ఈ సిద్ధాంతం కారణంగా అవధ్ ఆక్రమణ బలవంతంగా జరిగిందని ఆ ప్రాంత ప్రజలు, సైనికులు, ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

◆ ఆంగ్లేయులు భారతదేశంలో జయించిన చివరి రాజ్యం అవధ్. 1757లో బెంగాల్‌తో ప్రారంభమైన బ్రిటిష్‌వారి ఆక్రమణలు 1856లో అవధ్‌తో ముగిశాయి.

Word of the Day

880

Asperity

Telugu meaning: కరుకుదనం, కాఠిన్యం

English meaning: The word asperity (యాస్పెరిటీ) is a noun that refers to harshness in tone, manner, or behaviour; it can also refer to roughness of surface or condition.

Synonyms: Harshness, Severity ***Antonyms:*** Mildness, Gentleness

Usage: **1.** The manager spoke with such asperity that the entire team fell silent, sensing his disappointment in their performance.

2. The asperity of the rocky mountain path made climbing difficult, testing the stamina of even experienced hikers.

కరెంట్ అఫైర్స్



స్కీయింగ్ చేస్తూ దక్షిణ ధ్రువానికి చేరుకున్న అతిపిన్న భారతీయ వ్యక్తిగా కామ్యా కార్తికేయన్ (18 ఏళ్లు) ఘనత సాధించారు. మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రతను, ప్రచండ శీతల గాలులను తట్టుకుంటూ ఆమె దాదాపు 115 కిలోమీటర్ల దూరం స్కీయింగ్ చేసింది. ప్రపంచంలో స్కీయింగ్ ద్వారా అక్కడికి చేరుకున్న రెండో అతిపిన్న వయసు మహిళ కామ్యా.

భారత్ విజయవంతంగా ప్రళయ్ క్షిపణి పరీక్షలను 2025, డిసెంబరు 31న నిర్వహించింది. ఒడిశా తీరం నుంచి వరుసగా ఒకదాని వెంట ఒకటి రెండు ప్రళయ్ మిస్సైళ్లను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ప్రయోగించింది. ఈ రెండూ.. నిర్దేశిత లక్ష్యాలను ఛేదించాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణులను డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది.

❖ ఉపరితలం నుంచి ఉపరితలానికి దూసుకెళ్లే ప్రళయ్.. 500 నుంచి 1,000 కేజీల వరకు పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు.

దేశంలో గతేడాది (2025)లో వార్షిక సగటు ఉష్ణోగ్రత దీర్ఘకాలిక సగటు కంటే 0.28 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. 2025 ఏడాదికి సంబంధించిన వాతావరణ నివేదికను 2026, జనవరి 1న విడుదల చేసింది. 1901లో ఉష్ణోగ్రతల నమోదు ప్రారంభించిన తర్వాత 2025.. ఎనిమిదో వేడి సంవత్సరంగా నిలిచింది.

అమెరికాలోని న్యూయార్క్ నగర 112వ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ ప్రమాణం చేశారు. మాన్‌హట్టన్‌లోని ఓ చారిత్రక సబ్‌వే స్టేషన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. న్యూయార్క్‌లో తొలి ముస్లిం మేయర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

గణాంకాలు, పథకాల అమలు శాఖ (ఎంఓఎస్‌పీఐ) 2026, జనవరి 1న కొత్త లోగోను విడుదల చేసింది. దేశ అభివృద్ధి ప్రక్రియలో డేటా ప్రాముఖ్యతను ఈ కొత్త లోగో వర్ణిస్తుందని వెల్లడించింది. లోగోలో ఉన్న అశోక చక్రం నిజానికి, పారదర్శకతకు, మంచి పరిపాలనకు గుర్తు కాగా.. రూపాయి చిహ్నం ఆర్థిక ప్రణాళికలో, విధాన రూపకల్పనలో, దేశ వృద్ధిలో గణాంకాల కీలకపాత్రను ప్రతిబింబిస్తుంది. అందులో ఉన్న అంకెలు, చిహ్నాలు అధునాతన డేటా వ్యవస్థను, స్టాటిస్టిక్స్ సైన్స్‌ను తెలుపుతాయని వివరించింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టడీ జోన్

సావిత్రీబాయి ఫూలే

భారతీయ సమాజంలో అనాదిగా ఉన్న అసమానతలను తొలగించి.. సమ సమాజం, సామాజిక అభివృద్ధి కోసం ఎందరో మేధావులు, సంఘసంస్కర్తలు అలుపెరుగని పోరాటాలు చేశారు. అంధ విశ్వాసాలు, నిరక్షరాస్యతకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారు. అలాంటి వారిలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన వ్యక్తి సావిత్రీబాయి ఫూలే. జనవరి 3న సావిత్రీబాయి ఫూలే జయంతి సందర్భంగా పోటీ పరీక్షల నేపథ్యంలో ఆమె గురించిన ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!

బాల్యం – వ్యక్తిగత జీవితం

సావిత్రీబాయి ఫూలే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఖండాలా తాలూకా నైగావ్‌లో 1831, జనవరి 3న జన్మించారు.

✦ నాటి భారతీయ సమాజంలో అనేక వివక్షలు, అసమానతలకు తోడు స్త్రీలు చదువుకోకూడదనే నియమం ఉండేది. దీంతో ఆమె అక్షర జ్ఞానానికి దూరమైంది. సావిత్రికి చిన్నతనంలోనే వివాహమైంది. ఆమె భర్త జ్యోతిరావు ఫూలేకు చదువంటే మక్కువ. సమాజంలో స్త్రీలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని ఆయన విశ్వసించారు. ఆయన సావిత్రీబాయికి ఇంటి వద్దే చదువు చెప్పడం ప్రారంభించారు.

✦ తానొక్కటే కాకుండా స్త్రీలందరూ విద్యావంతులు కావాలని సంకల్పించిన ఆమె అహ్మద్‌నగర్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. అణగారిన వర్గాల పిల్లలు చదువుకునేలా పుణెలోని భిడేవాడాలో భర్తతో కలిసి మొట్టమొదటి బాలికల పాఠశాలను స్థాపించారు. అందులోనే ఆమె టీచర్‌గా పనిచేశారు. ఆ విధంగా దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్రకెక్కారు.




మహిళా విద్యను ప్రోత్సహిస్తూనే భర్తతో కలిసి లింగ వివక్ష, అంటరానితనం, బాల్య వివాహాలు, సతీ సహగమనం లాంటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు.

సావిత్రీబాయి రచనలు, ఇతర ముఖ్యాంశాలు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు తదితర సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

షెడ్యూల్డ్ కులాలు, తెగల కార్పొరేషన్లు

షెడ్యూల్డ్ కులాలు, తెగలు, బలహీన వర్గాలు, మహిళలు, మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. దీని కోసం అవసరమైన చట్టాలు రూపొందిస్తున్నాయి. ఆయా వర్గాల ఉన్నతి కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తున్నారు. సాంఘిక, సంక్షేమ పథకాలను రూపొందించి అమలుపరుస్తున్నారు.



షెడ్యూల్డ్ కులాలు – సంక్షేమం

2001 జనాభా లెక్కల ప్రకారం, దేశంలో 16 కోట్ల 66 లక్షల మంది, 2011 లెక్కల ప్రకారం, 20 కోట్ల 13 లక్షల మంది షెడ్యూల్డ్ కులాలవారు ఉన్నారు. వీరి అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది.

విద్యాభివృద్ధి చర్యలు

షెడ్యూల్డ్ కులాల్లో అక్షరాస్యత, విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు వివిధ చర్యలు చేపడుతున్నాయి.

■ అపరిశుద్ధ రంగాల్లో పనిచేసే కార్మికులు, చిన్నారులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందజేయడం. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా నిధులు కేటాయిస్తాయి.

ఆర్థికాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత ఉద్యమి యోజన, గిరిజన తెగలు - సంక్షేమం, షెడ్యూల్డ్ ప్రాంతం - ప్రత్యేక సదుపాయాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్యక్రమాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

అసోసియేట్ ఉద్యోగాలు

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 9. అర్హులైన అభ్యర్థులు 2026 జనవరి 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

టెక్నీషియన్ పోస్టులు

పశ్చిమ బెంగాల్, దుర్గాపుర్‌లోని సీఎస్ఐఆర్ - సెంట్రల్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఈఆర్ఐ) ఒప్పంద ప్రాతిపదికన టెక్నీషియన్-I (గ్రూప్-2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 20. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 21 జనవరి 2026.

స్పోర్ట్స్ కోటా కానిస్టేబుల్ (జీడీ) ఉద్యోగాలు

భారత ప్రభుత్వ హోం మంత్రిత్వశాఖకు చెందిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) 2025 ఏడాదికి సంబంధించి గ్రూప్ 'సి' నాన్-గెజిటెడ్ అండ్ నాన్-మినిస్టీరియల్ కింద స్పోర్ట్స్ కోటా కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 549. దరఖాస్తు ఫీజు రూ.159. అర్హులైన అభ్యర్థులు 2026, జనవరి 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జనవరి 3) చివరి తేదీ

■ ఈఎస్ఐసీ రాంచీలో 99 సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాలు. ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

■ టీఐఎఫ్ఆర్‌లో వర్క్ అసిస్టెంట్ పోస్టులు. పదో తరగతి, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Mathematics

Profit & Loss

1. A shopkeeper marks his goods at such a price that after giving a 20% discount, he still makes a 25% profit. What is the marked price (Rs.) of an article whose cost price is Rs.4,000?
A) Rs.6,000 B) Rs.6,250
C) Rs.6,500 D) Rs.6,750

2. The marked price of a backpack is Rs.720, which is 20% above its cost price. The backpack is sold at a 25% discount on the marked price. Find the gain or loss percentage.
A) 6.25% loss B) 10% loss
C) 12.5% gain D) 5% gain

3. A shopkeeper marks his goods at a price which is 50% above the cost price. He then allows a 20% discount on the marked price. What is the actual profit percentage made by the shopkeeper?
A) 15% B) 18% C) 20% D) 25%

4. The cost price of sugar increased from Rs.40 per kg to Rs.44 per kg. Earlier, the shopkeeper sold sugar at a 20% profit. If he continues to sell sugar at the same selling price, what will be his new profit or loss percentage?
A) 9.09% profit
B) 10% profit C) No profit, no loss
D) 5% loss

5. A trader sold an article at a loss of 5%. Had he sold it at a gain of 3%, he would have received Rs.64 more. What should be the selling price (Rs.) of the article to earn a profit of 20%?
A) Rs.640 B) Rs.720
C) Rs.800 D) Rs.960

6. A television and an air conditioner were sold for Rs.30,000 each. The television was sold at a gain of 25%, while the air conditioner was sold at a loss of 25%. Find the overall profit or loss percentage in the entire transaction.
A) 6.25% loss
B) 5% loss C) No profit, no loss
D) 4% profit

7. The difference between the cost price and the selling price of an article is Rs.200. If the profit percentage is 25%, what is the selling price (Rs.) of the article?
A) Rs.900 B) Rs.950
C) Rs.1000 D) Rs.1050

8. A man earns a profit of 40% by selling a watch at a certain price. If he sells the same watch at twice that selling price, what will be the new profit percentage?
A) 120% B) 140%
C) 160% D) 180%

9. Rohit sold a laptop to Suman at a profit of 15%. Suman sold it to Karan at a profit of 20%. Karan then sold it to Deepak at a loss of 10%. If Deepak paid Rs.62,370 for the laptop, what was the cost price (Rs.) of the laptop for Rohit?
A) Rs.45,666 B) Rs.48,475
C) Rs.50,217 D) Rs.52,563

10. Aman sold a mobile phone to Bhavesh at a profit of 20%. Bhavesh sold it to Chetan at a profit of 10%. Chetan then sold it to Dinesh at a loss of 10%. If Dinesh paid Rs.59,400 for the mobile phone, what was the cost price (Rs.) of the mobile phone for Aman?
A) Rs.45,000 B) Rs.48,000
C) Rs.50,000 D) Rs.54,000

11. The cost price of 40 identical articles is equal to the selling price of x such articles. If the shopkeeper makes a profit of 25% on each article, find the value of x.
(Cost price and selling price are the same for all articles.)
A) 30 B) 32 C) 34 D) 36

12. A shopkeeper sells rice at a profit of 20%. If he reduces the selling price by Rs.50, he incurs a loss of 20%. What was the initial selling price (Rs.) of the rice?
A) Rs.100 B) Rs.125
C) Rs.150 D) Rs.175

13. A trader incurs a loss of 25% by selling 60 notebooks for .90. At what selling price (Rs.) should he sell 60 notebooks to make a profit of 20%?
A) Rs.120 B) Rs.135
C) Rs.144 D) Rs.150

14. A dealer sells two printers at the rate of Rs.18,000 each. On one printer, he makes a profit of 25%, while on the other printer, he incurs a loss of 20%. Find the overall profit or loss percentage in the entire transaction.
A) 5% profit B) 2.44% loss
C) 6.25% loss D) No profit, no loss

15. Out of the total articles in a shop, 60% are sold at a loss of 20%, while the remaining 40% are sold at a profit of 15%. Find the overall profit or loss percentage.
A) 4% loss B) 6% loss
C) 2% profit
D) No profit, no loss

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

ప్రాక్టీస్ బిట్స్

పర్యావరణ అంశాలు

1. అడాప్టేషన్ ఫండ్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి?

ఎ) వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావాలకు లోనయ్యే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పర్యావరణ అనుకూల పథకాలకు సాయం చేయడానికి ఈ నిధిని సృష్టించారు.

బి) వాతావరణ మార్పుపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ జీవ వైవిధ్య సమావేశానికి అనుగుణంగా స్థాపించారు.

సి) క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం ప్రాజెక్టు కార్యకలాపాలు, ఇతర వనరుల నుంచి వచ్చే నిధులు అడాప్టేషన్ ఫండ్‌కు మద్దతు ఇవ్వడానికి ఉపయోగిస్తారు.

1) సి 2) ఎ, బి, సి 3) ఎ, బి 4) ఎ, సి

2. వియన్నా కన్వెన్షన్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి?

ఎ) 'వియన్నా కన్వెన్షన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ ది ఓజోన్' 1985లో కుదిరిన బహుపాక్షిక పర్యావరణ ఒప్పందం. ఇది ఓజోన్‌పొరను నాశనంచేయడంలో ప్రముఖపాత్ర వహించే సీఎఫ్‌సీల ఉత్పత్తిని తగ్గించడానికి చేసిన అంతర్జాతీయ ఫ్రేమ్‌వర్క్.

బి) 1985లో వియన్నా సమావేశంలో దీన్ని అంగీకరించారు. 1988,సెప్టెంబరు 22న అమల్లోకి వచ్చింది.

సి) భారతదేశం ఈ ఒప్పందాన్ని ఆమోదించలేదు.

1) బి, సి 2) ఎ, బి, సి 3) ఎ, బి 4) ఎ, సి

సమాధానాలు: 1–4; 2–3.

పదో తరగతి గణిత శాస్త్రం — బహుపదులు

1. శూన్యాల మొత్తం, లబ్ధం వరుసగా −3, 2 అయ్యేలా ఒక వర్గ బహుపదిని రూపొందించండి.

2 మార్కులు

సాధన: శూన్యాల మొత్తం $= \alpha + \beta = -3$

శూన్యాల లబ్ధం $= \alpha\beta = 2$

వర్గబహుపది $= k[x^2 - (\alpha + \beta)x + \alpha\beta],\ k \in R$

$= k[x^2 - (-3)\,x + 2]$

$= k[x^2 + 3x + 2]$

$= 1[x^2 + 3x + 2]$ ($k = 1$ అయితే) $= x^2 + 3x + 2$

∴ కావాల్సిన వర్గ బహుపది $= x^2 + 3x + 2$

2. బహుపది శూన్యాలు సమానంగా ఉండే వర్గబహుపదిని రూపొందించండి.

సాధన: బహుపది శూన్యాలు α, β అనుకుందాం.

ఇక్కడ $\alpha = \beta$ కాబట్టి $k[x^2 - (\alpha + \beta)x + \alpha\beta]$ లో $\alpha = \beta$ అయ్యే ఏవైనా విలువలు ప్రతిక్షేపించగా

ఉదాహరణకు $\alpha = \beta = 2,\ k = 1$, అనుకుంటే, $1[x^2 - (2 + 2)x + 2.2]$

కావాల్సిన బహుపది $= x^2 - 4x + 4$.

ఫైనల్ పరీక్షలు 2026 — ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

3. ఒక శూన్యం, రెండో శూన్యానికి రెట్టింపు ఉండే ఒక వర్గ బహుపదిని రూపొందించండి.

సాధన: బహుపది శూన్యాలు α, β అనుకుందాం.

ఇక్కడ $\alpha = 2\beta$ కాబట్టి $k[x^2 - (\alpha + \beta)x + \alpha\beta]$ లో $\alpha = 2\beta$ అయ్యే ఏవైనా విలువలు ప్రతిక్షేపించగా

ఉదాహరణకు $\alpha = 2,\ \beta = 4,\ k = 1,\ 1[x^2 - (2 + 4)x + 2.4]$

కావాల్సిన వర్గ బహుపది $= x^2 - 6x + 8$

4. శూన్యాలు ఒక దానికొకటి విలోమాలుగా ఉండే వర్గ బహుపదిని రూపొందించండి.

సాధన: బహుపది శూన్యాలు α, β అనుకుందాం.

ఇక్కడ $\alpha = \frac{1}{\beta}$ కాబట్టి $k\left[x^2 - \left(\frac{1}{\beta} + \beta\right)x + \frac{1}{\beta}\beta\right]$ లో $\alpha = \frac{1}{\beta}$ అయ్యే ఏవైనా విలువలు ప్రతిక్షేపించగా

ఉదాహరణకు $\beta = \frac{1}{2},\ \alpha = 2,\ k = 2$,

$$2\left[x^2 - \left(2 + \frac{1}{2}\right)x + 2.\frac{1}{2}\right] \Rightarrow 2\left[x^2 - \left(\frac{4+1}{2}\right)x + 1\right]$$

$$2\left(x^2 - \frac{5}{2}x + 1\right) \Rightarrow 2x^2 - 5x + 2$$


కావాల్సిన వర్గ బహుపది

$2x^2 - 5x + 2$


మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: డా.టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి



ఇళ్లు లేదా భవనాలను నిర్మించేటప్పుడు సూర్యరశ్మి ఇంట్లోకి రావడానికి వీలుగా నీడలు ఎటువైపు పడతాయో ముందే గ్రహించి కిటికీలు, తలుపులను ఏర్పాటు చేస్తారు. ప్రాచీన కాలంలో నీడ పొడవును బట్టి సమయాన్ని లెక్కించేవారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ఆ పద్ధతిని పాటిస్తున్నారు. రీజనింగ్‌లో దిశలు అధ్యాయంలో భాగంగా నీడలు, వాటి అనువర్తనాలపై పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతున్నారు. వాటి ద్వారా అభ్యర్థుల ప్రాదేశిక అవగాహనను, తార్కిక విశ్లేషణ సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. ఇందులో సూర్యుడి స్థానాన్ని అనుసరించి ఒక వ్యక్తి లేదా వస్తువు నీడ లేదా ఛాయ ఎటువైపు పడుతోందో ఊహించాల్సి ఉంటుంది. సమాధానాలను తేలికగా కనుక్కోవాలంటే దిక్కులు, వాటి మధ్య కోణాలపై స్పష్టత ఉండాలి. ఉదయం, సాయంత్రం సహా వివిధ సమయాల్లో నీడలు పడే స్థానాలను గుర్తుంచుకోవాలి.



ఛాయలు చేసే చిత్రాలు!

జనరల్ స్టడీస్ — రీజనింగ్

నీడలు - అనువర్తనాలు

పోటీ పరీక్షల్లో దిశల అనువర్తనాల్లో భాగంగా నీడలపై ప్రశ్నలు అడుగుతుంటారు. ఉత్తరం, దక్షిణం, తూర్పు, పడమర అనే నాలుగు ప్రధానమైన దిక్కులు ఉన్నాయి. వాటితోపాటు ఈశాన్యం, ఆగ్నేయం, నైరుతి, వాయవ్యం అనే నాలుగు మూలలు ఉన్నాయి. ప్రతీ రెండు వరుస దిక్కులు లేదా మూలల మధ్య కోణం 90°లుగా ఉంటుంది. ఒక వ్యక్తి లేదా వస్తువు ఒక దిక్కుకు అభిముఖంగా ఉన్నప్పుడు సమయానుగుణంగా అతడి/వస్తువు నీడ ఏ దిశకు అభిముఖంగా ఉందో కనుక్కోవడం లాంటి అంశాలపైన అవగాహన కలిగి ఉండాలి.



★ సాధారణంగా వ్యక్తి నీడ ప్రధానంగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్ర సమయం అనే మూడు అంశాలపైన ఆధారపడి ఉంటుంది.

సూర్యోదయ సమయానికి:

★ ఉదయం సమయాల్లో తూర్పు దిశకు అభిముఖంగా ఉన్న వ్యక్తి నీడ, అతడి వెనక వైపు అంటే పడమర వైపున ఉంటుంది.

★ ఉదయం సమయంలో ఉత్తర దిశకు అభిముఖంగా ఉన్న ఒక వ్యక్తి నీడ ఎల్లప్పుడూ అతడి ఎడమ వైపున ఉంటుంది.

మిట్ట మధ్యాహ్న సమయానికి:

★ మిట్ట మధ్యాహ్న సమయంలో సూర్య కిరణాలు నిట్టనిలువుగా పడటం వల్ల ఏ రకమైన నీడ ఏర్పడదు.

సూర్యాస్తమయ సమయానికి:


★ సాయంత్ర సమయాల్లో పడమర దిశకు అభిముఖంగా ఉన్న ఒక వ్యక్తి నీడ ఎల్లప్పుడూ తూర్పు వైపున ఉంటుంది.



★ ఇచ్చిన సమాచారం నుంచి ఉదయం సమయాల్లో నీడ ఎల్లప్పుడూ పడమర వైపు, సాయంత్ర సమయాల్లో నీడ ఎల్లప్పుడూ తూర్పు వైపున ఉంటుంది.

పైథాగరస్ సూత్రం

ఒక లంబకోణ త్రిభుజంలో కర్ణం మీది వర్గం మిగతా రెండు భుజాల వర్గాల మొత్తానికి సమానం.




$AC^2 = AB^2 + BC^2$

మాదిరి ప్రశ్నలు

1. ఉదయం సమయంలో A, B అనే ఇద్దరు వ్యక్తులు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎదురెదురుగా నిల్చొని మాట్లాడుతున్నారు. ఒక వేళ B నీడ, A కు ఎడమ వైపున ఉంటే, A ఏ దిశకు అభిముఖంగా ఉంటాడు?

1) తూర్పు 2) ఉత్తరం 3) దక్షిణం 4) పడమర

వివరణ: ఇలాంటి సందర్భాల్లో వ్యక్తి నీడను ముందుగా అమర్చాల్సి ఉంటుంది. ఉదయం సమయం కాబట్టి నీడ పడమర వైపున ఉంటుంది.






B నీడ A కు ఎడమ వైపున ఉండాలంటే A అనే వ్యక్తి ఉత్తర దిశకు అభిముఖంగా ఉండాలి. **జ: 2**

2. సూర్యోదయ సమయంలో P, Q అనే ఇద్దరు వ్యక్తులు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎదురెదురుగా నిల్చొని మాట్లాడుతున్నారు. ఒక వేళ P నీడ Q కు కుడివైపున ఉంటే, P అనే వ్యక్తి ఏ దిశకు అభిముఖంగా ఉంటాడు?

1) దక్షిణం 2) తూర్పు 3) పడమర 4) ఉత్తరం

వివరణ:






సూర్యోదయ సమయం కాబట్టి నీడ పడమర వైపున ఉంటుంది.

P నీడ Q కు కుడివైపున ఉండాలంటే, Q అనే వ్యక్తి దక్షిణం వైపు, P ఉత్తరం వైపు ముఖం చేసి ఉండాలి. **జ: 4**

3. సాయంత్రం సమయంలో మనీష్, మృణాల్ అనే ఇద్దరు వ్యక్తులు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎదురెదురుగా నిల్చొని మాట్లాడుతున్నారు. ఒక వేళ మనీష్ నీడ మృణాల్‌కు ఎడమవైపు ఉంటే, మృణాల్ ఏ దిశకు అభిముఖంగా ఉంటాడు?

1) దక్షిణం 2) తూర్పు 3) పడమర 4) వాయవ్యం

వివరణ: సాయంత్రం సమయంలో వ్యక్తి నీడ ఎల్లప్పుడూ తూర్పు వైపున ఉంటుంది.




మనీష్ నీడ మృణాల్‌కు ఎడమవైపు ఉండాలంటే, మృణాల్ దక్షిణం వైపు, మనీష్ ఉత్తరం వైపునకు అభిముఖంగా ఉండాలి. **జ: 1**

4. సూర్యాస్తమయ సమయంలో సోను, మెహర్ అనే ఇద్దరు వ్యక్తులు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎదురెదురుగా నిల్చొని మాట్లాడుతున్నారు. ఒకవేళ సోను నీడ, మెహర్‌కు కుడి వైపున ఉంటే మెహర్ ఏ దిశకు అభిముఖంగా ఉంటాడు?

1) తూర్పు 2) పడమర 3) ఉత్తరం 4) దక్షిణం

వివరణ:



సోను నీడ మెహర్‌కు కుడి వైపున ఉండాలంటే మెహర్ ఉత్తరం వైపు అభిముఖంగా ఉండాలి. **జ: 3**



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

సరికొత్తగా కార్మిక చట్టాలు!

వందేమాతరం గేయానికి గత నవంబరులో నూటయాభై ఏళ్లు పూర్తయ్యాయి. అదే నెలలో క్రికెట్, కబడ్డీ ప్రపంచకప్ పోటీల్లో భారత మహిళా జట్లు విజేతలుగా నిలిచాయి. పాత కార్మిక చట్టాలను ప్రస్తుత పరిస్థితులకు తగినట్లుగా సవరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. స్టేట్ బ్యాంకు వ్యాపార పరిమాణం వంద లక్షల కోట్ల రూపాయలకు చేరింది. తాజా భారీ దానశీలుర జాబితాలో దేశంలో శివ్ నాడార్ అగ్రస్థానంలో నిలిచారు. భారత రాష్ట్రపతి తొలిసారిగా అంగోలా, బోట్స్‌వానా దేశాల్లో పర్యటించారు. విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో పదమూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులకు ఏపీ ప్రభుత్వంతో ఒప్పందాలు కుదిరాయి. 'జన భాగస్వామ్యంతో జల సంరక్షణ' విభాగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది. దక్షిణాఫ్రికాలో జీ-20 సమావేశాలు, థాయ్‌లాండ్‌లో మిస్ యూనివర్స్ పోటీలు నిర్వహించారు. ఇలాంటి ముఖ్యమైన పరిణామాలు, వార్తల్లో నిలిచిన స్థానిక, జాతీయ, అంతర్జాతీయ అంశాలు, కీలక నియామకాలు, క్రీడల విజేతల వివరాలను పోటీ పరీక్షార్థులు మరోసారి మననం చేసుకోవాలి.



ముఖ్యాంశాలు

✦ దేశంలోనే తొలిసారిగా నాలుగేళ్ల బీఎస్సీ వ్యవసాయ కోర్సును సంయుక్తంగా నిర్వహించేందుకు తెలంగాణ అగ్రివర్సిటీ, ఆస్ట్రేలియాలోని సిడ్నీ వెస్టర్న్ విశ్వవిద్యాలయాలు ఓ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

✦ దేశంలో ఆవిష్కరణలు, పరిశోధనల రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ రూ.లక్ష కోట్ల పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణ(ఆర్‌డీఐ) పథకాన్ని ప్రారంభించారు. నవంబరు 3న న్యూదిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కన్‌క్లేవ్ (ఈఎస్‌టీఐసీ) 2025లో మోదీ దీన్ని ప్రారంభించారు.

✦ తొలిసారి మహిళల వన్డే ప్రపంచకప్ 2025 విజేతగా భారత్ నిలిచింది. నవంబరు 2న ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా జట్టును ఓడించింది. భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా దీప్తి శర్మ (215 పరుగులు, 22 వికెట్లు) నిలిచింది.

✦ భారతీయ స్టేట్ బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.100 లక్షల కోట్ల మైలురాయిని చేరినట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ప్రకటించారు. ఆస్తులపరంగా ప్రపంచంలో 43వ అతిపెద్ద బ్యాంకుగా ఎస్‌బీఐ నిలిచింది.

✦ అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు, డిక్ చెనీగా ప్రసిద్ధిగాంచిన రిచర్డ్ బ్రూస్ చెనీ (84) నవంబరు 3న మరణించారు. 9/11 ఉగ్రదాడుల అనంతరం అఫ్గానిస్థాన్, ఇరాక్‌లపై అమెరికా చేపట్టిన భీకర దాడుల నిర్మాతగా ప్రసిద్ధి పొందిన డిక్ చెనీ అమెరికా చరిత్రలోనే అత్యంత శక్తిమంతమైన ఉపాధ్యక్షుడిగా ఖ్యాతిగాంచారు.

✦ 2007, జనవరి 1 తర్వాత జన్మించిన ప్రతిఒక్కరికీ పొగాకు వాడకాన్ని పూర్తిగా నిషేధించిన ఏకైక దేశంగా మాల్దీవులు వార్తల్లో నిలిచింది.

✦ ఉత్తర కొరియా మాజీ దేశాధినేత కిమ్ యోంగ్ నామ్ (97) మరణించారు. నవంబరు 3న 1998 నుంచి 2019 వరకు దేశాధ్యక్షుడిగా ఉన్నారు.




నవంబరు 22, 23 తేదీల్లో దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో జీ-20 దేశాల శిఖరాగ్ర సదస్సు నిర్వహించారు. ప్రధాని మోదీ ఈ సదస్సులో పాల్గొని 'సమ్మిళిత, సుస్థిర ఆర్థికాభివృద్ధి' అనే అంశంపై ప్రసంగించారు. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదని, అది ఏ రూపంలో ఉన్నా తెగనాడాల్సిందేనని జీ-20 సదస్సు తీర్మానం చేసింది.

✦ భారత సంతతి యువకుడు జోహ్రాన్ మమ్దానీ (34) న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికయ్యారు. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా భారత్‌లో జన్మించి అమెరికాలో స్థిరపడిన గజాలా హష్మీ విజయం సాధించారు. సిన్సినాటి మేయర్‌గా భారత సంతతికి చెందిన ఆఫ్తాబ్ పురేవాల్ రెండోసారి ఎన్నికయ్యారు.

✦ ఎడెల్‌గివ్ హురున్ ఇండియా ఫిలాంత్రఫీ జాబితా-2025 ప్రకారం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ దేశంలో 2025లో దాతృత్వ కార్యక్రమాలకు అత్యధిక మొత్తం అందించిన వారిలో అగ్రస్థానంలో నిలిచారు. 2025లో ఈయన కుటుంబం రూ.2,708 కోట్లు దానం చేసింది. గత ఐదేళ్లలో దేశంలో అత్యంత దానశీలిగా శివ్ నాడార్ నిలవడం ఇది నాలుగో సారి. జాబితాలో తర్వాత స్థానాల్లో ముఖేష్ అంబానీ, బజాజ్ కుటుంబం, కుమార్ మంగళం బిర్లా కుటుంబం, గౌతమ్ అదానీ కుటుంబం ఉన్నాయి.

✦ జాతీయ గేయం వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నవంబరు 7న ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో స్మారక స్టాంపు, ప్రత్యేక నాణెం విడుదల చేశారు. ఏడాది పొడవునా జరిగే 'వందేమాతరం' ఉత్సవాలను ప్రారంభించారు.



ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియాన్ని నవంబరు 1న ఈజిప్ట్‌లో ప్రారంభించారు. దాదాపు రూ.8,320 కోట్ల వ్యయంతో కైరోలోని గాజా పిరమిడ్‌ల వద్ద నిర్మించిన ఈ మ్యూజియంలో ఈజిప్టు పురాతన నాగరికతను ప్రతిబింబించే 50 వేల కళాఖండాలు కొలువు దీరాయి.

✦ దేశంలోనే తొలిసారిగా ఆధునిక సాంకేతికతతో ఆరు గంటల్లోనే వివిధ జీవవ్యర్థ పదార్థాల (బయోవేస్ట్)ను పోషకాలు అధికంగా ఉండే జీవఎరువు (బయోఫెర్టిలైజర్)గా మార్చే భారీ పరిశ్రమను హైదరాబాద్‌లోని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసేందుకు వియత్నాంకు చెందిన ప్రసిద్ధ జీవ ఎరువుల తయారీ సంస్థ 'బయోవే'తో అగ్రి వర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది.

✦ కర్బన ఉద్గారాలను పీల్చుకునే ఉష్ణమండల అరణ్యాల సంరక్షణ కార్యక్రమం (టీఎఫ్ఎఫ్ఎఫ్- ట్రాపికల్ ఫారెస్ట్ ఫర్ ఎవర్ ఫెసిలిటీ)లో భారత్ నవంబరు 8న పరిశీలకు రాలి హోదాలో చేరింది. బ్రెజిల్ రూ.12,500 కోట్ల డాలర్లతో టీఎఫ్ఎఫ్ఎఫ్ నిధిని ప్రారంభించింది. ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు ఈ కార్యక్రమానికి నిధులు సమకూరుస్తాయి.

✦ జన్యు శాస్త్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ఆధునిక శాస్త్రాన్ని పునర్నిర్మించిన మార్గదర్శక బయాలజిస్ట్, డీఎన్ఏ డబుల్ హెలిక్స్‌ను కనుక్కోవడంలో సహాయపడి, హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్ట్‌కు నాయకత్వం వహించిన జేమ్స్ డి.వాట్సన్ (97) నవంబరు 6న న్యూయార్క్‌లో మరణించారు.

✦ నవంబరు 10న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆఫ్రికాలోని అంగోలాలో పర్యటించారు. అధ్యక్షుడు జోవో మాన్యుయేల్ గొన్ సాల్వెష్ లోరెన్సోతో సమావేశమయ్యారు. భారత రాష్ట్రపతి అంగోలాలో పర్యటించడం ఇదే తొలిసారి.

✦ నవంబరు 12 నుంచి 14 వరకు హైదరాబాద్‌లోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం (ఇన్‌కాయిస్)లో 32వ అంతర్జాతీయ సునామీ సదస్సు నిర్వహించారు.

✦ మూడు రోజుల బోట్స్‌వానా పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశాధ్యక్షుడు డ్యూమా గిడియోన్ బోకోతో నవంబరు 12న భేటీ అయ్యారు. 2026లో బోట్స్‌వానా, భారత్‌ల మధ్య దౌత్య సంబంధాలు 60వ ఏట అడుగుపెట్టనున్నాయి. భారతరాష్ట్రపతి బోట్స్‌వానాలో పర్యటించడం ఇదే మొదటిసారి.

✦ కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు-2024లో జల్ సంచయ్ జన్ భాగీదారీ (జన భాగస్వామ్యంతో జల సంరక్షణ) విభాగం కింద తెలంగాణ జాతీయ స్థాయిలో తొలి ర్యాంకు సాధించింది.

✦ నవంబరు 10-13 వరకు ప్రపంచ ఆక్వాకల్చర్ సదస్సు-2025ను హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించారు.



నవంబరు 2న ఇస్రో సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి బాహుబలి రాకెట్‌గా పేరొందిన 'ఎల్‌వీఎం3-ఎం5' వాహక నౌక ద్వారా ఈ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టారు. 2013లో ప్రయోగించిన జీశాట్-7 ఉపగ్రహ స్థానంలో ఇది సేవలు అందిస్తుంది.

✦ భారత క్రీడాకారిణి అనుపమ రామచంద్రన్ మహిళల ప్రపంచ స్నూకర్ టైటిల్-2025ను నెగ్గింది. ప్రపంచ స్నూకర్ టైటిల్ (15-రెడ్) సాధించిన తొలి భారత మహిళా క్రీడాకారిణిగా ఆమె ఘనత సాధించింది.

✦ సీఐఐ భాగస్వామ్య సదస్సును ఏపీ ప్రభుత్వం విశాఖపట్నంలో నిర్వహించింది. మూడు రోజుల్లో 12 రంగాల్లో రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులు, 613 ఒప్పందాలు కుదిరాయి. తద్వారా 16.31 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నట్లు అంచనా.

✦ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, టాటా ఎలక్ట్రిక్ మొబిలిటీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శైలేష్ చంద్ర 'ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ మోటార్ వెహికల్ మ్యానుఫ్యాక్చరర్స్' (ఓఐసీఏ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



మిస్ యూనివర్స్-2025 టైటిల్ విజేతగా ఫాతిమా బాష్ (మెక్సికో) నిలిచింది. థాయ్‌లాండ్‌లో జరిగిన ఈ పోటీల్లో తొలి రన్నరప్‌గా ప్రవీణార్ సింగ్ (థాయ్‌లాండ్), రెండో రన్నరప్‌గా వెనుజువెలాకు చెందిన స్టిఫానీ అబాసలీ నిలిచారు.

✦ భారతదేశపు మొదటి క్వాంటం డైమండ్ మైక్రోస్కోప్‌ను న్యూదిల్లీలో జరిగిన ఈఎస్‌టీఐసీ-2025 (ఎమర్జింగ్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్)లో ఆవిష్కరించారు. ఐఐటీ బాంబేలోని పీ-క్వెస్ట్ గ్రూప్ అభివృద్ధి చేసిన ఈ మైక్రోస్కోప్ న్యూరోసైన్స్, సెమీకండక్టర్ విశ్లేషణ, క్వాంటం టెక్నాలజీ రంగాల్లో ఉపయోగపడుతుంది.

✦ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 17 ఏళ్ల కుంచల కైవల్య రెడ్డి అమెరికాలో ప్రతిష్ఠాత్మక వ్యోమగామి శిక్షణ కార్యక్రమానికి ఎంపికైంది. 2026 నుంచి 2029 వరకు ఫ్లోరిడాలో జరిగే శిక్షణ కార్యక్రమం అనంతరం కైవల్య 2029 అంతరిక్ష మిషన్‌లో పాల్గొంటుంది.

✦ సవరించిన భారత్ నెట్ పథకాన్ని పూర్తిగా అమలుచేసిన మొదటి రాష్ట్రంగా పంజాబ్ నిలిచింది.

✦ ప్రపంచంలో 2024లో అత్యధిక క్షయ కేసులు భారత్‌లోనే నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకటించింది. తర్వాత స్థానాల్లో ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, చైనా, పాకిస్థాన్ ఉన్నట్లు పేర్కొంది.

✦ వృక్షమాతగా గుర్తింపు పొందిన 'సాలుమరద' తిమ్మక్క (114) నవంబరు 14న బెంగళూరులో మరణించారు.

✦ ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ హాకీ(ఎఫ్ఐహెచ్) ఉత్తమ పురుష ఎంపైర్(2025)గా భారత హాకీ ఎంపైర్ రఘుప్రసాద్ ఎంపికయ్యారు. తన కెరీర్ మొత్తం మీద 198 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో విధులు నిర్వహించాడు.

✦ జేడీయూ అధినేత నీతీష్ కుమార్ నవంబరు 20న బిహార్ 22వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈయన సీఎం పదవి చేపట్టడం ఇది పదోసారి. 2000లో నీతీష్ తొలిసారి అధికారంలోకి వచ్చారు.

✦ దేశవ్యాప్తంగా కార్మికులందరికీ సామాజిక భద్రత న్యాయం అందించేందుకు నవంబరు 21న నాలుగు కార్మిక (లేబర్) కోడ్‌లను అమల్లోకి తీసుకొచ్చినట్లు కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో రూపొందించిన వేతనాల కోడ్-2019, పారిశ్రామిక సంబంధాల కోడ్-2020, సామాజిక భద్రత కోడ్-2020, వృత్తిపరమైన భద్రత ఆరోగ్యం- పని ప్రదేశాల్లో పరిస్థితుల కోడ్-2020 అనే నాలుగు కోడ్‌లు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి.

✦ కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తించే ఆదేశాలు, చట్టాలను నేరుగా చేసే అధికారాలను రాష్ట్రపతికి ఇస్తున్న ఆర్టికల్ 240 పరిధిలోకి చండీగఢ్‌ను కూడా తేవాలని కేంద్రం ప్రతిపాదించింది. చట్టసభల్లేని కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్-నికోబార్ దీవులు, దాద్రా-నగర్ హవేలీ, దమన్-దీవ్ ప్రస్తుతం అధికరణం 240 పరిధిలో ఉన్నాయి.


✦ మహిళల కోసం జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) 24 గంటలు అందుబాటులో ఉండే కొత్త హెల్ప్‌లైన్ నంబరు 14490ను నవంబరు 24న ప్రారంభించింది.

✦ నవంబరు 24న సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. దేశ న్యాయవ్యవస్థలో ఈ అత్యున్నత పదవి చేపట్టిన తొలి హరియాణా వాసిగా ఘనత సాధించారు. 2027, ఫిబ్రవరి 9 వరకు పదవిలో కొనసాగుతారు.

✦ భారత అంధ మహిళల క్రికెట్ జట్టు తొలి టీ-20 వరల్డ్‌కప్ విజేతగా నిలిచింది. రన్నరప్‌గా నేపాల్ నిలిచింది.

✦ మహిళల కబడ్డీ ప్రపంచకప్‌ను భారత్ నెగ్గింది. నవంబరు 24న ఢాకాలో జరిగిన ఫైనల్లో భారత్ 35-28తో చైనీస్ తైపీని ఓడించింది. రీతూనేగి సారథ్యంలోని భారత జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా టైటిల్ నిలబెట్టుకుంది.

✦ హైదరాబాద్ మహానగరం మరింత విస్తరించి బృహత్ నగరంగా మారనుంది. బాహ్యవలయ రహదారి (ఓఆర్ఆర్) లోపల, దాన్ని ఆనుకుని బయట ఉన్న 27 నగర, పురపాలక సంఘాలను గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది.




అరవింద్ పనగడియా నేతృత్వంలోని 16వ ఆర్థిక సంఘం 2026-31 మధ్య కాలానికి రాష్ట్రాలకు పంపిణీ చేసే ఆర్థిక వనరులకు సంబంధించిన నివేదికను నవంబరు 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేసింది. ఈ కొత్త సిఫార్సులు 2026, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. 2023, డిసెంబరు 31న 16వ ఆర్థిక సంఘాన్ని కేంద్రం ఏర్పాటు చేసింది.

✦ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్యం, ఎన్నికల సహాయ అంతర్జాతీయ సంస్థ (ఐడీఈఏ) అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు.

✦ ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంలో మానవ హక్కుల ఉల్లంఘనపై విచారణ జరిపేందుకు ఏర్పాటైన ప్యానెల్‌కు నేతృత్వం వహించేందుకు ఒడిశా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.మురళీధర్ ఎన్నికయ్యారు.

✦ ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబరు)లో భారత్ 8.2 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది ఆరు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి.



రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్

కృష్ణా, పల్నాడు జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి అభినందనలు

ఈనాడు, అమరావతి: 'నూతన సంవత్సర శుభాకాంక్షలను విద్యార్థులకు ఉపయోగపడేలా మలిచిన కృష్ణా, పల్నాడు జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. పలు జిల్లాల్లో కలెక్టర్లు ఇలా వినూత్న ఆలోచనలతో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడాన్ని గుర్తుచేస్తూ సీఎం 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు.

అటల్ వయో అభ్యుదయ యోజన పథకానికి రూ.2.91 కోట్లు

ఈనాడు, అమరావతి: వృద్ధుల సంరక్షణ, నిర్వహణ చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన అటల్ వయో అభ్యుదయ యోజన పథకానికి రూ. 2.91 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులిచ్చింది. వృద్ధులకు పిల్లల నుంచి ఎదురయ్యే వేధింపులు, ఆస్తికి సంబంధించిన వివాదాలు, ఇతర సమస్యల్ని వారు పరిష్కరించుకునేందుకు జిల్లాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. కేంద్ర సహకారంతో ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది.

మంత్రి అచ్చెన్నాయుడి సోదరుడు ప్రభాకర్ ఓఎస్డీ పదవీకాలం పొడిగింపు

ఈనాడు, అమరావతి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి సోదరుడు, విశ్రాంత అదనపు డీసీపీ కింజరాపు ప్రభాకర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. అదనపు డీసీపీ హోదాలో పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌ను గతేడాది జనవరిలో ఏడాది కాలపరిమితితో కాంట్రాక్టు ప్రాతిపదికన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీగా నియమించారు. ఆ హోదాలో ఆయన విశాఖపట్నం ఆర్‌వీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ పదవీ కాలం ఈ నెల 8తో పూర్తయిపోతోంది. ఈ నేపథ్యంలో మరో ఏడాది పాటు ఆయన్ను ఓఎస్డీగా కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి రథశకలాల నిమజ్జనం వాయిదా

ఈనాడు, అమరావతి: శనివారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించ తలపెట్టిన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథ శకలాల నిమజ్జన కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు దేవాదాయ శాఖ ప్రకటించింది. వైకాపా హయాంలో ఈ రథం దహనమైన విషయం తెలిసిందే. దాని స్థానంలో దేవస్థానం కొత్త రథాన్ని తయారుచేయించింది. పాత రథాన్ని శనివారం నిమజ్జనం చేస్తామని తొలుత ప్రకటించింది. ఆగమశాస్త్ర నిబంధనలు, ముహూర్తాలపై చర్చించిన అనంతరం ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసింది.

పారిశుద్ధ్య అవగాహన కార్యక్రమాలపై దృష్టి పెట్టండి

- ఏజెన్సీలకు స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ పట్టాభిరామ్ సూచన

ఈనాడు, అమరావతి: పారిశుద్ధ్యానికి సంబంధించి వివిధ వర్గాల ప్రజలకు అవగాహన.. మున్సిపల్, పంచాయతీ సిబ్బందికి శిక్షణ అందించే ఏజెన్సీల పనితీరుపై స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ పట్టాభిరామ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నెన్స్ (ఏఐఎల్ఎస్‌జీ), వాష్ ఇన్‌స్టిట్యూట్ ఏజెన్సీల ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశమై సమీక్షించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నందున, ఫలితాలపై దృష్టి సారించాలని పట్టాభిరామ్ సూచించారు. ఫొటోల వంటి కార్యక్రమాల ద్వారా మనల్ని మనం మోసం చేసుకోవద్దని హితవు పలికారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయన దిశానిర్దేశం చేశారు.

విద్యుత్తు ఛార్జీలపై ప్రచార ఆర్భాటం ఆపాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: కూటమి పాలనలో 18నెలల్లో అదనంగా మోపిన రూ.15,485కోట్ల సర్దుబాటు ఛార్జీలను రద్దు చేసి, తమ చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రచార ఆర్భాటం ఆపి, హామీ ఇచ్చిన విధంగా భారం తగ్గించాలని పేర్కొన్నారు. "అదానీ స్మార్ట్‌మీటర్ల బిగింపు ఆపి, ప్రజలను రక్షించాలి. 2019-24లో వినియోగించుకున్న విద్యుత్తుపై రూ.12,771కోట్ల ట్రూ అప్ ఛార్జీల భారం వేయడానికి పంపిణీ సంస్థలు ప్రతిపాదనలు పెట్టాయి. విద్యుత్తు నియంత్రణ మండలి వాటిలో రూ.8,274కోట్లను తిరస్కరించి, రూ.4,497 కోట్లు వసూలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించారు. గత 26ఏళ్లలో ఏనాడూ లేని విధంగా కూటమి ట్రూ డౌన్ చేసిందని మంత్రి ప్రకటించడం హాస్యాస్పదం. గత 18 నెలల కాలంలో కూటమి సర్కారు రూ.15,485 కోట్లను 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తోంది. ప్రతి నెలా అదనంగా యూనిట్‌కు 40పైసలు సైతం వసూలు చేయడం దుర్మార్గం" అని విమర్శించారు.



ఇది షీరాక్స్ సెంటర్

ఎక్కడైనా 'జిరాక్స్' సెంటర్‌ను చూస్తుంటాం.. తెలంగాణలోని ఖమ్మం నగరం గాంధీచౌక్ ప్రాంతంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాత్రం 'షీరాక్స్' సెంటర్ కనిపించడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఖమ్మం గ్రామీణ మండలం ఆరెంపులకు చెందిన కొంగర స్వరూపరాణి దివ్యాంగురాలు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా డీఆర్‌డీఏ ఆమెకు రూ.3 లక్షల రుణం ఇవ్వగా జిరాక్స్, లామినేషన్ యంత్రం కొనుగోలు చేశారు. స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌కు ప్రభుత్వమే 'షీరాక్స్' అనే పేరు పెట్టింది. ఆర్థికంగా వెసులుబాటు కలగడంతో తాను ఇతరులకు భారం కాకుండా ఉన్నానని స్వరూపరాణి చెప్పారు. –న్యూస్‌టుడే, ఖమ్మం గాంధీచౌక్

ఆరోగ్య రక్ష.. 'సఖీ సురక్ష'

- 26.53 లక్షల మంది డ్వాక్రా మహిళలకు పరీక్షలు
- అవసరమైతే ఆసుపత్రుల్లో చేర్పించి వైద్యం
- తొలి దశలో లక్ష మందికి..

ఈనాడు, అమరావతి: పట్టణ పేద మహిళల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం 'సఖీ సురక్ష' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. నగరాలు, పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 26.53 లక్షల మంది మహిళలను ఉద్దేశించి దీన్ని రూపొందించింది. తొలి దశలో వీరిలో లక్ష మందికి జీవనశైలి వ్యాధులపై పరీక్షలు చేయించడంతోపాటు వైద్యం అవసరమైన వారిని ఆసుపత్రుల్లో చేర్పించడం ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ ఆదేశాలతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో సఖీ సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత నెల రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించి, 76 వేల మందికి పైగా వైద్య పరీక్షలు చేయించారు. వీరిలో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 14,659 మందిని ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో చేర్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

అండగా హెల్త్ రిసోర్స్‌పర్సన్లు

- వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యలున్నట్లు గుర్తించిన మహిళలను ఆసుపత్రుల్లో చేర్పించడం, వారి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు హెల్త్ రిసోర్స్‌పర్సన్లను ఏర్పాటు చేస్తున్నారు. 40-50 మంది సభ్యులకు ఒకరు చొప్పున వీరు ఉంటారు.
- ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు లేని వారికి అర్హత మేరకు ఇప్పించి వారందర్నీ సంబంధిత నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో చేర్పించనున్నారు.
- ఆసుపత్రుల నుంచి ఇళ్లకు వచ్చిన వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు ఎప్పటికప్పుడు తెలుసుకుని సలహాలు ఇచ్చేలా టెలి మెడిసిన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మందుల వినియోగం నుంచి పౌష్టికాహారం తీసుకునే వరకు వైద్యులు సూచనలు చేయనున్నారు. వైద్య, ఆరోగ్య శాఖను ఇందులో భాగస్వామిని చేస్తున్నారు.

పరీక్షల్లో గుర్తించిన ప్రధాన సమస్యలివి

అధిక బరువు

- 29,365 మంది బాధితులు
- ఎక్కువ మందిలో మోకాళ్ల నొప్పులు, కీళ్ల వాపులు

క్యాన్సర్లు

- లక్షణాలున్నవారు: 69,074 మంది
- తీవ్రత ఎక్కువ ఉన్నవారు: 11,284
- ప్రధానమైనవి: రొమ్ము, గర్భాశయ, నోటిక్యాన్సర్లు

మానసిక సమస్యలు

- అత్యధికుల్లో మానసిక సమస్యలు గుర్తింపు
- కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించే వీలు
- కుటుంబ సమస్యలు, కలహాలు, పేదరికం వంటి సమస్యలు, ఒంటరితనం

కాలేయ, మూత్రపిండాల సమస్యలు: 80 వేల మందికి పైగా బాధితులు.



ప్రస్తుత సమాజంలో కొందరు జనాలకు క్రమశిక్షణ లేకుండా పోతోంది. ఈ విషయం చాలా సందర్భాల్లో బహిర్గతం అవుతూనే ఉంటుంది. అయితే క్రమశిక్షణగా ఎలా ఉండాలో అప్పుడప్పుడు జంతువులు, పక్షులు మనకు గుర్తుచేస్తుంటాయి. దానికి నిదర్శనమే ఇక్కడ కనిపిస్తున్న జింకలు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ సమీపంలోని పిల్లలమర్రి ప్రాంగణంలో మినీ జూపార్క్ ఉంది. ఇక్కడున్న నీటి కాల్వను జింకలు వరుస క్రమంలో ఒకదానివెనుక ఒకటి ఈదుకుంటూ దాటి... ఒడ్డున ఉన్న దాణాతో కడుపు నింపుకొన్నాయి. అనంతరం తిరిగి అదే పద్ధతిలో అడవిలోకి వెళ్లిపోయాయి. – ఈనాడు, మహబూబ్‌నగర్


డౌటే వద్దు.. మేడిన్ చంచల్‌గూడ



చిత్రాన్ని చూసి పోలీసులు షాపింగ్ చేస్తున్నారనుకుంటే పొరపాటే. వారే అక్కడ వ్యాపారం నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు వివిధ ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. మహిళలు గాజులు, ఉన్ని దుస్తులు, సెల్‌ఫోన్ పౌచ్‌లు, ల్యాప్‌టాప్, జూట్ బ్యాగులు, సబ్బులు, పేపర్ బ్యాగులు, పచ్చళ్లు, బేకరీ ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. పురుషులు ఇనుప కుర్చీలు, బీరువాలు, చెక్క వస్తువులు, సూట్‌లు, శానిటైజర్లు, ఫినాయిల్ తయారు చేస్తున్నారు. వాటిని హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహిస్తున్న నుమాయిష్‌లోని స్టాల్‌లో ఇలా విక్రయిస్తూ కనిపించారు. –ఈనాడు, హైదరాబాద్

నేర్చుకుందామా నెలకో అలవాటు..

బరువు తగ్గాలి.. ప్రొటీన్ ఎక్కువగా తీసుకోవాలి.. చక్కెర జోలికి వెళ్లకూడదు.. ఇలా కొత్త సంవత్సరంలో ఆరోగ్యంగా ఉండేందుకు తీర్మానాలు చేసుకుంటాం. అన్ని ఒకేసారి కాకుండా ఏదైనా ఒక అలవాటును క్రమంగా ఆచరిస్తూ వెళ్తే దీర్ఘకాలం ఉంటుంది. అందుకే జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) సరికొత్త ప్రచారం ప్రారంభించింది. నెలకు ఒక అలవాటు చొప్పున 12 నెలలకు సంబంధించిన తీర్మానాలతో క్యాలెండర్ రూపొందించింది. ఎన్ఐఎన్ డైరెక్టర్ భారతీ కులకర్ణితో సహా శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు దీన్ని తయారు చేశారు. –ఈనాడు, హైదరాబాద్



'వీబీ జీ రామ్ జీ' రద్దు చేసేలా కేంద్రంపై సీఎం ఒత్తిడి తేవాలి:షర్మిల

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకం ఊపిరి తీసిన 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని రద్దు చేసేలా కేంద్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఒత్తిడి తేవాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'కరవు పనిపై కేంద్రం కుట్రలు చేస్తుంటే సీఎం చంద్రబాబు కిమ్మనకుండా ఉండటం దారుణం. పథకం ద్వారా రాష్ట్రంలో ఏటా 80 లక్షల మంది పేదలకు ఉపాధి హక్కుగా మారింది. పథకాన్ని బాగా వినియోగించుకుంటున్న రాష్ట్రాల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. కొత్త చట్టంతో రాష్ట్రానికి ఏటా రూ.4,500 కోట్ల భారమని తెలిసీ ప్రశ్నించకుండా సీఎం మౌనం వహించడం బాధాకరం. వీబీ జీ రామ్ జీకి 40% నిధులు ఎక్కడి నుంచి తెస్తారు?' అని షర్మిల ప్రశ్నించారు.

ఎస్ఐఆర్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఏపీలో ఎస్ఐఆర్ త్వరగా మొదలు పెట్టాలని జనసేన కోరడం భాజపాకు వంతపాడటమేనని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో ఇప్పటికే కేరళ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడుల్లో లక్షల ఓట్లు తొలగించారని ఆరోపించారు. గతంలో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించిన తెదేపా.. అధికారం చేపట్టాక అమలుకు సన్నద్ధం కావడం సరికాదని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు ఛైర్మన్ పదవీకాలం మూడేళ్లు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు ఛైర్మన్, సభ్యుల పదవీకాలంలో ప్రభుత్వం మార్పులు చేసింది. ఆంధ్రప్రదేశ్ ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చట్టం ప్రకారం ఛైర్మన్, సభ్యుల పదవీకాలం మూడేళ్లుగా ఉండాలి. కానీ ఇటీవల వారి పదవీకాలాన్ని రెండేళ్లుగా పేర్కొంటూ పరిశ్రమలు, వాణిజ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చట్టంలో నిర్దేశించిన మేరకు పదవీకాలాన్ని మూడేళ్లకు మార్పు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది.

రూ.6,500 కోట్ల రుణం తీసుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.6,500 కోట్ల రుణం తీసుకోబోతోంది. వచ్చే మంగళవారం రిజర్వుబ్యాంకు నిర్వహించే సెక్యూరిటీల వేలంలో పాల్గొని ఈ మొత్తం తీసుకోనుంది. వివిధ కాలపరిమితుల్లో ఆ రుణం తీర్చేలా సమీకరించేందుకు రిజర్వు బ్యాంకుకు వర్తమానం పంపింది. ఈ మేరకు ఆ బ్యాంకు శుక్రవారం నోటిఫై చేసింది. రూ.1,000 కోట్ల చొప్పున 10 ఏళ్లు, 14 ఏళ్లు, 16 ఏళ్లు, 18 ఏళ్లు, 19 ఏళ్ల కాలపరిమితితో తీర్చేలా రూ.5,000 కోట్లు.. 21 ఏళ్ల కాలపరిమితితో తిరిగి తీర్చేలా రూ.1,500 కోట్ల రుణం తీసుకోనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కేంద్రం నుంచి వచ్చిన అనుమతుల మేరకు ఈ అప్పులు సమీకరిస్తోంది.

కలుషిత ఆహారం తిని మూడేళ్ల బాలుడి మృతి

యాచారం, న్యూస్‌టుడే: కలుషిత ఆహారం తిని మూడేళ్ల బాలుడు మృతి చెందగా.. మరో ఆరుగురు ఆసుపత్రిపాలైన ఘటన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశాకు చెందిన జాయ్‌దోర్ అలీ, రోమేసా ఖాతుమ్ దంపతులు తమ్మలోనిగూడెం సమీపంలోని కోళ్లఫారంలో కూలీలుగా పనిచేస్తుంటారు. వారి సమీప బంధువులు, కందుకూరు మండలం సాయిరెడ్డిగూడెంలోని మరో కోళ్లఫారంలో పనిచేస్తున్న అబ్దుల్ మాలిక్, బనేసా ఖాతుమ్ దంపతులు..తమ సంతానం ముజుదా ఖాతుమ్, మాముని, ఆరిఫుల్(3)లను తీసుకుని గురువారం రాత్రి జాయ్‌దోర్ అలీ వద్దకు వచ్చారు. అనంతరం వారంతా కలిసి..ఆలుగడ్డ, ఎండు చేపల కూరతో భోజనం చేశారు. అర్ధరాత్రివేళ కడుపులో వికారంగా ఉండటంతో అందరూ ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లారు. ముగ్గురు చిన్నారుల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు..నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆరిఫుల్ మృతి చెందగా మిగిలిన వారు కోలుకున్నారు. ఆహారం కలుషితం కావడమే ఘటనకు కారణమై ఉండొచ్చని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

కాలువలో ఒకటి.. కల్వర్టు ఢీకొట్టి మరొకటి.. బోల్తాపడిన పాఠశాల, కళాశాల బస్సులు

- ఖమ్మం, భద్రాద్రిలో జిల్లాల్లో ప్రమాదాలు
- 52 మంది విద్యార్థులకు గాయాలు, ఇద్దరికి తీవ్రం

పెనుబల్లి, అశ్వాపురం, న్యూస్‌టుడే, ఈనాడు, హైదరాబాద్: అతివేగం, డ్రైవర్ ఏమరుపాటుతో దాదాపు వందమంది విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే భయానక పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు బస్సు ప్రమాదాల్లో 52 మంది విద్యార్థులు గాయాలపాలయ్యారు. అందులో ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉండగా.. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. పోలీసులు, పిల్లల తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గణేష్‌పాడు శివారులో పాఠశాల బస్సు అదుపు తప్పి ఎన్ఎస్పీ కాకర్ల మేజర్ కాలువలోకి పల్టీ కొట్టింది. ఆ సమయంలో బస్సులో 107 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 20 మంది గాయపడ్డారు. ఐదుగురిని పెనుబల్లి వైద్యశాలకు, 15 మందిని ఏపీ తిరువూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కాలువలో నీళ్లు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వేంసూరు మండలం మొద్దులగూడెంలోని శ్రీవివేకానంద విద్యాలయంలో సమీప ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. సాయంత్రం వారిని ఇంటి దగ్గర దింపేందుకు బయలుదేరిన బస్సు అదుపు తప్పి గణేష్‌పాడు ఊరి చివర్లోని మేజర్ కాలువపై ఉన్న వంతెన రక్షణ గోడను ఢీకొట్టి కాలువలో పల్టీ కొట్టింది. పొలాల్లో పనులు చేస్తున్న రైతులు పరుగెత్తుకొచ్చి బస్సులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. ఈ ఘటనపై రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.





గణేష్‌పాడు వద్ద పల్టీ కొట్టిన పాఠశాల బస్సు ★ మొండికుంట వద్ద బోల్తా పడిన కళాశాల బస్సు

వాహనాన్ని తప్పించే క్రమంలో..

అదుపు తప్పిన ఓ కళాశాల బస్సు బోల్తా పడిన మరో ఘటన భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం మొండికుంటలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ సహా 32 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. పాల్వంచలోని కేఎల్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు మణుగూరు నుంచి పాల్వంచకు 36 మంది విద్యార్థులను ఎక్కించుకొని వస్తోంది. మొండికుంట వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ఓ వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి పక్కనే ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టి అవతలి పక్కకు వెళ్లి బోల్తా పడింది. తేరుకున్న డ్రైవర్.. బస్సు ముందు, వెనక భాగంలోని అద్దాలను బద్దలు కొట్టి విద్యార్థులను బయటకు తీసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అశ్వాపురం సీఐ అశోక్, పోలీసులు ఘటన స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని భద్రాచలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తెదేపా కేంద్ర కార్యాలయంలో ప్రజావేదిక షెడ్యూల్ ఇదే..

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమం షెడ్యూలును ఎన్టీఆర్ భవన్ విడుదల చేసింది. ప్రతి శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో ఆయా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నందున.. శుక్రవారం నాడు ఎన్టీఆర్ భవన్‌లో ప్రజావేదిక కార్యక్రమం ఉండదని వెల్లడించింది. జనవరి 14, 15, 16 తేదీల్లో భోగి, సంక్రాంతి, కనుమపండగలు.. 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయా రోజుల్లో ఎలాంటి గ్రీవెన్స్ కార్యక్రమం ఉండదని పేర్కొంది. ఈ నెలలో నిర్వహించే ప్రజావేదిక షెడ్యూలు, పాల్గొనే నేతల వివరాలు వెల్లడించింది.

తేదీ	తెదేపా కేంద్ర కార్యాలయంలో ప్రజావేదికలో పాల్గొనే నాయకులు
03.01.2026	మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు
05.01.2026	మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ
06.01.2026	మంత్రి కొలుసు పార్థసారథి, ఏపీ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు
07.01.2026	మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు
08.01.2026	మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, డీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురామ్
10.01.2026	మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపీఎల్‌డబ్ల్యూబీ ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్
12.01.2026	మంత్రి టీజీ భరత్, ఏపీటీఎస్ఎల్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ
13.01.2026	మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు
17.01.2026	మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఎండబ్ల్యూఏబీ ఛైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి
19.01.2026	మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఏపీ గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి
20.01.2026	మంత్రి ఎస్.సవిత, ఏపీ హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా
21.01.2026	మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర
22.01.2026	మంత్రి పయ్యావుల కేశవ్, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు
24.01.2026	మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్
27.01.2026	మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి
28.01.2026	మంత్రి పొంగూరు నారాయణ, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు
29.01.2026	మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కాకినాడ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్

డిజిటల్ అరెస్టు పేరిట వృద్ధుడికి రూ.7 కోట్ల టోకరా

- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

ఈనాడు, హైదరాబాద్: సైబర్ మాయగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరిట మరో భారీ మోసానికి పాల్పడ్డారు. ఒక వృద్ధుడిని భయపెట్టి ఏకంగా రూ.7 కోట్లు కాజేసిన సంఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదులోని వివరాల మేరకు.. సోమాజిగూడకు చెందిన వృద్ధుడు(81) గతంలో వ్యాపారం చేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. గతేడాది అక్టోబరు 27న ఆయన వాట్సప్ నంబరుకు ఒక కాల్ వచ్చింది. మీరు ముంబయి నుంచి బ్యాంకాక్‌కు చేసిన కొరియర్‌లో ఒక ల్యాప్‌టాప్, 3 కిలోల వస్త్రాలు, 5 పాస్‌పోర్టులు, మాదకద్రవ్యాలు ఉన్నాయని అవతలి వ్యక్తి భయపెట్టాడు. తాను ఎటువంటి కొరియర్ పంపలేదని వృద్ధుడు ఫోన్ పెట్టేశారు. వెంటనే ముంబయి పోలీసు డిపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ మరొకరు కాల్ చేశారు. మీరు మాదకద్రవ్యాల రవాణా, మనీ లాండరింగ్, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు తమ వద్ద ఆధారాలున్నాయని బెదిరించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని, మీరు ఇంటి నుంచి కదలకుండా డిజిటల్ అరెస్ట్ చేశామంటూ ఉక్కిరిబిక్కిరి చేశారు. వీడియోకాల్ చేయాలన్నారు. మీ ఆర్థిక లావాదేవీలు పరిశీలించాలని తొలుత రూ.19.80 లక్షలు బదిలీ చేయించుకున్నారు. అక్టోబరు 29న మరోసారి సైబర్ మోసగాడు ఫోన్ చేసి నగదు లావాదేవీల్లో ఏదో సమస్య ఉందని చెప్పాడు. సిగ్నల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని లింక్ పంపారు. ఆయనతో యాప్ ద్వారా మాట్లాడుతూ.. మ్యూచువల్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లోని రూ.7,12,80,000 నగదు తమ ఖాతాల్లో జమ చేయించుకున్నారు. నగదు లావాదేవీలు పూర్తిగా పరిశీలించాక తిరిగి జమ చేస్తామని నమ్మించారు. అనంతరం వయోధికుడు సిగ్నల్ యాప్‌ను ఫోన్ నుంచి తొలగించారు. గతేడాది డిసెంబరు 29న మరోసారి ఫోన్ చేసిన మోసగాళ్లు కేసు మూసివేసేందుకు అదనంగా రూ.1.2 కోట్లు ఇవ్వాలని డిమాండు చేయడంతో ఆయనకు అనుమానం వచ్చింది. ఇటీవల ఒక పత్రికలో డిజిటల్ అరెస్టుపై వచ్చిన కథనాన్ని చూసి తాను మోసపోయినట్లు గ్రహించారు. శుక్రవారం 1930 నంబరు ద్వారా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కె.వి.ఎం.ప్రసాద్ తెలిపారు.

పొగమంచు మృత్యువై..!

కారు బోల్తా.. ఇద్దరి మృతి

మహేశ్వరం, న్యూస్‌టుడే: రోడ్డుపై దట్టమైన పొగమంచు అలముకోవడంతో దారి కనిపించక.. కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఠాణా పరిధిలో గురువారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఎస్సై ధనంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం పోరండ్ల గ్రామానికి చెందిన సంగెం గిరీష్ (33), తెరేటి శ్రీకాంత్ (25), దయ్యాల శివకుమార్ స్నేహితులు. గురువారం రాత్రి వారంతా కలిసి మహేశ్వరంలోని ఓ హోటల్‌కు వెళ్లి బిర్యానీ తిన్నారు. అనంతరం తిరిగి కారులో స్వగ్రామానికి బయలుదేరగా.. మార్గంమధ్యలోని ఆకన్‌పల్లి చౌరస్తా వద్ద ప్రమాదవశాత్తు వాహనం రోడ్డుపక్కన బోల్తాపడింది. ఈ క్రమంలో కారు ముందు తలుపులు తెరుచుకొని డ్రైవర్ సీట్లో ఉన్న గిరీష్, అతని పక్కన కూర్చున్న శ్రీకాంత్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీట్లో కూర్చున్న శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



'కశ్మీరం'లా కరీంనగర్!

ఈ చిత్రంలో దట్టమైన పొగ మంచు.. చిన్నబోయిన సూర్యుడు.. కనిపించని రోడ్లు, భవనాలను చూసి కశ్మీర్ అనుకునేరు. ఇది తెలంగాణలోని కరీంనగరే. గత నాలుగైదు రోజుల నుంచి కరీంనగర్ జిల్లాను పొగమంచు కమ్మేస్తోంది. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగమంచు కారణంగా రోడ్లపై వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వాకింగ్ చేసే వారు పక్కపక్కనే ఉన్నా కనిపించలేదు. – ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం